మహాత్మా శ్రీ త్రైలింగస్వామి

జీవితము - ఉపదేశములు



పరిచయము :

మహామహోపాధ్యాయ, దేశికోత్తమ

సద్గురు డా॥ కె. శివానందమూర్తి

మహాత్మా శ్రీ త్రైలింగస్వామి

జీవితము - ఉపదేశములు

బెంగాలీ మూలం

శ్రీ ఉమాచరణ ముఖోపాధ్యాయ్

హిందీ అనువాదం

డా॥ వాసుదేవ ఛటర్జీ

తెలుగు అనువాదం

ఆచార్య హరి శివకుమార్

ఆచార్య రేగులపాటి మాధవరావు

ప్రచురణ

శివానంద సుపథ ఫౌండేషన్

ఆనందవనం, భీమునిపట్నం

మహాత్మా శ్రీ త్రైలింగస్వామి - జీవితము - ఉపదేశములు

© All rights reserved

ISBN No. 978-81-927356-5-8

మొదటి ముద్రణ : డిసెంబర్, 2003

రెండవ ముద్రణ : 2011

మూడవ ముద్రణ : 2013

నాలుగో ముద్రణ : మే, 2022 - ప్రతులు : 500

అయిదవ ముద్రణ : నవంబర్, 2023 - ప్రతులు : 500

ప్రచురణ & ప్రతులకు

శివానంద సుపథ ఫౌండేషన్

ఆనందవనం, భీమునిపట్నం (భీమిలి)

విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ - 531 163

ఫోన్స్ : 91779 99696, 9441114222

web : www.ssfound.com

email : enquiry@ssfound.com

https://m.facebook.com/ssfound

sivananda_ssf

ముఖచిత్రకల్పన : డి.లక్ష్మీనారాయణ, హైదరాబాద్

ముద్రణ : మహతి ప్రింట్ క్రియేషన్స్, అంబర్‌పేట్,

హైదరాబాదు. ఫోన్ నెం.9246575681

వెల : రూ॥ 200/-

విషయసూచిక

పరిచయము	డా. శివానంద మూర్తి	5

ప్రథమ భాగము

జీవితము

1.	రెండు మాటలు	శ్రీశ్రీ త్రైలింగస్వామి మఠము	12
2.	ముందుమాట	శ్రీ రాజేశ్వర శాస్త్రీ ద్రావిడ్	13
3.	ఉపోద్ఘాతము	శ్రీ గణపతి శాస్త్రి హెబ్బార్	16
4.	హిందీ గ్రంథ ప్రకాశకుని నివేదన	శ్రీ విశ్వనాథ్ ముఖోపాధ్యాయ్	18
5.	ఆముఖము	శ్రీ వాసుదేవ ఛటర్జీ	20
6.	మహాత్మా శ్రీ త్రైలింగస్వామి చరిత్ర		21

ద్వితీయ భాగము

ఉపదేశములు

1.	గురుశిష్యులు	89
2.	చిత్తశుద్ధి	97
3.	ధర్మము	102
4.	ఉపాసన	110
5.	పూర్వజన్మము - పరజన్మము	121
6.	ఆత్మబోధ	128
7.	తన్మయత్వము	133
8.	కొన్ని సారోక్తులు	146
9.	తత్త్వజ్ఞానము	154
10.	ఈశ్వరుడు	181
11.	సృష్టి	189
12.	సంసారము	201

మహామహోపాధ్యాయ, దేశికోత్తమ
డా. శివానందమూర్తి
పీఠాధిపతి
శ్రీ శైవ మహాపీఠము

ఆనందవనమ్
భీమునిపట్నం-531 163

పరిచయము

ఇది "మహాత్మ శ్రీ త్రైలింగస్వామి - జీవితము, ఉపదేశములు" అనబడే తెలుగు అనువాద గ్రంథము. దీనికి హిందీ మాతృక డా॥ వాసుదేవ ఛటర్జీగారి అనువాద గ్రంథం. దానికి మూలం శ్రీ ఉమాచరణ్ ముఖోపాధ్యాయగారి బెంగాలీ గ్రంథం. హిందీ అనువాదానికి శ్రీ గణపతి శాస్త్రి హెబ్బార్ వ్రాసిన ఉపోద్ఘాతము, శ్రీ రాజేశ్వర శాస్త్రి ద్రావిడ్ వ్రాసిన ముందుమాటలు కూడా ఈ తెలుగు అనువాదంలో ఉన్నాయి. అలాగే, హిందీ ప్రకాశకులు శ్రీ విశ్వనాథ్ ముఖోపాధ్యాయ గారి మాటలు కూడా తెనిగించబడి ఇందులో చేర్చబడినవి. ఈ తెలుగు అనువాదం చేసినవారు ఆచార్య హరిశివకుమార్‌గారు, ఆచార్య రేగులపాటి మాధవరావుగారు. తెలుగు అనువాదకులు ఇద్దరూ కూడా ఉత్తమశ్రేణికి చెందిన సంస్కృత, హిందీ, ఆంధ్ర పండితులు కావడం చేత ఈ శైలి సులభసాధ్యమయింది. ఈ తెలుగు గ్రంథం పునర్ముద్రణ గావించబడటం ముదావహము.

బెంగాలీ నుంచి హిందీలోకి అనువాదం అయేనాటికే ఈ మహాయోగి దేహోత్సర్జనము చేసిన నాటినుండి 80 సంవత్సరములు గతించాయి. మొదటి మూల గ్రంథమైన బెంగాలీ గ్రంథమే, దాని శైలిచేత ఒక మహాయోగి వ్యక్తిత్వాన్ని పండిత - పామరులకు గ్రాహ్యమైన విధంగా ఆవిష్కరించలేకపోయింది.

1887 వ సంవత్సరములో దేహోత్సర్జనము చేసిన ఈ స్వామి జీవిత చరిత్రను మంచి రచయిత ఎవ్వరూ వ్రాసే ప్రయత్నం చేయలేదు. ఒక మహాయోగి చరిత్ర వ్రాయడానికి, అతడికి సన్నిహితుడై, కొంత విద్యావంతుడై ఉంటే, అటువంటి మహావ్యక్తిని అర్థం చేసుకోడానికి - తిరిగి వ్రాయడానికి సాధ్యమవుతుంది. కాని ఆ భక్తుడు కేవలం సేవకుని మాత్రంగానే సహచరించినవాడైతే, తాను చూచిన కొన్ని మహత్తులు మాత్రం వ్రాయగలడు. ప్రశ్నోత్తరాలగు సంభాషణలు మాత్రం కొంతవరకు గుర్తుంచుకొని ఆ సేవకభక్తుడు బెంగాలీలో వ్రాసినట్టు తెలుస్తోంది.

ప్రతి భాషకీ నుడికారం అంటూ ఒకటి ఉంటుంది. మాటకి మాట అనువదించినా మూలంలోని భావం సువ్యక్తం కాదు. అనేక సంవత్సరాలు సేవచేసినవాని అవగాహన ఎంత లోతైనదీ, వివేకవంతమైనదీ అయితే, ఆతడి రచన ఆ మహనీయుని వ్యక్తిత్వాన్ని అంత స్పష్టముగా మనకు చెప్పగలదు. ఇంతటి మహనీయుడు వారణాసిలో 15 దశాబ్దాలు జీవించినా, పదిమంది పండితులు కానీ, చదువుకున్న వ్యక్తులు కానీ ఆయనను గురించిన మంచి గ్రంథము ఎవరూ వ్రాయకపోవడం ఆశ్చర్యమే. ఆనాటి సమాజములోని ప్రముఖ వ్యక్తులు అనేకుల యొక్క జీవన విశేషాలు, బోధలు ఎంతో వివరముగా రచించిన గ్రంథాలు మనకు లభిస్తున్నాయి. ఉదాహరణకు రామకృష్ణ పరమహంస. అలాగే కొద్దికాలం తర్వాతివారైన శ్రీ అరవిందులు, శ్రీ రమణమహర్షి వంటి వ్యక్తుల చరిత్రలు, బోధలు మనకు ఎన్నో లభిస్తున్నాయి. శ్రీ అరవిందులు స్వయముగా విస్తారమైన రచన కూడా చేయడం జరిగింది. శ్రీ రమణులు అసలు గ్రంథరచనే బహుళముగా చేయలేదు. కొద్దిపాటి చిన్న రచనలు, సంభాషణలు, భక్తులయొక్క అవగాహనతో కూడిన రచనలు మనకి లభిస్తున్నాయి. శ్రీ అరవిందులు నాగరక సమాజంతో పెట్టుకున్న క్రియాశీలక సంబంధం ఎంతో ఉన్నది. కాని, రమణులు రచన -

ఉపన్యాసములు కాక ప్రశ్నలకు సమాధానమే ఇచ్చారు. తనకు తానై సమాజముతో పెట్టుకున్న సంబంధం ఏమీ లేదు. తనదైన ఒక సంస్థ లేదు.

ఇక త్రైలింగస్వామి విషయం - ఆయనకు ఈ ప్రపంచముతోనే తనదైన సంబంధం లేదు. ఓ మఠము, సంస్థ, ఉపన్యాసము, బోధనలు, ఒక నిత్యమైన నిర్దిష్టమైన కార్యక్రమము, ఒక సంస్థారూపకమైన సిబ్బంది ఏమీ లేవు. ఈ మహాత్ముడు క్రీ.శ. 1737లో వారణాసి ప్రవేశించి 1887 వరకు, 150 సంవత్సరములు ఆ పట్టణములో సంచరించాడు. ఆయన దిశమొలతో ఈ ప్రపంచ స్పృహ దాదాపు లేకుండానే చుట్టూ ఉన్న సమాజాన్ని తానుగా గుర్తించకుండానే సంచరించాడు. ఏ విధమైన లౌకిక వ్యాపారము, తనకొక నిత్యకర్మ లేకనే తిరిగిన ఈ వ్యక్తితో లౌకికులైన పండితులు, రచయితలు ఎటువంటి సంబంధమూ పెట్టుకోలేదన్నమాట. అంటే, ఈ లౌకిక సమాజానికి ఆతడొక పిచ్చివాడు. అట్టి వ్యక్తిని గురించిన గ్రంథజాలమేముంటుంది?

ఇంతకుముందు 1987 లో శ్రీమేడపాటి వెంకటరెడ్డిగారి 'తెలుగు యోగులు' గ్రంథములో ఒక వ్యాసము ఈ స్వామిని గురించి వచ్చింది. తరువాత 1998లో ఆచార్య శ్రీ బిరుదురాజు రామరాజుగారు తమ 'ఆంధ్రయోగులు' (ప్రథమభాగం) గ్రంథములో ఈ స్వామిని గురించి ఒక మంచి వ్యాసము రచించారు. అందులోని విశేషాలు, ఆ స్వామి తల్లిదండ్రుల పేర్లు మొదలైనవి ఒక విధంగా ఉంటే, ఈ హిందీ రచన వాటిని మరొక విధంగా పేర్కొంటుంది. ఆ రచన ప్రకారం ఈ స్వామి అసలు పేరు శివరామయ్య. విజయనగరం మండలంలోని హోలియా గ్రామంలో విద్యావతి, నరసింహరావులనే దంపతులకు 19-12-1607 వ తేదీనాడు (ప్లవంగ పుష్యశుద్ధ ఏకాదశి) శనివారం, రోహిణీ నక్షత్రములో ఈయన జన్మించాడు. 1679లో భగీరథస్వామి అనే యోగివద్ద పుష్కరతీర్థంలో ఈ శివరాముడు సన్న్యాసదీక్ష తీసుకుని 'గణపతిస్వామి' అనే దీక్షానామకులయ్యారు. తరువాత 1737 లో వారణాసి చేరేవరకు ఆయన దేశసంచార విషయాలు చాలా కొద్దిగా మనకు తెలుస్తాయి. ఆయన అధిక కాలం హిమవంతంలోనే తపస్సులో గడిచింది.

త్రైలింగస్వామి ఒక మహాయోగి. మన సంప్రదాయంలో దర్శనములన్నీ ఆర్యుడు కోరే నాలుగవ పురుషార్థమైన మోక్షము కొరకే మార్గములుగా రూపొందించబడ్డాయి. వాటిలో ఆస్తికదర్శనములని చెప్పబడేవి. వేదాన్ని ప్రమాణంగా స్వీకరించినట్టివి. వాటిలో సాంఖ్యయోగముల జంట ఈ సృష్టిని అయథార్థమని నిరాకరించక, దానిని సత్యముగా నిరూపించి యోగమార్గమనే తపస్సును శాస్త్రీయంగా నిరూపణ చేసి, మోక్షసిద్ధిని సూచించింది. అద్వితీయ బ్రహ్మవాదులు ఆదిశంకరుల సిద్ధాంతానుయాయులు (ఈ సిద్ధాంతము ఆయనకు పూర్వమే ఉన్నది. కాని శంకరులు భాష్యకారులు) యోగశాస్త్రాన్ని ద్వైతసిద్ధాంత ఆధారమని తిరస్కరించారు. కాని సాంఖ్యయోగ మార్గాలని పూర్తిగా తిరస్కరించలేదు. ఆదిశంకరులే యోగసాధనను, దివ్య మంత్రసాధనను ఒక స్థితిలో గౌరవించారు. 'అష్టసిద్ధి ప్రదమైన యోగమార్గాన్ని తిరస్కరించడం సాహసమే' అన్నారు. ఒకనాటి మహర్షుల తపోవిధానములు ఆనాడు గ్రంథస్థము కాలేదు. సత్యాన్వేషణకు విచారమే కాక తపస్సు ఆవశ్యకమని సంప్రదాయములో ఒప్పుకున్నవారు - వ్యక్తులు, వాఙ్మయము కూడా- అనంతముగా ఉన్నారు. అయితే అట్టి తపస్సుకు పూర్వరంగమైన

విరాగము, అంతర్ముఖత్వము తపస్సును త్వరలో ఫలప్రదం చేస్తాయి. అణిమాది సిద్ధులు రాగద్వేషాల శేషం మిగిలి ఉన్నవారికి ప్రమాద కారణాలు కావచ్చు కాని, ఉత్తమజీవునికి అవి అయాచితంగా వచ్చి తనను సేవించు విభూతులు మాత్రమే కాగలవు. అట్టి యోగి ఆ మార్గంలోనే ఆత్మసాక్షాత్కారం అనుభవపూర్వకముగా సాధించి జీవన్ముక్తుడు కాగలడు. కాని అట్టివాడు యోగులలోనే అరుదుగా

ఉండగలడు. త్రైలింగస్వామి అట్టి అసాధారణ జ్ఞాన, యోగసిద్ధుడు. అట్టి సంపూర్ణత్వము పొందిన వెనుక కాశికాపురవాసము 150 సంవత్సరములు దేనిని ఆశించి చేసినట్లు? జయించబడిన మృత్యువు కల ఆ యోగి కేవలము ఆ మహా క్షేత్రములో ప్రజానీకానికి తాను కనబడుట అనే లోకానుగ్రహము కావచ్చును. ఎట్టి కర్తవ్యము లేని తాను తన దేహముయొక్క అస్తిత్వ - నాస్తిత్వ భేదమును నిరాకరించి యాదృచ్ఛికముగా దేహమందు సంచరించినాడని చెప్పవచ్చును. ఆయన దర్శన, భాషణముల వలన ఉత్తీర్ణులైన అనేకమంది సాధకులు ఉన్నారు.

ఈ భారతదేశమందలి విగ్రహారాధన, పుణ్యక్షేత్ర గంగాస్నానాది సాంప్రదాయములను సమర్థించి తన జ్ఞానసంపూర్ణత్వమును లోకానికి చూపినాడు. 1965లో ఈ సమాధిని నేను దర్శించినప్పటికి ఈ పాటి గ్రంథజాలము కూడ ఆనాడు లేవు. ఈయన చరిత్ర చాలామట్టుకు అజ్ఞాతంగానే ఉండిపోయింది. అద్భుతములు ఎన్నో జరిగియుండవచ్చును. అవన్నీ వెలువడకపోవచ్చును. నిర్గుణ బ్రహ్మతత్త్వమందే సంచరించి, సగుణ బ్రహ్మమును కూడ ఏకకాలమందే ఉపాస్య వస్తువుగా గుర్తించి మనతో సహజీవనం చేసిన విశ్వాత్ముడీతడు. అడిగిన సామాన్యునికి నేత్ర గోచరముగా కాళీమాత దర్శనమును ప్రసాదించుట గొప్ప అపూర్వ విషయము. పంచగంగా ఘట్టమందుగల ఆయన సమాధి ప్రత్యక్ష చైతన్యయుక్తము.

ఈ గ్రంథమందలి ప్రశ్నోత్తరములు పరిపుష్టమైన భాషయందు ఒక రచనవలె గోచరించక పోయినా, ఈ మహాయోగి అద్వైత పరబ్రహ్మానుభూతిని అంతిమ ధ్యేయముగా సూచించినాడని గ్రహించవచ్చును. అంతేకాక, తాను సాధించిన పరమసత్యానుభూతి అంతరంగమందలి చైతన్య సహాయంతో ఎవరైనా సాధించ వచ్చని ఆయన బోధించటంలో సర్వాంతర్యామియైన ఏకాత్మను ఆయన నిర్ద్వంద్వముగా బోధించినట్లు స్పష్టము.

ఈతడు తెలుగు దేశస్థుడని అనుకున్నప్పుడు మన మనస్సు మరింత ఆనందించుట సహజము. ఆంధ్రులకు అపరిచితుడైన ఈ మహాయోగి ఇటీవలి దశాబ్దములలోనే క్రమముగ మనకు తెలియుట మన భాగ్య విశేషమే. యోగీశ్వ రేశ్వరుడైన శ్రీకృష్ణుడు, రుద్రుడే అయిన గోరక్షనాథుడు వంటి యోగీశ్వరునిగా ఈయనను స్మరింతును.

శ్రీరస్తు

- శివానందమూర్తి

తేది : విజయనామ సం॥ కార్తీకం, 2013

ప్రకాశకుల మాట

తెలుగుభూమిలో జన్మించి, మోక్షపురి అయిన కాశీ మహా క్షేత్రంలో జీవించి, 280 సంవత్సరాల తన దివ్యజీవనంతో ఎందరో ఆర్తులను, జిజ్ఞాసువులను తరింప చేసిన భారతీయ ఆధ్యాత్మిక మేరుశిఖరం శ్రీ త్రైలింగస్వామి. తెలుగువారు కావడంతో, వీరికి ఉత్తరాదివారు ఇచ్చిన వ్యవహారనామమే 'త్రైలింగులు'.

గురుదేవులు డా॥ శివానందమూర్తిగారి పరిచయ పీఠికతో ఈ త్రైలింగ మహాయోగి అత్యాశ్చర్యకర జీవితాన్ని, బోధలను తెలిపే ఈ అనువాద గ్రంథం, 2003, 2011, 2013, 2022 సంవత్సరాలలో మూడు ముద్రణలు పొందింది. అనేక మంది చదువరుల కోరికపై, దీని ఐదవ ముద్రణను ఇప్పుడు అందిస్తున్నాము.

– శివానంద సుపథ ఫౌండేషన్

నవంబర్, 2023

మహాత్మా శ్రీ త్రైలింగస్వామి

జీవితము - ఉపదేశములు

ప్రథమ భాగము

రెండు మాటలు

జ్ఞానము, వైరాగ్యము, భక్తి అనే అగాథమైన అనంతసాగరంలో మునిగి అమూల్యమైన ముత్యాలను సేకరించి యావత్ విశ్వాన్ని ఆశ్చర్యచకితులను చేసిన మహానుభావులలో మహాత్మా త్రైలింగస్వామివారి పేరు కూడా వస్తుంది.

ఏమాత్రం చదువులేని, అమాయకమైన, ఋజువైన, నిశ్చలమైన, ఆడంబర రహితమైన ఆయన వ్యక్తిత్వం చాలా అంతర్ముఖమైనది, విచిత్రమైనది. ఆయన అలౌకిక ప్రతిభ ప్రపంచాన్నంతా ఆకర్షించింది.

మహాత్మా త్రైలింగస్వామి జీవనచరిత్రను గురించి సమగ్రంగా చెప్పగల పుస్తకం ఇంతవరకు దొరకలేదు. స్వర్గీయ వేదమూర్తులు శ్రీ గోవింద భట్‌పోఖర్‌కర్‌గారు ముద్రించిన పుస్తకం కాక, మరే ఇతర పుస్తకము శ్రీ స్వామివారి జీవన చరిత్రము వెలుగుచూపగలది ఇంతవరకు కన్పించలేదు. పోఖర్‌కర్‌గారు స్వర్గస్థులు కావటంవలన ఆ పుస్తక ప్రచురణ పూర్తికాలేదు. ఆ సమయంలో పుస్తకం ప్రచురణ ఆగిపోవటం, భక్తజనుల కోపతాపాలు, శ్రీస్వామివారి అంతఃప్రేరణల ఫలితంగా శ్రీ త్రైలింగస్వామి వారి మఠమే ఈ పుస్తకాన్ని ప్రచురించటానికి పూనుకొన్నది.

ఈ పుస్తకం యొక్క మూలస్వరూపాన్ని ముందరి ముద్రణతో సరిచేస్తూ, జాగ్రత్తగా దీనిని పరిష్కరించటం జరిగింది. భాషాగతమైన కొన్ని కొన్ని దోషాలను వీలైనంతవరకూ దూరంచేసే ప్రయత్నం కూడా చేయటం జరిగింది.

ప్రియమైన పాఠకులు, భక్తజనులు శ్రీ స్వామివారి ఈ జీవన చరిత్రను శ్రద్ధా భక్తులతో పఠించి, తమ జీవితాన్ని ధన్యం చేసుకొనగలరని విశ్వసిస్తున్నాము.

ప్రబంధక్

శ్రీశ్రీ త్రైలింగస్వామి మఠము

23/95, పంచగంగాఘాట్, వారణాసి

రథయాత్ర - విక్రమ 2046

ముందుమాట

శ్రీ గురుః శరణమ్

సమస్త శ్రోతలను ఆశ్చర్యచకితులను చేయగల ధన్యజీవులైన రాజయోగులలో బ్రహ్మీభూతులు శ్రీ త్రైలింగస్వామి చరణుల అనన్యసామాన్యమైన కథలు ఎన్నో ఉన్నాయి. యోగసూత్రాలలో యోగప్రభావము ఎట్లా చెప్పబడిందో, అలాంటి యోగశక్తులు ఈ యోగివర్యులచేతకూడా ప్రదర్శింపబడినాయి. వారి చరిత్రను స్వయంగా దర్శించినవారిలో మా మాతామహులు, కీర్తిశేషులు సుబ్రహ్మణ్య శాస్త్రి గారు కూడా ఒకరు. కాలభైరవ ప్రదక్షిణం చేసే సమయంలో ప్రతిదినమూ, గోడమీద గీసిన శ్రీ స్వామివారి చిత్రాన్ని మా మాతామహులతోపాటు నేను కూడా దర్శించేవాడిని. ఆ సమయంలోనే ఆ చిత్రం శ్రీ త్రైలింగస్వామివారిదని నాకు వారు చెప్పారు. వారి ముఖతః శ్రీ స్వామివారి కొన్ని కథలను విన్నాను. ఆ చిత్రపట అవిష్కరణ మహోత్సవానికి నేను వెళ్ళి శ్రీ స్వామివారి దివ్యకథలను ఆ మందిరం లోనే విన్నాను. సిద్ధయోగివర్యులైన శ్రీ చరణుల దర్శనభాగ్యం కలగకపోయినా, శాండో (కోడి) రామమూర్తి మహోదయుల శక్తిసామర్థ్యాలను చూసినవారు విన్నవారు చాలామంది ఉన్నారు. ఆ మహానుభావుడు ఏనుగులవంటి పెద్ద బరువైన వాటిని కూడా పైకి ఎత్తేవారు. వేగంగా పోయే మోటారు వాహనాలను కూడా అడ్డగించి ఆపేసేవారు. ఇలాంటి ఆశ్చర్యకరమైన పనులు యోగమార్గరీత్యా ప్రాణాయామాది శక్తులవలన చేయవచ్చుననీ, అదే తన బలానికి కారణమనీ వారు చెప్పేవారు. ఈ నిదర్శనలవలన యోగశక్తిద్వారా కలిగే సామర్థ్యాన్ని వారినుంచి ఎందరో తెలుసుకున్నారని చెప్పుకొనేవారు. అదేవిధంగా శ్రీ స్వామివారి చమత్కారభరితములైన కథలను కూడా అలాగే గ్రహించవలసి ఉంటుంది. అందులో నమ్మలేని విషయాలేమీ ఉండవు. ఇవన్నీ యోగాభ్యాసం వలన కలిగి, ఆయన చేతులలో క్రీడలుగా ప్రదర్శించబడినాయి. అయితే యోగాభ్యాసం యొక్క ఫలాలు అవేకావు. అనాదిగా సంసారమగ్నులైన జీవులకు అలౌకిక సుఖాన్ని ఇచ్చే మహాత్ముల సాక్షాత్కారమే దాని ముఖ్యమైన ఫలము. అందుకోసం ప్రయత్నించే యమ నియమాది సంపన్నులైన యోగులు తాము దర్శించిన యోగశక్తులను ప్రదర్శించినప్పటికీ, ఏఫలాన్నీ ఆశించరు. అనధికారులైనవారిముందు ఆ

యోగరహస్యము వారు ప్రదర్శించరు. అయినప్పటికీ ఆ ఉపాస్యములైన యోగ రహస్యాలను ఏకలవ్యులుగా తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో, తమ విగ్రహాన్ని తాము జీవించి ఉన్న సమయంలోనే వారు స్థాపిస్తారు. అది ఉపాసకుల మహత్‌భాగ్యము. అది వారు చేసే ఒక గొప్ప అలౌకిక కార్యము.

రాజనీతి దృష్ట్యా కూడా రాజ్యప్రతిష్ఠాపన యొక్క మూలభూతమైన శక్తి యోగంలోనే ఉంటుందనేది నిర్వివాదమైన విషయము. దాని స్వరూపము.

"ఆస్తిక్యం ప్రవిభజ్య భోజన మనుత్తాపశ్చ తథ్యం వచో
మేధా బుద్ధి ధృతి క్షమాశ్చ కరుణా జ్ఞానంచ నిర్దంభతా।
కర్మానిందిత మస్పృహంచ వినయో ధర్మః సదైవాదరాత్
ఏతే సత్వగుణాన్వితస్య మనసో గీతా గుణా జ్ఞానిభిః ॥ (చరకసంహిత)

అనే పద్ధతిలో ఆయుర్వేదంలో వర్ణింపబడి యున్నది. సత్వగుణ ప్రతిబంధ కములైన రెండు గుణములు - రాజస, తామస గుణములు. ఒకచోట చాంచల్యము, రెండవచోట అజ్ఞానము ఉంటుంది. విశేషమేమిటంటే - ఇవి మనస్సులో ఎప్పటివరకూ ఉంటాయో అప్పటివరకూ సత్త్వగుణము తక్కువగా ఉంటుంది. అందువలన వాటిని పోగొట్టటానికి ఏకాగ్రత ముఖ్యము. దానిని సాధించటానికి యోగాభ్యాసమే

ఉపయోగపడుతుంది. అజ్ఞానరూపమైన తామస శక్తి ఎక్కువైతే, శరీరానికి ఆధారమైన బ్రహ్మచర్యశక్తి క్షీణిస్తుంది కనుక, ఆ శక్తిని రక్షించుకోవాలని ఆయుర్వేదవిదులు చెబుతారు. ఆ శక్తియొక్క ప్రశమనమే జ్ఞానమని కూడా చరకసంహితలోనే చెప్పబడింది.

"హృద్యం యత్స్యాద్యదౌజస్యం స్రోతసాం యత్ప్రసాదనమ్।
తత్తద్యత్నేన సంసేవ్యం ప్రశమో జ్ఞానమేవ చ॥

అది కూడా ఏకాగ్రత వలననే కలుగుతుంది. అది కూడా యోగంవల్లనే సిద్ధిస్తుంది. అది శ్రీ త్రైలింగస్వామి చరణుల మూర్తిని ఉపాసించటంవల్ల ఆయన కృపకు పాత్రులైన భక్తులకు, ఉపాసకులకు లభించింది.

శ్రీ త్రైలింగస్వామివారి శిష్యులు బహుశః ఈనాటికీ ఆ పరంపరలో వచ్చిన

వంగజాతీయులలోనూ ఎక్కువగా కన్పించరు. ఆయన భక్తులు కొందరిచేత యోగివర్యులైన శ్రీ స్వామివారి చరిత్రలు వంగభాషలో కూర్చబడినాయి. కాని సాధారణమైన వారి రచనలలో స్వామివారి భావములు స్పష్టంగా వివరింప బడలేదు. వాటినన్నింటినీ సుబోధకంగా చేయటం కోసం కీర్తిశేషులు, సాంగ వేదవిద్యాలయ హోమియోపతి విభాగ సంచాలకులు, హిందీ-వంగభాషాభిజ్ఞులు అయిన వాసుదేవ చటర్జీ మహోదయులచేత ఎంతో చక్కగాను పరిపూర్ణంగాను హిందీ భాషలోకి ఇది సమగ్రంగా సంపాదింపబడింది. వీరి ఈ గొప్ప కృషి ఎంతో ప్రశంసనీయమైనది.

- శ్రీ రాజేశ్వర శాస్త్రీ ద్రావిడ్

ఉపోద్ఘాతము

శ్రీః

సిద్ధయోగివర్యులు, కీర్తిశేషులు, బ్రహ్మీభూతులు అయిన శ్రీ త్రైలింగస్వామి వారి అనేక అసాధారణ చారిత్రక ఘటనలు వినేవారినందరినీ ఆశ్చర్యచకితులను చేస్తాయి. యోగసూత్రాలలో యోగానుష్ఠాన ప్రభావం ఎట్లా చెప్పబడిందో, అలాంటి ప్రభావాలను యోగివర్యులైన శ్రీ స్వామివారు చేసి చూపించారు. శ్రీ స్వామివారి జీవిత చరిత్రను దర్శించిన కొందరిలో మా పూజ్యమాతామహులైన కీర్తిశేషులు శ్రీ సుబ్రహ్మణ్య శాస్త్రిగారు కూడా ఒకరు. మా మాతామహులు కాశీనాథుడైన శ్రీ కాలభైరవ స్వామికి ప్రదక్షిణలు చేసే సమయంలో ప్రతిరోజు అక్కడి గోడమీద గీసిన శ్రీ త్రైలింగస్వామివారి చిత్రాన్ని చూపి, వారు చేసిన చిత్రాలను చెప్పేవారు. ఆ విధంగా మా తాతగారి ముఖతః శ్రీ స్వామివారి విచిత్ర చిత్రాలను నేను చాలా విన్నాను. క్రిందటి సంవత్సరం శ్రీ త్రైలింగస్వామి మఠంలో శ్రీ స్వామిచరణుల చిత్రావిష్కరణ సమయంలో జరిగిన సభలో నేను అక్కడే ఉన్నాను. ఆనాడు మాట్లాడిన ఉపన్యాసకుల ద్వారా కూడా నేను ఎన్నో కథలు విన్నాను. యోగాభ్యాస ప్రభావంవల్ల సంప్రాప్తమయ్యే శక్తులు కథలు వారికి కేవలం ఆటలలాగా ఉండేవి.

యోగసిద్ధులైన శ్రీ స్వామివారి దర్శనభాగ్యం కలగనివారిలో చాలామంది శాండో శ్రీ (కోడి) రామమూర్తిగారి శక్తిని చూసినవారు విన్నవారు ఉండేవారు. రామమూర్తి గారు ఏనుగులవంటి బరువులను ఎత్తేవారు, వేగంగా నడిచే మోటారుకార్లను ఆపేవారు. యోగమార్గ విధానంలో చెప్పిన ప్రాణాయామ శక్తివలన అలాంటి బలం వస్తుందని, అదే విధంగానే తానుకూడా అలాంటి శక్తులను సాధించానని వారు చెబుతూ ఉండేవారు. రామమూర్తి మహోదయుల ఈ మాటలను బట్టి అలాంటి ఆశ్చర్యజనకమైన విషయాలకు మూలం ఏమిటో తెలుసుకోవచ్చును. అలాంటప్పుడు యోగసిద్ధులైన శ్రీ స్వామివారి విషయంలో ఇంక చెప్పవలసినది ఏమి ఉంటుంది. అందులో నమ్మలేని కారణం ఏదీ ఉండదు.

ఇలాంటి ఆశ్చర్యకరమైన విషయాలు సిద్ధయోగులకు కేవలం ఆటలవంటివి అయినప్పటికీ ఇలాంటి చమత్కారాలు చేయటమే యోగాభ్యాస లక్ష్యం కాదు. అనాది కాలంనుంచీ సంసారపతితులైన జీవులకు సాటిలేని సుఖాన్ని ఇచ్చే పరమాత్మ సాక్షాత్కారమే యోగమునకు ముఖ్య లక్ష్యము. అలాంటి లక్ష్యాన్ని సాధించటానికి యమ నియమాది సాధనసంపన్నులైన యోగులు యోగప్రభావాన్ని

ప్రత్యక్షంగా చూపించటానికి ఇష్టపడరు. అందువలన అనధికారులముందు యోగశక్తులను ప్రదర్శింపరు. అయినప్పటికీ ఏకలవ్యుని వంటి కొందరు భక్తులు మాత్రము అలాంటి యోగరహస్యాలను తెలుసుకోగలుగుతారు. ఆ ఉద్దేశ్యంతోనే శ్రీస్వామి వారు తమ జీవితకాలంలోనే తమ చిత్రపటాన్ని ప్రతిష్ఠించే ఏర్పాటు చేశారు. అది ఉపాసకులకు మహద్భాగ్యమని తెలుసుకోవాలి. అలాంటి అలౌకిక కార్యాన్ని కూడా శ్రీ స్వామివారు చేశారు.

రాజనీతి దృష్ట్యా ఆలోచించినప్పటికీ రాజప్రతిష్ఠాపనకు ఏ సత్త్వగుణము ప్రధానమో, దానికి కూడా యోగాభ్యాసమే సాధనము. సత్త్వగుణము యొక్క ప్రధాన లక్షణములు - అస్తికత్వము, దానం చేయగా మిగిలింది భుజించటము,పశ్చాత్తాపం పడవలసిన అవసరం లేకపోవటము, సత్యం పలకటము, మేధస్సు, బుద్ధి, ఓర్పు, సహనము, కరుణ, జ్ఞానము, గర్వరాహిత్యము, అనింద్యకర్మలు చేయటము, ఫలాపేక్ష రహిత కార్యములు చేయటము, వినయము, ధర్మముపట్ల ఆదరము మొదలైనవి. ఇలాంటి సత్త్వగుణ లక్షణాలు ఆయుర్వేదంలో కూడా చెప్పబడినాయి. రజోగుణ తమోగుణములు సత్త్వగుణానికి విరోధులు. రజోగుణం వలన చంచలత్వము, తమోగుణం వలన అజ్ఞానము పెరుగుతాయి. ఈ రెండు గుణాలు ఎంతగా పెరిగితే, సత్త్వగుణం అంతగా తరిగిపోతుంది. అందువలన రజస్తమో గుణాలను ఏకాగ్రతద్వారా నశింపచేయాలి. ఏకాగ్రత రావాలంటే యోగాభ్యాసం అవసరము, అజ్ఞానం పెరిగినకొద్దీ బ్రహ్మచర్యానికి మూలకారణమైన ఓజస్సు క్షీణించిపోతుంది. శమము - జ్ఞానములు ఓజోవర్ధకములు. ఈ శమము - జ్ఞానములు ఎంతో ప్రయత్నిస్తేనే లభిస్తాయని ఆయుర్వేదంలో కూడా చెప్పబడింది. అంటే - ఏకాగ్రతను యోగాభ్యాసముద్వారా సాధించాలని భావము. శ్రీ త్రైలింగ స్వామివారి రూపాన్ని ఉపాసించేవారికి ఆయన అనుగ్రహంవలన యోగప్రాప్తి అనే లాభం కలుగుతుంది.

శ్రీ స్వామీజీ శిష్యపరంపర ఈనాటికీ వంగదేశంలో అధికంగానే కన్పిస్తుంది. శ్రీ స్వామీజీ చరిత్ర వంగభాషలో సంగ్రహింపబడి ఉన్నది. అది హిందీవారికి తెలియదు. సాంగవేదవిద్యాలయ హోమియోపతి విభాగాధిపతి కీర్తిశేషులు శ్రీ వాసుదేవ చటర్జీ మహోదయులు హిందీలోకి ఈ అనువాదాన్ని సుందరంగాను, సుబోధకంగాను సుష్టుగాను చేశారు. కనుక ఇది చాలా ఆనందదాయకమైన పని.

- గణపతి శాస్త్రి హెబ్బార్

హిందీ గ్రంథ ప్రకాశకుని నివేదన

సత్సంగము, సద్గ్రంథ పఠనము మనుష్యుల ఆత్మవికాసానికి ఎంతో సహాయ కారులవుతాయి. ఆ ఉద్దేశ్యంతో తత్త్వదర్శులు సాధువులు అయినవారు భక్తుల జీవితములను ఉపదేశములను సంకలనం చేయటం, వాటిని గ్రంథాలుగా వ్రాసి ప్రచురించటం చేస్తారు. అది పరోక్షంగా ధర్మప్రచారరూపమైన పుణ్యకార్యము మా తండ్రిగారు శ్రీయోగీంద్రనాథ ముఖోపాధ్యాయులు, పితామహులు, కీర్తిశేషులు ఉమాచరణ మహోపాధ్యాయులు ఇద్దరూ శ్రీ గురుచరణాశ్రితులు, ఈశ్వరజ్ఞాన పిపాసులు, సాధకులు, జ్ఞానులు, భక్తులు. ఈ గ్రంథానికి రచయిత మా పితా మహులు, ప్రకాశకులు మా తండ్రిగారు. వారు మహాత్మా త్రైలింగస్వామివారికి ప్రేమపాత్రులై మంత్రదీక్ష తీసుకొన్న శిష్యులు. జిజ్ఞాసువులైన సాధకులు కూడా. అందువలన మహాశక్తి మంతులు, అంతర్ద్రష్ట, సిద్ధగురువులు అయిన స్వామి వారిని యోగ్యులైన ఆధారంగా భావించి తమ సాధన ద్వారా పొందిన, గురుముఖతః లభించిన నిగూఢ తత్త్వజ్ఞానమును అక్షరబద్ధం చేశారు. ఈ జీవన చరిత్రలోని రెండవభాగంలో ఆ తత్త్వోపదేశాలు అన్నీ కూర్చబడినాయి. దీనివలన జిజ్ఞాసువులైన వారికి ఆధ్యాత్మిక ప్రపంచద్వారాలు తెరువబడినాయి. ఈ గ్రంథంలో మహత్తరమైన వారి జీవితము, గంభీరములైన ఉపదేశములు జోడింప బడినాయి. దీనిని చదవటం వలన ఒక మహత్తరమైన, పరిపూర్ణమైన, ఉన్నతమైన, పవిత్రమైన జీవనం గడపాలనే అంతరంగ ఆర్తి ఉత్పన్నమవుతుంది. దీనిని నేనే కాక చాలామంది వ్యక్తులు కూడ అనుభవ పూర్వకంగా గ్రహించారు. దురదృష్టకరమైన విషయమేమిటంటే – ఇలాంటి అపూర్వమైన ధార్మికగ్రంథం ఎన్నో సంవత్సరాలుగా ముద్రింపబడక పోవటం వలన, సామాన్యజనులు ఈ రసాస్వాదన చేయలేక పోయారు. మధ్య మధ్యలో చాలామంది నా దృష్టిని ఇటు మరలించే ప్రయత్నం చేశారు.

ఈ సమయంలో ఒక చింతతో నా మనస్సు క్షోభపడుతున్నది. నా జీవన సర్వస్వము, పరమ ప్రేమస్వరూపుడు అయిన శ్రీ ఠాకూర్ అనుకూల్‌చంద్, మా పితృపాదులు కూర్చిన ఈ శాశ్వతానందాన్ని శ్రద్ధగా రక్షించమని నాతో చెబుతూ ఉండేవారు. కాని నేను దానిపట్ల విశేష శ్రద్ధ చూపలేకపోయాను. పుణ్యశ్లోకులైన

మా పితామహులు రచించిన ఈ పుస్తకాన్ని ముద్రించక పోవటం నేను చేస్తున్న మహాపరాధమని నాకు ఇప్పటికీ అనిపిస్తున్నది. నేను లోకకల్యాణార్థం ఏ శాశ్వతమైన సంపదను సృష్టించి ఇవ్వలేను. కాని, మా పితృపాదులు నాకు ఇచ్చిపోయిన ఈ అమృతధారను లోకులకు పంచకుండా వారిని వంచించి ఉంచటానికి నాకు ఏమి అధికారం ఉన్నది? నా బుద్ధి ప్రబోధించిన ఈ అనుశాసనాన్ని తలదాల్చి ఈ పని చెయ్యటానికి పూనుకొన్నాను. ఇది పూర్తిగా మొదటి ముద్రణలాగానే ప్రచురించటం జరిగింది. ఈ పుస్తకాన్ని చదివిన ఏ ఒక్క మనిషి హృదయంలోనైనా భగవన్నిష్ఠ - వ్యాకులతలు వాస్తవంగా ప్రభవిస్తే, నేను పడిన ఈ శ్రమ సార్ధకమైనదని భావిస్తాను.

పుణ్యాత్ములైన మా పితామహుల స్మృతిని రక్షించటానికి ఏమీ చేయని నాలాంటి అయోగ్యునికి, ఈనాడు గంగాజలంతోనే గంగామాత పూజచేసినట్లు, వారి జ్ఞాపకాలను రక్షించే ప్రయత్నం చేస్తున్నాను. నేను కూడా వారి అడుగుజాడలను అనుసరించి అచంచలమైన భావంతో జీవితాంతము ఆ పరమగురువులను సేవించి, నా జీవితాన్ని ధన్యం చేసుకోవాలని వారు ఊర్ధ్వలోకాలనుంచి ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నాను. ఆ పురుషోత్తములకు నమస్కారము.

- శ్రీ విశ్వనాథ్ ముఖోపాధ్యాయ్

ఆముఖము

వంగభాషలో ఉన్న మహాత్మా త్రైలింగస్వామివారి జీవనచరిత్రను హిందీలోకి అనువదించే అదృష్టం నాకు కలిగింది. కాని, నాలాంటి అజ్ఞానులకు ఈ కార్యము పర్వతోల్లంఘనం వంటిది. అయినప్పటికీ నేను మహాత్మా శ్రీ త్రైలింగస్వామివారిని ప్రార్థిస్తూ ఈ పనికి పూనుకొంటున్నాను. ఇందులో ఎలాంటి దోషాలైనా కన్పిస్తే, అందుకు నన్ను క్షమించవలసినదని పఠితలను సవినయంగా ప్రార్థిస్తున్నాను.

– వాసుదేవ ఛటర్జీ

మహాత్మా శ్రీ త్రైలింగస్వామి చరిత్ర

భారతదేశ చరిత్రను బాగా అధ్యయనం చేస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. ధర్మానికి గ్లాని కలిగినప్పుడో, సమాజంలో విద్వేషభావాలు ప్రబలి హీనమైన మార్గంలో ప్రజలు ప్రయాణించేటప్పుడో మహానుభావులు జన్మించి సత్కార్యాలు చేస్తారు. దానిని నిరూపించటానికి గొప్ప పరిశోధన చేయనక్కరలేదు. పుణ్యభూమియైన భారతదేశంలో ఇందుకు ఎన్నో ప్రమాణాలు కన్పిస్తాయి.

చైతన్య మహాప్రభువు, శ్రీశంకరాచార్యులు, రామానుజాచార్యులు, సంత్ కబీర్ దాస్, తులసీదాస్, గురునానక్, సంత్ తుకారాం, మహాత్మా త్రైలింగస్వామి, భాస్కరానందస్వామి, సాధకరాం ప్రసాద్, శ్రీరామకృష్ణ పరమహంస, విజయకృష్ణ గోస్వామి, స్వామీ వివేకానంద, వామా పాగల్, ఘిషేపాషులా వంటి మహాత్ములను అందుకు ఉదాహరణలుగా పేర్కొనవచ్చును. ఆ పరమేశ్వరుని పరమోద్దేశ్యాన్ని సాధించటానికి ఆ మహాత్ములు ఎన్ని కష్టాలు అనుభవించారో, ఎన్ని త్యాగాలు చేశారో అందరికీ తెలిసినదే. ఆ మహాత్ముల చేష్టలను చూస్తే, వారు భగవదంశతో జన్మించిన మహానుభావులని స్పష్టమవుతుంది. కాని మొదటినుంచి ఎలాంటి జీవితాన్ని గడిపారో, ఎలాంటి జీవన విధానాన్ని అలవరచుకొని పరమపవిత్రమైన మహోన్నత జీవితాశయాలను సాధించుకోగలిగారో, ఎలాంటి జీవన విధానాన్నను సరించి పూజనీయులైనారో, ఏ విధంగా పరమపదమును సాధించారో - అది ఎవ్వరికీ తెలియదు. దానికి కారణము - తాము జీవితంలో చేసిన కార్యకలాపాలను గురించి వారెవ్వరూ ఏమీ వ్రాసిపెట్టలేదు. అయితే వారి శిష్యులలో ఏ కొందరో వ్రాసి ఉంచిన వ్రాతలే మనకు ఆధారాలు.

వర్తమాన మానవ చరిత్రను గురించి ఆలోచిస్తే, అది ఎంతో మలినమై పోతున్నప్పటికీ, హిందువులలో ఆకాంక్ష, ఉత్సాహము, ఉద్యమశీలతలు ఇంకా ఉన్నాయనేది స్పష్టము. ఆధునిక హిందువుల ధర్మావలంబనం కన్నను ధర్మపథంలో నడవటానికే ఇష్టపడతారు. ఒకవేళ హిందువులు తీవ్రమైన ఆకాంక్ష, ఉద్యమశీలతలతో పాటు సాధనామార్గంలో కూడా ముందు ఉండగలిగితే, చివరకు పారమార్థికలాభము తప్పక కలుగుతుందనేది నిశ్చయ విషయము. అందులో కొంచెమైనా సందేహం లేదు. కేవలం హిందువులే కాదు - ధర్మావలంబులు ఎవరైనా సరే-ధర్మమార్గంలో

ఉన్నతిని సాధించదలిస్తే, వారు తమ తమ ధర్మాలపట్ల విశ్వాసం ఉంచి, లక్ష్యాన్ని నిశ్చయించి, చేయవలసిన కర్మలు చేయగలిగితే, సఫలీకృతులు కాగలుగుతారు. అన్ని ధర్మాల అంతిమలక్ష్యము ఒక్కటే. కనుక ధర్మతత్త్వ మూలవిషయమున భిన్నత్వం అసంభవము. కాని విభిన్న ధర్మాల కార్యప్రణాళికలు భిన్న భిన్నంగా ఉంటాయి. ఏమైనప్పటికీ అన్ని ధర్మాల అంతిమ ముఖ్య ఉద్దేశ్యము పారమార్థిక లాభమే!

సంప్రదాయజ్ఞులు హిందువులను విగ్రహారాధకులంటారు. కాని వారికి విగ్రహారాధన యొక్క వాస్తవము తెలియదు. మానవుని ఇంద్రియాలకు, మాటలకు, మనస్సుకు అతీతమైనది పరబ్రహ్మము. కేవలం దాని శక్తుల ద్వారానే దానిని తెలుసుకోవచ్చును. హిందూ ధర్మావలంబులు ఒక్కొక్క శక్తిని ప్రతీకగా తీసుకొని, విగ్రహాలను రూపొందిస్తారు. తరువాత వాటిని ముందుంచుకొని అదే శక్తిని పూజిస్తారు. అగ్నికి దాహకశక్తి అభిన్నమైనట్లు, పూలకు సువాసన అభిన్నమైనట్లు, పంచదారకు తీపిదనం అభిన్నమైనట్లు, విగ్రహాలకు కూడా భగవత్ శక్తి అభిన్నం అనే భావనతో ఆ విగ్రహాలను పూజిస్తారు. ఏ విద్యకైనా అక్షరాలు, పుస్తకాలు, పాఠ్య ప్రణాళిక, పరిశ్రమ అవసరమే. అయితే - ఏ విద్య అన్ని విద్యలకంటె శ్రేష్ఠమైనదో, ఏ విద్య అన్ని ఇతర విద్యలను పరాస్తం చేస్తుందో, ఏ విద్యను పొందటం వలన మరే విద్యనూ పొందవలసిన అవసరం లేదో, అలాంటి తత్త్వ విద్యను పొందటానికి ఏ ప్రణాళిక అవసరమూ ఉండదా? ఆ పరమవిద్యను తెలుసుకోటానికి హిందువులకు విగ్రహం అక్షర స్వరూపమైనది. ధర్మశాస్త్రం దానికి కావలసిన పుస్తకము. పూజావిధానము దాని ప్రణాళిక. సాధనరూపమైన పరిశ్రమ, చిత్త ఏకాగ్రతలు చేయవలసిన ప్రయత్నాలు. స్థూలంగా ఆలోచిస్తే హిందూ ధర్మానికీ, ఇతర ధర్మాలకూ ఈ వ్యత్యాసాలు విశేషంగా కన్పిస్తాయి. ఇతర ధర్మాలలోని ప్రణాళికలు పిల్లలకు, యువకులకు, వృద్ధులకు, మూర్ఖులకు, జ్ఞానులకు అందరికీ ఒకటే. కాని, భూమియొక్క సారము - నిస్సారముల ననుసరించి విశేషములైన బీజాలను ఉపయోగించవలసి వచ్చునట్లు, హిందూ ధర్మములోని భిన్నభిన్న అధికారులకు భిన్న భిన్న మార్గాలు సోపానాలు నిర్దేశింపబడి ఉన్నాయి. ఎవరిది ఏ క్షేత్రమో దానికి తగిన శిక్షణ, ఎవరి విశ్వాసము ఎలాంటిదో దానికి తగిన మానసిక శక్తి, దానికి అనువైన మార్గములు - సోపానములు

నిర్ధారింపబడి ఉన్నాయి. అన్నిటికన్నా క్రింది మెట్టు నుండి ఎక్కటం ప్రారంభిస్తేనే మనుష్యుడు కర్మనిష్ఠుడు - సచ్చరిత్రుడు కాగలుగుతాడు. ఈ మెట్లన్నీ అధిగమించినవారే పాపరహితులై మానవత్వాన్ని పొందగలుగుతారు. మనస్సులో విశ్వాసము, శ్రద్ధ, భక్తి, నిష్ఠలతో ఆధ్యాత్మిక మార్గాన్ని పట్టుకొని, నియమిత ప్రక్రియ - ప్రణాళికలననుసరించి సాధనచేస్తే సహజంగానే భగవత్‌ప్రాప్తి లభించవచ్చు. మా ఈ పుస్తకంలోని అధినాయకులైన మహాత్మా శ్రీ త్రైలింగస్వామి ఈ తత్త్వాలకు ఉత్తమమైన నిదర్శనము. ఆయన హృదయసరోవరంలో ఏ కమలము జన్మించిందో, అది భగవద్భక్తితో కలిసి వికసించింది. దానివలన ఆయన అంతఃకరణంలో సాత్త్వికవృత్తులు జాగృతములైనాయి. అదేవిధంగా కరుణామయుడైన ఈశ్వరుడు స్త్రీ పురుషుల హృదయాలలో నాటిన ప్రేమబీజాలను చక్కగా నీరుపోసి పెంచితే తప్పక అంకురిస్తాయి.

మహాత్మా శ్రీ త్రైలింగస్వామి పేరు ప్రఖ్యాతమైనది. అత్యాశ్చర్యకర ములైన అనేక దైహిక కార్యకలాపాల విషయంలో చాలామంది ఆయన పేరు తప్పక వినే ఉంటారు. ఈశ్వరీయ శక్తిసంపన్నులైన శ్రీ స్వామీజీ స్వార్థాన్ని త్యజించి, సహనశీలంతో మానుషాతీత కార్యకలాపాలలో తన లక్ష్యాన్ని సాధించారు. ఆ లక్ష్యంతో వారు జరామరణముల నుంచి కూడా ఏ విధంగా తప్పించుకున్నారో ఈ గ్రంథంలో వీలైనంతగా వివరించే ప్రయత్నం జరిగింది.

మహాత్మా శ్రీ త్రైలింగస్వామి జననము

పదిహేడవ శతాబ్ది ప్రారంభంలో దక్షిణాపథంలో విజనా తాలూకాలోని హోలియా గ్రామంలో నృసింహధరుడనే బ్రాహ్మణుడు ఉండేవాడు. ఆయన మంచి సంపన్నుడు. దయ, సౌజన్యము, పరోపకారము వంటి సుగుణములతో పాటు ఆయన గొప్ప కీర్తి ప్రతిష్ఠలను కూడా సంపాదించుకున్నాడు. ఆయన ధార్మికుడు, సచ్చరిత్రుడు, ఉదారహృదయుడు, కర్తవ్యనిష్ఠుడేకాక చక్కని నిష్ఠాగరిష్ఠుడు కూడా. ఇన్ని సద్గుణములతో తోటిప్రజల మన్ననలకు పాత్రుడై సుఖంగా జీవితయాత్ర సాగిస్తూ ఉండేవాడు.

ఆయనకు ఇద్దరు భార్యలు. మొదటిభార్యకు సంతానం కలగక పోవటం వలన రెండవ వివాహం చేసుకున్నాడు. అయితే దైవం అనుకూలించి, క్రీ.శ. 1607 కు

సరియైన వంగీయ సంవత్సరము 1014 లో పుష్య శుద్ధ ఏకాదశినాడు రోహిణీ నక్షత్రంలో నృసింహధరుని మొదటి భార్యకు ఒక పుత్రుడు జన్మించాడు. అతను జన్మించిన శుభఘడియలను బట్టి భవిష్యత్తులో భారతదేశంలోనే ఒక ఉజ్జ్వల రత్న మవుతాడని ఊహించారు. అయితే ఆ శిశువు ధార్మికప్రపంచాన్ని తన జ్ఞాన ప్రకాశంతో ముంచియెత్తుతాడని, భగవన్మాహాత్మ్యాన్ని విస్తరింపజేయటానికి ఆ పరాత్పరుని అంశతో జన్మించినవాడని ఎవరూ ఊహించలేక పోయారు. ఆయనే మన త్రైలింగస్వామి.

బాల్యము

నవజాత శిశు ముఖారవిందమును తిలకించిన నృసింహధరుని సంతోషానికి అవధులు లేవు. కుమారుడు జన్మించిన శుభసందర్భాన్ని పురస్కరించుకొని ఆయన పేదవారికి లెక్కలేనన్ని దానాలు చేశాడు. ఆ తరువాత యథోచితంగా ధార్మిక–లౌకిక క్రియాకలాపాలు నిర్వర్తించి, తన కుమారునికి త్రైలింగధరుడని పేరుపెట్టాడు.

త్రైలింగధరుడు చిన్న వయస్సునుంచే బుద్ధిమంతుడై, సత్స్వభావంతో మెలిగేవాడు. అతని జ్ఞాపకశక్తి అద్భుతమైనది. ఒకసారి వింటే దానిని మర్చిపోయేవాడు కాడు. ఆయన పెరిగి పెద్దవాడు అవుతూ ఉంటే, ఆయనలో దయార్ద్రహృదయం కూడా వృద్ధి చెందింది. ఇతరుల దుఃఖాలను చూసి ఆయన క్రుంగిపోయేవాడు. ఎప్పుడూ నిర్జన ప్రదేశంలో కూర్చొని, ఏకాంతంగా ఏదో ఆలోచిస్తూ ఉండేవాడు.

ఇట్లా కొన్ని రోజులు గడిచిన తరువాత నృసింహధరుని రెండవభార్యకు కూడా ఒక కుమారుడు జన్మించాడు. అతనికి శ్రీధరుడని నామకరణం చేశారు.

యౌవనము

త్రైలింగధరుడు క్రమక్రమంగా బాల్యావస్థనధిగమించి యౌవనుడైనాడు. కాని యౌవనావస్థలో ఉండవలసిన మానసిక వికాసం లేకపోగా, ఆయన ఎల్లప్పుడూ అన్యమనస్కుడై సంచరించేవాడు. అది గమనించిన తండ్రి వికల మనస్కుడైనాడు. త్రైలింగధరునిలో మార్పు తీసుకొనిరావటానికి తండ్రి అతనితో పెండ్లి ప్రస్తావన చేశాడు. కాని త్రైలింగధరుడు ఏ మాత్రమూ పెండ్లికి అంగీకరించలేదు. నృసింహధరుడు పదేపదే బలవంతపెడుతూ ఉండగా, చివరకు ఒకనాడు తండ్రితో

ఇట్లా అన్నాడు. "తండ్రీ! నశ్వరమైన ఈ జీవితము కొఱకు తాపత్రయమెందుకు? అనశ్వరమైనది, సుస్థిరమైనది అయినదానిని అన్వేషించటమే నా ధ్యేయము" అని. అయినా నృసింహధరుడు తన కుమారునిలో మార్పు తేవటానికి ఎంతగానో ప్రయత్నించాడు. కాని కుమారుని మనోవృత్తిలో మార్పు తేలేకపోయినందుకు ఎంతో దుఃఖించాడు.

త్రైలింగధరుని తల్లి విద్యావతి, ఒక విలక్షణమైన ధార్మిక రమణీమణి. ఆమెలోని సరళస్వభావము, మృదుభాషణము, వాత్సల్యపూరిత ప్రవర్తనలతో ఆమె తన పరివారములోని వారందరిచేత ఆదరింపబడేది. దాసదాసీజనమెందరో ఉన్నప్పటికీ తన పనిని తానే చేసుకొనేది. ఎవరితోనూ కూడా కఠినంగా మాట్లాడేది కాదు. వారిని తనవారిగానే చూచుకొనేది. వారు కూడా ఆమెను తమ తల్లిగా భావించి గౌరవించేవారు. సంసార భారాన్ని మోస్తూకూడా ఆమె పరమధార్మికజీవనం గడుపుతూ ఉండేది. ఆమె భర్తపట్ల చూపే అనురాగము ఆదరణలు అసామాన్యమైనవి. శరీరలావణ్యంతోపాటు ఆమెలోని దయాదాక్షిణ్యాది మహాగుణమువలన ఆమె భూమికి దిగివచ్చిన దేవతలా భాసిస్తూ ఉండేది. ఆమె చూపులలో గొప్ప తేజస్సు ప్రకాశిస్తూ కన్పించేది. అమృతమయుడైన సుధాకరుడు ఆమె హృదయంలో దాగి ఉన్నాడా అన్నట్లుగా ఆమె సమస్త శరీరంనుంచీ ధవళకాంతులు ప్రసరిస్తూ ఉండేవి. పరమశివుని పూజచేయక ఆమె పచ్చి మంచినీరైనా త్రాగేది కాదు. ఆమె తన రెండు చేతులూ జోడించి, పరిపూర్ణహృదయంతో భగవంతుని ధ్యానిస్తూ స్తోత్ర పఠనం చేసినప్పుడు, భక్తి శ్రోతస్సు ఆమె ఆనందాశ్రురూపంలో ప్రవహిస్తున్నదా అన్నట్లుండేది. అలాంటి మధురభక్తితో ధ్యాన నిమగ్నురాలయినప్పుడు ఆమె ముఖమండల కాంతితో ఇల్లంతా పునీతమయ్యేది. అలాంటి పతివ్రతాలలామ అయిన ఆ సాధ్వీమణి భూమికి దిగివచ్చిన దేవత అనటంలో ఏమాత్రమూ అతిశయోక్తి లేదు. ఆ విధంగా విద్యావతి ధ్యానమగ్నయై ఉన్నప్పుడు ఆమె దగ్గరకు ఒక్క త్రైలింగధరుడు తప్ప మరెవ్వరూ పోలేకపోయేవారు.

విద్యావతి మొదటినుంచీ తన కుమారుని మానసిక స్థితిగతులను కనిపెట్టి చూస్తూనే ఉండేది. త్రైలింగధరుని ప్రవర్తనను చూసి, ఆయన కేవలం ధార్మిక కార్యకలాపాలు నిర్వర్తించటానికి జన్మించిన అవతారపురుషుడే అని ఆమె భావించేది. అసారమైన, అనిత్యమైన ఈ సంసార జంజాటంలో చిక్కుకొనేవాడు

కాదని తలంచేది. అందుకు ఆమె కించిత్తు కూడా ఆవేదన చెందేది కాదు. పైగా మనస్సులో ఎంతో ఆనందపడేది. అందువలన త్రైలింగధరుడు వివాహ విముఖుడై నప్పటికీ ఆమె ఆశ్చర్యంకాని, ఆవేదన కాని వ్యక్తం చేసేది కాదు.

ఒకరోజున తన భర్త ఒంటరిగా ఉన్నప్పుడు విద్యావతి ఆయనను సమీపించి - "స్వామీ! త్రైలింగధరుడు వివాహం చేసుకొనకపోవటాన్ని గురించి మీరింతగా ఎందుకు చింతిస్తున్నారు? వివాహము యొక్క ఉద్దేశ్యము వంశాభివృద్ధియే కదా! అందువలన శ్రీధరునికి వివాహము చేస్తే సరిపోతుంది. కానీ వివాహవిముఖుడైన త్రైలింగధరునికి వివాహం చేయటంవలన ఆతనికి మానసికానందము చేకూరక పోగా, విషపరిణామాలు సంభవించవచ్చును. అలాంటి సంఘటనలు ప్రపంచంలో ఎన్నో కన్పిస్తున్నాయి. త్రైలింగధరుడు అనుసరించదలచిన మార్గంలో అతనిని సాగనిస్తే అతనికి సాఫల్యం లభించటమే కాక, భవిష్యత్తులో మన వంశానికే కాక యావత్ భారతదేశానికే సముజ్జ్వల రత్నమై ప్రకాశించగలుగుతాడు. అది మనకు ఎంతో గౌరవప్రదమైనదికదా! అందుచేత అతని మనోప్రవృత్తికి ఆఘాతం కల్గించటం ఏ విధంగానూ సముచితం కాదు. కనుక మనం కూడా త్రైలింగధరుడు ఉత్తరోత్తరాభివృద్ధిని సాధించి, జీవితసాఫల్యాన్ని పొందేటట్లు కృషి చెయ్యాలి". అని భర్తకు ప్రబోధించింది. ఆ విధంగా గుణవతియైన విద్యావతి తన భర్తను ఒప్పించి మెప్పించి త్రైలింగధరుని వివాహాన్ని గురించి ఆలోచించే దృక్పథాన్నుంచి ఆయనను మరలించింది. నృసింహధరుడుకూడా తన భార్య చెప్పిన సలహాను మన్నించి, అలాంటి ఉత్తమోత్తముడైన పుత్రరత్నాన్ని కన్నందుకు సంతోషించాడు. ఆ తరువాత తన రెండవ కుమారుడైన శ్రీధరునికి వివాహం జరిపించాడు. శ్రీధరుని వివాహంతో విద్యావతితో పాటు త్రైలింగధరుడుకూడా చాలా సంతోషించాడు.

వయస్సు పెరిగినకొద్దీ త్రైలింగధరుని మనస్సులో ధార్మికచింతన మరింత పెరుగుతూ వచ్చింది. అతని మనస్సులో ఏవో అమూల్యమైన భావనలు మొలకెత్త సాగినాయి. ఆహార విహారములు, అధ్యయన-శయనాది కార్యకలాపాలపైన ఏమాత్రమూ అభిరుచి లేనివాడై అతడు మెలగసాగాడు. అతని మనస్సు అనేక రకాలుగా వ్యాకులత చెందటంవలన తల్లి విద్యావతి అతనికి ఎన్నో రకములైన ఉపదేశాలు చేసింది. దానితో త్రైలింగధరునికి స్వర్గం దొరికినంత సంతోషం కలుగుతూ ఉండేది. తల్లి ఉపదేశము ఆయనలో అమృతత్వాన్ని నింపినట్లుండేది.

తల్లి ఉపదేశాన్ని పొందినప్పుడు త్రైలింగధరుడు అనిర్వచనీయమైన ఆనంద సాగరంలో తేలియాడినట్లు ఉప్పొంగి పోయేవాడు. అతనిలోని వ్యాకులత్వమనే మేఘజాలం పటాపంచలై, విద్యుత్‌కాంతి ప్రకాశించినట్లు అనిపించేది. తల్లి ఉపదేశాలను గ్రహించి ముందుకు సాగిన కొద్దీ అతనిలో ఆనందం అధికమయ్యేది. దానికితోడు అతని మానసిక ప్రవృత్తిలోకూడా ఎంతో పరిణామం కనిపించసాగింది. ఆ విధంగా కొంతకాలానికి అతని హృదయం భగవత్ప్రేమలో నాట్యమాడసాగింది. భగవత్ప్రేమామృతపానమత్తుడైన అతని హృదయంలో భగవద్భక్తి ప్రస్ఫుటం కాసాగింది.

త్రైలింగధరుడు పారలౌకిక ఆనందంతో ఉప్పొంగిపోతున్న ఆ రోజులలోనే దుఃఖపు నీలినీడలనుకూడా చూడవలసివచ్చింది. నృసింహధరుడు జ్వరపీడితుడయినాడు. సాధ్యమైనంత వైద్యసహాయం అందించినా జ్వరము తగ్గలేదు సరికదా ఇంకా పెరుగుతూపోయింది. అయనకు సేవలందించటంలో ఎలాంటి అజాగ్రత్త జరుగకపోయినా, ఆశించిన ఫలితం మాత్రం లభించలేదు. బాధ మొదలైన ఐదవ రోజునే నృసింహధరుడు భార్యాపుత్రాది ఐహిక పాశములను త్రెంచుకొని, ఈ మాయా ప్రపంచాన్ని విడిచి అనంతధామం చేరుకొన్నాడు. అప్పటికి త్రైలింగధరుని వయస్సు నలువది సంవత్సరాలు. నృసింహధరుని మృతిపట్ల హోలియా నగరంలోని ఆబాలగోపాలము శోకసంతప్తహృదయులయినారు. సామాన్యజనులు కూడా ఎంతో విచారపడ్డారు. ఇక పతిసేవాపరాయణురాలైన విద్యావతికి పంచప్రాణములు లేచిపోయినట్లయింది. అప్పటినుంచీ ఆమె భగవంతుని చింతన తప్ప మిగిలిన పనులు వేటిలోనూ లీనమయ్యేది కాదు.

తండ్రి మరణానంతరము త్రైలింగధరుడుకూడా తల్లితోపాటు భగవచ్చింతనలోనే లీనమవుతూ ఉండేవాడు. ఆ విధంగా 12 సంవత్సరాలు గడిచినాక, దేవతామూర్తియైన విద్యావతికూడా స్వర్గస్థురాలైంది. తల్లికూడా మరణించిన తరువాత త్రైలింగధరునికి ప్రపంచమంతా శూన్యంగా కన్పించసాగింది. భూమంతా తన కళ్లముందు తిరుగుతూ ఉన్నట్లుయి, ప్రపంచం విషతుల్యంగా అనిపించసాగింది. అతని ప్రాణము మనస్సు మాయా జగత్తును వదలి, అకాశవిహారం చేయసాగినవి. ఏ ప్రదేశంలో తల్లి ఈ ప్రపంచాన్ని వదలిపెట్టిందో, ఆ ప్రదేశం అతనికి ఎంతో పవిత్రంగా భాసింపసాగింది. ఆనాటినుండి త్రైలింగధరుడు తన తండ్రి

నృసింహధరుని సంపాదనకంతటికీ వారసుడైనప్పటికీ, సంసారిక బంధాలను తెంచుకొని, చితాభస్మాన్ని ధరించి శ్మశానంలోనే నివసింపసాగాడు.

త్రైలింగధరుని మానసికస్థితిని చూసిన ఆతని సవతితల్లి కొడుకు శ్రీధరుడు, త్రైలింగధరుని ఇంటికి రమ్మని ఎంతగానో బ్రతిమిలాడాడు. కాని ఫలితం లేక పోయింది. శోకతప్తహృదయుడైన శ్రీధరుడు ఒకరోజున ఆత్మీయులను, బంధువులను తోడ్కొని త్రైలింగధరునివద్దకు వెళ్ళి, తండ్రిగారి ధనసంపత్తిని తీసుకోమని బ్రతిమిలాడాడు. కాని భగవత్ప్రేమ అనే ప్రఫుల్లకమల మధు పానమునకు అలవాటుపడిన త్రైలింగధరుని మనోమధుకరము అందుకు అంగీకరించలేదు. అతని మనస్సు భగవద్ధ్యాన సుధాసింధువు లోనే నిత్యమూ నిమగ్నమయ్యేది. భగవన్నామాంకురమునే తన హృదయక్షేత్రంలో నాటుకొని, దాని ప్రేమామృత ఫలాస్వాదనతోనే, ప్రఫుల్లమనస్కుడవుతూ ఉండేవాడు. భగవద్భాం డారములోని అమూల్యరత్నాలకు అధిపతి కావలసిన అతడు సంసారములోని సామాన్య రత్నజాలముతో సంతృప్తిపడతాడా? నశ్వరమైన పార్థివపదార్థాలయెడ అతని మనస్సు ఆకర్షింపబడుతుందా? ఈ బాహ్యజగత్తును పరిత్యజించి, అంత రంగ జగత్తులోకి ప్రవేశించటానికి అభిలషించే త్రైలింగధరుని ఈ సంసార ప్రలోభాలు ఆకర్షించలేకపోయాయి. అతను తన కుటంబ సభ్యులను అనున యించి, ఆత్మీయులను ప్రార్థించి, సగౌరవంగా ఇంటికి పంపించాడు. తరువాత తన తమ్ముడిని దగ్గరకు పిలిచి – "సోదరా! శ్రీధరా! నీవు అనవసరంగా దుః ఖపడుతున్నావు. ఆ దుఃఖాన్ని వదిలిపెట్టి మన తండ్రిగారు సంపాదించిన ధనధాన్యసంపత్తిని నీవే అనుభవించు. నాకు అవి అవసరం లేదు. నేను ఇక ఇంటికి తిరిగిరాను. ఈ పాపపంకిల ప్రపంచంలో నేను ఉండను. ఈ మాయా సంసారము కంటకప్రాయమైనది. ఈ క్షణభంగురమైన శరీరముతో నేను అనిత్యమైన ఈ సంసారసాగరంలో మునిగిపోవటానికి ఇష్టపడను. ఆద్యంతరహిత మైనది, అనశ్వరమైనది అయిన సుఖమును పొందటమే నా ధ్యేయము. దేనివలన అశాంతి కలుగుతున్నదో దానినే పొందటానికి మనము అనునిత్యమూ ఆరాటపడుతున్నాము. అందుకు నా మనస్సు అంగీకరించదు. కనుక ఇప్పుడు ఇంటికి తిరిగిరమ్మని ప్రార్థించటం మానుకో" అని ప్రబోధించాడు.

తీర్థయాత్రలు

త్రైలింగధరుని ఇంటికి తీసుకొనిపోవటానికి ఎంత ప్రయత్నించినప్పటికీ అతని మనస్సులో పరివర్తన రాకపోవటంతో శోకసంతప్త హృదయంతో శ్రీధరుడు ఇంటికి వెళ్ళిపోయాడు. ఆ తరువాత త్రైలింగధరుడు ఉండినచోటనే అతని కొఱకు ఒక నివాసగృహం ఏర్పాటుచేయించాడు. ప్రతినిత్యమూ అక్కడికి ఆహారం పంపే ఏర్పాటు కూడా చేశాడు. అప్పటినుండీ త్రైలింగధరుడు తన తల్లి చేసిన ఉపదేశాను సారం యోగసాధనలో నిమగ్నమైపోయేవాడు. ఆ విధంగా 20 సంవత్సరాలు గడిచాక, ఒక మహాపురుషుని ఎవరినైనా కలవవలెననే కోరిక ఆయన మనస్సులో కలిగింది.

ఆ ప్రాంతానికి పశ్చిమదిశలో ఉన్న పాటియాలా రాజ్యంలో వాస్తూరు అనే గ్రామం ఉన్నది. అక్కడ భాగీరథస్వామి అనే పేరుగల ఒక సుప్రసిద్ధ యోగి ఉండేవాడు. వంగ సంవత్సరము 1086లో ఆ భాగీరథస్వామి హఠాత్తుగా త్రైలింగధరుని ఆశ్రమానికి వచ్చాడు. వారిద్దరూ పరస్పరం సంభాషించుకొని అత్యంత ప్రసన్నులయ్యారు. భాగీరథస్వామి కొంతకాలం అక్కడే ఉండిపోయాడు. ఆ తరువాత త్రైలింగధరుని వెంటపెట్టుకొని భాగీరథస్వామి పుష్కరక్షేత్రానికి వెళ్లాడు. అక్కడ వారిద్దరూ చాలారోజులు ఉన్నారు. అక్కడనే త్రైలింగధరుడు వంగసంవత్సరము 1092 లో భాగీరథస్వామి నుండి దీక్షాస్వీకారం చేశాడు. దీక్షాస్వీకారం తరువాత ఆయన పేరు 'గణపతిస్వామి'గా మారింది. 1102 వ సంవత్సరంలో భాగీరథస్వామి ఆ పుష్కరక్షేత్రంలోనే తన పార్థివశరీరాన్ని విడిచి పెట్టారు. మహాత్మా భాగీరథ స్వామి పరలోకగతుడైన తరువాత గణపతిస్వామి (త్రైలింగధరుడు) తీర్థయాత్రలు చెయ్యటానికి పుష్కరతీర్థాన్ని విడిచిపెట్టి బయల్దేరారు.

కొన్నిరోజులు వివిధ పుణ్యక్షేత్ర సందర్శనం చేసిన గణపతిస్వామి సేతుబంధ రామేశ్వరం చేరారు. కార్తీక శుక్ల పంచమి నాడు రామేశ్వరంలో పెద్దయెత్తున ఉత్సవం జరుగుతుంది. ఆ సమయంలో అక్కడికి ఎందరెందరో మహానుభావులు, సాధువులు వచ్చి చేరతారు. తీర్థయాత్రలు చేస్తూ ఆ సమయంలో అక్కడికి వచ్చి చేరిన గణపతిస్వామి తన ఊరి యాత్రికులను కలిశారు. వారు కూడా చాలారోజుల

నృసింహధరుని సంపాదనకంతటికీ వారసుడైనప్పటికీ, సంసారిక బంధాలను తెంచుకొని, చితాభస్మాన్ని ధరించి శ్మశానంలోనే నివసింపసాగాడు.

త్రైలింగధరుని మానసికస్థితిని చూసిన అతని సవతితల్లి కొడుకు శ్రీధరుడు, త్రైలింగధరుని ఇంటికి రమ్మని ఎంతగానో బ్రతిమిలాడాడు. కాని ఫలితం లేక పోయింది. శోకతప్తహృదయుడైన శ్రీధరుడు ఒకరోజున ఆత్మీయులను, బంధువులను తోడ్కొని త్రైలింగధరునివద్దకు వెళ్ళి, తండ్రిగారి ధనసంపత్తిని తీసుకోమని బ్రతిమిలాడాడు. కాని భగవత్ప్రేమ అనే ప్రఫుల్లకమల మధు పానమునకు అలవాటుపడిన త్రైలింగధరుని మనోమధుకరము అందుకు అంగీకరించలేదు. అతని మనస్సు భగవద్ధ్యాన సుధాసింధువు లోనే నిత్యమూ నిమగ్నమయ్యేది. భగవన్నామాంకురమునే తన హృదయక్షేత్రంలో నాటుకొని, దాని ప్రేమామృత ఫలాస్వాదనతోనే, ప్రఫుల్లమనస్కుడవుతూ ఉండేవాడు. భగవద్భాం డారములోని అమూల్యరత్నాలకు అధిపతి కావలసిన అతడు సంసారములోని సామాన్య రత్నజాలముతో సంతృప్తిపడతాడా? నశ్వరమైన పార్థివపదార్థాలయెడ అతని మనస్సు ఆకర్షింపబడుతుందా? ఈ బాహ్యజగత్తును పరిత్యజించి, అంత రంగ జగత్తులోకి ప్రవేశించటానికి అభిలషించే త్రైలింగధరుని ఈ సంసార ప్రలోభాలు ఆకర్షించలేకపోయాయి. అతను తన కుటంబ సభ్యులను అనున యించి, ఆత్మీయులను ప్రార్థించి, సగౌరవంగా ఇంటికి పంపించాడు. తరువాత తన తమ్ముడిని దగ్గరకు పిలిచి – "సోదరా! శ్రీధరా! నీవు అనవసరంగా దుః ఖపడుతున్నావు. ఆ దుఃఖాన్ని వదిలిపెట్టి మన తండ్రిగారు సంపాదించిన ధనధాన్యసంపత్తిని నీవే అనుభవించు. నాకు అవి అవసరం లేదు. నేను ఇక ఇంటికి తిరిగిరాను. ఈ పాపపంకిల ప్రపంచంలో నేను ఉండను. ఈ మాయా సంసారము కంటకప్రాయమైనది. ఈ క్షణభంగురమైన శరీరముతో నేను అనిత్యమైన ఈ సంసారసాగరంలో మునిగిపోవటానికి ఇష్టపడను. ఆద్యంతరహిత మైనది, అనశ్వరమైనది అయిన సుఖమును పొందటమే నా ధ్యేయము. దేనివలన అశాంతి కలుగుతున్నదో దానినే పొందటానికి మనము అనునిత్యమూ ఆరాటపడుతున్నాము. అందుకు నా మనస్సు అంగీకరించదు. కనుక ఇప్పుడు ఇంటికి తిరిగిరమ్మని ప్రార్థించటం మానుకో" అని ప్రబోధించాడు.

తీర్థయాత్రలు

త్రైలింగధరుని ఇంటికి తీసుకొనిపోవటానికి ఎంత ప్రయత్నించినప్పటికీ అతని మనస్సులో పరివర్తన రాకపోవటంతో శోకసంతప్త హృదయంతో శ్రీధరుడు ఇంటికి వెళ్లిపోయాడు. ఆ తరువాత త్రైలింగధరుడు ఉండినచోటనే అతని కొఱకు ఒక నివాసగృహం ఏర్పాటుచేయించాడు. ప్రతినిత్యమూ అక్కడికి ఆహారం పంపే ఏర్పాటు కూడా చేశాడు. అప్పటినుండీ త్రైలింగధరుడు తన తల్లి చేసిన ఉపదేశాను సారం యోగసాధనలో నిమగ్నమైపోయేవాడు. ఆ విధంగా 20 సంవత్సరాలు గడిచాక, ఒక మహాపురుషుని ఎవరినైనా కలవవలెననే కోరిక ఆయన మనస్సులో కలిగింది.

ఆ ప్రాంతానికి పశ్చిమదిశలో ఉన్న పాటియాలా రాజ్యంలో వాస్తూరు అనే గ్రామం ఉన్నది. అక్కడ భాగీరథస్వామి అనే పేరుగల ఒక సుప్రసిద్ధ యోగి ఉండేవాడు. వంగ సంవత్సరము 1086లో ఆ భాగీరథస్వామి హఠాత్తుగా త్రైలింగధరుని ఆశ్రమానికి వచ్చాడు. వారిద్దరూ పరస్పరం సంభాషించుకొని అత్యంత ప్రసన్నులయ్యారు. భాగీరథస్వామి కొంతకాలం అక్కడే ఉండిపోయాడు. ఆ తరువాత త్రైలింగధరుని వెంటపెట్టుకొని భాగీరథస్వామి పుష్కరక్షేత్రానికి వెళ్లాడు. అక్కడ వారిద్దరూ చాలారోజులు ఉన్నారు. అక్కడనే త్రైలింగధరుడు వంగసంవత్సరము 1092 లో భాగీరథస్వామి నుండి దీక్షాస్వీకారం చేశాడు. దీక్షాస్వీకారం తరువాత ఆయన పేరు 'గణపతిస్వామి'గా మారింది. 1102 వ సంవత్సరంలో భాగీరథస్వామి ఆ పుష్కరక్షేత్రంలోనే తన పార్థివశరీరాన్ని విడిచి పెట్టారు. మహాత్మా భాగీరథ స్వామి పరలోకగతుడైన తరువాత గణపతిస్వామి (త్రైలింగధరుడు) తీర్థయాత్రలు చెయ్యటానికి పుష్కరతీర్థాన్ని విడిచిపెట్టి బయల్దేరారు.

కొన్నిరోజులు వివిధ పుణ్యక్షేత్ర సందర్శనం చేసిన గణపతిస్వామి సేతుబంధ రామేశ్వరం చేరారు. కార్తీక శుక్ల పంచమి నాడు రామేశ్వరంలో పెద్దయెత్తున ఉత్సవం జరుగుతుంది. ఆ సమయంలో అక్కడికి ఎందరెందరో మహానుభావులు, సాధువులు వచ్చి చేరతారు. తీర్థయాత్రలు చేస్తూ ఆ సమయంలో అక్కడికి వచ్చి చేరిన గణపతిస్వామి తన ఊరి యాత్రికులను కలిశారు. వారు కూడా చాలారోజుల

తరువాత ఆయనను చూసినందుకు ఎంతో సంతోషించి, తిరిగి ఆయనను తమ ఊరు తీసుకొనిపోవటానికి చాలా ప్రయత్నం చేశారు. కానీ ఆ ప్రయత్నాలన్నీ విఫలం కాగా, తమ ప్రయత్నాలనుంచి విరమించుకొని, తమ తమ పనులలో నిమగ్నులైపోయారు.

ఉత్సవంలో రెండోరోజున ఒక సంఘటన జరిగింది. ఉత్సవానికి వచ్చిన ఒక వృద్ధుడు శీతోష్ణములకు తట్టుకోలేక క్రిందపడి మరణించాడు. ఆ బ్రాహ్మణుని బంధువులు పెద్దగా విలపించసాగారు. వారి ఆక్రందనలతో ఆ ప్రదేశమంతా సంచలనం కలిగింది. రెండుగంటల తరువాత ఆ సంచలనం సద్దుమణిగి, బంధువులంతా ఆ వృద్ధునికి దహన సంస్కారాలు చేయటానికి ఉద్యుక్తులయ్యారు. ఆ సమయంలో గణపతిస్వామి అక్కడికి వచ్చి, వారిని ఆపి, తన కమండలంలోని నీటిని నాలుగైదుసార్లు ఆ చనిపోయిన వ్యక్తిమీద చల్లారు. క్రమక్రమంగా ఆ వృద్ధునికి స్పృహ రావటం మొదలయింది. అది గమనించిన గణపతిస్వామి, అతనికి పాలు తాగించమని బంధువులకు స్నేహితులకు సలహా ఇచ్చి వెళ్లిపోయారు. ఈ విచిత్ర సంఘటనను చూసినవారంతా ఆయన ఎంతో మహానుభావుడని చెప్పుకోసాగారు.

ఆ తరువాత వంగ సంవత్సరం 1106 లో గణపతిస్వామి దక్షిణదేశాన్ని వదలి, సుదామ పూరి, ప్రయాగ, ద్వారకలు దర్శించారు. అక్కడ ఆయనకు చాలామంది బీదబ్రాహ్మణులు కన్పించారు. వారిలో కొందరు సేతుబంధ రామేశ్వరంలో గణపతిస్వామి ప్రదర్శించిన అలౌకిక మహిమలను కళ్లారా చూసినవారు. స్వామి అక్కడికి చేరగానే వారాయనను గుర్తించి, అత్యంత భక్తి ప్రపత్తులతో ఆయనకు సేవలు చేశారు. వారి సేవానిరతికి సంతుష్టుడైన గణపతిస్వామి "మీ సేవలకు నేనేమి చెయ్యాలి" అని అడిగారు. ఆ బీదబ్రాహ్మణులు కొందరు తమకు ధనం కావాలని, మరికొందరు తమ వంశాభివృద్ధి కావాలని కోరుకున్నారు. అప్పుడు స్వామివారు "మీ కోరికలు త్వరలోనే నెరవేరుతా"యని అనుగ్రహించారు. గణపతిస్వామి అనుగ్రహం వలన వారు ఒక సంవత్సరంలోనే చాలా ధనవంతు లయ్యారు. మరికొందరు పుత్రవంతులయ్యారు. అనతికాలంలోనే ఈవిషయం అందరికీ తెలిసి, ఎందరెందరో తమ కోర్కెలను తీర్చుకోటానికి గణపతిస్వామి వద్దకు రాసాగారు. ఆ విధంగా గణపతిస్వామివారిని సేవించే భక్తుల సంఖ్య దినదినాభివృద్ధి

అయింది. దానితో స్వామివారి పారమార్థికచింతనకు విఘ్నం కలగటం ప్రారంభమైంది. అందువలన గణపతిస్వామి ఆ ప్రదేశాన్ని వదిలిపెట్టి మరొక చోటుకు వెళ్లటానికి నిశ్చయించుకొన్నారు.

వంగసంవత్సరం 1108లో గణపతిస్వామి ద్వారకను వదలి, నేపాల్ చేరి అక్కడ ఒక నిర్జన ప్రదేశంలో యోగాభ్యాసం చేయసాగారు. ఆయనలోని అత్యంత ఆశ్చర్యకరమైన శక్తులు, అసాధారణమైన మహిమలు త్వరలోనే జనసామాన్యంలో వ్యాపించాయి.

ఒకరోజు నేపాల్ మహారాజు తన సైన్యంతో అరణ్యానికి వేటకు వెళ్లాడు. కొంతసేపయిన తరువాత రాజుగారి సైన్యాధిపతి ఒక పెద్దపులిపైకి తుపాకిని పేల్చాడు. తుపాకీ గుండు ఆ పులికి తగలకపోవటంతో అది తప్పించుకొని, పెద్దగా గాండ్రిస్తూ పరుగెత్తసాగింది. అది చూసి రాజభటులు గుఱ్ఱాలమీద ఆ పులిని వెంబడించారు. ఆ పెద్దపులి పరుగెత్తి పరుగెత్తి ధ్యానమగ్నుడైన గణపతి స్వామి ఉన్నచోటికి చేరుకొని, ఆర్తనాదం చేస్తూ స్వామివారి పాదములవద్ద పిల్లిలాగా పడుకొన్నది. ఆ పులి చేసిన ఆర్తనాదాలకు స్వామి వారి ధ్యానస్థితి సడలిపోయింది. కన్నులు తెరవగానే వారి దృష్టి పులిమీద పడింది. ఆ పులి పరిస్థితిని అర్థం చేసుకొన్న స్వామి, ఆ పులిశరీరాన్ని ఆప్యాయంగా నిమిరారు. ఇంతలో పులిని వెంటాడుతూ వచ్చిన రాజభటులు కూడా అక్కడికి చేరుకొన్నారు. ఆ అద్భుత దృశ్యాన్ని చూసి వారు నిశ్చేష్టులై నిలిచిపోయారు. స్వామివారు కరుణామయములైన చూపులతో ఆ భటులను తనవద్దకు రమ్మని సంజ్ఞ చేశారు. వారు ఎంతో భక్తి ప్రపత్తులతోను, భయభ్రాంతులతోను స్వామివారి చెంతకు చేరి నమస్కరించారు. స్వామివారు చిరునవ్వుతో ఇలా అన్నారు. “మీరంతా ఇంత ఆశ్చర్యాన్ని పొందటానికి, భయభ్రాంతులు కావటానికి కారణమేమిటి? మీరు మీ హింసాప్రవృత్తిని విడిచి పెడితే క్రూరజంతువులు కూడా మిమ్మల్ని హింసించవు. అవి కూడా తమ హింసా ప్రవృత్తిని విడిచిపెడతాయి. ఈ పెద్దపులి ఇంత ప్రశాంతంగా పడిఉండటమే అందుకు ప్రత్యక్ష ప్రమాణము. ఇంతవరకూ మీరు దాని ప్రాణములు తియ్యాలను కొన్నారు. కాని ఇప్పుడు ఈ పులి సునాయాసంగా మీ ప్రాణాలను తియ్యగలదు. అందువల్లనే దీనిని చూసి మీరు భయపడుతున్నారు. ఎవరికీ ఇంకొకరి ప్రాణాలు తీయటానికి అధికారం లేదు. ఒకవేళ అలాంటి అధికారం కనుక మీకు ఉంటే,

దాని ప్రాణం మీరు ఎప్పుడో తీసి ఉండేవారు. ఈ ప్రపంచంలో అన్ని ప్రాణులు సమానులే. కనుక ఒకరిని మరొకరు హింసించటం మంచిదికాదు. ఇక మీకు భయం లేదు. మీరు నిర్భయంగా, నిశ్చింతగా వెళ్లి మీ అనుచర వర్గాన్ని చేరవచ్చు. నేటినుంచీ హింసాప్రవృత్తిని మానటానికి ప్రయత్నించండి" అని ప్రబోధించారు. స్వామివారి మాటలు విన్న ఆ రాజభటులు స్వాస్థ్యచిత్తులయ్యారు. ఎన్నడూ కనీ వినీ ఎరుగని దృశ్యాన్ని ప్రత్యక్షంగా చూసినవారు అవాక్కయ్యారు. స్వామివారి పాదధూళిని కన్నులకు అద్దుకొని, వారి అనుమతితో అక్కడినుంచి వెళ్లిపోయారు. కొంతసేపటికి ఆ పెద్దపులి కూడా వెళ్లిపోయింది.

స్వామివారి అనుజ్ఞను పొందిన రాజభటులు, ఆ సన్నివేశాన్నే పదే పదే తలుచుకొంటూ తమ ఊరికి వెళ్లి, జరిగినదంతా రాజుగారికి విన్నవించుకొన్నారు. ఈ అద్భుత సంఘటనలు విన్న సభాసదులు ఆశ్చర్యపడ్డారు.

నేపాలు మహారాజు పరమధార్మికుడు. స్వామివారి ఈ అసాధారణ క్షమతను, అలౌకిక శక్తిని విని, వారిని దర్శించాలని నిర్ణయించుకొన్నాడు. ఆ తరువాత ససైన్యంగా బయల్దేరి స్వామివారిని దర్శించి, అమూల్య రత్నరాశులను తీసుకొనివెళ్లి స్వామివారి పాదపద్మములకడ సమర్పించాడు. స్వామివారు కన్నులు తెరిచి చూశారు. ఎదురుగా ఉన్న రాజును, రాజభటులను చూసి చిరునవ్వు నవ్వారు. రాజు ఇచ్చిన రత్నరాశులను ముట్టనైనా ముట్టలేదు. ఈ రత్నభాండారమైన వసుంధరనే తృణీకరించిన ఆ మహామహుని నశ్వరమైన పార్థివద్రవ్యాలు ఆకర్షిస్తాయా? స్వామివారు రాజును సన్మానించి, వివిధరకాల ఉపదేశములను చేసి పంపించారు.

ఇలాంటి ఆశ్చర్యకరమైన కార్యకలాపాలు త్వరలోనే సర్వత్రా వ్యాపించినాయి. ఎందరెందరో మహానుభావులు స్వామివారిని దర్శింపసాగారు. అందువలన స్వామివారి పారిమార్థిక కార్యక్రమాలకు మరొకసారి విఘ్నం కలిగింది.

అందువలన స్వామివారు వంగీయ సంవత్సరం 1114లో నేపాల్ రాజ్యం వదలి, టిబెట్ చేరుకొన్నారు. అక్కడ కొన్ని రోజులుండి, 1117 లో మానస సరోవరం చేరుకొన్నారు. అక్కడ చాలాకాలం యోగసాధన చేశారు.

మానససరోవరంలో ఉన్న రోజులలో ఒకనాడు ఒక వితంతు స్త్రీ 7 సంవత్సరాల

మృతబాలుని భుజాన వేసుకొని, పెద్ద పెట్టున ఏడుస్తూ, అంతిమ సంస్కారం చేయ్యటానికి శ్మశానం వైపు నడవసాగింది. ఆమెకు ఏకైక ఆధారమైన ఆ ఒక్క పిల్లవాడుకూడా, అంతకు ముందురోజు రాత్రి పాముకాటుకు గురియై మృత్యువాత పడ్డాడు. ఆ పిల్లవాని బాల్యావస్థలోనే తండ్రి మరణించాడు. ఆ పుత్రుడు తప్ప ఈ ప్రపంచంలో ఆమెకు ఎవ్వరూ లేకపోవటం వలన, ఆ పిల్లవాడిమీదనే తన ఆశలన్నీ పెట్టుకొని జీవిస్తూ ఉండేది. ఉన్న ఒక్క ఆధారమూ పోయేసరికి, ఆమె దుఃఖం భరింపరానిది అయింది. ఆ కష్టంలో గ్రామవాసులంతా ఆమెకు తోడుగా నిలిచారు. చాలామంది శ్మశానం వరకూ ఆమెకు తోడుగా వెళ్లారు. ఆ పిల్లవానికి అంతిమ సంస్కారం చేయటానికి సన్నద్ధులైన తరుణంలో గణపతిస్వామి అక్కడికి చేరుకొన్నారు. స్వామిని చూడగానే ఆమె మనస్సులో ఏదో ఆశ హఠాత్తుగా అంకురించింది. స్వామీజీని చూడగానే ఆయన తన పుత్రునికి ప్రాణదానం చేయగలడని అంతరాత్మ చెప్పినట్లయింది. అనిర్వచనీయమైన ఒక అనుభూతిని పొంది, కొన్ని క్షణాలపాటు భయంకరమైన తన పుత్రశోకాన్ని కూడా మర్చి పోయింది. కొంతసేపటికి తేరుకొని, చనిపోయిన కుమారుని స్వామీజీ పాదాలదగ్గర ఉంచి, ప్రాణదానం చెయ్యమని ప్రార్థించింది. ఆమె పరిస్థితిని గ్రహించిన కరుణామయుడైన స్వామీజీ ఆ పిల్లవాని భౌతిక కాయాన్ని చేతిలో స్పృశించారు. స్వామీజీ చెయ్యి తాకగానే ఆ శరీరంలో చైతన్యం ఉట్టిపడింది. దానిని చూసి ఆ స్త్రీ ఆనంద పులకాంకితయై స్వామివారి చరణములపైన వ్రాలి నమస్కరించింది. అక్కడ ఉన్నవారంతా నిశ్చేష్టులయ్యారు. స్వామివారు వారందరినీ అనుగ్రహించి ఆ పిల్లవానిని ఇంటికి తీసుకు వెళ్లమని అనుజ్ఞ ఇచ్చారు. వారంతా చూస్తూ ఉండగానే మరుక్షణంలో స్వామీజీ అదృశ్యమయ్యారు. ఆ తరువాత మరెప్పుడూ గణపతిస్వామి మానససరోవరంలో కనిపించలేదు.

ఆ తరువాత గణపతిస్వామి 1133 వ సంవత్సరంలో నర్మదానదీ తీరాన ఉన్న మార్కండేయాశ్రమానికి వచ్చి నివసింపసాగారు. అక్కడ ఎందరో మహాత్ములతో కలసి సంభాషించే అవకాశం ఆయనకు లభించింది. అది ఆయనకు చాలా సంతోషాన్ని కలిగించింది. వారుకూడా గణపతిస్వామిని కలిసినందుకు సంతుష్టులైనారు.

ఆ ఆశ్రమంలో ఖాకీబాబా అనే ఒక మహానుభావుడు చాలారోజులుగా నివసిస్తూ

ఉండేవారు. ఆయన ప్రతిరోజూ నర్మదానదీ తీరానికి వెళ్లి యోగాభ్యాసం చేసేవారు. ఒకరోజున ఆయన నది ఒడ్డుకు వెళ్లి చూసేసరికి, ఆ నదిలోని నీళ్లన్నీ పాలలాగా కనబడసాగినాయి. గణపతిస్వామి ఆ పాలను దోసిలితో తీసుకొని త్రాగటానికి సిద్ధంగా ఉన్నారు. అదిచూసిన ఖాకీబాబా హఠాత్తుగా నిశ్చేష్టుడయ్యారు. ఆ పాలను తానుగూడా త్రాగటానికి దోసిలిలో పట్టగానే ఆ నదిలోని పాలన్నీ నీరయ్యాయి. ఆ అద్భుత సంఘటన చూసి ఖాకీ బాబా నిశ్చేష్టుడై నిలబడిపోయారు. ఆ తరువాత తన ఆశ్రమానికి తిరిగివచ్చిన ఖాకీబాబా, తాను చూసిన ఆ యథార్థ సంఘటనను ఆ ఆశ్రమంలోనే ఉంటూ ఉన్న మహాత్ములకు వర్ణించి చెప్పారు. అది విన్న ఆ ఆశ్రమవాసులంతా ఆశ్చర్యచకితులై పూర్వంకన్న ఎక్కువ భక్తిశ్రద్ధలతో గణపతి స్వామిని గౌరవించసాగారు.

ఆ సంఘటన తరువాత గణపతిస్వామివారు మార్కండేయాశ్రమాన్ని వదలి 1140లో ప్రయాగ చేరుకొన్నారు. అక్కడ ఒక నిర్జన ప్రదేశంలో యోగసాధన చేయసాగారు. ఒకరోజున గణపతిస్వామి ప్రయాగఘాట్‌లో కూర్చొని ఉండగా, ఒక నావకొంతమంది యాత్రికులను తీసుకొని అక్కడికి వస్తూ ఉండింది. ఆ నావ ప్రవాహ మధ్యభాగంలో ఉండగా ఆకాశమంతా మేఘావృతమై, తుఫాను గాలులు వీచసాగాయి. పెద్దవాన మొదలైంది. ఒడ్డున ఉన్న జనమంతా ప్రాణభీతితో పారిపోసాగారు. గణపతిస్వామి మాత్రం ఆ వానలో అక్కడ అట్లాగే కూర్చొనే ఉన్నారు. పారిపోతున్న వారిలో రామతారక భట్టాచార్య అనే ఒక బ్రాహ్మణుడు స్వామివారిని గుర్తించి, వారివద్దకు వెళ్లి, వర్షంలో కూర్చొని అనవసరంగా కష్టమును కొనితెచ్చుకోవద్దని, కాకపోతే తనవెంట రమ్మని ప్రార్థించాడు. అది విని గణపతిస్వామి చిరునవ్వు నవ్వి ఇలా అన్నారు. "బాబూ! నీవు నాకొరకు ఎందుకు బాధపడతావు. నేను కష్టాన్ని అనుభవించటంలేదు. అదిగో చూడు – ఆ వస్తున్న నావ కొద్దిసేపట్లో మునిగిపోతున్నది. దానిలోని యాత్రికులను రక్షించవలసి యున్నది" అని అంటూ ఉండగానే ఆ నావ నీటిలో మునిగపోయింది. చూస్తూ చూస్తూ ఉండగానే గణపతిస్వామి కూడా అదృశ్యులయ్యారు. అది చూస్తూ ఉన్న ఆ బ్రాహ్మణుడు నిశ్చేష్టుడయ్యాడు. అక్కడే ఉండి ఏం జరుగుతుందో అని ఆతృతతో చూస్తూ ఉండగా, మరుక్షణంలో ఆ నావ ఒడ్డుకు చేరుకొన్నది. ఆ నావలోనుండి యాత్రికులతోపాటు గణపతిస్వామికూడా దిగారు. అది చూసి బ్రాహ్మణుడు మరింత

ఆశ్చర్యపడినాడు. అతని నోటినుంచి మాటలు కూడా రాలేదు. తమతోపాటు నావలోనుంచి దిగిన ఆ అపరిచిత దిగంబర వ్యక్తిని చూసి ఆశ్చర్యచకితులయ్యారు. తమ నావ ఏ విధంగా ఒడ్డుకు చేరిందో వారికి తెలియనే తెలియదు. అందరూ ఎవరి ఇళ్ళకు వారు వెళ్లిపోయారు. రామతారక భట్టాచార్యుడు మాత్రం అదంతా అర్థం చేసుకొని స్వామీజీ పాదాలమీద వ్రాలిపోయాడు. స్వామీజీ పాదధూళిని స్వీకరించి, నొసటిమీద ధరించి, ఏదో అడగబోయాడు. అంతలోనే స్వామీజీ ఆయన మనస్సులోని మాటను గ్రహించి ఇలా చెప్పసాగాడు. "బాబూ! ఇప్పటి సంఘటనను చూసి నీవెందుకు అంత ఆశ్చర్యపడుతున్నావు? నిజంగా నీవు ఆశ్చర్యపడనవసరం లేదు. ఇటువంటి శక్తి నీలో కూడా ఉన్నది. అది అందరిలోనూ ఉంటుంది. కాని, మనుష్యులంతా అనిత్యమైన ఈ సాంసారిక సుఖంలో మునిగిపోయి, ఎవ్వరూ తమ అత్యున్నతస్థితిని గురించి ఆలోచించటంలేదు. భగవంతుడు మానవ శరీరాన్ని సృష్టించి, స్వయంగా దానిలోనే కాపురమున్నాడు. అందువలన ప్రతిమనిషిలోనూ ఈశ్వరీయ శక్తి ఉన్నది. అనిత్యమైన ప్రపంచం కొరకు మానవుడు ఎంత ప్రయత్నం చేస్తున్నాడో, అందులో నూరవవంతు భగవంతుని కొరకు ప్రయత్నిస్తే ఆయన మనకు తప్పక లభిస్తాడు. అలాంటివారికి ఈ ప్రపంచంలో అసాధ్యమైనది ఏమీ ఉండదు. ఇందులో ఆశ్చర్యకర విషయం ఏమీ లేదు. నీవు అనవసరంగా వర్షంలో తడిసి కష్టపడుతున్నావు". అని చెప్పి స్వామీజీ అదృశ్యులయ్యారు.

వంగసంవత్సరం 1144 మాఘమాసంలో గణపతిస్వామి ప్రయాగను వదలి పెట్టి కాశీపట్టణం చేరి, అక్కడి అసీఘాట్‌లో ఉన్న తులసీదాసు తోటలో నివసింప సాగరు. అక్కడాయన అప్పుడప్పుడు లోలార్కకుండమునకు వెళ్లి వస్తూ ఉండేవారు. ఒకరోజున అక్కడ ఆయనకు అజ్మీర్‌వాసియైన బ్రహ్మసింహుడనే పేరుగల చెమిటి వాడు కుష్టురోగంతో బాధపడుతూ కనిపించాడు. స్వామిజీ ఆయనను స్పృశించ గానే ఆ వ్యక్తి మేల్కొని వారిని స్తుతింపసాగాడు. స్వామి సంతుష్టులై అతనికి ఒక బిల్వపత్రాన్ని ఇచ్చి, లోలార్కకుండంలో స్నానం చేసి, ఆ బిల్వ పత్రాన్ని ధరించి, ఆ పీడనుంచి విముక్తుడవు కమ్మని ఆదేశించారు. స్వామివారు చెప్పినట్లు చేసి, కొద్దిదినాలలోనే ఆతడు చెమిటితనము - కుష్ఠురోగములనుండి విముక్తుడై కాంతిమంతుడైనాడు. అప్పటినుంచీ అతడు స్వామీజీకి సేవకునిలా సేవలు చేయసాగాడు.

దాని తరువాత స్వామివారు తులసీదాసుతోటను వదలి, వేదవ్యాసాశ్రమంలో ఉండసాగారు. సీతానాథ బందోపాధ్యాయ అనే ఒక బ్రాహ్మణుడు రాజయక్ష్మంతో చాలారోజులుగా బాధపడుతూ ఉండేవాడు. ఎన్నివైద్యాలు చేయించినా ఆ రోగం తగ్గలేదు. అతడు హతాశుడై, ఒక రోజున స్నానం చేయ్యటానికి గంగానదికి వెళ్లాడు. అక్కడ అతనికి దగ్గు రావటం ప్రారంభమైంది. ఒకవైపున అలసట, మరొకవైపున రోగముతోను బాధపడుతూ ఆ గంగానది ఒడ్డున పడి ఏడవసాగాడు. కొంచెం సేపటికి రోగం అధికమై అచేతనుడైపోయాడు. హృదయవిదారకమైన ఆ దృశ్యాన్ని చూసినవారు చలించిపోయి, అతనికి సేవచేయుటం ప్రారంభించారు. కాని ఎంతసేపటికీ ఆయనలో కదలిక రాకపోవటంవలన ఆయనమీద ఆశలు వదిలివేశారు. అదే సమయంలో గణపతిస్వామి గంగాస్నానానికి అక్కడికి వచ్చారు. స్వామి వారందరినీ ప్రక్కకు పొమ్మని ఆదేశించి, ఆ బ్రాహ్మణుని వక్షస్థలాన్ని ముట్టుకొని, అతని చేతులు పట్టుకొని కూర్చోబెట్టారు. బ్రాహ్మణుడు పునర్జీవితుడైనట్లు లేచి కూర్చున్నాడు. తన ఎదుట ఉన్న దైవస్వరూపులైన స్వామివారి పాదాలను పట్టుకొని నమస్కరించి, తనకు సంక్రమించిన భయంకరవ్యాధినుంచి విముక్తిని ప్రసాదించమని ప్రార్థించాడు. కరుణామయులైన స్వామీజీ గంగానదిలోని మట్టిని తెచ్చి తినమని చెప్పి, తాము స్నానానికి వెళ్లిపోయారు. ఆ బ్రాహ్మణుడు భక్తిప్రపత్తులతో స్వామి చెప్పినట్లు చేసి, కొద్దిరోజులలోనే రాజయక్ష్మరోగంనుంచి పూర్తిగా విముక్తుడై దివ్యతేజస్సును పొందాడు. అప్పటినుంచీ అతడు స్వామివారిని సాక్షాత్తు భగవంతునిగానే భావించి సేవ చేయసాగాడు. స్వామివారి పాదధూళిని పరిగ్రహించి, పాదసేవ చేసి, కృతార్థుడయినయితినని భావించేవాడు.

కొన్ని దినాలకు గణపతిస్వామి వేదవ్యాసాశ్రమం వదలి, హనుమాన్ ఘాట్‌లో నివసింపసాగారు. ఒక మహారాష్ట్ర మహిళ ప్రతిరోజు విశ్వనాథుని సేవించటానికి వస్తూ ఉండేది. దిగంబరులైన స్వామిని చూసి తిరస్కార భావంతో తొలగిపోతూ ఉండేది. గణపతిస్వామివారు మాత్రం ఆమెను పట్టించుకొనేవారు కారు. ఒకరోజు ఆమె విశ్వేశ్వరుని పూజ పూర్తిచేసుకొని ఇంటికి తిరిగివచ్చింది. ఆ రాత్రి విశ్వనాథుడు ఆమెకు కలలో కనిపించి "నీవు ఏ కోరికను పొందవలెనని పూజ చేస్తున్నావో అది నాతో నెరవేరదు. ఏ స్వామివారిని నీవు తిరస్కరిస్తున్నావో ఆయన వల్లనే నెరవేరుతుంది." అని చెప్పాడు. అది విని ఆమె ఎంతో పశ్చాత్తాపపడి, తన

మనస్సులో పరితపించసాగింది. స్వామివారిని అకారణంగా తిరస్కారభావంతో చూసినందుకు ఎంతో తప్పు చేసినట్లు భావించింది. కాని, స్వామివారు ఏమీ అనకపోవటం వలన తనపట్ల ఆయన దయచూపుతారని ఆశించింది. మరునాడు ప్రొద్దున ఆమె హనుమాన్‌ఘాట్‌కు వెళ్లి, స్వామివారి పాదాలమీదపడి క్షమించమని వేడుకొని "నా భర్తకు కడుపులో ఒక పెద్ద పుండు ఉన్నది, దానిని నయము చెయ్యమని ప్రతిరోజు విశ్వనాథుని పూజిస్తున్నాను" అని విన్నవించుకొన్నది. ఆమె ప్రార్థనను విన్న స్వామివారు ఆమెకు కొంచెం భస్మం ఇచ్చి, దానిని అతని వక్షస్థలంమీద వ్రాయమని చెప్పారు. గణపతిస్వామివారికి ఆమె భక్తిప్రపత్తులతో నమస్కరించి, ఇంటికివెళ్లి, వారు చెప్పినట్లు చేసింది. కొద్ది రోజులలోనే ఆమె భర్త పూర్తిగా ఆరోగ్యవంతుడయ్యాడు.

ఆ తరువాత గణపతిస్వామి హనుమాన్‌ఘాట్‌ను వదిలి, దశాశ్వమేధఘాట్‌వద్ద నివసింపసాగారు. రాంపూర్ నివాసి అయిన శివప్రసాద్ మిశ్రా అనే బ్రాహ్మణుని కుమారుడు పక్షవాతంతో బాధపడుతూ ఉండేవాడు. ఎన్ని మందులు వాడినా అది తగ్గలేదు. ఒకరోజున శివప్రసాద్ మిశ్రా తన కుమారుని తీసుకొని గణపతిస్వామి వారిని దర్శించి, ఆ పిల్లవానిని స్వామిపాదాలచెంత ఉంచి, నయం చెయ్యమని ప్రార్థించాడు. కరుణామయులైన స్వామీజీ ఆ బ్రాహ్మణుని మాటలు విని, ఆ పిల్లవానిని శిరస్సునుంచి కాళ్లవరకూ చూశారు. ఆ తరువాత అతనిని స్పృశించి ఇంటికి తీసుకొని వెళ్లమని ఆదేశించారు. ఆ బ్రాహ్మణుడు స్వామివారి పాదధూళిని గ్రహించి, ఆనందంతో ఇంటికి తిరిగి వెళ్లాడు. కొద్దిరోజులకే ఆ బాలుడు పక్షవాతం నుంచి విముక్తుడై ఆరోగ్యవంతుడైనాడు.

ఈ విధంగా గణపతిస్వామివారి అసాధారణమైన ప్రతిభ ప్రచారమై, నాలుగు దిక్కులా వ్యాపించింది. ఎందరో స్వామివారి వద్దకు వచ్చి, తమ కోర్కెలను తీర్చమని ఎన్నో విధాల కోరుకునేవారు. అందువలన స్వామివారి పారిమార్థిక జీవనానికి విఘ్నం కలుగసాగింది. అందుకు స్వామీజీ మౌనవ్రతం పాటించటం ప్రారంభించారు. ఎవరితోనూ మాట్లాడేవారు కారు. ఏదయినా ముఖ్యమైన పని ఉంటే, ఒకటి రెండు మాటలు మాత్రం మాట్లాడేవారు. ఎవరు ఏది ఇచ్చినా కులగోత్రాలు లెక్కపెట్టక తినేవారు.

కాశీవాసులే కాక, ఇతర ప్రాంతాలనుంచి వచ్చినవారు కూడా, విశ్వనాథుని అన్నపూర్ణను మణికర్ణికను దర్శించినపుడు ఎలాంటి తృప్తిని పొందేవారో, అట్లాగే ఈ మహాత్ముని దర్శించి కూడా ధన్యులమైనామని భావించేవారు. స్వామివారి అసలు పేర్లయిన త్రైలింగధరుడు - గణపతిస్వామి వంటివి వారికి తెలియక పోవటంవలన, త్రిలింగదేశానికి చెందినవాడని తెలుసుకొని, ఆయనను త్రైలింగస్వామి అని పిలువసాగారు.

అన్నపానీయాల విషయం గురించి ఆయన ఏమీ పట్టించుకోకపోవటం వలన, ఒకరోజున ఒక దుర్మార్గుడు సున్నం కలిపిన నీటిని ఆయనచేత త్రాగించేడు. స్వామి నిర్వికార చిత్తంతో దానిని త్రాగి, అతని ఎదుటనే మూత్రవిసర్జన చేసి, నీటిని సున్నాన్ని వేరుచేసి చూపించారు.

ఒకరోజున ఒక ధనవంతుడు ఇరవై తులాల బంగారు కంకణాలను చేయించి స్వామివారి చేతులకు తొడిగాడు. ఆ కంకణాలను దొంగిలించదల్చిన కొందరు దుష్టులు స్వామివారికి తెలియకుండా ఆయనచేత మద్యపానం చేయించారు. అయినా స్వామీజీ మూర్ఛితులుకాని, క్రుద్ధులు కానీ కాలేదు. పైగా వారి ఉద్దేశాన్ని గ్రహించి, తనచేతికి ఉన్న కంకణాలను తీసి వారికి ఇచ్చివేశారు.

సాధారణంగా కాశీపట్టణానికి ధనవంతులు వచ్చేవారు. వారిలో చాలామంది త్రైలింగస్వామివారికి బహుమూల్యములైన వస్తువులను భూషణములను తెచ్చి సమర్పించుకొనేవారు. కాని ధనలోలురు, దుష్టులు అయినవారు వాటిని దొంగిలించే వారు. స్వామివారు మాత్రం దానిని గురించి పట్టించుకొనేవారు కాదు.

త్రైలింగస్వామి దిగంబరులై తిరుగుతూ ఉండేవారు. అందువలన కొందరు పోలీసులు ఆయనను పట్టుకొని పోయి జిల్లా న్యాయాధిపతిముందు నిలబెట్టారు. న్యాయాధిపతి అట్లా తిరగటానికి వీలులేదని శాసించాడు. ధోవతి కట్టుకోవాలని ఆదేశించాడు. స్వామీజీ దాన్ని పట్టించుకోలేదు. న్యాయాధిపతికి కోపం వచ్చి, బేడీలు వేసి చెరసాలలో పెట్టమని ఆదేశించాడు. వెంటనే పోలీసులు ఆయనకు బేడీలు వేయటానికి దగ్గరకు వెళ్లగా, స్వామీజీ వారికి కనబడలేదు. అక్కడ ఉన్నవారంతా ఆశ్చర్యపడ్డారు. వారు ఆ ప్రదేశమంతా దాదాపు గంటసేపు వెదికినా కనబడలేదు. ఆ తరువాత స్వామీజీ న్యాయాధిపతి ముందు హఠాత్తుగా

ప్రత్యక్షమయ్యారు. స్వామీజీ ఎట్లా మాయమయ్యారో, మళ్లీ ఎట్లా ప్రత్యక్షమయ్యారో వారికి అర్థం కాలేదు. అది చూసి వారంతా ఆశ్చర్యచకితులైనారు. న్యాయాధిపతి కొంతసేపటికి తేరుకొని, స్వామివారు తమకు నచ్చినవిధంగా తిరుగవచ్చునని అనుమతినిచ్చాడు.

ఈ సంఘటన జరిగిన కొద్ది రోజులకు మరొక అధికారి వచ్చాడు. ఆయన చాలా తీవ్రస్వభావం కలవాడు. ఒకరోజు ఆయన దృష్టి స్వామివారిమీద పడింది. స్వామీజీ దొంగసాధువు అని తలంచి చెరసాలలో పెట్టి బంధించాడు. మరునాడు ప్రొద్దున ఆయనకు ఒక విచిత్ర సంఘటన కనిపించింది. అదేమిటంటే – స్వామీజీని బంధించిన చెరసాల అంతా బాగా నీళ్లతో తడిసి ఉండింది. చెరసాల తలుపుకు వేసిన తాళం అట్లాగే ఉండింది. కాని స్వామీజీ మాత్రం చెరసాల బయటివైపున అటూ ఇటూ పచార్లు చేస్తూ కనిపించారు. వెంటన ఆ అధికారి – "నీవు చెరసాల నుంచి బయటకు ఎట్లా వచ్చావు? ఇంత నీరు చెరసాలలోకి ఎట్లా వచ్చింది?"అని అడిగాడు. స్వామీజీ చిరునవ్వు నవ్వి "అర్ధరాత్రి నాకు మూత్రవిసర్జన చేయవలసి వచ్చింది. గదికి తాళం వేసి ఉండటంవలన, గదిలోనే మూత్రవిసర్జన చేశాను. ఉదయం కాగానే బయటకు పోవాలనే కోరిక కలిగింది. చూసేసరికి గదితలుపులు తెరిచి ఉన్నాయి. నేను బయటకు వచ్చేశాను. మీరు ఎవరి జీవితాన్నీ తాళం వేసి బంధించలేరని నిశ్చయంగా తెలుసుకోండి. ఒకవేళ ఆ విధంగా బంధించగలిగినా, వారిని మరణసమయంలో బంధించి మరణం రాకుండా కాపాడగలరా? అంతకు ముందు కూడా ఎవ్వరూ మరణించరు. ఎవ్వరికీ అలాంటి శక్తి లేదు. మరి మీరు ఎందుకు అంతగా కోపగిస్తున్నారు?" అని అన్నారు. ఆ విచిత్ర సంఘటనను తన కళ్లారా చూసిన ఆ అధికారి అవాక్కయిపోయాడు. ఆ తరువాత స్వామీజీ యథేచ్ఛగా తిరుగవచ్చని అనుమతి ఇచ్చాడు. స్వామీజీకి అయిష్టమైనపని ఎవ్వరూ చేయరాదని ఆజ్ఞాపించాడు.

ఒకరోజున ఖాలీస్‌పురా నివాసి అయిన దేవనారాయణ వాచస్పతి అనే పండితుడు స్వామివారిని భోజనానికి ఇంటికి తీసుకొనివచ్చాడు. భోజనం అయిన తరువాత త్రాగటానికి నీరు కావాలన్నారు స్వామీజీ. నీరు తేవటానికి వాచస్పతి ప్రక్కగదిలోకి వెళ్లాడు. తిరిగి రావటంలో కొంచెం ఆలస్యం అయింది. వాచస్పతి తిరిగివచ్చేసరికి స్వామీజీ నీళ్లు త్రాగుతూ కన్పించారు. ఆ నీళ్లు ఆయనకు ఎట్లా

వచ్చాయో అర్థం కాలేదు. కాని తాను చేసిన ఆలస్యానికి ఎంతో సిగ్గుపడ్డాడు పండితుడు.

వంగ సంవత్సరం 1195 లో ఒక హిందూ స్వతంత్రరాజు సపరివారంగా కాశీకి వచ్చాడు. గంగానదిపట్ల ఆయనకు ప్రగాఢమైన భక్తివిశ్వాసాలు ఉండటం వలన, వారంతా సపరివారంగా నడిచివెళ్లి దశాశ్వమేథఘాట్‌లో స్నానం చేయాలని అనుకొన్నారు. కాని రాణి సామాన్యంగా మరొకరి ముందుకు రావటానికి కాని, అసలు బయటకు రావటానికి కాని ఇష్టపడదు. అందువలన వారున్న ప్రదేశంనుంచి స్నానం చేయదలచిన రేవువరకూ తెరలు కట్టారు. లోపలికి ఎవ్వరూ రాకుండా తెరలు అమర్చబడినాయి. నియమిత సమయంలో రాజు - రాణి దాసీలతో కలిసి స్నానానికి వెళ్లారు. స్నానం చేయటానికి ముందు వారికి అక్కడ ఎవ్వరూ కన్పించలేదు. కాని స్నానం చేసి బయటకు వచ్చేసరికి దీర్ఘకాయుడైన ఒక దిగంబర పురుషుడు వారి ఎదుట నిలబడి ఉండటం కన్పించింది. రాణి ఆ దిగంబర పురుషుని చూసి సిగ్గుపడి, దాసీజనంతో తన నివాసస్థలానికి వెళ్లిపోయింది. అదంతా చూడగానే రాజుకు విపరీతమైన కోపం వచ్చింది. స్వామీజీని దండించటానికి మహారాజు భటులను పంపించాడు. భటులు అక్కడికి రాగానే, రాజుకు ఒక దివ్యరూపంతో స్వామి కనిపించారు. రాజు స్వామీజీని దండించక ఏవో ప్రశ్నలు వేసాడు. స్వామీజీ సమాధానం చెప్పలేదు. ఆ తరువాత స్వామీజీని పైకి పంపించమని ఆదేశించాడు. రక్షకభటులు స్వామీజీని పైకి తీసుకొనివెళ్లారు. "మీరు ఇక్కడికి ఎందుకు వచ్చా"రని రాజు స్వామిని ప్రశ్నించాడు. స్వామి దానికీ సమాధానం చెప్పలేదు. ఇదంతా వింతగా చూస్తూ ఎందరో అక్కడ చేరారు. అందులో స్వామీజీ మహిమలు తెలిసినవారు కొందరు, ఆ మహానుభావునికి ఏ శిక్షా పడకూడదని మనస్సులో భావిస్తూ ఉన్నారు. వారి కళ్లవెంట కన్నీరు కారుతున్నా రాజుగారిఎదుట ఏమీ చెప్పలేక, లోలోపల చాలా దిగులుపడసాగారు. వారు ఒకరితో ఒకరు మెల్లిగా మాట్లాడుకున్నదానిని బట్టి రాజుకు ఆ దిగంబర పురుషుని గొప్పతనం తెలిసింది. స్వామీజీ యథార్థ స్వరూపం తెలుసుకున్న రాజు వారిని వదిలిపెట్టమని ఆజ్ఞాపించారు. అయినా ఇద్దరు ముగ్గురు రాజుగారి అనుయాయులు స్వామివారిని అవమానపరచిన తరువాతనే విడిచిపెట్టారు.

ఆరోజు రాత్రి రాజుగారికి నిద్రలో ఒక భయంకర దృశ్యం కనిపించింది. జటాజూటము ధరించి, పులిచర్మం కట్టుకొని, త్రిశూలాన్ని ధరించిన ఒక వ్యక్తి భీషణాకారంతో, కళ్లు ఎఱ్ఱవి చేసి ఈ విధంగా అన్నాడు. "ఓరి దురాచారీ! బుద్ధిహీనుడా! నీవు త్రైలింగస్వామి గొప్పతనాన్ని ప్రత్యక్షంగా అనుభవించికూడా, ఆయనను అవమానపరచి పంపించి, నా హృదయానికి చాలా బాధ కలిగించావు. దానికి తగిన శిక్షను నీవు అనుభవించవలసిందే. మూర్ఖుడా! నీవు ఇలాంటి పవిత్రస్థలంలో ఉండదగిన వ్యక్తివి కావు. త్వరగా నీవు ఈ ప్రదేశాన్ని వదిలి వెళ్లు. లేకపోతే నీకు క్షేమం లేదు" అని. ఆ భయంకరస్వప్నం కన్న రాజు నిద్రలో పెద్దగా అరిచాడు. ఆ అరుపు విని రాజపరివారమంతా అక్కడికి వచ్చి చూసేసరికి మహారాజు అచేతనంగా పడిఉన్నాడు. ఆయన కనుగ్రుడ్లు పైపైకి పోతూ ఉండినాయి. అది చూసి గాభరా పడిన పరివారం, కారణం ఏమిటో తెలియక గొడవపడసాగారు. కొద్దిసేపటికి రాజుగారికి తెలివి వచ్చింది. అట్లా పెద్దగా అరవటానికి కారణమేమిటని పరిజనం రాజును ప్రశ్నించారు. కాని మహారాజు ఆరాత్రి వారికేమీ చెప్పలేదు.

మరునాడు ప్రొద్దున సేవకులను పంపించి స్వామివారిని వెదికించాడు రాజు. స్వయంగా ఆయన వద్దకు వెళ్లి, పాదాలమీద పడి క్షమాపణ వేడుకొన్నాడు. చిదానంద నిర్వికారుడైన స్వామీజీ కోపం చూపకపోగా, ఆ రాజును క్షమించి, విశ్రాంతిని ప్రసాదించాడు.

వంగ సంవత్సరం 1207లో స్వామీజీ దశాశ్వమేధఘాట్ వదిలి, పంచగంగా ఘాట్‌లోని బిందుమాధవునివద్ద నివసింపసాగారు. అప్పుడు ఆయన ఎవరితోనూ మాట్లాడేవారు కారు. ఎక్కడికి వెళ్లేవారూ కాదు. అప్పటినుంచీ అందరూ ఆయనను "మౌనీబాబా" అనేవారు. స్వామీజీ సంజ్ఞలతోనే అన్ని పనులూ నిర్వహించేవారు. చాలా అవసరమనిపిస్తే, ఒకరిద్దరు పుణ్యాత్ములతో ధార్మికచర్చ చేసి, దాని అర్థతాత్పర్యములు వివరించేవారు. మనస్సులోని సందేహాలను తొలగించేవారు. అందరిపట్ల దయ చూపుతూ ఉండేవారు.

స్వామీజీతోపాటు అక్కడ మంగళదాస్ ఠాకూర్, ఆయన తమ్ముడు కృష్ణప్రసాద్ ఠాకూర్, వారి తల్లి అంబాదేవి కూడా ఉండేవారు. మంగళదాస్ స్వామీజీకి సేవలు

చేస్తూ ఉండగా, అంబాదేవి వారికి వంట చేసి పెట్టేది. వాళ్లకు ఉన్న ఒక ఆవుకు కృష్ణప్రసాద్ సేవచేస్తూ ఉండేవాడు. స్వామీజీ వాళ్లందరినీ ఎంతో ప్రేమగా చూసేవారు.

మంగళదాస్‌తో స్వామీజీ సంజ్ఞలతోనే మాట్లాడేవారు. అందువలన మంగళ దాస్‌కు కూడా సంజ్ఞలతోనే మాట్లాడటం అలవాటయింది. స్వామీజీ పడుకొనే గద్దెకు దగ్గరలో ఉన్న ఒక గోడమీద చాలా శ్లోకాలు వ్రాయబడి ఉండేవి. ఎప్పుడైనా ఎవరైనా ఏదైనా విషయాన్ని గురించి చర్చించటానికి వస్తే, స్వామీజీ మంగళదాసును పిలిచి, ఆ శ్లోకాలలో ఒకదాని మీద వ్రేలుపెట్టి వ్రాయమనేవారు. మంగళదాసు దానిని వ్రాసి ఇచ్చిన వ్యక్తికి దానిని చదివి వివరించమని చెప్పేవారు. ఒకసారి ఇద్దరు బ్రహ్మచారులు వచ్చి ఒక ముఖ్యమైన విషయాన్ని గురించి వివరణ అడుగగా, స్వామివారు తాను స్వయంగా వ్రాసిన ఇరవై -ముప్పై పుస్తకాలనుంచి అవసర మున్న ఒక పుస్తకాన్ని తెప్పించి, అందులో ఉన్న ఆ విషయాన్ని గురించి వివరించమని అనేవారు. ఇంకా ఏదయినా అత్యవసరమైన పరిస్థితిలో రాత్రివేళలో దానిని అర్థమయ్యేటట్లు బోధించేవారు.

స్వామీజీ ఆహారానికి కూడా నియమాలు ఉండేవి కావు. ఒక్క శేరు నుంచి ఒక్క మణుగు వరకూ తినేవారు. ఒక్కొక్కప్పుడు అసలు ఏమీ తినేవారు కాదు. ఒక్కొక్కసారి అన్నం తినేవారు. మరొకసారి పాలు త్రాగేవారు. ఒక్కొక్కసారి ఎవరు ఏది ఇస్తే అదే తినేవారు.

వంగసంవత్సరం 1217లో ఒకసారి ఉజ్జయినీ మహారాజు కాశీకి వచ్చాడు. ఒకరోజున ఆయన కాశీరాజు భవనం ఉన్న రామ్‌నగర్‌నుంచి మణికర్ణికకు నావలో బయల్దేరాడు. ఆయన వెంట ఉన్న బ్రాహ్మణులు వేదపఠనం చేస్తూ ఉన్నారు. ఇంతలో ఎదురుగా కొంచెం దూరంలో త్రైలింగస్వామి నీళ్లపైన ప్రకాశిస్తూ కనిపించారు. మహారాజు ఆశ్చర్యచకితుడై, ఆయన ఎవరని అడిగాడు. నౌకలో ఉన్న స్వామివారి భక్తుడొకడు ఈ విధంగా చెప్పాడు. "మహారాజా! ఆయన ఒక గొప్ప యోగీశ్వరుడు. నీటిమీదను, భూమిమీదను ఆయనకు సమానమైన అధికారం ఉన్నది. అసాధారణ యౌగికశక్తిసంపద కల మహాపురుషుడు. ఇంత గొప్ప యోగిపుంగవులు వర్తమానకాలంలో మరెక్కడా కన్పించరు" అని అన్నాడు. అది విని మహారాజు. "శరీరంలోని అంతశ్శత్రువులను అణచివేసినవారిని బయటి

శక్తులు ఏమి చేయగలుగుతాయి?" అని ప్రశంసించారు. ఆ మాటలు విన్న స్వామివారి భక్తుడు నావను స్వామివారివద్దకు తీసుకొనివెళ్లమని చెప్పాడు. నావ దగ్గరకు వచ్చిందో లేదో, మహారాజు మనస్సులోని అభిప్రాయాన్ని గుర్తించిన స్వామివారు స్వయంగా నౌకలోకి ఎక్కారు. మహారాజు చాలా సంతోషించారు. అంతేకాక, తాను చెప్పకముందే స్వామీజీ తన మనస్సులోని అభిప్రాయాన్ని గుర్తించినందుకు మహారాజు ఆశ్చర్యపడ్డారు. మహారాజు చేతిలో ఒక ఖడ్గం ఉండింది. మహారాజుగారి శౌర్యసాహసాలకు సంతుష్టులైన బ్రిటిష్‌వారు ప్రశంసా పూర్వకంగా ఆయనకిచ్చిన ఖడ్గమది. స్వామివారికి ఆ ఖడ్గాన్ని చూడాలని కోరిక కలిగింది. మహారాజు ఏమాత్రం సంకోచించకుండా దానిని స్వామివారి చేతికి ఇచ్చి అది తన సౌభాగ్యమని సంతోషపడ్డాడు. ఇంతలో స్వామివారు ఆ కత్తిని గంగా ప్రవాహంలోకి విసిరివేశారు. రాజుగారికి అమితమైన కోపం వచ్చి ఆ నావలోని భక్తులతో "ఈయనేమి సాధువు? ఇతరుల వస్తువులు తీసుకొని, దాని గుణాగుణములను తెలుసుకోకుండా ఇట్లా నష్టపరుస్తాడా? ఈయనలోని ఏ మహాగుణాలను చూసి సుప్రసిద్ధ మహాపురుషులని మీరు భావిస్తున్నారో నాకు అర్థం కావటంలేదు. ఏదో యోగవిద్యలో నీటిమీద తేలుతూ కనిపించినంతమాత్రాన మహాపురుషుడవుతాడా? ఒట్టి కపట సన్యాసిలాగా ఉన్నాడు". అని నిందించాడు. రాజు మాటలు విన్న భక్తులు – "మహారాజా! మీరు కోపగించకండి. మేము ఇప్పుడే గజ ఈతగాళ్లను పిలిపించి మీ కత్తి మీకు ఇప్పిస్తాము" అన్నారు. ఈ విధంగా వారి సంభాషణ జరుగుతూ ఉండగానే పడవ మణికర్ణికా ఘాట్‌కు చేరింది. స్వామివారు పడవ దిగటానికి ప్రయత్నించారు. కాని మహారాజు ఆయనను దిగనివ్వలేదు. అంత ప్రశస్తమైన ఖడ్గాన్ని నదిలో పారవేసినందుకు ఆ స్వామిని శిక్షించాలని అనుకొన్నాడు. ఒకవైపున కోపము, మరొకవైపున దుఃఖముతో సతమతమవుతున్న రాజును చూసి, స్వామివారు గంగా ప్రవాహంలో చెయ్యి పెట్టి రెండు ఖడ్గాలను పైకి తీశారు. ఆ రెండింటినీ రాజు చేతిలో పెట్టి – "ఇందులో నీ కత్తి ఏదో తీసుకో" అన్నారు. రెండు కత్తులూ ఒకేవిధంగా ఉండటంవలన తన కత్తి ఏదో రాజు తెలుసుకోలేకపోయాడు. అప్పుడు స్వామి – "మహారాజా! నీవు నీ వస్తువును తెలుసుకోలేకపోతే అది నీ వస్తువు ఎట్లా అవుతుంది? ఒకవేళ అది నీ వస్తువయితే నీవు దానిని తప్పక గుర్తించేవాడివి కదా! నీది కాని వస్తువుకోసం ఇంత తాపత్రయమెందుకు? నీలాంటి అహంకారి, మూర్ఖుడు ఎవ్వరూ ఉండరు" అని

మందలించారు. ఆ విధంగా అంటూనే స్వామీజీ ఒక కత్తిని రాజుగారి చేతిలోపెట్టి, రెండవకత్తిని తిరిగి గంగలోకి విసిరివేశారు. స్వామివారి మహిమలను చూసిన రాజుగారు కింకర్తవ్యతామూఢుడయ్యాడు. "స్వామీజీ మహాపురుషుడని తెలిసికూడా, ఒక సామాన్యమైన కత్తికోసం నేనాయనను నిందించి, శిక్షించటానికి పూనుకొన్న నీచుడను. ఒక చిన్న వస్తువుమీది మోహంతో ఎంతటి నీచకార్యానికి ఒడిగట్టాను?" అని మనస్సులో పరితపించసాగాడు. విలువైన తన ఖడ్గం లభించినా, ఎందుకనో అది మునుపటిలాగా ప్రీతికరంగా లేదు. ఆ మహారాజు స్వామివారి అలౌకిక శక్తులకు ముగ్ధుడైపోయాడు. అతని హృదయం భక్తిరసప్లావితమయింది. తాను చేసిన తప్పుకు స్వామీజీ పాదలమీద పడి క్షమాపణ కోరుకోవటం తప్ప గత్యంతరం లేదనుకొని, స్వామి పాదాలమీదపడి క్షమించమని ప్రార్థించాడు. రాజుగారి పశ్చాత్తాపానికి స్వామి కరిగిపోయి, కొన్ని సంజ్ఞల ద్వారా ఆయనను ఊరడించి, తిరిగి గంగాప్రవాహంలోకి దూకి అదృశ్యులయ్యారు. ఈ అద్భుత దృశ్యాన్ని కళ్లారా చూసిన రాజు, ఇతర భక్తులు ఆశ్చర్యచకితులయ్యారు. ఆయన మానవుడా? దేవుడా? అని వితర్కించుకొన్నారు. ఆ సమయంలో భక్తులు అనుభవించిన ఆనందం వర్ణనాతీతం. అందరూ ముక్తకంఠంతో స్వామివారిని ప్రశంసించసాగారు. మహారాజు కూడా అనిర్వచనీయమైన ఆనందంతో తబ్బిబ్బై ఆ భక్తులను కౌగలించుకొన్నాడు.

1276లో దయానంద సరస్వతి అనే మహాపండితుడు కాశీనగరానికి వచ్చాడు. ఆయన హిందూదేవతలను ఉపాసించటం వ్యర్థమని ప్రబోధింపసాగాడు. వారిని నిందింపసాగాడు. ప్రజలను తన ధర్మం వైపుకు తిప్పుకోవటానికి ప్రయత్నించ సాగాడు. ఒక్క ఈశ్వరుడే జగత్కర్త అని, ఆయన నిరాకారి–చైతన్యస్వరూపుడు – సర్వవ్యాపి అయి జగత్కల్యాణకారకుడ వుతున్నాడని ప్రబోధించాడు. అందుచేత ఇతర మూర్తులను ఉపాసించటం సంభవం కాదన్నాడు. ఆయన ఉపదేశాలతో ప్రభావితులైన జనులు చాలా మంది తమ ధర్మాన్ని విడిచి బ్రహ్మసమాజంలో చేరటం ప్రారంభించారు. దానిని చూసి త్రైలింగస్వామి వారి శిష్యులు ఇద్దరు దయానందసరస్వతిని గురించి వారికి నివేదించారు. అదంతా విని స్వామివారు ఒక చిన్న కాగితం ముక్కపైన ఏదో వ్రాసి మంగళదాస్ ఠాకూరుచేత దయానంద సరస్వతికి పంపించారు. అది చదివి దయానంద కాశీని విడిచి వెళ్లిపోయారు. ఆ

కాగితం మీద ఏమి వ్రాశారో అది దయానంద సరస్వతికి తప్ప మరెవ్వరికి తెలియదు.

వంగ సంవత్సరం 1281లో పృథ్వీగిరి శిష్యుడు విద్యానందుడు అనే ఆయన రాజఘాట్‌కు వచ్చారు. అది తెలిసి కొందరు ఆయనను కాశీధామాన్ని దర్శించమని కోరారు. కాని ఆయన తనకు త్రైలింగస్వామిని చూడటం తప్ప వేరే ఏమీ పని లేదని చెప్పాడు. కొన్ని రోజులు గడిచాక, ఒకరోజు ప్రాతఃకాలములో ఆయన త్రైలింగస్వామి ఆశ్రమానికి వెళ్లారు.ఆ సమయంలో త్రైలింగస్వామి శిష్యులతో ఉన్నారు. వారిలో కొందరు కూర్చొని ఉండగా మరికొందరు నిలుచునే ఉన్నారు. విద్యానందుని చూడగానే త్రైలింగస్వామి ఆయనను సాదరముగా ఆహ్వానించి కౌగలించుకొన్నారు. మరుక్షణంలో వారిద్దరూ అదృశ్యమైపోయారు అది చూసి అక్కడ ఉండిన శిష్యగణం ఆశ్చర్యచకితులయ్యారు. అందరూ అట్లాగే నిశ్శబ్దంగా కూర్చుండిపోయారు. ఒక అర్ధగంట తరువాత స్వామివారు మాత్రం తన స్థానంలో కన్పించారు. కాని విద్యానందస్వామి మాత్రం కనపడలేదు. అతడు రాజ్‌ఘాట్‌లో ఉన్నట్లు తెలుసుకొని అందరూ అక్కడికి వెళ్లారు.

ఒకసారి సోనాపూర్ నివాసియైన రాంకమల్ ఛటోపాధ్యాయుని ఐదు సంవత్సరాల పిల్లవాడు మెట్లమీదనుంచి పడ్డాడు. అతని గుండె ఎముక ఒకటి విరిగింది. చికిత్స కై ఆ పిల్లవానిని బేల్‌పూర్ ఆసుపత్రిలో చేర్చారు. కొన్ని దినాలు చికిత్స చేశాక కొంతనయమైంది. కాని గుండె నొప్పి తగ్గలేదు. అతడు చక్కగా నడవలేకపోయేవాడు. వైద్యులు ఆ పిల్లవానిని కలకత్తాకు తీసుకొనిపోయి మంచి డాక్టరువద్ద చికిత్స చేయించమని సలహా ఇచ్చారు. కలకత్తాలోని డాక్టర్లు ఆ పిల్లవానిని పరీక్షించి ఆపరేషన్ చెయ్యాలని చెప్పారు. అయితే దానివలన ప్రాణహాని కూడా కలుగవచ్చునని చెప్పారు. అది విని రాంకమల్ భయపడ్డాడు. ఆబాలునిపై ఆశ వదులుకొని ఇంటికి తీసుకొనివచ్చాడు. ఆ విషయమంతా విన్న రాంకమల్ భార్య నిరాశాగ్రస్తురాలయింది.

కొన్నిరోజులు గడిచాయి. ఆ పిల్లవానిని త్రైలింగస్వామి వద్దకు తీసుకొని పోవటానికి నిశ్చయించుకొన్నారు. అంతేకాక స్వామివారు పొమ్మని అనుజ్ఞ ఇచ్చే వరకూ అక్కడే ఉండటానికి కూడా నిర్ణయించుకొని, ప్రతి రోజూ స్వామి వారిని

దర్శించుకొని ధ్యానిస్తూ ఉండేవారు. ఆవిధంగా వస్తూపోతూ ఒకనెల గడచి పోయింది.

ఒకరోజు స్వామివారు మీరు ప్రతిరోజూ ఇక్కడికి వచ్చిపోవటానికి కారణమే మిటని అడిగారు. అప్పుడు ఆ పిల్లవాని తల్లి జరిగిన వృత్తాంతమంతా వివరించి చెప్పి ఆయన పాదాలమీద పడి ఏడవసాగింది. స్వామివారు పిల్లవానిని చూసి, ఆ స్థానంలోని మట్టిని తీసి, బాధ ఉన్నచోట వ్రాయమన్నారు. అంతేకాక –"ఈ పిల్లవాడిని ఇంటికి తీసుకొనిపొండి. కొంచెం సేపటికి ఇతనికి విపరీతమైన జ్వరం వస్తుంది. కాని మీరు భయపడవద్దు. కొద్దిసేపటికి ఆ జ్వరం తగ్గి, విపరీతమైన ఆకలి వేస్తుంది. అప్పుడు ఇంట్లో ఏది ఉంటే అది తినిపించండి. మీ బాలుని ఆరోగ్యం కుదుట పడుతుంది". అన్నారు. ఆ తరువాత స్వామివారు చెప్పినట్లే ఆ పిల్లవాడు ఆరోగ్యవంతుడయ్యాడు.

ఖాలిస్‌పురా నివాసి అయిన భవానీచరణ్ వాచస్పతికి జ్వరము – అతిసారము పిత్తాశయ వ్యాధులు వచ్చి చాలాకాలంగా బాధపడసాగాడు. ఎందరెందరో డాక్టర్లు చికిత్సచేశారు. కాని ఫలితం లేకపోయింది. భవానీచరణ్ హతాశుడై, తనకు అవసాన కాలం ఆసన్నమవుతున్నదని భావించి త్రైలింగస్వామిని శరణువేడటానికి నిర్ణయించుకొన్నాడు. అప్పటినుంచీ ప్రతిరోజు స్వామివారి ఆశ్రమానికి వచ్చిపోతూ ఉండేవాడు. ఒకరోజు స్వామివారు నీవు నిత్యం ఇక్కడికి వచ్చి పోవటానికి కారణమేమిటని అడిగారు. భవానీచరణ్ తన పరిస్థితిని వివరించాడు. అది విన్న స్వామీజీ కొంచెం భంగు తీసి ఆయన కిచ్చి నలిపి, దానిలో కొంత తినమని సంజ్ఞ చేశారు. భవనీచరణ్ అట్లాగే చేశాడు. ఆ తరువాత స్వామివారు ప్రతిరోజూ రమ్మని ఆయనకు సంజ్ఞ చేశారు.

ఆ విధంగా భవానీచరణ్ నెలరోజులపాటు ప్రతిరోజూ అక్కడికి వెళ్లేవాడు. స్వామివారి ఆదేశానుసారం భంగుని నలిపి, ప్రతిదినం ఒక గోలీని సేవిస్తూ ఉండేవాడు. ఒకరోజున స్వామివారు పెద్దగా వాంతి చేసుకొన్నారు. భవానీ చరణ్ రాగానే దానిని శుభ్రం చెయ్యమని ఆయనకు సంజ్ఞ చేశారు. భవానీ చరణ్ ఎలాంటి సంకోచమూ లేకుండా తన రెండు చేతులతో ఆ వమనమును తీసివేసి శుభ్రం చేసి స్నానం చేశాడు. ఆ తరువాత స్వామివారు ప్రతిరోజూలాగేనే, ఒకరోజున భంగు ఇచ్చి నలిపి సేవించమన్నారు. మర్నాడు వచ్చిచూసే సరికి అక్కడ మలమూత్రాలు

ఉండినాయి. స్వామీజీ – దానిని బయట పారేసి శుభ్రం చెయ్యమని సంజ్ఞ చేశారు. భవానీచరణ్ ఏమాత్రం సంకోచించకుండా దానిని శుభ్రం చేసి స్నానం చేశాడు. స్వామివారు యథాప్రకారంగా భంగును ఇచ్చి నలిపి సేవించమని ఆజ్ఞాపించారు. ఇప్పటినుంచీ ఇక రానవసరంలేదని, త్వరలో బాధావిముక్తుడవవుతావని చెప్పి పంపించారు. కొన్ని రోజులు తరువాత భవానీచరణ్ సంపూర్ణ ఆరోగ్యవంతు డయ్యాడు. అప్పుడు అతని ఆనందానికి అవధులు లేవు. అప్పటినుంచీ ఎప్పుడెప్పుడు స్వామివారి దర్శనానికి వచ్చి, అత్యంత సుఖానుభూతిని పొందేవాడు.

వంగ సంవత్సరం 1291 లో కలకత్తా హైకోర్టు న్యాయాధిపతి ఒకరు స్థానచలనం చెందుతూ అనేక ప్రదేశాలు తిరిగి కాశీ నగరానికి వచ్చాడు. పుట్టుకతో ఆయన హిందువైనప్పటికీ స్వేచ్ఛా భావాలు కలవాడు. హిందూదేవతలను ఉపాసించటం ఆయన నీచకార్యంగా భావించేవాడు. అయినా కాశీనగరంచేరి, ఆయన ఉత్సాహంగా విశ్వేశ్వరుని అన్నపూర్ణను, మణికర్ణికను దర్శించాడు. కాని ఎక్కడా పూజకాని, కనీసం నమస్కారం కాని చెయ్యలేదు. ఆయన కొన్ని రోజులు కాశీలో ఉన్నాడు. ఆ సమయంలో త్రైలింగస్వామివారి అలౌకికశక్తులను గురించి విని, ఒకరోజున వారి దర్శనానికి వెళ్లాడు స్వామివారి చుట్టూ చాలామంది ఉన్నారు. కొందరు కూర్చున్నారు. మరికొందరు నిలుచున్నారు. స్వామి దర్శనాభిలాషులు ఆయనకు ప్రణామంచేసి కూర్చుంటారు. కొంతమంది కొంచెంసేపు మాత్రం ఉండి వెళ్లిపోతారు. జడ్జిగారు అక్కడికి చేరి ఆ సంఘటనలను, స్వామివారి లావణ్య మూర్తిని పదేపదే చూడసాగారు. ఆ సమయంలో ఎవరో అతని చెవిలో 'ఓరీ నరాధమా! దురాచారీ! రెండు ఇంగ్లీషు ముక్కలు చదివావో లేదో, నీ ధర్మాన్ని నీవు సంపూర్ణంగా మరచిపోయినట్లున్నావు. స్వామివారికి నమస్కరించు' అని పలికి ముందుకు త్రోసినట్లయింది. ఆ త్రోపుడుకు జడ్జి స్వామివారి పాదాలమీద పోయి పడ్డాడు. దానితో ఆయనలోని మోహం పటాపంచలైంది. ఆతని హృదయం భక్తిరస ప్లావితమై, పాశవిక ప్రవృత్తులు నశించిపోయాయి. అతని మనస్సు అభూత ఆనందాన్ని అనుభవించింది. తమాషా చూడటానికి వచ్చిన వాడు అమూల్యరత్నం పొందాడు. స్వామివారి చరణస్పర్శతో హృదయమాలిన్యం తొలగిపోయి, నూతన భావాలు నిండాయి. స్వామివారి అద్భుత శక్తులు చూసి ఆకర్షితుడై, ఆనాటినుంచే ధర్మమార్గంలో నడవసాగాడు. హిందూ ధర్మప్రాశస్త్యం తెలిసికొని, స్వామివారి

సేవకు ప్రతినెలా ధనం ఇవ్వటానికి నిశ్చయించుకొన్నాడు. ఆ విషయాన్ని మంగళదాస్ ఠాకూర్ ద్వారా స్వామీజీకి నివేదించుకొన్నాడు. అది విని స్వామివారు ఆగ్రహోదగ్రులై తన అసమ్మతిని తెలిపారు. కాని స్వామివారు దేహత్యాగం చేసిన తరువాత ఆశ్రమ నిర్వహణకు ప్రతినెలా పదిరూపాయలు తప్పకుండా పంపేవాడు.

త్రైలింగస్వామి భరించరాని చలికాలంలో కూడా చల్లని నీటితో అభ్యంగన స్నానం చేసేవారు. ప్రచండ గ్రీష్మకాలంలో ఎవ్వరూ బయటకు రావటానికి సాహసం చెయ్యని సమయంలో 3,4 గంటలు గంగ నీటిలోనే మునిగి ఉండేవారు. మరొకసారి నీటి ప్రవాహానికి ఎదురుగా నీటిపైన నడిచి వెళ్లేవారు. నీరు, ఎండ, చలి అన్నీ ఆయనకు సమానమే! ఎప్పుడూ ఆయన ఒక గొంగళీ మీద పడుకొని, మరొక గొంగళిని కప్పుకొనేవారు.

స్వామివారి అద్భుత చర్యలను దర్శించినవారు తమజన్మ ధన్యమైనదని, సార్థకమైనదని భావించేవారు. జ్ఞానోదయమై హృదయ మాలిన్యం తొలగిపోయి సత్త్వగుణ సంపన్నులయ్యేవారు. స్వామివారిని దర్శించాలని హృదయపూర్వకంగా భావించేవారికే వారి దర్శనం లభించేది. స్వామివారి యోగ్యత తెలియనివారికి, వారిని గూర్చి అపహాస్యం చేసేవారికి, వారి దర్శన భాగ్యమే లభించేదికాదు.

స్వామివారి ఆశ్రమంలో వారి రాతివిగ్రహాలను ప్రతిష్టించి, వచ్చిన యాత్రికులు వాటికి పూజలు చేస్తూ ఉండేవారు. మంగళదాస్ ఠాకూర్ ఆశ్రమ సేవలు అందిస్తూ ఉండేవాడు.

ఇక నేను స్వయంగా చూసిన సంఘటనలను వర్ణిస్తాను. అన్ని సంఘటనలనూ వర్ణిస్తే ఇది బృహద్గ్రంథమవుతుంది. కనుక ప్రధాన సంఘటనలనే వివరిస్తాను. వాటిని చదివిన వారికి త్రైలింగస్వామి త్రికాలజ్ఞుడని, నిర్వికారుడని, సదానందుడని, దయాసాగరుడని, జీవన్ముక్తుడని, మహాపురుషుడనీ విశదమవుతుంది.

ధర్మాలకు సంబంధించిన వివిధోపన్యాసాలను విని, అనేక ధర్మాలను పరీక్షించి చూచిన తరువాత, నా మనస్సులో ఒక సందేహం కలిగింది. శాస్త్రాల్లో జన్మ జన్మాంతర సిద్ధాంతాలు ప్రతిపాదింపబడినాయి. స్వర్గనరకాలు, నానాయోని భ్రమణ ములు, సుఖదుఃఖాలు మొదలైనవి వారు వారు చేసుకొన్న సుకృతులు, దుష్కృతుల వలన కలుగుతూ ఉంటాయని సాధువులు, మహాత్ములు, జ్ఞానులు అయిన

మహానుభావులు చెబుతూ ఉంటారు. ఇదంతా తెలిసికూడా పునర్జన్మను గురించి మహాపురుషుడైన త్రైలింగస్వామి అభిప్రాయమేమిటో వారిద్వారానే తెలుసుకోవాలని నా మనస్సులో కోరిక కలిగింది. ఒకసారి హరిద్వార్ వరకూ తీర్థయాత్ర చెయ్యాలను కొన్నాను. అయితే అంతకు ముందే కాశీధామం వెళ్లి త్రైలింగస్వామిని దర్శించి నా సందేహనివృత్తి చేసుకోవాలని తీవ్రమైన కోరిక కలిగింది. నా సందేహం పండితుల వల్ల నివృత్తి అయ్యేది కాదు. ఎందుకంటే పండితులంతా తార్కిక బుద్ధి కలవారు. నా సందేహం తర్కానికి అందేదికాదు. ప్రత్యక్ష ప్రమాణం చూపగలిగినవారు స్వామీజీ ఒక్కరే! కనుక ఎలాగైనా స్వామివారిని దర్శించి నా సంశయం తొలగి పోనంతవరకూ తిరిగి రాకూడదని నిశ్చయించుకొన్నాను. అప్పుడు నేను ముంగేర్ అనే పట్టణంలో ఉన్న ఒక పెద్ద ఆసుపత్రిలో ఉద్యోగం చేస్తూ ఉండేవాడిని. కనుక శలవు లభించకపోతే వెళ్లటం అసంభవము. శలవు దొరికే వరకూ నా మనుస్సు చిరాకుగా ఉండింది.

వంగ సంవత్సరం 1287లో నాకు మూడు నెలలు సెలవు దొరికింది. అప్పుడు మాఘ శుద్ధ విదియ నాడు తీర్థయాత్రకు బయల్దేరాను. ముంగేర్ పట్టణంలోని ఒక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా ఉన్న శ్రీయుత సురనాథ చటోపాధ్యాయకు కాశీధామంలోని నారదఘాట్‌లో ఒక ఇల్లు ఉండింది. దానిని కనిపెట్టుకొని ఉన్న రామచంద్రముఖోపాధ్యాయగారికి చటోపాధ్యాయ గారు ఒక ఉత్తరం వ్రాసి ఇచ్చి, నాకు కాశీలో వసతి కల్పించారు. ఆ ఉత్తరం వల్ల నాకెంతో ఉపకారం జరిగింది. రామచంద్ర ముఖోపాధ్యాయ నాకు అన్ని సౌకర్యాలు కలిగించి ఆదరించాడు. మొదట నేను నా తల్లిదండ్రులకు శ్రాద్ధకర్మలు చేశాను. ఆ తరువాత బ్రాహ్మణ భోజనాలు, కుమారీపూజలు ఆయన సహాయంతోనే పూర్తి చేశాను. ఏడురోజుల పాటు కాశీలోని తీర్థాలన్నింటికీ మేమిద్దరం తిరిగాము. ఆయన సంతోషంగా నాతోపాటు ఉండి, అన్ని మందిరాలను, దేవతలను చూపించాడు. అక్కడ విశేషాలను ఆయన వర్ణించి చెప్పాడు. మధ్యలో ఆయన పంచగంగాఘాట్‌లో ఉన్న బిందుమాధవ మందిరాన్ని, మహాత్మా త్రైలింగస్వామి ఆశ్రమాన్ని నాకు చూపించాడు. త్రైలింగస్వామి దివ్యస్వరూపాన్ని చూడగానే నా మనస్సులో అత్యంత భక్తిశ్రద్ధలు జనించాయి. కొంతసేపు అక్కడ ఉండి, ఆయనకు నా నమస్కారం చేసుకొని ఇద్దరమూ తిరిగి వచ్చాము. నా మనోభావాలను రామచంద్రగారితో నేను

చెప్పలేదు. ఇంటికి వచ్చిన తరువాత, త్రైలింగస్వామి గుణగణములను, వారిలోని దివ్యశక్తులను గూర్చి అడిగాను. వారు విశేషంగా చెప్పకపోగా, ఇట్లా చెప్పారు. "ఆయనను గురించి అడుగుతున్నారెందుకు? ఆయనకు మంచి - చెడు అనే విచక్షణ లేదు. ఆయనొక పిచ్చివాడు. కులభేదాలు లేవు. ఏది దొరికితే అది తింటాడు. దుకాణాలదగ్గరి వస్తువులను ఏరుకొంటూ ఉంటాడు. ఎవరితోనూ మాట్లాడడు. దిగంబరంగా తిరుగుతూ ఉంటాడు. భయంకరమైన ఎండాకాలంలో ఇసుక తిన్నెలమీద నిద్రిస్తాడు. వణుకుపుట్టించే చలిలో గంగానది నీళ్లలో మునిగి ఉంటాడు. ఒక్కొక్కసారి 2,3 గంటలపాటు నీటిలోనే ఉంటాడు. ఒక్కొక్కసారి నీటిమీద తేలియాడుతూ కన్పిస్తాడు. అందుచేత ప్రజలాయనను 'కుంభకయోగి' అని అంటూ ఉంటారు. అతని వయస్సు ఏడెనిమిది వందల సంవత్సరాలుండ వచ్చును. కాని ఎప్పుడూ ఒకేలాగ కన్పిస్తూ ఉంటారు" అని చెప్పాడు.

మర్నాడు ఉదయం మణికర్ణికలో స్నానం చేసి, మౌనస్వామియైన మహాత్మా త్రైలింగస్వామి పూజ్యపాదుల దర్శనానికి వెళ్ళాను. వారికి నమస్కరించి ఒక స్తంభాన్ని ఆనుకొని, వారి దివ్యస్వరూపాన్ని చూస్తూ నిలుచుండిపోయాను. పునర్జన్మను గురించి వారిని అడిగి తెలుసుకొని, నా సందేహ నివృత్తి చేసుకోవా లనుకొన్నాను. కాని ఆయన దగ్గరకు వెళ్లి కూర్చోటానికి సాహసించలేకపోయాను. నేను ఏమీ మాట్లాడకముందే స్వామివారు సంజ్ఞచేసి నన్ను వెళ్లిపొమ్మన్నారు. మరికొంతసేపు అక్కడే ఉందామనుకొన్నాను. కాని మంగళదాస్ నన్ను తొందరగా వెళ్లిపొమ్మన్నాడు. నేను ఎంతో విచారపడుతూ నానా రకాల ఆలోచనలతో ఇంటికి వెళ్లాను. అదేరోజు మధ్యాహ్నం మళ్లీ ఆశ్రమానికి వెళ్లి నమస్కరించి, ఒక స్తంభానికి ఆనుకొని నిలుచున్నాను. నన్నుచూసి స్వామి ఉదయంలాగానే వెళ్లిపొమ్మని సంజ్ఞ చేశారు. అది చూసి మంగళదాస్ నన్ను త్వరగా వెళ్లిపొమ్మన్నాడు. దెబ్బతిన్న హృదయంతో వివశుడనై, అప్రసన్న మనస్సుతో ఇంటికి వెళ్లిపోయాను.

మూడోరోజు ప్రొద్దున స్నానంచేసి, ప్రతిరోజూవలెనే స్వామివారి ఆశ్రమానికి వెళ్లి నమస్కరించి, అదే స్థానంలో నిలబడినాను. ఈవేళ కూడా స్వామీజీ పొమ్మని సంజ్ఞ చేశారు. మంగళదాస్ త్వరగా వెళ్లిపొమ్మన్నాడు. అయినా నేను వెళ్లక పోయేసరికి, స్వామీజీ కోపగించి, నన్నక్కడినుంచి తొలగించమని గోసేవకులను ఆజ్ఞాపించారు. వారు నన్ను బలవంతంగా తోసివేశారు. నేను సిగ్గుపడి,

అవమానంతో విచారిస్తూ ఇంటికి వచ్చాను. నానారకాలుగా ఆలోచిస్తూ హతాశుడనైనాను. నా అదృష్టం ఎట్లా ఉన్నదో ఏమో – నేను మాత్రం నా నమ్మకాన్ని విడువలేదు. అత్యంత భయభక్తులతో మళ్లీ మధ్యాహ్నం ఆశ్రమానికి వెళ్లి, యథాపూర్వం నమస్కరించి, అదే స్థానంలో నిలుచున్నాను. పూర్వంలాగానే నన్ను వాళ్లు త్రోసివేశారు. ఎట్లాగైనా అక్కడ కూర్చోటానికి కొంత స్థానం సంపాదించటమే నా ప్రధాన లక్ష్యం. అందువలన అక్కడ ఉండే సేవకులకు కొంత డబ్బు ఇచ్చి తృప్తిపరిస్తే, వారు అక్కడినుంచి నన్ను తొలగించరని అనుకొన్నాను. అంతేకాక స్వామివారు సంజ్ఞచేసినా, అక్కడే నిలిచిఉండాలని, నా అనుమానం తీరిపోయే వరకూ తిరిగిరాకూడదని నిశ్చయించుకొన్నాను.

నాలుగవరోజు ఉదయం మణికర్ణికాఘాట్‌లో స్నానం చేసి ఆశ్రమానికి చేరుకొని, మంగళదాస్ ఠాకూర్ దగ్గరే కూర్చున్నాను. మంగళదాస్ ఠాకూర్‌కు నాలుగు రూపాయలు, గోసేవకులకు రెండు రూపాయలు సమర్పించుకొని, నన్ను అక్కడినుంచి వెళ్లగొట్టవద్దని చేతులు జోడించి వేడుకున్నాను. వారు తృప్తిపడి అంగీకరించారు. కాని మంగళదాస్ మాత్రం స్వామివారి అనుమతి లేనిదే అక్కడ ఉండటం అసంభవమని, తాము ఏమీ చెయ్యలేమని, స్వామివారి ఆజ్ఞను పాటించక తప్పదని చెప్పాడు. నేను భయపడుతూనే స్వామివారిముందు స్తంభం దగ్గర యథాప్రకారంగా నిలుచున్నాను. కాని కొంచెం ముందుకు వెళ్లి మనసులోని మాటను చెప్పటానికి సాహసించలేకపోయాను. అయితే, బయటకు వెళ్లగొడతారనే భయం లేకపోవుటవలన నా సంశయాన్ని తీర్చుకోటానికే నిశ్చయించుకొన్నాను.

అట్లా నిర్ణయించుకొని కొంచెం ముందుకు వెళ్లాను. అదే సమయంలో కలకత్తా నుంచి వచ్చిన ఇద్దరు వ్యక్తులు స్వామివారికి నమస్కరించి అక్కడ నిలబడినారు. కొంచెంసేపటికి స్వామివారు వారిని వెళ్లిపొమ్మని సంజ్ఞ చేశారు. వారిద్దరిలో నమ్రస్వభావంగల వ్యక్తి వెళ్లిపోవటానికి సిద్ధమయ్యాడు.కాని, ఉగ్రస్వభావం గల రెండోవ్యక్తి సేవకులతో కోపోద్రేకంతో "మేము స్వామీజీని దర్శించటానికి వచ్చాము. ఇక్కడే ఉండిపోవటానికి రాలేదు. కొంచెం సేపయినాక మేము ఎట్లాగయినా ఇక్కడి నుంచి వెళ్లిపోతాము. మీరెందుకు అనవసరంగా అంత కోపంతో మమ్మల్ని వెళ్లగొడుతున్నారు." అని అన్నాడు. అది విని స్వామీజీకి కోపం వచ్చి మంగళదాస్‌కు సంజ్ఞచేసి, గోసేవకులద్వారా అక్కడినుంచి తొందరగా వారిని పంపించి వెయ్యమని

చెప్పారు. గోసేవకులు వచ్చి "స్వామివారి దర్శనమయింది కదా! అనవసరంగా గుమికూడవద్దు. తొందరగా వెళ్ళిపొం"దని బలవంతంగా నెట్టివేశారు. వారు ససేమిరా వెళ్లమని పట్టుబట్టారు. అప్పుడు వారిద్దరికీ కొంచెం ఘర్షణ జరిగింది. అది చూసి స్వామివారు అతనిని అక్కడ ఉండమని సంజ్ఞచేశారు. తరువాత మంగళదాస్‌ను పిలిచి కాగితం-కలము తెమ్మన్నారు. మంగళదాసు వచ్చిన తరువాత గోడపైన ఉన్న ఒకశ్లోకములోని అక్షరాల మీద చేయిపెట్టి చూపించారు. మంగళదాసు వాటిని వ్రాస్తూపోయాడు. వ్రాత పూర్తి అయిన తరువాత దానిని చదివి వినిపించమన్నారు. మంగళదాసు ఆ అక్షరాలను కలకత్తా బాబుకు చదివి వినిపించాడు. అందులో నీవు పద్దెనిమిది రూపాయల విలువైన పాదరక్షలను బయట వదలి నన్ను చూడటానికి వచ్చావు. ఎవరైనా వాటిని ఎత్తుకొనిపోతే ఇంటికి వెళ్లటం కష్టం కదా! అదీకాక, నీవు మమ్మల్ని చూస్తున్నావా? లేక నీ పాదరక్షలను గురించి ఆలోచిస్తున్నావా? ఏమి ఆలోచిస్తున్నావో నిజం చెప్పు. నీవు కాలం వృథా చెయ్యక నీ పాదరక్షలను తీసుకొని వెళ్లిపో. ఇప్పటివరకూ వాటిని ఎవరూ ఎత్తుకొని పోలేదు. త్వరగా వెళ్లు" అని ఉన్నది. ఆ సంఘటన చూసి, అక్కడి వారంతా నిశ్చేష్టులయ్యారు. అప్పుడు నేను "నీవు నిజంగా నీ పాదరక్షలను గురించి ఆలోచిస్తున్నావా" అని అడిగాను. ఆయన ఔనన్నాడు. ఇలాంటి సంఘటనను నేను ఎప్పుడూ చూడలేదు. అది చూశాక నా హృదయం భక్తిరసభరితం అయింది. ఎన్ని కష్టాలు వచ్చినా నేను వచ్చిన పని పూర్తిచేసుకోవాలని నిశ్చయించుకొన్నాను. స్వామి వారి మహిమ తెలిశాక కలకత్తా బాబుకు కోపం పోయింది, బుద్ధి వచ్చింది. ఆ తరువాత స్వామివారు సంజ్ఞ చేయగానే మారుమాట్లాడకుండా అక్కడినుంచి వెళ్లిపోయాడు.

కొంచెం సేపటికి స్వామివారు నావైపు తిరిగి వెళ్లిపొమ్మని సంజ్ఞ చేశారు. వెళ్లిపోవద్దనుకున్నాను. కానీ సాహసం చెయ్యలేక ఇంటికి వెళ్లిపోయాను. మళ్లీ మధ్యాహ్నం ఎంతో ఆశతో ఆశ్రమానికి వెళ్లాను. మళ్లీ అట్లాగే జరిగింది. ఆ విధంగా ప్రతిరోజూ రెండు పూటలా ఆశ్రమానికి వెళ్లివస్తూనే ఉన్నాను. అట్లా 12 రోజులు గడిచాయి. కనీసం అక్కడ కూర్చోటానికి కూడా అవకాశం లభించలేదు. నేను ఎంతో నిరాశపడ్డాను. నా జీవితం వ్యర్థమనుకొన్నాను. నావంటి దౌర్భాగ్యుడు ఈ ప్రపంచంలో ఎవ్వరూ ఉండడనుకొన్నాను. సత్పురుషులవద్ద కూర్చొనే స్థలం కూడా

నాకు లభించటంలేదు. చూడగానే తరిమివేస్తున్నారు. నేనేమి పాపం చేశానో బోధపడలేదు. అదేమి దౌర్భాగ్యమో నాకే తెలియదు. నా దురదృష్టంపట్ల నాకే దుఃఖం కలిగింది.

13వ రోజు ఉదయం మళ్లీ ఆశ్రమానికి వెళ్లి, దుఃఖం ఆపుకోలేక ఏడవటం మొదలుపెట్టాను. నా కళ్లవెంట అశ్రుధారలు ప్రవహింపసాగినాయి. అది చూసి స్వామివారు నన్ను కూర్చోమని స్వయంగా చెప్పారు. దుఃఖాన్ని ఆపుకోమని సంజ్ఞ చేశారు. స్వామివారి దయార్ద్ర దృష్టి నన్ను మరింత దుఃఖితుని చేసింది. నేను వారి పాదాలను పట్టుకొని వెక్కి వెక్కి ఏడవసాగాను. ప్రాయశ్చిత్తంతో నా మనస్సు పరిశుద్ధమైంది. నా యీ పరిస్థితిని చూసి స్వామివారు మంగళదాస్‌ను పిలిచి, 'ఇవ్వాళ అతనిని వెళ్లిపోయి, రేపు ప్రొద్దున రమ్మని' చెప్పు అని సంజ్ఞ చేశారు. మంగళదాస్ స్వామివారి ఆజ్ఞను నాకు వినిపించారు. దానితో నా మనస్సు కొంచెం కుదుటపడింది. మళ్లీ ఏదో ఆశ నాలో చిగురించింది. నేను మధ్యాహ్నం ఇంటికి వెళ్లి, ఆ రాత్రి ఎప్పుడు తెల్లవారుతుందా అని ఎదురుచూస్తూ గడిపాను.

14వ రోజున గంగాస్నానం చేసి, పరిపూర్ణ ఉత్సాహంతో ఆశ్రమానికి వెళ్లి స్వామివారికి దండ ప్రణామాలు చేసి, వారి పాదధూళిని నా సర్వాంగములకు పూసుకొని, వారి సమీపంలో కూర్చున్నాను. సత్పురుష సాంగత్యం వలన నా మనస్సున ఆవరించిన తెర తొలగిపోయింది. నా శరీరం పవిత్రమైనదే అనే భావం నాకు కలిగింది. ఆ ఆనందాన్ని లోలోపల అనుభవిస్తూ స్వామివారి అనుగ్రహం కోసం ఎదురుచూస్తున్నాను. ఇంతలో స్వామివారు మంగళదాస్‌కు ఏదో సంజ్ఞ చేశారు. దాని ప్రకారం మంగళదాస్ ఎఱ్ఱరాతివంటి ఒక గంధపు చెక్కను, ఒక గిన్నెలో నీటిని తెచ్చి అక్కడపెట్టి, 'స్వామివారు నిన్ను గంధం తియ్యమన్నారు' అని చెప్పి వెళ్లిపోయాడు. నేను గంధం తియ్యటం మొదలుపెట్టాను. దాదాపు రెండు జాములు తీశాక స్వామివారు స్వయంగా ఆ మిగిలిన గంధంచెక్కను ఒక రాతిగిన్నెలో పెట్టి భోజనానికి వెళ్లమన్నారు. నేను వారి ఆదేశానుసారం భోజనానికి వెళ్లి మళ్లీ ఆశ్రమానికి తిరిగివచ్చాను. స్వామీజీ నన్ను చూసి, మళ్లీ గంధం తియ్యమని సంజ్ఞచేవారు. నేను మధ్యాహ్నం వరకూ అట్లాగే తీస్తున్నాను. కొంచెం సేపటికి ఒక బ్రహ్మచారి వచ్చాడు. స్వామివారు నేను తీసిన గంధమును అతనికి ఇచ్చి, దేవనాగరిలిపిలో వ్రాసి ఉన్న ఒక కాగితం కూడా ఇచ్చి, ఆ గంధంతో వాకిలి

గోడమీద ఏదో వ్రాయమన్నారు. ఆ బ్రహ్మచారి ఏదో వ్రాసాడు. సాయంకాల మయ్యాక, మిగిలిపోయిన గంధం ముక్కను ఒక గిన్నెలో పెట్టి ఇంటికి వెళ్లిపొమ్మని చెప్పారు. స్వామివారి ఆజ్ఞ ప్రకారం ఇంటికి వెళ్లిపోయాను.

పదిహేనవరోజు నియమ ప్రకారం పొద్దున్నే పంచగంగాఘాట్‌లో స్నానం చేసి ఆశ్రమం చేరుకొని, స్వామివారి సమీపంలో కూర్చున్నాను. వారు నిన్నటి లాగానే తియ్యమని సంజ్ఞ చేశారు. అరగదీసి అరగతీసి చేతులు నొప్పి పుట్టటం వలన మెల్లగా అరగదీయసాగాను. అది చూసి స్వామివారు గంభీరంగా ముఖం పెట్టి వేగంగా చెయ్యమని చేతులతో సంజ్ఞచేసి చెప్పారు. వారి ముఖకవళికలు చూసి వేగంగా అరగతియ్యసాగాను. తరువాత వారు చేసిన సంజ్ఞ ప్రకారం తీసిన గంధాన్ని అక్కడ పెట్టి ఇంటికి వచ్చి భోజనంచేసి రెండు గంటలకు ఆశ్రమం చేరుకొన్నాను. ఈ ప్రకారము నిత్యము నియమిత వేళలలో రెండు చేతులతో రెండుపూటల గంధం తీసి తీసి నా చేతులు బలహీనమయ్యాయి. ఆ విధంగా 15 రోజులు గడిచాయి. నాచేతులు, అన్నం కూడా తినలేనంత బలహీనమయ్యాయి. నా అదృష్టం ఎట్లా ఉంటే అట్లా అవుతుందని మనస్సులో అనుకొన్నాను కాని, పైకి మాత్రం అనలేకపోయాను. రెండుపూటలా నేను గంధం అరగదీస్తూ ఉంటే, ఆ బ్రహ్మచారి ప్రాంగణంలోని గోడలమీద శ్లోకాలు వ్రాసేవాడు. ప్రతిరోజూ నేను తీసిన గంధం అంతా అయిపోతూ ఉండేది. బ్రహ్మచారికి ఏమీ కష్టం లేకపోయినా, నేను మాత్రం అలసిపోయేవాడిని.

ఈవిధంగా 28 రోజులు గడిచిపోయాయి. 29 వ రోజు ప్రొద్దునే స్నానం చేసి వచ్చి, స్వామివారికి నమస్కరించి వారి సమీపంలో కూర్చున్నాను. ఒకవేళ ఆ రోజుకూడా గంధం తియ్యమంటే నా చేతకాదేమోననిపించింది. నాచేతులు అలసి పోయాయి. ఇవ్వాళ నా పరిస్థితి ఏమిటో అనుకొన్నాను. నేను గంధం తియ్యలేక పోతే, స్వామివారు నన్ను అక్కడినుంచి పంపించి వెయ్యవచ్చు. అట్లా జరిగితే నా ఆశల్నీ మట్టిలో కలసిపోయినట్లే. ఇన్నిరోజులూ కష్టపడిచేసిన పరిశ్రమ వృథా అయి, నా ఆశలకు తిలోదకం వదలి తిరిగి వెళ్లిపోవలసి వస్తుందేమో అని నా మనస్సు చాలా వ్యాకులం చెంది ఉండింది. కళ్లనుండి కన్నీళ్లు ధారగా ప్రవహిస్తు న్నాయి. కొంచెం సేపటికి స్వామివారు నన్ను చూసి నవ్వారు. నేను దేవనాగరి లిపి చదవగలనో లేదో అని మంగళదాస్ చేత అడిగించారు. నేను చదవగలనని

అనగానే స్వామివారు తమ వేదిక మీద పరచిన గొంగళీక్రింద నుంచి చెక్కలతో కట్టివున్న ఒక తాటాకు గ్రంథం తీసి నాచేతికిచ్చారు. దీనిలో ఉన్న శ్లోకాలన్నింటిని బెంగాలీ భాషలోకి అనువదించమని మంగళదాస్ చేత చెప్పించారు. నాకు బంగారం దొరికినంత ఆనందం కలిగింది. అప్పటినుంచీ గంధం అరగదీసే పనికి విముక్తి లభించింది. స్వామివారి కృప లభించినందుకు ఎంతో సంతోషించాను. కలం, కాగితాలు, సిరాబుడ్డి తీసుకొని అనువదించసాగాను. ప్రతి కాగితంకింద నా సంతకం ఉంది. అయిదురోజులు కష్టపడి ఆ శ్లోకాలను బెంగాలీ భాషలోకి అనువదించాను. స్వామివారు వాటిని చదివి వినిపించమని సంజ్ఞ చేశారు. అన్ని శ్లోకాలు చదవటం పూర్తి అయిన తరువాత, తాటాకు పుస్తకాన్ని చెక్కలతో కట్టేసి గొంగళీ క్రింద పెట్టుకొన్నారు.

ఆ తరువాత అక్కడినుంచే మరొక తాటాకు పుస్తకాన్ని తీసి ఇచ్చి ఇదివరకటి లాగానే అందులోని శ్లోకాలను కూడా బెంగాలీ భాషలోనికి అనువదించమని ఆదేశించారు. ఈ తాటాకు పుస్తకం మొదటి దాని కన్నా కొంచెం చిన్నది. కనుక మూడు రోజులలో దానిని పూర్తిచేశాను. వాటిని కూడా చదివి వినిపించిన తరువాత, ఆ తాటాకు పుస్తకాన్ని కూడా యథాస్థానంలో గొంగళీ క్రిందపెట్టి, నన్ను ఇంటికి వెళ్ళి భోజనం చెయ్యమన్నారు.

నేను భోజనం చేసి, ఆశ్రమానికి తిరిగివచ్చి, స్వామివారి దగ్గర కూర్చున్నాను. వారు నావైపుచూస్తూ పడుకొన్నారు. ఈరోజున నేను చేయవలసిన పని ఏమీ లేదనిపించింది. స్వామి నావైపుకు తిరిగి, నన్ను చూస్తూ అట్లాగే పడుకున్నారు. నేను వారి పాదధూళిని తీసి నాశరీరానికి పూసుకొని, వారి పాదసేవ చేయసాగాను. నాకు సాధువుల సేవ చేసే సౌభాగ్యం లభించినందుకు సంతోషపడ్డాను.

స్వామివారు సంధ్యాకాలంలో లేచారు. మరునాడు ప్రాతఃకాలం కాకుండా సాయం సమయాంతమున రమ్మని నాకు సంజ్ఞచేశారు. మంగళదాస్ నన్ను ఇంటికి వెళ్లమని సంజ్ఞ చేశారు. నేను ఎంతో సంతోషంగా ఇంటికి వెళ్లాను. నాకష్టమంతా పటాపంచలై పోయింది. రాత్రి పూర్తయి, దినమంతా గడిచిపోయి, సాయంత్రం ఎప్పుడు అవుతుందా అని నిరీక్షిస్తూ కాలం గడపసాగాను. రెండవరోజు సాయంత్రం తొందరగా వెళ్ళి స్వామీజీని దర్శించాలనే కుతూహలంతో ఆశ్రమానికి వెళ్లాను. స్వామివారి ఆశ్రమంలో ఉన్న పెద్ద మహాదేవమూర్తిని కాళిమాతను

దర్శించి, హారతులు తీసుకొని, స్వామివారి దగ్గర కూర్చున్నాను. స్వామీజీ నన్ను ఒక చిన్న గదిలోకి తీసుకొని వెళ్లారు. అందులోకి ఎవ్వరూ రాకూడదని కట్టడి చేశారు. ఆగదిలో ఒక ఆసనం ఉన్నది. అక్కడ ఒక చిన్న దీపం వెలుగుతున్నది. స్వామివారు ఆ ఆసనం మీద కూర్చున్నారు. నేను వారి దగ్గర కూర్చున్నాను. భక్తవత్సలుడైన స్వామి, భక్తుల కోరికలను తీర్చటానికి తమ మౌనవ్రతాన్ని వదిలిపెట్టి గంభీరంగా ఇలా అన్నారు. "నీవు దేనిని మనస్సులో పెట్టుకొని దాని సమాధానం కోసం ఇక్కడికి వచ్చావో దానిని గురించి ఇంత సందేహం ఎందుకు? త్రికాలదర్శులు, ఆత్మతత్త్వజ్ఞులు అయిన దేవర్షులు - మహర్షులు పుణ్యాత్ములు. తపోబలంతో వారు చేసిన సిద్ధాంతాలను గురించి నీవు సందేహపడనక్కరలేదు. వారు చెప్పినది సత్యం. జీవుడు తాను చేసిన సుకృతులకు - దుష్కృతులకు అనుగుణంగా సుఖదుఃఖాలను అనుభవించటానికి జన్మలు ఎత్తుతూ ఉంటాడు. అదికూడా సంపూర్ణ సత్యమే. ఈ జన్మల సంగతిని గురించి తెలుసుకోగలవాడు మనిషి ఒక్కడే. కాని దానిని గురించి తెలుసుకోవాలని ఎవరూ ప్రయత్నించక పోవటం ఒక్కటే దుఃఖాన్ని కలిగించే విషయము. నేను నీతో అంటున్నది వాస్తవము. దానికి ప్రమాణం ఏమిటి? దానిని ఎట్లా విశ్వసించాలి? అని నీవు సందేహించ వచ్చు. దానికి సమాధానం చెబుతాను. నీవు నామీది విశ్వాసంతో పునర్జన్మను గురించి తెలుసుకోవాలని ఇన్ని కష్టాలూ అనుభవించావు. పునర్జన్మను గురించి నీకు చక్కగా అర్థమయ్యేటట్లు తప్పక చెబుతాను. మొదట నేను నీ జీవితంలో జరిగిన కొన్ని సంఘటనలను గురించి చెబుతాను. అవి సత్యమే అని నమ్మకం కుదిరిన తరువాత నీవు, పునర్జన్మను గురించి నేను చెప్పిన దానిని నిశ్చయంగా సత్యమని నమ్ముతావు. మానవునికి పునర్జన్మ సంభవించినప్పుడు, అప్పుడు ఈ జీవితంలోని సర్వవిషయాలు జీవాత్మలో నిక్షిప్తమవుతాయి. ఆ జీవాత్మను స్వీకరించిన పరమాత్మ, పునర్జన్మకు కారణమైన జీవాత్మను తిరిగి నిర్మిస్తాడు. అందుచేత ఈ జన్మలో విద్వాంసుడైన వాడు తరువాతి జన్మలో కూడా విద్వాంసుడై పుడతాడు. ఈ జన్మలో మంచి వాద్యకారుడైతే వచ్చే జన్మలో కూడా మంచి వాద్యకారుడవుతాడు. ఈ జన్మలో మంచి ధార్మికుడైతే వచ్చే జన్మలో కూడా మంచి ధార్మికుడవుతాడు. ఈ జన్మలో దొంగ అయినవాడు వచ్చే జన్మలో దొంగవుతాడు. ఎన్ని ప్రయత్నాలు చేసినా భగవంతుని దయామయుడని, సర్వశక్తిమయుడని మనం

అనుకోము. భగవంతుడు ఆలోచించినంత గొప్పగా మరెవ్వరూ ఆలోచించరని అందరూ ఒప్పుకొంటారు. ఒకవేళ మరోజన్మ లేకపోతే ఒకరు రాజు – మరొకరు సాధారణ జనుడు; ఒకడు ధనవంతుడు, నిర్ధనుడు, ఒకడు బ్రాహ్మణుడు మరొకడు చండాలుడు, ఒకడు పల్లకీ ఎక్కేవాడు, మరొకడు మోసేవాడు; ఒకడు ఆరోగ్య వంతుడు – మరొకడు రోగి; ఒకడు భాగ్యవంతుడు – మరొకడు నిర్భాగ్యుడు ఎట్లా అవుతారు? జీవితంలో ఇన్ని భేదాలు ఎందుకు వస్తున్నాయి? ఏ తప్పు చేయని వాడు ఏ శిక్షా అనుభవించ నవసరంలేదు. ఈశ్వరుడు మంచి చెడ్డలను గురించి ఆలోచించడా? తాను ఇష్టం వచ్చినట్లు చేస్తాడా? అట్లా ఎప్పుడూ జరగదు. ఈశ్వరునిలాగా ఆలోచన చేసేవారు ఈ ప్రపంచంలో ఎవ్వరూ లేరు. ఈ మాటను ఎవ్వరూ తెలుసుకోలేరు. అందుచేతనే వారి వారి కర్మఫలాలను అనుసరించి ఇన్ని భేదాలున్నాయి. ఈ జన్మయొక్క ఆకృతి, వర్ణము, విద్య, బుద్ధి, స్వభావము, కర్మఫలము – ఇవన్నీ అతిసూక్ష్మ రూపంలో జీవాత్మలో నిక్షిప్తమై ఉండి, పునర్జన్మకు హేతువులవుతాయి. అందువలననే మనుష్యులు నానారకాల ఆకృతులకు, అవస్థలకు ఒదిగి, సుఖాన్నీ దుఃఖాన్నీ అనుభవిస్తారు. అద్దంలో చూసినప్పుడు ప్రశాంతమైన ముఖం ప్రశాంతంగాను, వికటించిన రూపము వికటంగాను ప్రతిబింబించినట్లే, ఒక జన్మలోని పరిస్థితులు కూడా మరొక జన్మలో ప్రతిఫలిస్తాయి. అన్యాయము, అసత్కార్యాలు చేస్తే ఆత్మ అధోగతి నొందుతుంది. ధర్మము, సత్కర్మలు చేస్తే ఆత్మ ఉన్నతస్థితిని పొందుతుంది. దీనిలో ఏ మాత్రమూ సందేహం లేదు.

ఒకవేళ నీవు దొంగతనం చేస్తే నిన్ను ప్రభుత్వం దండిస్తుంది. నీవు ఏ తప్పు చేయకపోతే నిన్ను దండించే అధికారం ఎవరికీ ఉండదు. నీకు ఏదైనా బాధ కలిగినప్పుడో రోగం వచ్చినప్పుడో వైద్యుని అవసరం కలుగుతుంది. లేకపోతే అతని అవసరం ఉండదు. ఈ జన్మలో నీకు ప్రాప్తించిన రూపాన్ని, విద్యను, బుద్ధిని, స్వభావాన్నీ పరిశీలిస్తే పూర్వజన్మలో నీవెట్లా ఉండేవాడివో నీకే తెలుస్తుంది. అట్లాగే ప్రస్తుత జీవితాన్ని నీవు చూస్తూనే ఉన్నావు. ఈ జీవితంలో నీవు ఏమి మంచి చేశావో, ఏమి చెడు చేశావో నీకే బాగా తెలుసు. మంచి చేస్తే మంచి జరుగుతుంది. చెడు చేస్తే చెడు జరుగుతుంది. పూర్వజన్మ సుకృతం వలన ఈ జన్మలో బ్రాహ్మణ వంశంలో పుట్టినావు. నీవు బ్రాహ్మణోచితమైన పనులు చేసి, సన్మార్గాన్ని అవలంబిస్తే ఆత్మోన్నతిని పొందుతావు. అట్లాకాక అన్యాయాలు పాపాలు చేస్తే అధోగతి

పాలవుతావు. కావున ఈ జన్మలో నీవు చేసే మంచి చెడులను బట్టే పునర్జన్మ ఉంటుంది. అందువలన పునర్జన్మను నీకు నీవే స్వయంగా నిర్ణయించుకోగలవు. నీవు దీని విషయంలో ఇంకొకరిని అడుగవలసిన అవసరం లేదు. దీనినిగురించి నీకు తరువాత వివరిస్తాను. ఇప్పుడు నామీద నమ్మకం కలగటానికి కొంత వివరిస్తాను." అన్నారు.

నేను ఏమీ చెప్పకుండానే స్వామివారు నామనస్సులోని మాటలను ఎట్లా గ్రహించగలిగారని నిస్తబ్ధుడనయినాను. స్వామివారు అంతర్యామి అని, ఆత్మజ్ఞానం కల యోగి అని తెలుసుకొన్నాను. నాకు ఈ జ్ఞానం కలగగానే వారిపై నాకు విశ్వాసం పెరిగింది. స్వామివారు చెప్పినది కఠోరసత్యమనటంలో సందేహం లేదు. నా ఆనందానికి హద్దులు లేవు. స్వామివారు నాకోసం ఇంత శ్రమపడతారని కూడా నేను ఊహించలేదు.

స్వామివారు మళ్లీ చెప్పటం ప్రారంభించారు. "నీపేరు ఇది. నీ తండ్రిపేరు ఇది. నీవు ఫలానా గ్రామస్థుడవు. నీ ఇంట్లో ఇన్ని గదులున్నాయి. ఇంటికి ఫలానా దిక్కున ఒక చెరువున్నది. ఆ చెరువు ఒడ్డున ఫలానా ఫలానా చెట్లున్నాయి. నీ ఇంట్లో ఫలానావారు నివసిస్తూ ఉంటారు" అంటూ స్వామివారు నా విషయం అంతా తెలిసిన వ్యక్తిలాగా చెబుతూ ఉంటే విని ఆశ్చర్యపోయాను.

స్వామివారు మళ్లీ ఇట్లా చెప్పసాగారు. "పూర్వజన్మలో మీరు బ్రాహ్మణులు. ఫలానా గ్రామంలో, ఫలానా పేరుగల జమీందారుగా ఉండేవారు. నీవు చాలా మంచివాడివి. నీమేడ రెండవ అంతస్తులో నీ శయనమందిరం ఉన్నది. ఆ ద్వారంపైన నీవు స్వయంగా చేతితో వ్రాసిన మూడు శ్లోకాలు ఇప్పటికీ ఉన్నాయి. వెళ్ళి చూసుకో!" అన్నారు.

ఆ తరువాత స్వామివారు మళ్లీ ఇట్లా చెప్పసాగారు. "ఫలానా గ్రామంలో ఫలానా పేరు గల ఒక వ్యక్తి ఉన్నాడు. ఆయన నిన్ను చాలా ప్రేమిస్తాడు. నీవు కూడా ఆయనను ఎంతో ప్రేమిస్తావు. స్నేహంతో ఉంటావు. ఎందుకో తెలుసా? అతడు పూర్వజన్మలో నీ తండ్రి. తండ్రీకొడుకులు కనుక మీ ఇద్దరి మధ్యా అంత ప్రేమ ఉన్నది. కానీ శరీరంలో మార్పు వచ్చింది. అందుచేత ఒకరినొకరు గుర్తించలేరు. మీ పినతండ్రి ముంగేరులోనే ఉన్నాడు. అతని పేరు ఫలానా. అతడు నిన్ను

ఎంతగానో ప్రేమిస్తాడు. అతడు తొమ్మిది పదిగంటలవరకూ నీ వద్దనే ఉంటాడు. నిన్ను చూడనిదే అతనికి ప్రశాంతత లేదు. నీవు కూడా ఆయనను భక్తితో చూస్తావు. దానికి కారణం తెలుసా? పూర్వజన్మ సంబంధమే! అప్పటి స్నేహం అట్లాగే ఉన్నది. కాని శరీరాలు మాత్రం పరివర్తనం చెందాయి".

చివరకు స్వామి ఇట్లా అన్నారు. "ఉమాచరణ్! నీ పూర్వజన్మ సుకృతం వల్ల సెలవు పెట్టుకొని కాశీకి వచ్చావు. అందువలన బ్రాహ్మణోచిత సత్కర్మలు చేసి, అనుష్ఠాన మాచరించి, జన్మజన్మలలో నీకు కష్టం కలగకుండా చూసుకో! నీవు జన్మను సరిగా ఉపయోగించుకొన్నావా వచ్చే జన్మలో ముక్తి లభిస్తుంది. వాసనలు త్యజించటమే ముక్తికి సోపానం. వాసనలు త్యజించకపోతే ముక్తి ఆశే లేదు."

స్వామివారు పల్కిన ఈ అలౌకికపు పలుకులు విని నేను నిస్తబ్ధుడనై పోయాను. జన్మజన్మల విషయాలలో నాసందేహం తొలగిపోయింది. శాస్త్రానుకూలమైన నమ్మకం కుదిరింది. అయితే స్వామివారికి నా మీద ఇంత దయ ఉంటే మొదట నాకు ఇన్ని కష్టాలు ఎందుకు కలిగించి ఉంటారు? బహుశా మొదట కష్టం అనుభవించనిదే, తరువాత సుఖం దొరకదు కాబోలు. ఈవిధంగా నా విషయాలూ మాట్లాడుతూనే రాత్రి గడిచిపోయింది. అప్పుడు స్వామివారు నాతో ఇట్లా అన్నారు. "నీవు ఇంటికి వెళ్లి కాలకృత్యాలు తీర్చుకొని తొందరగా తిరిగిరా! ఈనాడు మనిద్దరం కలిసి స్నానం చేద్దాం"అని.

నేను అట్లాగే చేశాను. తిరిగి వచ్చిన తరువాత ఇద్దరం కలిసి గంగాస్నానానికి వెళ్లాము. రేవులో దిగిన తరువాత స్వామివారు నాతో ఇట్లా అన్నారు. "ఉమాచరణ్ గారు! రాత్రి మీరు వచ్చేటప్పుడు ఒక తెల్లకాగితాల పుస్తకం తెచ్చుకోండి. నేను చెప్పినది వ్రాసుకోండి. దానివలన మీకెంతో లాభం కలుగుతుంది. కేవలం విన్నంత మాత్రాన జ్ఞాపకం ఉండదు. ఎన్నో ధార్మికగ్రంథాలు చదవవలసిన అవసరం లేదు. నేను వ్రాయించింది చదువుకొని జ్ఞాపకం ఉంచుకొంటే ఎంతో జ్ఞానం కలుగుతుంది. జీవునికి ముక్తికి మించిన వస్తువేదీ లేదు. ఆత్మజ్ఞానాన్ని మించిన జ్ఞానం ఏదీ లేదు. జ్ఞానాన్ని - ముక్తిని పొందటానికి ఎన్నో శాస్త్రాలు చదవనవసరంలేదు. కేవలం ప్రధానసిద్ధాంతాలను, మాటలను తెలుసుకొంటే కార్యం సిద్ధిస్తుంది. మానవునికి ముక్తికి మించిన గమ్యంలేదు. ముక్తిని పొందాలనే కోరికే ఎప్పుడూ ఉండాలి. ఎన్ని రోజులవరకూ జ్ఞానం కలుగదో అప్పటివరకూ జన్మించటం,

కష్టాలనుభవించటం, మరణించటం తప్పదు. ఈ ప్రపంచంలో నీవు చూస్తున్న దంతా మిథ్యే! ప్రపంచంలో రాజుకైనా, సామాన్య వ్యక్తికైనా కేవలం సుఖం మాత్రమే అనుభవించే అధికారంకాని, శక్తికాని లేవు".

స్వామివారి ఉపదేశాన్ని విని ఎంతో సంతోషించాను. మేమిద్దరం స్నానం చెయ్యటానికి గంగలో దిగాము. స్వామివారు కొంతసేపు నిస్తబ్ధులై ఉండి, స్థిరచిత్తులయ్యారు. వారు అవయవాలను కదల్చకుండానే ప్రవాహానికి ఎదురు పోసాగారు. కొంతదూరం వెళ్లిన తరువాత నీటిలో మునిగి అదృశ్యులయ్యారు. బహుశః రెండు గంటలు అయిన తరువాత నీటినుండి వెలుపలికి వచ్చి, నావద్దనే మెట్ల మీద కూర్చున్నారు. నేను వారి శరీరాన్ని తుడిచాను. అక్కడి నుంచి ఆశ్రమానికి వచ్చాము. వారు తమ గద్దెపైన ఆసీనులయ్యారు. నేను వారి గద్దె ప్రక్కనే కూర్చున్నాను. కొంచెం సేపు అయ్యాక వారి అనుమతి తీసుకొని ఇంటికి వెళ్లాను.

భోజనం చేసి, స్వామివారు చెప్పినట్లు ఒక పుస్తకాన్ని తీసుకొని సంధ్యా సమయానికి ఆశ్రమానికి వెళ్లాను. హారతి అయిన తరువాత స్వామివారు నన్నొక చిన్న గదిలోకి తీసుకొని వెళ్లారు. వారు కూర్చోగానే, వారి దగ్గరనే నేను కూడా కూర్చున్నాను. స్వామివారు గంభీర స్వరంతో ఇలా చెప్పసాగారు.

నేటినుండి ప్రారంభించి నిన్ను నీవు తెలుసుకునే పద్ధతిని నీకు అర్థమయ్యేటట్లు నేను చెబుతాను. నువ్వు వ్రాసుకొంటూ ఉండు. నీవు పన్నెండు విషయాలు అర్థం చేసుకోవాలి. జగత్సృష్టికి ముందు ఈ ప్రపంచంలో ఒక్క ఈశ్వరుడు తప్ప ఏమీ లేదు. కనుక

1. మొదట ఆ ఈశ్వరుని గూర్చి చెబుతాను. 2. సృష్టి 3. సంసారం. 4. గురుశిష్యులు 5. చిత్తశుద్ధి 6. ధర్మం 7. ఉపాసన 8. పునర్జన్మ 9. ఆత్మబోధ 10. తన్మయత్వం 11. కొన్ని ముఖ్యమైన మాటలు 12. తత్త్వజ్ఞానం, ఇవి అర్థం చేసుకుంటే నీకుఎంతో లాభం కలుగుతుంది. అని ఈశ్వరుని గూర్చి చెప్పసాగారు. నేను వ్రాయసాగాను. ఆ విధముగా 13 రోజులలో ఆ పన్నెండు విషయాలు పూర్తి అయినాయి. ఆ తర్వాత వారు ఇలా అన్నారు. ఇప్పుడు నీవు ఏ ధర్మశాస్త్రమునూ చదువనవసరం లేదు. ఎందుకంటే ఎక్కువ చదివిన కొద్దీ మనస్సు ఏ ఒక్క దానిపై స్థిరముగా నిలువదు. అంతేకాక నానారకముల సందేహాలు పుడుతాయి.

ఆ తర్వాత స్వామివారు ఇట్లా చెప్పసాగారు. నీకు దేవతా తత్త్వాన్ని గూర్చి కొంత తెలుసుకొనవలసిన అవసరం ఉన్నది. దాన్ని గూర్చి కూడా ఎటువంటి సందేహం ఉండకూడదు. అందువలన నీవు మరొక్క నోట్‌బుక్ తెచ్చుకో. నేను నీతో మరి పన్నెండు విషయాలు వ్రాయిస్తాను.

వారి ఆదేశానుసారము మర్నాడు నేను మరొక్క పుస్తకము తీసుకొని వెళ్లాను. వారు నన్ను అదే గదిలోకి తీసుకొని వెళ్లి వరుసగా 6 రోజులలో పన్నెండు విషయాలు వ్రాయంచారు. అవి. 1. కృష్ణలీల 2. రామలీల 3. సీతాపహరణము 4. రామరావణ యుద్ధము. 5. సముద్రమథనం 6. ఇంద్రుడు 7. వాయువు 8. వరుణుడు 9. గౌతముడు 10. తీర్థయాత్రలు 11. భోజనము - బట్టలు 12. శుచి -అశుచి-అనేవి. అవి వ్రాయించిన తర్వాత ఆ రెండు వ్రాతప్రతులను ఎంతో భద్రముగా ఉంచమని ఆదేశించారు. ఆ తర్వాత వారు వ్రాసిన "మహావాక్య రత్నావళి" అనే పేరుగల ఒక పుస్తకాన్ని ఇచ్చారు. మధ్యమధ్యలో దానిని చదవమని చెప్పారు.

ఇంట్లో చివరి సంతానం అందరికీ ప్రియమైనట్లే, స్వామివారు నాతో ఎంతో ప్రేమగా మెలిగేవారు. రెండు నెలల నుండి వరుసగా వచ్చిపోతూ ఉండటం వలన నేను కూడ ఆశ్రమవాసిననే భావము అందరికీ కల్గింది. ముఖ్యంగా మేమిద్దరము కలసి స్నానం చేయటం వలన, ఈ బెంగాలీబాబును స్వామివారు తమ శిష్యునిగా చేయబోతున్నారని అనుకొన్నారు. నేను పూర్వంలాగా సాహసపూర్వకంగా కాక, నిర్భయంగా ఆశ్రమానికి వెళ్తూ ఉండేవాడిని. తండ్రి ఇంట్లో కొడుకుకు అధికారం ఉన్నట్లే ఆశ్రమంలో నాకు అధికారం దొరికింది. ఆశ్రమానికి వచ్చివెళ్లటం నాఇష్టంపైనే ఆధారపడ ఉండింది. నా మనస్సు ఆలోచనాసముద్రంలో విహరించ సాగింది. స్వామివారు నాపైన అంత దయచూపినారు. కనుక నేను దీక్ష తీసుకోక ఉండలేకపోయాను. అందుకు నేను అక్కడ ఎన్ని రోజులు ఉండవలసివచ్చినా అన్ని రోజులూ ఉండాలనే అనుకొన్నాను.

మరునాడు నేను స్వామివారి సన్నిధిలో కూర్చొని వారి పాదసేవ చేయసాగాను. అప్పుడు మంగళదాసు నాతో ఇలా అన్నాడు "ఉమేష్‌బాబు! (అప్పటినుండి మంగళదాసు నన్ను ఉమేష్‌బాబు అని పిలువసాగాడు) నీవు స్వామివారిని వశపరచుకొన్నావు. స్వామివారు నిన్ను శిష్యునిగా స్వీకరిస్తారని తెలుస్తున్నది" అని.

అది విని నేను ఎంతో ఉత్సాహంతో ప్రశ్నించాను. "మీరు నా గురించి స్వామివారి ద్వారా ఏదైనా విన్నారా?" అని. అది విని మంగళదాసు "మిమ్మల్ని శిష్యునిగా స్వీకరించటానికి ఇంకా ఏమికావాలి? బాబాగారు ఎవరితోనూ ఇంతటి సత్సంబంధాన్ని పెంచుకోలేదు" అని అన్నాడు.

బెంగాలీబాబు ఎంతో శాంతస్వభావం కలవాడని అప్పుడప్పుడు అనేవారట. మంగళదాసు అన్న ఆ మాటలువిని నేను ప్రసన్నమయ్యాను. స్వామివారి ద్వారా దీక్షను స్వీకరించాలని నా మనస్సులో ఆశ పుట్టింది. వెంటనే మంగళదాసుతో - "మీరు నాకు దీక్ష ఇప్పించే సహాయం చేయాలి. అప్పుడప్పుడు బాబాగారిని అడుగుతూ ఉండండి వారి మనస్సును తెలుసుకొంటూ ఉండండి" అని అడిగాను. మంగళదాసు దానికి ఒప్పుకొన్నాడు. సంధ్యాసమయం కాగానే ఇంటికి వెళ్లాను. మర్నాడు ప్రొద్దున నేను స్వామి దగ్గరే కూర్చొని వారి అలౌకిక ప్రజ్ఞ, యోగశాస్త్రంలో వారి పాటవములను గూర్చి ఆలోచిస్తూ వారి వద్దనే యోగశిక్షణ పొందాలని ఆలోచించి నాకోరికను తెలపటానికి వారి దగ్గరకు వెళ్లాను. నేను ఏమి చెప్పక ముందే స్వామివారు మంగళదాసుని పిల్చి ఈ బెంగాలీబాబు ఇప్పుడు దీక్ష తీసుకోవాలని కోరుకొంటున్నాడు" అని అన్నారు. వెంటనే నేను చేతులు జోడించి "మీరు నాపైన ఎంతో దయ చూపించారు. ఇది ఎవరికీ లభించని అదృష్టం. అయినా మీరు నన్ను ఎలాగైనా ఉద్ధరించాలి". అని వేడుకొన్నాను. దానికి స్వామీజీ- "ఆ విషయాన్ని గూర్చి రాత్రి ఆలోచించుదాం. అది చాలా కఠినమైన పని. ఇప్పటివరకు మీరు స్వతంత్రులు. దీక్ష తీసుకొంటే బందీలయిపోతారు"అని చెప్పి ఇంటికి వెళ్లమని ఆదేశించారు.

తరువాత సంధ్యాసమయంలో నేను ఆశ్రమానికి వెళ్లి కూర్చోగానే ఇదివరకటి చిన్న గదిలోకి వెళ్లి కూర్చోమని ఆదేశించారు. నేను అట్లా చేశాక ఈ విధముగా అన్నారు. "నీవు ఎప్పుడైనా యోగశిక్షణను పొందటాన్ని గూర్చి ఆలోచించావా? నీకు ఆ శిక్షణ పొందే అధికారం లేదు. నీవు ఉపాసనా మార్గమునకు తగినవాడివి. అందువలన ఉపాసన మార్గమును స్వీకరించటానికి సంసిద్ధుడవై దానిని అనుసరించి నడుచుకో". అని అన్నారు. నేను వారి సలహాను స్వీకరించి ఉపదేశమిమ్మని కోరాను. అప్పుడు వారు "ఈ పుష్యమాసంలో పుష్యమీ నక్షత్రం రోజు వచ్చే చంద్రగ్రహణం వరకు నీవు ఆగాలి. శరీరాన్ని మొదట పరిశుద్ధం

చేయనిదే దీక్షతీసుకోటానికి వీలులేదు. ఆ చంద్రగ్రహణం నాటి రాత్రి నేను నీ శరీరాన్ని పరిశుద్ధం చేస్తాను" అన్నారు.

ఆ తర్వాత ఒక పదార్థం పేరు చెప్పి దానిని తీసుకురమ్మని ఆజ్ఞఇచ్చారు. ఆ పదార్థమును చంద్రగ్రహణ సమయంలో ఒక సద్బ్రాహ్మణునికి దానం చేసి, ఒక ఆసనం మీద కూర్చొని ఒక మంత్రాన్ని జపించాలని చెప్పారు. దాని విధి విధానమును కూడ చెప్పారు.

కాశీలో దీక్షను గ్రహించే సమయంలో ఒక సద్బ్రాహ్మణుడు దొరకటం చాలాకష్టం. అందుచేత నేను స్వామితో ఇలా అన్నాను. "బాబా! ఇది నాకు కఠినమైన పరీక్ష. ఎందుకంటే కాశీలో దీక్షను గ్రహించే సమయంలో ఏ బ్రాహ్మణుడూ నా నుండి దానమును గ్రహింపడు. కనుక నేను ఎవరికి దానమివ్వాలో దయచేసి మీరే చెప్పండి" అని. అప్పుడు వారు నవ్వి "ఏ వ్యక్తయితే నేను చెప్పిన పదార్థాల పేర్లు ఉచ్చరిస్తూ భిక్షమెత్తుకొంటాడో అతనికి దానమివ్వు. దానివలన నీ కార్యం సిద్ధిస్తుంది" అని చెప్పారు. నేను చాలా సంతోషించాను. స్వామివారే ఎవరినయినా బ్రాహ్మణులను పంపుతారని మనస్సులో అనుకొని దీక్షాసమయమైన గ్రహణం కొరకు నిరీక్షిస్తూ ఉన్నాను. ప్రతిరోజు నియమానుసారము రెండు వేళలా ఆశ్రమానికి వచ్చి పోయేవాడిని. దీక్ష స్వీకరించే రోజు సమీపించింది. స్వామివారు చెప్పినట్లు ఒక బ్రాహ్మణుడు ఆ రోజున ఆ పదార్థముల పేర్లు చెబుతూ భిక్ష అడిగాడు. నేను భక్తి శ్రద్ధలతో దానం చేశాను. అది నాకు ఆశ్చర్యం కలిగించింది.

గ్రహణం తర్వాత వచ్చిన మాఘశుద్ధ చతుర్థినాడు నేను స్నానం చేసి, దేవతామూర్తులకు నమస్కరించి, స్వామివారికి నమస్కరించి వారి దగ్గర కూర్చున్నాను. అప్పుడు స్వామివారు "నీ శరీరము పరిశుద్ధము అయింది" అంటూ గురుశిష్యుల సంబంధం ఏమిటో, శిష్యునిలో ఏయే గుణాలుండాలో వాటన్నింటిని వివరముగా చెప్పారు. ఆ తర్వాత "రేపు నీ దీక్ష ఉంటుంది. దీక్షకు ఏయే వస్తువులు కావాలో చెబుతాను తెచ్చుకో" అని చెప్పారు.

గురువుగారికి భోజనము పెట్టించాలనే కోరిక చాలా రోజులనుండి నా మనస్సులో దృఢంగా ఉండింది. నా కోరికను స్వామివారికి వెల్లడించాను అది

వినగానే స్వామివారు "నేను అన్నం తినాలి. అందుకు కొన్ని వంకాయలు తీసుకురా" అని అన్నారు. నేను వెంటనే సంతకు వెళ్లి ఐదుకిలోల వంకాయలు, మిఠాయి తెచ్చాను. వంకాయలను చూసి ఆయన చాలా సంతోషించారు. మంగళదాస్ తల్లి అయిన అంబాదేవిని పిల్చి వంకాయకూర, అన్నము వండమని చెప్పారు. అందులోనుంచి నాలుగు వంకాయలు తీసి నా చేతికి ఇచ్చారు. మిఠాయిని చూసి అపరిమితమయిన కోపముతో – "నిన్ను మిఠాయి తెమ్మని నేను చెప్పలేదు. మరి ఎందుకు తెచ్చావు" అని అన్నారు. ఆయన ముఖకవళికలు చూసి నేను బెదిరిపోయాను. వెంటనే నేను వారి పాదములను పట్టుకొన్నాను. వారు ప్రసన్నులయి మిఠాయి తిన్నారు. దాదాపు అరకిలో మిఠాయి మిగిలింది. నన్ను మంగళదాసుని తినమని ఆజ్ఞాపించారు. మేమిద్దరం ప్రసాదం గ్రహించాము. తర్వాత నన్ను ఇంటికి వెళ్లమని చెప్పారు. కాని నేను ఇంటికి వెళ్లక అక్కడే కూర్చొని ఉన్నాను. వారి కొరకు వంకాయకూర, అన్నము తయారుకాగానే ఆహారం తీసుకోటానికి ఉపక్రమించారు.

స్వామివారు భోజనం చేస్తున్నారు. అదృష్టం ఉంటే నాకు కూడా ప్రసాదం లభిస్తుంది అనుకొన్నాను. కనీసం ఒక్క మెతుకయినా దొరక్కపోతుందా అని అనుకొన్నాను. భోజనం చేయటం పూర్తికాగానే వారు. "నీవు నా ఉచ్చిష్టమును ఎందుకు తింటావు?" అని ప్రశ్నించారు. అప్పుడు నేను "ఇది నాకు ఉచ్చిష్టము కాదు. అది మహాప్రసాదము అని అన్నాను. అప్పుడు బాబాగారు "నీకు అలాంటి శ్రద్ధ ఉంటే నీవు ఇష్టం వచ్చినట్లు చెయ్యి" అన్నారు. నేను ప్రసాదం తీసుకొని పాత్రలను, భోజనాలు చేసిన స్థలమును శుభ్రంచేసి ఇంటికి వెళ్లినాను.

మధ్యాహ్నం ఆశ్రమమునకు తిరిగి వచ్చి చూడగా అక్కడ ముగ్గురు నలుగురు పరమహంసలు ఏదో విషయమును గూర్చి చర్చించటానికి కూర్చున్నారు. వారిముందు దేవనాగరి లిపిలో ఉన్న 25-30 వ్రాతప్రతులు ఉండినాయి. స్వామీజీ మంగళదాసుని పిలిచి ఒక పుస్తకమును తెప్పించి అందులో ఒక భాగమును తెరచి, వారికి తెలుపవలసిన విషయమును చూపించారు. వారి జిజ్ఞాసకు తగిన సమాధానం చూపించారు. అట్లా సాయంకాలం వరకు ఆ ముగ్గురు నల్గురు పరమహంసలు తమ సందేహ నివృత్తి చేసుకొన్నారు. సంధ్యా సమయంలో ఆకాశం మేఘావృతమైంది. వెంటనే వారు ముగ్గురు స్వామివారి వద్ద అనుజ్ఞ తీసుకొని

వెళ్ళిపోయారు. నేను కూడ వెళ్లిపోవటానికి అనుజ్ఞ అడిగాను. కాని నన్ను వారు కూర్చోమని ఆదేశించారు. కొద్ది సేపటికే బ్రహ్మాండమయిన వర్షం ప్రారంభమయింది. రెండు గంటల వరకు ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉండింది. రాత్రి చాలా పొద్దుపోయింది. వర్షం తగ్గకపోగా ఉధృతమయింది. భయంకరమైన ఆ అంధకారంలో ఇంటికి వెళ్లకుండా నేను అక్కడే ఉండిపోదామనుకొన్నాను. ఆసమయంలో స్వామివారు నన్ను దగ్గరకు పిలిచి ఇంటికి వెళ్లమని చెప్పారు. నేను వారి ఆదేశమును విని ఎంతో విచారించాను. ఎందుకంటే ఆస్థితిలో ఇంటికి వెళ్లడం మానవుని శక్తికి మించిన పని. అందువలన వర్షం వెలిసేంతవరకు ఆగుతానని వారితో చెప్పాను. కాని స్వామివారు అప్పుడే వెళ్లిపొమ్మని అజ్ఞ ఇచ్చారు.

నేను మంగళదాసుతో "ఈవేళ ఎందువల్లనో స్వామివారు కఠినమైన ఆదేశం ఇచ్చారు. నేను ఎంత కష్టపడవలసి వస్తుందో? గొడుగులేదు. వెలుతురు లేదు. పైగా భయంకరమైన అంధకారం. నాల్గు దిక్కులా జడివాన, భయంకరమైన మేఘగర్జనలు, మెఋపులు. ఇలాంటి పరిస్థితిలో నేను ఎట్లా వెళ్లాలి? నాకు బాధ తప్పదు. అని అన్నాను. మంగళదాసు "మీరు భయపడవలసిన పనిలేదు. బాబాగారి ఆజ్ఞను పాలించండి. బహుశః దీనిలో వారి ఉద్దేశము ఏదో ఉండి ఉంటుంది." అని అన్నాడు.

నేను ఏవేవో ఊహిస్తూ స్వామివారికి నమస్కరించి, వారి పాదధూళిని నుదుట గ్రహించి తలుపు బయటకు వెళ్లాను. అక్కడ జడివాన కురుస్తున్నది. కాని ఒక్క వర్షపు బిందువు కూడ నామీద పడటంలేదు. ఆ విధంగా కొద్ది దూరము వెళ్లగానే ఒక బాబుగారు లాంతరు పట్టుకొని నాముందు నడవసాగారు. ఆ వెలుతురును చూచి నేను గట్టిగా అరచి – "అయ్యా! మీరు ఎటు వెళ్తారు" అని అడిగాను. జవాబు రాలేదు. నేను తొందరగా నడుస్తున్నాను. కాని ఆ లాంతరు పట్టుకొని నడిచేవారిని పట్టుకోలేక పోయాను. అప్పుడు నేను పరిగెత్తసాగాను. అయినా ఆయనను అందుకోలేకపోయాను. విచిత్రమేమిటంటే మొదట నాకు ఎంత దూరంలో ఉన్నారో, పరిగెత్తినపుడు అంతే దూరంలో ఉన్నారు. నేను మళ్లీ మెల్లగా నడవసాగాను. నాకు ఆ లాంతరు వెలుతురు బాగానే కనబడుతున్నది. అలాంటప్పుడు నేను ఎందుకు కష్టపడి ఆయన వద్దకు వెళ్లాలి అనుకొన్నాను. లాంతరు పట్టుకొని వెళ్లేవారు ఇదివరకటిలాగానే నాముందు మెల్లమెల్లగా

నడుస్తున్నారు. నాకు వెలుతురు కనిపిస్తూనే ఉన్నది. నా లక్ష్యం వెలుతురు మీద తప్ప వేరేదానిపైన లేదు. వర్షపు నీరు నా కాళ్లకు తగులుతున్నదే కాని శరీరానికి ఎక్కడా తగలటం లేదు. ఏ కారణం వల్ల నేను ఆవిధంగా అంత సుఖంగా వెళ్తున్నానో దానిని గూర్చి నామనస్సులో ఏ మాత్రం ఆలోచన లేదు. నేను ఇల్లు చేరుకొన్నాను. లాంతరు పట్టుకొన్న వ్యక్తి అదృశ్యులయ్యారు. ఒక్కసారి నేను ఆశ్చర్య చకితుడనయ్యాను. అంతేకాక స్వామివారు నన్ను అక్కడ ఉండవద్దని చెప్పటానికి కారణమేమిటో తెల్సింది. అంత మహాపురుషుని అనుగ్రహమునకు పాత్రుడను అయ్యానని తెల్సి, నా ఆత్మ ఎంతో సంతృప్తి చెందింది. భక్తి భావముతో ఆయనకు నమస్కారములు చేశాను. అంతటి అలౌకికమైన శక్తిగల మహాపురుషుని వలన దీక్షను పొందే అదృష్టం కలిగిందని గ్రహించాను. మరునాడు వారు నాకు దీక్షను ఇస్తారు. అందులో ఎలాంటి బాధ రాకూడదని భావిస్తూ భోజనం చేసి పడు కొన్నాను. వారి అలౌకిక కార్యకలాపముల గూర్చి ఆలోచిస్తూ గాఢ నిద్రలో మునిగి పోయాను.

మరునాడు మాఘశుద్ధ పంచమి ప్రాతఃకాలములోనే ఆశ్రమమునకు వెళ్లి స్వామివారికి నమస్కరించాను. మేమిద్దరం కలిసి స్నానమునకు వెళ్లాం. వారి స్నానం ప్రతిరోజు రెండు గంటలకు తక్కువ పట్టదు. నేను అంతసేపు ఎప్పుడూ నీటిలో ఉండేవాడిని కాదు. కనుక రేపు ఒడ్డున కూర్చొని వారు బయటకు వచ్చే వరకు నిరీక్షించేవాడిని. స్నానం చేసి ఒడ్డుకు రాగానే వారి శరీరమును తుడిచేవాడిని. ఆ తర్వాత ఆశ్రమమునకు తిరిగి వచ్చేవాళ్లము. ఈనాడు కూడా అలాగే చేశాను.

స్నానం చేయటానికి వెళ్లివచ్చే సమయాలలో స్వామివారు నా భుజంమీద చెయ్యివేసి నడిచేవారు.

స్నానం చేసి తిరిగి వచ్చిన తరువాత స్వామివారు తనగద్దెపైన కూర్చున్నారు. నేను నేలమీద నాకు నిర్దేశించిన స్థానములో కూర్చున్నాను. కొంతసేపటికి వచ్చిపోయేవారు ఆగిపోయిన తర్వాత స్వామివారు నన్ను తమ ఆసనం వద్దకు పిలిచి మంత్రోపదేశం చేశారు. దాని విధి విధానం తెలిపినారు. ఆ తర్వాత గద్దెమీద కూర్చొని ఇలా అన్నారు. "ఏ విషయమైనా ఎంతవరకు చెప్పవలెనో అంతవరకే చెప్పాలి. అనవసరముగా ఏదో చెప్పి సమయం వృథా చేయకూడదు. అనవసరమైన విషయాలు చెప్పటం వలన ఎంతో నష్టం సంభవిస్తుంది. ఎవరి ధర్మాన్నీ ద్వేషించ

కూడదు. ఎవరికి ఏ ధర్మముపైన నమ్మకముంటుందో వారికి దానివలననే ముక్తి లభిస్తుంది. ఆహార విహారముల వలన ధర్మానికి హాని కలుగదు. కాని ముక్తి లభించటంలో ఆలస్యం అవుతుంది. మహమ్మదీయులు కూడా ముక్తిని సాధించ గలరు. అనన్య చిత్తులై భక్తి భావంతో భగవంతుని పిలిచేవారికి ముక్తి త్వరగా లభిస్తుంది" అని చెప్పి మళ్లీ ఈ విధంగా చెప్పసాగారు. "నీవు ఇన్ని సంఘటనలు చూసి మోహపరవశుడవు అవుతున్నావు. వీటిలో ఒక్కటికూడ ఆశ్చర్యజనకం కాదు. ఎందుకంటే మానవుడు నిజంగా మానవుడే అయితే, ఈ అలౌకిక కార్యములన్నీ చేయగలడు. కేవలం ఆహారవిహారాలు మానవుని సుఖసంతోషాల కోసమే సృష్టింపబడలేదు. భగవంతునిలో ఏయే శక్తులున్నాయో అవే శక్తులు మనుష్యులలో కూడా ఉన్నాయి. భగవంతుడు మానవుని తన ఇష్టానుసారం తయారుచేసి అతనిలో తన సమస్త శక్తులను సమకూర్చి జీవుని శ్రేష్ఠతమునిగా చేశాడు. కాని ఎవరికీ ఆశక్తిని ఉపయోగించుకోవటం తెలియదు. ఎవరివలన ఈ ప్రపంచం సృష్టించ బడిందో, ఎవరయితే ఎల్లప్పుడూ మనవెంటే ఉంటారో, అటువంటి భగవంతుని తెలుసుకోటానికిగాని, ఆయనను దర్శించటానికిగాని ఎవరికీ కోరిక ఉండదు. ఒకవేళ ఎవరికైనా ఆ భగవంతుని తెలుసుకోవాలనే కోరిక ఉన్నా ఆయనను చేరే విధానం తెలియదు. అందువలన అతడు తనకు నచ్చిన విధానమును అనుసరించి 10రోజులలో ఆ భగవంతుని దర్శనం కాకపోతే ఆ పనిని విడిచిపెట్టి నాస్తికుడవుతాడు. భగవంతుని హృదయపూర్వకంగా ప్రేమించేవారికి లేదా ఆయనను చేరటానికి ప్రయత్నించేవారికి భగవంతుడు తప్పక వశమవుతాడు. ఈ ప్రపంచమును సృష్టించినవారు అన్ని వేళలా అన్ని స్థానములలోను ఉంటారు. వారే ఈశ్వరులు. వారు ఈసమస్త జగత్తులో వ్యాపించియున్నారు. మనం మన ఆలోచనతోనూ, జ్ఞానబలంతోనూ వారిని వెదికి పొందాలి. గట్టి ప్రయత్నం చేస్తే దానిని మనము తప్పక పొందవచ్చు."

స్వామివారి ఉపదేశాత్మక సందేశాన్ని విని నేను వారిని "నిజంగా భగవంతుని దర్శనం కలుగుతుందా"! అని అడిగాను. దానికి వారు "సాధన చేసినప్పుడు, గురుకృప లభించినప్పుడు భగవంతుని దర్శనం తప్పక కలుగుతుంది. నీవు నిజంగా భగవంతుని దర్శింపదలిచినావా?" అన్నారు. నేను ఆతృతతో "ప్రభూ! అట్లా జరిగితే నేను నిజంగా ధన్యుడినే. ఈనాడు స్వయంగా భగవంతుడినే గురువు రూపంలో

పొందటం నా సౌభాగ్యము. భగవంతుని గుణగణాలను తెలియనివారు ఎవ్వరూ భగవంతుని దర్శనం పొందలేరు". అన్నాను. అప్పుడు స్వామివారు "నేటిరాత్రి నీ కోరిక తీరుతుంది. ఇప్పుడు ప్రొద్దుపోయింది. ఇంటికి వెళ్లు" అన్నారు. వారి ఆజ్ఞానుసారం నేను ఇంటికి వెళ్లాను.

ఆరోజు మధ్యాహ్నం కాక, సంధ్యాసమయంలో ఆశ్రమానికి వెళ్లి, స్వామి వారికి నమస్కరించి దగ్గరలో కూర్చున్నాను. కొద్దిసేపటికి స్వామివారు నన్ను ఒక చిన్న గదిలోకి తీసుకొనివెళ్లారు. వారు కూర్చొనగానే నేను కూడా వారికి దగ్గరగా కూర్చున్నాను. అప్పుడు స్వామివారు నాకు ప్రక్కన ఉన్న చిన్న గదిలోని కాళీమాత విగ్రహాన్ని చూసిరమ్మన్నారు. నేను వెళ్లి చూసివచ్చాను. రాతితో చేసిన ఆ విగ్రహం అక్కడ నిశ్చలంగా ఉన్నదని చెప్పాను. అప్పుడు స్వామివారు నవ్వి "ఆ కాళీమాత విగ్రహాన్ని నీవు ఇక్కడ చూడదలిచావా?" అని అడిగారు. అందుకు నేను "గురుదేవా! నేను ఆ తల్లిని ఇక్కడే చూసే సౌభాగ్యమును పొందగలనా?" అన్నాను. ఆ తల్లిని చూడటమన్నా, దర్శించటమన్నా ఒకటే కదా! అందువలన "ఆ జగన్మాతను నాకు మీరు దర్శింపజేస్తే కృతార్థుడను" అన్నాను. అప్పుడు గురుదేవులు నన్ను స్థిరంగా కూర్చోమని చెప్పి, తాము ధ్యానావస్థలోకి వెళ్లారు. ఒకగంట తరువాత ధ్యానం నుంచి లేచి ఆ జగన్మాతను పిలిచారు. నేను ఎంతో శ్రద్ధతో గమనిస్తూ కూర్చున్నాను. ఇంతలో ఒక బాలారూపిణియై ఆ తల్లి మెల్లమెల్లగా నడుచుకుంటూ వచ్చి వారిముందు ఆగింది. దీపం వెలుగులో ప్రకాశవంతంగా మెరిసిపోతున్న ఆ పార్థివరూపాన్ని చూసి ఆశ్చర్యచకితుడనైనాను. ఆమెను 'తల్లీ' అని పిలవాలనే భావన నా మనస్సులో ఒక్కసారి మెదిలింది. ఆ సమయంలో నాముందు జగన్మాత, గురుదేవులు ఉన్నారు. ఒకవేళ మృత్యువు ప్రాప్తిస్తే సశరీరంగా స్వర్గం దొరుకుతుందని కూడా భ్రమపడ్డాను. ఆనందము భయములతో నా నోటినుండి మాటకూడా రాలేదు. నేను జడపదార్థంలాగా నిలిచిపోయాను. అచేతనమైన పాషాణము సచేతనమైనది కాని సచేతనప్రాణినై ఉండికూడా అచేతనమైనాను. నేను మామూలుస్థితికి వచ్చిన తర్వాత ఆ మాతృమూర్తి ఉన్నచోటనే ఉన్నదోలేదో చూచి రమ్మని గురుదేవులు అన్నారు. అప్పుడు నాకు మరింత భయం కలిగింది. ఆ భయంలోనేను స్వామివారికి అతిచేరువగా చేరాను. స్వామివారు చిరునవ్వు నవ్వి తన వద్దకు రమ్మని చెప్పారు. నేను వారివద్ద కూర్చొని

ఆ జగన్మాతను చూస్తున్నాను. అంతా నిశ్చలంగా ఉన్నది కాని నానోటి నుండి మాత్రం మాటలు వెలువడటం లేదు. స్వామివారి ఆజ్ఞను తీసుకొని ఆ దేవికి నమస్కారం చేశాను. ఆ తర్వాత ఆ దేవి చరణధూళిని ముఖముపైన, సర్వాంగముల పైన రుద్దుకొని నా జీవితమును సార్థకము, పునీతము చేసుకొన్నాను. ఆ తల్లి చరణములు మామూలు మనుష్యుల చరణముల లాగానే ఉండినవి. కొద్ది సేపటికి స్వామి నాతో "జాగ్రత్తగా చూడు. తర్వాత ఏ సందేహము ఉండకూడదు" అని అన్నారు. అప్పుడు స్థిరచిత్తుడనై చూశాను. కొంచెం సేపు అయిన తర్వాత గురుదేవులే ఆ దేవిని తన స్థానమునకు వెళ్లమని చెప్పారు. అప్పుడు ఆదేవి చిన్న బాలికలాగా మెల్లమెల్లగా వెళ్లి తన ఆసనముపైన మూర్తీభవించినది. అప్పుడు నేను గురుదేవుని చూసి రాయి ఎలా నడుస్తుందని ప్రశ్నించాను. దానికి గురుదేవులు "నీ శరీరము ఎట్లా నడుస్తున్నది? అది జడమేకదా! సిద్ధసాధకుని గుణము వలన మన్ను, పాషాణములలో కూడ ఆత్మ మరియు చైతన్యములు సంచరిస్తాయి. అప్పుడు ఆ మూర్తి నడుచుట, మాట్లాడుట, వినుట మొదలైన పనులు చేస్తుంది." అని చెప్పారు. ఆ తర్వాత మరునాడు ప్రొద్దున మనిద్దరము కలిసి వెళ్దామని చెప్పి గురుదేవులు తమ ఆసనం దగ్గరకు చేరుకొన్నారు.

మర్నాడు మాఘమాస షష్ఠి మేమిద్దరం కలసి స్నానమునకు వెళ్లినాము. పంచగంగా ఘాట్ వద్దకు ఆనాటి రాత్రి కూడా రావలెనని, ఆనాటితో నీ పనులన్నీ పూర్తి అవుతాయని, ఆ తర్వాత రావలసిన పని ఉండదని గురుదేవులు చెప్పారు. గంగాస్నానము చేసివచ్చిన గురువుగారి శరీరమును తుడిచాను. ఆ తర్వాత మేమిద్దరం ఆశ్రమమునకు వచ్చాము. ఆ మధ్యాహ్నం అంబాదేవి అన్నం వండి తీసుకొని వచ్చింది. నన్ను ఇంటికి వెళ్లమని ఆజ్ఞాపించి స్వామివారు భోజనమునకు కూర్చున్నారు. నేను ఇంటికి వచ్చి భోజనము చేసి కొంచెం సేపటికి నిద్రపోయాను. మెళకువ వచ్చేసరికి సంధ్యాసమయ మయింది. కొద్దిగా ఆలస్యమయిందని భావించి తొందరగా ఆశ్రమమునకు వెళ్లి గురుదేవులకు నమస్కారం చేసి వారివద్ద కూర్చున్నాను. వారి వేదికవద్ద ఖచోడీలు ఉండినాయి. అందులోనుండి రెండు నాకిచ్చి, తాము రెండు తిన్నారు. ఆ తర్వాత నన్ను గదిలోకి తీసుకొనివెళ్లారు. స్వామివారు కూర్చున్న తర్వాత నేను కూడా వారి వద్ద కూర్చున్నాను. ఒకటి రెండు విషయాలు వారు ప్రస్తావించిన తరువాత స్వామివారు నాతో ప్రత్యేకంగా ఇలా

చెప్పారు. "ఓ ఉమాచరణ్! నీవు ఇప్పుడు బంధనములలో పడిపోయావు. ప్రతిరోజు నీవు చేయవలసిన కార్యక్రమాలు చేయాలి. వాటిపట్ల ఎలాంటి అవహేళనా చేయ కూడదు. పగలు సమయం దొరకకపోతే సంధ్యాసమయంలో చేయాలి. సంధ్యా సమయంలో సమయం దొరకకపోతే రాత్రిపూట చేయాలి. సమయం దొరకటం లేదని చెబితే పని సఫలం కాదు. నీవు నిర్లక్ష్యం చేస్తే నాకు అంతా తెలిసిపోతుంది" అని ఆ తర్వాత స్వామివారు మరలా ఇలా చెప్పసాగారు. "నేను నీకు మొట్టమొదటనే చెప్పాను. భగవంతుడు తన సంపూర్ణశక్తిని మానవునిలో నిక్షిప్తం చేసి వానిని సమస్త జీవరాశిలో శ్రేష్టునిగా సృష్టించాడు. కావున మానవుడు కూడ భగవంతునిలాగానే ఏ పని అయినా చేయగలడు. దీనిని నేను నీకు ప్రత్యక్షముగా చూపగలను. దానిని చూసి నీవు మానవుడే భగవంతుడు అని తెలుసుకుంటావు. ఆ భగవంతుడు ఆత్మరూపంలో హృదయమందును, పరబ్రహ్మరూపంలో మస్తిష్కమందును విరాజ మానుడై యున్నాడు. ఆయన ఏదో పేరుతో కన్నులకు కనబడే శరీరం కాదు. ఇదంతా ఈశ్వరుడే. ఈ మొత్తం ప్రపంచం అతనిదే. నేను ఏమీ కాదు. నాది ఏమీ లేదు అని ఎల్లప్పుడూ జ్ఞాపకం ఉంచుకోవాలి. సమత, సత్సంగము, ఆలోచనము, ఆనందము అనే నాల్గింటిని ఎప్పుడూ మనం మిత్రులుగా గుర్తించాలి. ధర్మాన్ని గూర్చి ఎవ్వరితోనూ, వాద వివాదాలు చేయకూడదు. ఎక్కడైనా ధర్మాన్ని గూర్చి తర్కవితర్కములు జరుగుతూంటే అక్కడి నుండి వెళ్లిపోవాలి" అని చెప్పి, నన్ను కండ్లు మూసుకొమ్మని ఆజ్ఞాపించారు. తాముకూడ స్వయముగా ధ్యానమగ్ను లయినారు. దాదాపు ఒకగంట తర్వాత ధ్యానమును విడిచి నాతో "ఒకసారి కండ్లు తెరచి మనం ఎక్కడ ఉన్నామో చూసి చెప్పు" అన్నారు. నేను కండ్లు తెరచి చూసేసరికి మేము ఆగదిలో లేము. గంగపైన ఒక మంచము వేయబడి ఉన్నది. దానిపైన ఒక తెల్లటి పరుపు, ఆ పరుపుకు తెల్లటి గలేబు, దానిపైన ఒక తెల్లని దుప్పటి ఉన్నాయి. ఆ మంచమునకు రెండువైపులా మూడుమూడు దిండ్లు ఉన్నాయి. దానిపైన స్వామివారు పడుకొని ఉన్నారు. వారి శరీరం తెల్లగా కనబడుతున్నది. నేను వారివద్ద కూర్చొని ఉన్నాను. ఇది నేను యథార్థముగా చూచిన విషయము. వారు నాతో ఇలా అన్నారు. "మనము గంగపై ఉన్నాము కదా! మరి గంగలో నీరు ఉన్నదో లేదో చూడు" అని నేను తలవంచి చేతితో నీటిని తాకినాను. ఆ సమయంలో నాకు మంచంతో సహా మునిగిపోతామేమో అన్న భయము కలిగింది. అందుచేత వారిని అంటిపెట్టుకొని కూర్చొన్నాను.

కొంతసేపటికి వారు నన్ను కండ్లుమూసుకొమ్మని చెప్పారు. నేను కండ్లు మూసుకొని కూర్చున్నాను. అప్పుడు వారు "ఇప్పుడు మనం ఎక్కడ ఉన్నాము"? అని ప్రశ్నించారు. నేను కండ్లు తెరచి చూచాను. మేము ఆశ్రమంలో ఉన్నాము. వారు గద్దెపైన పడుకొని యున్నారు. నేను వారిప్రక్కనే కూర్చొనియున్నాను. ఆ విచిత్ర సంఘటనను చూసి ఆశ్చర్యపోయాను. అది దేవతలకు కూడా అసాధ్యమైన పని. మరి మనుష్యులకు ఎలా సాధ్యమైంది అనుకొన్నాను. అది గమనించి వారు అది ఏమంత ఆశ్చర్యకర విషయం కాదన్నారు. "మానవులు నిజమైన సంపూర్ణ మానవత్వం పొందితే ఏ కార్యమును అయినా చేయగల్గుతారు. ఇంతకు పూర్వం నీవు చూసిన సంఘటనను కేవలం సత్యముపైన విశ్వాసము కల్గటానికి నీకు చేసి చూపించాను. మీరు కూడా ఇలాంటి పనులు చేయగలరు". అని చెప్పి స్వామివారు ఇంటికి వెళ్లమని ఆజ్ఞ ఇచ్చారు. నేను ఇంటికి వెళ్లి భోజనం చేసి పడుకున్నాను. కాని ఆనాడు జరిగిన సంఘటనను గూర్చి ఆలోచిస్తూ పడుకోవటం వలన నిద్రపట్టలేదు. ఆరాత్రి అలా గడచిపోయింది.

మర్నాడు మాఘసప్తమి. ఆరోజున మేమిద్దరం ఆనందంగా గంగాస్నానం చేసి యథాస్థానంలో ఆశ్రమంలో కూర్చున్నాము. ఆ సమయంలో నా మనస్సులో ఒక అనుమానం పొడసూపింది. అది నా గురుదేవులు అయిన వీరిలోనే ఇంతటి అతీతశక్తులుంటే వారి గురుదేవులలో ఎంతటి శక్తులున్నాయో అని. అందువలన స్వామివారి జీవితచరిత్రనే పూర్తిగా తెలుసుకోవలెనన్న కోరికను విన్నవించు కున్నాను. కాని వారు నా మాటను పట్టించుకోలేదు. అయినా నేను పదే పదే అడగటం వలన తమ గరువులను గురించి తమ రెండవ శిష్యుడైన మహాత్మా కాళీచరణ్‌ను అడిగి తెలుసుకోమని చెప్పారు. మహాత్మా కాళీచరణ్ స్వామివారితో నాకు ఆ ఆశ్రమంలోనే పరిచయం అయింది. అంతేకాదు. ఎంతో దగ్గరి సంబంధం ఏర్పడింది. నేను వారిద్వారా స్వామివారి జీవితంలోని బాల్యం నుంచి కాశీలో నివసించే వరకు అన్ని విషయాలను తెలుసుకున్నాను. వారు నన్ను ఎంతో ప్రేమగా చూశారు. ఇప్పుడు వారు హరిద్వార్‌లో ఉన్నారు.

గురుదేవులు గొంగళిపైన నిదురించేవారు. దానినే కప్పుకొనేవారు. అది చూచి నాకు చాలా కష్టమనిపించింది. నేను రెండు శాలువాలను ఒక దుప్పటిని కొని తెచ్చివారికి ఇచ్చాను. వారు శాలువాలు చూసి చాలా కోపించి నేలపైకి విసరి

వేశారు. కోపోద్రిక్తమైన వారి ముఖమును చూసి నేను చాలా భయపడ్డాను. వారి పాదములు పట్టుకుని క్షమించమని వేడుకున్నాను. వారు శాంతించిన కొద్ది సేపటికి నేను "మీకు ఎలాంటి వస్త్రాలు కప్పుకోవటానికి కావాలో చెప్పండి" అని ప్రార్థించాను. అప్పుడు వారు తమకు ఒక గొంగళి మాత్రం తెచ్చియిమ్మని చెప్పి ఇంటికి వెళ్లమని ఆదేశించారు. నేను ఇంటినుండి తిరిగివచ్చునప్పుడు రెండు మంచి కంబళ్లను, ఒక ఆసనమును కొని తెచ్చి ఇచ్చాను. వాటిని చూసి స్వామివారు ఏమీ అనలేదు. దానివలన నాకు కొంతధైర్యము కలిగింది. ఒక గొంగళిని నేలమీద పరచమని ఆదేశించి మెల్లిగా గద్దె దిగి వచ్చారు. రెండవ గొంగళిని కప్పుకున్నారు. "ఇది బాగుంది. నీవు తెచ్చిన శాలువాను నువ్వే వాడుకో"మ్మని ఆదేశించారు. నాకు చాలా సంతోషం కలిగింది. నేను దుప్పటిని మంగళదాసుకు ఇచ్చి, శాలువాను మాత్రం తీసుకున్నాను. స్వామివారు శాంతించటం చూచి నేను కూడ సాంత్వనము పొందాను.

ఈ విధంగా రోజూ రెండుపూటలూ వస్తూపోతూ మాఘ - ఫాల్గుణ మాసములు, చైత్రశుక్ల దశమి వరకు గడిపాను. ఏకాదశి రోజున యథాపూర్వముగా నేను గురుదేవుల వద్ద కూర్చొని యున్నాను. దర్శనము కోసం వచ్చే భక్తులందరూ వెళ్లిపోయిన తర్వాత స్వామివారు "నీవు యేయే సంఘటనలను చూశావో, ఏయే మాటలు విన్నావో, వాటిని నమ్మకంలేని వారికి ఎవ్వరికీ చెప్పకూడదు. ధర్మావలంబనము చేస్తూనే మనుష్యులు ప్రపంచంలో వికసించాలి. ప్రతిసమయం లోనూ సచ్చరిత్ర కలవాడై ధర్మమును ఆచరించాలి. జీవితంలో అసలు పని అయిన ఉపాసనము ఎప్పుడూ విడువకూడదు. నేను నీకు చేయవలసిన పనులను వ్రాయించాను, చెప్పాను, వివరించాను. ఇక ఇప్పుడు ఈ ఆశ్రమంలో నీవు ఉండవలసిన అవసరం లేదు. కొన్ని రోజుల తర్వాత నీ ఉద్యోగానికి వెళ్లు. ఈ ప్రపంచంలోకి మరలమరల తిరిగి రాకూడదనే కోరికను పెంచుకో. ఆ భగవంతుని వద్దనే నీవు ఉండవలెను. నీకు వివాహము అయినది కదా. దానిని కూడా నీవు అనుసరించవలెను. కనుక నీవు ఇక్కడ ఉండటానికి వీలులేదు" అని స్వామివారు చెప్పారు.

నాకు హరిద్వారము వెళ్లవలెనని కోరిక ఉన్నది. ఇప్పుడు వెళ్లితేనే వెళ్లగలను. లేకపోతే నాజీవితంలో ఎప్పుడూ వెళ్లలేను. అని అనుకున్నాను. కాని ఇప్పుడు

అధికమాసం కావటం వలన వెళ్లలేనని విన్నవించుకున్నాను. అక్కడినుండి ప్రయాగకు వెళ్లమని స్వామివారు సెలవిచ్చారు. "అయోధ్యలోని సరయూనది తీరంలో రామదాసు ఉన్నారు. వారిని దర్శించి ప్రయాగలోని సూరదాస్ బాబాను దర్శించు. ఆ తర్వాత హరిద్వారమునకు వెళ్లు" అని ఆదేశించారు.

చైత్ర సంక్రాంతికి ముందు రోజు నేను అయోధ్యకు వెళ్లటానికి స్వామివారి అనుజ్ఞను పొందాను. ఆ తర్వాత స్వామివారికి నా సందేహము నొకదానిని వెలిబుచ్చాను. అది "నేను పాప విముక్తుడను అయినానో లేదో ప్రమాణపూర్వకంగా తెలియజెప్పండి" అని వేడుకొన్నాను. నా విశ్వాసం కోసం వారు "అప్పుడు నీ అరచేతిలో ఒకపొర ఊడిపోతుంది" అని చెప్పారు. (వాస్తవానికి నేను హరిద్వారము నుండి ముంగేరుకు తిరిగి వచ్చిన తరువాత నా రెండు అరచేతులలోని చర్మము కాలిన తర్వాత ఎలా ఊడిపోతుందో అలా ఊడిపోయింది. దానిని చాలా మంది చూశారు కూడ). అప్పుడు నేను గురుదేవుని చరణధూళిని నుదుట ధరించి వారికి నమస్కరించాను. వారు నన్ను ఆశీర్వదించి "ఎప్పుడైనా, ఏదైనా సందేహం కలిగినపుడు నీవు ఒంటరిగా నా దగ్గరకు రా" అని చెప్పారు. నేను హరిద్వార్ నుండి తిరిగివచ్చేటప్పుడు మీ చరణసన్నిధికి వచ్చే భాగ్యమును కలిగించండని వేడుకొన్నాను. "అప్పుడు నీవు ఒకటి రెండు రోజులు కాశీలో ఉండు" అని చెప్పారు. ఆతరువాత నేను వారికి నమస్కరించి సెలవు తీసుకొన్నాను.

గురుదేవుల ఆజ్ఞానుసారం చైత్ర సంక్రాంతి చివరిరోజున ప్రాతఃకాలవేళకు నేను అయోధ్యాయాత్రను పూర్తి చేశాను. అయోధ్యలో మూడు రోజులు ఉండి, స్వామివారు సెలవిచ్చిన ప్రకారం మహాత్మా రామదాస స్వామివారిని సరయూనదీ తీరంలో దర్శించి తరించాను. వారు ధ్యానమగ్నులై ఉన్నారు వారి మాటలు వినవలెనని కోరికతో నేను అక్కడనే కూర్చొనియున్నాను. రెండు గంటల తరువాత కనులు తెరచి చూచి "నీ పని పూర్తి అయినది కదా! ఎందుకు కూర్చున్నావు" అని అడిగి, తిరిగి కన్నులు మూసుకొన్నారు. వారు ఇక ఏదీ మాట్లాడరని భావించి నేను అక్కడినుండి వెళ్లిపోయాను.

మర్నాడు నేను ప్రయాగ వెళ్లాను. అక్కడ 7 రోజులుండి, నా కర్తవ్యమును పూర్తి చేసుకొని, ఒకరోజున గురుదేవుల ఆజ్ఞానుసారం మరి ఇద్దరి వ్యక్తులతో కలసి సూరదాస్ బాబాగారి దర్శనమునకు వెళ్లాను. గంగాతీరమునకు వెళ్లే త్రోవలో

ఒక చిన్న నది ఉన్నది. దానిని దాటి వెళ్లటానికి ఒక వంతెన ఉన్నది. దానికి ఒక ప్రక్కన మహాత్మా సూరదాస్ బాబాగారు ధ్యానమగ్నులయి కూర్చొనియున్నారు. దాదాపు మూడు గంటలు వారివద్దనే కూర్చున్నాను. కాని వారు ధ్యానమును వీడలేదు. అక్కడ ఉన్న కొంతమంది ఈవిధంగా చెప్పారు. "సిపాయిల తిరుగుబాటు కాలం ముందునుంచీ శీతాకాలము ఎండాకాలము అనే భేదము లేక, సంవత్సరం పొడుగునా రాత్రింబవళ్ళు ఇదే విధముగా కూర్చొని యున్నారు" అని. సిపాయిల తిరుగుబాటు జరిగే రోజున కొందరు సిపాయిలు వచ్చి "ఇక్కడే యుద్ధము జరుగుతుంది. కనుక మీరు మరొక చోట కూర్చుండి ధ్యానం చేసుకోండి" అని చెప్పారు. కాని సిపాయిలు ఎంత పెద్దగా అరచినా ధ్యానముద్రలో ఉన్న బాబా గారికి వారి మాటలు వినపడలేదు. అప్పుడు వారు ఒక అగ్గిపుల్లను వెలిగించి వారి భుజముపైన పెట్టారు. ఒక అరగంట తర్వాత బాబాగారు ధ్యానమునుండి యథాస్థితికి వచ్చి "మీరు నాపైన ఎందుకు అత్యాచారం చేస్తున్నా"రని సిపాయిలను ప్రశ్నించారు. దానికి సిపాయిలు "ఇక్కడ యుద్ధం జరుగుతుంది. కనుక మీరు వేరే ప్రదేశాన్ని చూసుకోండి" అని సమాధానము చెప్పారు. అప్పుడు సూరదాస్ బాబాగారు "ఒకవేళ తుపాకిగుళ్లతో నాకు మృత్యువు సంభవిస్తే మీలో ఎవ్వరూ దానిని ఏ విధముగానూ ఆపలేరు. మీరు యుద్ధము చేసుకోండి. నా గురించి ఆలోచించవద్దు. నేను ఈ ప్రదేశమును విడిచివెళ్లను" అని బదులు చెప్పి తిరిగి సమాధిస్థితిలోకి వెళ్లిపోయారు. అక్కడ యుద్ధం జరిగింది. కాని వారికి ఎలాంటి హాని జరుగలేదు. భుజముపైన అగ్గిపుల్లతో కాల్చిన మచ్చమాత్రం ఉన్నది. అయినా వారు సమాధి స్థితిని వీడలేదు. వారు చాలా శుష్కించియున్నారు. కేవలం ఎముకలపైన చర్మము అతికించినట్లు వారున్నారు. సంధ్యాసమయం వరకు మేముండి ఆ తర్వాత అక్కడి నుండి ఆగ్రాకు వెళ్లాము. అక్కడ మూడురోజులుండి తాజ్‌మహల్ చూశాము. తరువాత మధురలో 7 రోజులుండి బృందావనమును చూసీ, ఢిల్లీ మీదుగా హరిద్వార్‌కి వెళ్లాము. అక్కడ బాబాగారి రెండవ శిష్యుడైన మహాత్మా కాళీచరణ్ స్వామివారిని దర్శించాము. వారి అనుగ్రహం వలన 'కన్‌ఖళ్'లో ఉన్న మరి నలుగురు మహాపురుషులను చూశాము. తరువాత గంగా ఘాట్‌లో స్నానము చేయుటకు వెళ్లినపుడు బాబాగారి మూడవ నాల్గవ శిష్యులైన మహాత్మా బ్రహ్మానంద స్వామి. మహాత్మా భోళానాథ్ స్వామివారల పరిచయం కలిగింది. హరిద్వార్‌లో మేము గురుదేవుల అనుయాయులం నలుగురము కలిసి

ఒకరితో ఒకరు ఒకనెల రోజులు గడిపాము. వారితో నాకు చాలా సన్నిహితత్వము కలిగింది. వారు నా యోగక్షేమములను ఎప్పుడూ కనిపెట్టుకొని ఉంటామని మాట ఇచ్చారు. అంతేకాక అప్పుడప్పుడు కలుస్తూ ఉందామని కూడా చెప్పారు.

కొన్ని క్షేత్రములను దర్శించిన తరువాత నేను తిరిగి కాశీధామము చేరాను. మొట్టమొదట నేను ఆశ్రమమునకు వెళ్లి గురుదేవులకు దండప్రణామములు చేసి వారి సమీపంలో కూర్చున్నాను. స్వామివారు నన్ను చూచి “నీ పనులన్నీ ముగిసినవి కనుక నీవు ఈ కాశీధామమును వదిలి ముంగేరు వెళ్లు” అని చెప్పారు. “మీరు 3 నెలలు సెలవు తీసుకొని వచ్చారు. కాని 8 నెలలు గడిచిపోయినాయి. ఇక ఇక్కడ ఒకరోజు కూడ ఉండటం కుదురదు. రేపు తప్పక వెళ్లిపోవాలి. మీ ఉద్యోగం గూర్చి మీరేమాత్రమూ చింతించవద్దు. మీ ఉద్యోగం నుండి మిమ్మల్ని ఎవరూ తొలగించలేరు” అని కూడా చెప్పారు.

స్వామివారి ఆజ్ఞ తీసుకొని వారి పాదధూళిని నుదుట ధరించి అక్కడినుండి బయలుదేరాను. మంగళదాస్ ఠాకూర్ వద్దకు వెళ్లి, వారితో చాలాసేపు మాట్లాడిన తర్వాత, నమస్కరించి వారినుండి కూడా సెలవు తీసుకొని మర్నాడు ముంగేరికి ప్రయాణమయ్యాను.

మహాత్మా త్రైలింగస్వామివారితో నాకు శిష్యసంబంధము ఏర్పడిన రోజుననే స్వర్గవాసిని మేడమ్ బ్లావట్‌స్కీ, కల్నల్ ఆల్‌కాట్‌లు బొంబాయి వచ్చి థియోసాఫికల్ సొసైటిని స్థాపించి, యోగవిద్య యొక్క అద్భుత శక్తులను ప్రచారం చేస్తూ ఉండేవారు. అప్పుడప్పుడు అలౌకిక కార్యములు చేసి చూపి, ఆ సిద్ధులను లోకులకు తెలియజెప్పేవారు. అలాంటి యోగసిద్ధులు ఆమెకు ఎట్లా కలిగినాయని స్వామి వారిని ప్రశ్నించగా అవన్నీ యోగసిద్ధులు కావని, అదంతా కనుకట్టు అనీ చెప్పారు. స్వామివారు చెప్పినట్లుగానే కొన్ని రోజుల తరువాత కుసుమ అనే ఆమె, బ్లావట్‌స్కీకి అనుయాయిగా ఉండి, మద్రాస్ నగరంలోని ఆమె రహస్య స్థావరాన్ని రహస్య విషయాలను బయటపెట్టింది. అది ప్రపంచానికంతా తెలిసి, ఆమె అల్లరి పాలయింది. వార్తా పత్రికలు ఆమెను తీవ్రంగా విమర్శించాయి. ఆ తరువాత బ్లావట్‌స్కీ యొక్క యోగసిద్ధులను గురించిన ఆ ప్రస్తావనే ఎక్కడా లేదు. స్వామివారి దివ్యదృష్టి తత్త్వ జ్ఞానములు నాకెంతో ఆశ్చర్యాన్ని కలిగించినాయి.

ముంగేరు తిరిగి వచ్చిన తరువాత నేను అందరినీ కలిశాను. శ్రీయుతులు యదునాథ్ భగ్చీగారితోను, పరివ్రాజక శ్రీకృష్ణప్రసన్న సేన్‌గారితోను (ముంగేరు ఆర్యధర్మ ప్రచార సభాప్రతినిధులు) శ్రీ స్వామివారి అలౌకిక శక్తులను గురించి, వారి ఉపన్యాసములను గురించి చెప్పి, వారు నాచేత ఉపదేశపూర్వకంగా వ్రాయించిన రెండు పుస్తకాలను చూపించాను. ఆ మాటలు విని వారు ఆశ్చర్యపడ్డారు. కాశీకి తీసుకొని వెళ్లి స్వామివారి దర్శనం చేయించమని పదేపదే ప్రాధేయపడ్డారు. స్వామివారు నాకు చేసిన ఉపదేశాన్ని ఎవ్వరితోనూ చెప్పవద్దని వారు చెప్పినా, ఆ ఇద్దరితోనూ చెప్పకుండా ఉండలేకపోయాను. అందుకు కారణం వారు నాకు చాలా సన్నిహితులు, నన్ను బాగా ప్రేమించేవారు కావటమే! క్రమక్రమంగా నా మాటలు అంతటా వ్యాపించసాగినాయి. నేను చాలా భయపడ సాగాను.

ఒక సంవత్సరం తరువాత నేను శ్రీకృష్ణప్రసన్నసేన్ మహాశయులతో కలిసి కాశీకి వెళ్లాను. సంధ్యాసమయం అయ్యాక స్వామివారి దర్శనార్థం వచ్చిన భక్తులు అందరూ వెళ్లిపోయిన తరువాత, అసురసంధ్యవేళ ఆశ్రమానికి వెళ్లాము. ఆశ్రమంలోని దేవతామూర్తులకు, స్వామివారికి నమస్కరించి మేము స్వామివారి దగ్గర కూర్చున్నాము. స్వామివారు కొంతసేపటికి మావైపు చూసి ఇట్లా అన్నారు. "ఓయీ శ్రీకృష్ణా! నీ మనస్సులో ఎంతో అహంకారం ఉన్నది. శ్రీకృష్ణుడు అవతార మెత్తినట్లే నీవు కూడా అవతారమెత్తానని భావిస్తూ ఉంటావు. అందరూ నీపూజ చేయాలని భావిస్తూ ఉంటావు. నీ పాదధూళిని బ్రాహ్మణులకు ఇవ్వటానికి కూడా సంకోచించవు. నీ భవిష్యత్తు చాలా విచారకరంగా ఉన్నది. నీవు సామాన్య మానవుడివి. కాని కొంత మాట్లాడగల శక్తి నీకు ఉన్నది. పిండిని పూరీలాగా ఒత్తి సలసల మరిగే నూనెలో పడవేసినప్పుడు, అందులో పచ్చి ఉన్నంత వరకూ శబ్దం చేస్తుంది. పూరీ అయిన తరువాత అది శబ్దం చెయ్యదు. అంతేకాక నూనె మీద తేలియాడుతూ ఉంటుంది. అలాగే నీలోని అహంకారం పోయి నమ్రత వస్తే నీవు ధర్మానికి చేరువవుతావు. ప్రస్తుతం నీవు ధర్మానికి ఎంతో దూరంలో ఉన్నావు" అని అన్నారు. ఆ మాటలు విన్న శ్రీకృష్ణప్రసన్నసేన్ మహాశయుడు ఏమీ జవాబు చెప్పకపోగా, ఏరకమైన కుతూహలమును ప్రదర్శించలేదు. కొద్ది సేపటికి స్వామివారు మమ్ములను వెళ్లిపొమ్మని సంజ్ఞచేశారు. మేము బయటకు వచ్చేశాము.

శ్రీ సేన్ మహాశయుడు మిసిర్ పోఖరాలో ఆర్యధర్మ ప్రచారక సభను స్థాపించటానికి అక్కడే ఉండిపోయాడు. కాని నేను అక్కడ ఉండటం స్వామివారికి ఇష్టం లేదు. కావున మూడు రోజులు కాశీలో ఉండి ముంగేరుకు తిరిగి వచ్చాను. గురుదేవులను గురించి ప్రచారం చేసినందుకు స్వామివారికి నాపైన కోపం వచ్చినట్లుంది. అందుకే వారు నన్ను తిరస్కారభావంతో చూశారు. నా తప్పును క్షమించమని వారిని నేను వేడుకొన్నాను. మీ అలౌకిక శక్తులను, అసాధారణ గుణగణాలను గురించి నా దగ్గరి స్నేహితులొకరిద్దరితో చెప్పకుండా ఉండలేక పోయాను అని విన్నవించు కొన్నాను.

సేన్ మహాశయుడు కొన్ని రోజులు మిసిర్ పోఖరాలో ఉండి, హూజ్ కటారాలో ఒక ఇంటిని కొన్నారు. అక్కడ శ్రీఅన్నపూర్ణాదేవిని ప్రతిష్ఠించి, ఆ ఇంటికి యోగాశ్రమమని పేరు పెట్టి అక్కడే ధర్మ ప్రచారం చేస్తూ ఉండిపోయారు. అప్పటి నుండి ఆయన పేరు కృష్ణానంద స్వామి అయింది.

ఒక సంవత్సరం తరువాత బాబా యదునాథ్ భాగ్చీ మహాశయులు, ఆశ్వీయుజ మాసంలో వచ్చే దేవీ నవరాత్రుల సందర్భంగా ఇచ్చే శెలవులలో నాతోపాటు కాశీకి వచ్చారు. సంధ్యాసమయంలో మేమిద్దరమూ శ్రీస్వామివారి ఆశ్రమానికి వెళ్లి, అక్కడ ఉన్న దేవతామూర్తులకు, స్వామివారికి నమస్కరించి, స్వామివారి సన్నిధిలో కూర్చున్నాము. స్వామీజీ మమ్మల్ని చూసి “ఓ యదునాథ్ బాబూ! నీవు అనేక శాస్త్ర గ్రంథాలను చదివి చెడిపోయినావు. ఇప్పటికీ నీ మనస్సు స్థిమితపడలేదు. మొదట నీవు నీ మనస్సును అధీనంలో పెట్టుకో! తరువాత నీకు ముక్తి లభిస్తుంది. నీకు నానుండి దీక్ష స్వీకరించాలనే కోరిక ఉన్నది. కాని ఇప్పటివరకూ నేను ఐదుగురిని శిష్యులుగా గ్రహించాను. ఇంక ఎవ్వరికీ దీక్ష ఇవ్వను. దీక్ష ఇవ్వటం కూడా మహాపాపమే. ఎందుకంటే దీక్ష ఇచ్చిన తరువాత శిష్యుడు గురూపదేశం ప్రకారం కర్మ చెయ్యాలి. ఒక వేళ ఆ కర్మ శిష్యుడు చెయ్యకపోతే గురువే చెయ్యాలి. గురువు కూడా చేయకపోతే మహాపాపం చుట్టుకొంటుంది. శిష్యుడిని ఎలా ఉద్ధరించాలా అనే గురువు ఆలోచిస్తూ ఉంటాడు. అందుచేత నేను మహాపాతకములలో మునిగి పోతాను. కావున నాతో సమానమైన నా రెండో శిష్యుడు మహాత్మా కాళీచరణ్ స్వామి నీకు దీక్ష ఇస్తారు. దీక్ష ఇచ్చే ముందు నీ శరీరము పవిత్రం కావలసి ఉన్నది. అందుకు నీకు ఒక ఉపాయము చెబుతాను. వైశాఖ పూర్ణిమ రోజున

కాశీకి వచ్చి ఒక సద్‌బ్రాహ్మణుని చేత ఆ పని చేయించుకో" అని చెప్పి ఇంకా ఇలా అన్నారు "నీవు నీ కార్యాలయంలో ఉన్నతపదవిలో ఉన్నవాడివి. కనుక నీవు ఆ కార్యాలయాన్ని గురించి ఎంతో ఆలోచించాలి. నీవు గత 20-22 సంవత్సరాల నుంచీ శాకాహారివి. కొన్ని రోజుల తరువాత నీకు భయంకరమైన గొంతునొప్పి వస్తుంది. కావున నీవు ఆరోగ్యంగా ఉండాలనుకుంటే చేపల ఆహారం తీసుకోవాలి. అయితే నీవు ఉద్యోగం వదిలి పెట్టదలిస్తే అలా చెయ్యనవసరం లేదు. యదునాథ్! నీవు అంత నియమనిష్ఠాగరిష్ఠుడైన హిందువు కావలసిన అవసరం లేదు. ఒకరోజున నీవు నీ దగ్గర పనిచేసే ఒక బ్రాహ్మణ ఉద్యోగి లఘుశంక తీర్చుకొనే సమయంలో తన యజ్ఞోపవీతాన్ని చెవిపైన వేసుకోని కారణంగా, క్రోధవివశుడవై అతనికి పదోన్నతి కలుగకుండా చేశావు. దానిని బట్టి నీకు యజ్ఞోపవీతాన్ని చెవిపైన వేసుకోవటంలోని ఆంతర్యం తెలియదని అర్థమవుతున్నది. యజ్ఞోపవీతము అతిపవిత్రమైనది. అల్పాచమానము అపవిత్రమైనది. అల్పాచమానము యజ్ఞోపవీతం మీద పడకుండా ఉండటానికి దానిని చెవికి చుట్టుకుంటారు". అని అన్నారు. భాగ్చీమహాశయుడు స్వామివారి మాటలు విని ఆశ్చర్యచకితుడయ్యాడు. ఆ సమయంలో భాగ్చీమహాశయుని జ్యేష్ఠపుత్రుడు సరోజ్‌నాథ్‌కు ఉపనయనము చేయాలని సంకల్పించి సుముహూర్తం కొరకు ఎదురుచూస్తున్నాడు. సరోజ్‌నాథ్ ఒక సద్బ్రాహ్మణుడు కావాలనే కోరికతో స్వామివారిని ఒక శుభలగ్నం నిర్ణయించ మని కోరాడు. స్వామివారు శుభముహూర్తం నిర్ణయించి మమ్మల్ని వెళ్లమని ఆదేశించారు. మేమిద్దరమూ స్వామివారికి నమస్కరించి వెళ్ళిపోయాము.

మరునాటి ప్రొద్దున ఆశ్రమానికి వెళ్లేటప్పుడు మణికర్ణికా ఘాట్‌లో మహాత్మా భోళానాథ్ స్వామి సాక్షాత్కరించారు. వారి చెంత మేము కూర్చున్నాము. అందరూ వచ్చిపోవటం తగ్గిన తరువాత నాతో స్వామివారు "మీరు ఆశ్రమానికి వచ్చేటప్పుడు ఎవరినీ వెంట తీసుకొనిరావద్దు. ఒకవేళ ఆశ్రమానికి రావలసివస్తే ఒంటరిగానే రావాలి. లేదా, రానే వద్దు" అని చెప్పి భోళానాథ్ స్వామి ఆశ్రమానికి వెళ్లమని చెప్పారు. మేము వెళ్లాము. స్వామివారి వద్ద గుమికూడటం మంచిదికాదని భోళానాథస్వామి నాతో చెప్పారు. వారు మొదటినుంచీ నాతో చాలా స్నేహంగా ఉండేవారు. ముంగేరులో ఉన్నప్పుడు వారు నా దగ్గరకు మూడు నాల్గు సార్లు

వచ్చారు. ఏడు రోజులు కాశీలో ఉండి భాగ్చీమహాశయుడు, నేను ముంగేరుకు తిరిగివెళ్లాము.

ముంగేరుకు వెళ్ళిన తరువాత భగ్చీమహాశయుడు శరీరశుద్ధికొరకు దానం చేయదలచి సద్బ్రాహ్మణుడైన శశిధర తర్కచూడామణిని కోరాడు. కాని దానికి వారు అంగీకరించలేదు. అప్పుడు భాగ్చీ మహాశయుడు ఎంతో ఆలోచించి, నవద్వీపం లోను, భాట్‌పాడాలోను వెదకి ఒక సద్బ్రాహ్మణుని పట్టుకొన్నాడు. కాని కాశీలో దానం తీసుకోటానికి ఎవ్వరూ అంగీకరించలేదు. దానం తీసుకోనే బ్రాహ్మణుడు దొరకనందున భాగ్చీ మహాశయుడు ఎంతో విచారించాడు. క్రమక్రమంగా పుణ్యకాలం సమీపిస్తూ ఉండింది. రోజులు గడుస్తున్నాయి. కానీ సమస్యకు సమాధానం దొరకలేదు. అందువలన ఒక రోజున అదే విషయం ఆలోచిస్తూ కళ్లనీళ్ల పర్యంతం అయ్యాడు.

శ్రీ స్వామివారు నిర్దేశించిన సమయం ఇంకా నాలుగు రోజులు ఉన్నదనగా, మహాత్మా భోళానాథస్వామి అక్కడికి వచ్చారు. త్రైలింగస్వామివారు మమ్మల్ని కాశీకి తీసుకొనిరమ్మన్నారని, మమ్మల్ని పరిశుద్ధుల్ని చెయ్యటానికి కాశీలో ఒక సద్బ్రాహ్మణుని వెతకమని మా వద్దకు పంపారని చెప్పారు. రెండవ రోజు యదునాథ్ భాగ్చీ, భోళానాథస్వామి వెంట కాశీకి వెళ్లారు. అక్కడ త్రైలింగస్వామివారు నియమించిన ఒక నిత్యాగ్నిహోత్రి అయిన బ్రాహ్మణునిచేత శరీరశుద్ధి కార్యక్రమాన్ని పూర్తి చేయించి, ఏడు రోజులలో ముంగేరుకు పంపించారు. ఆరోజు నుంచీ శ్రీస్వామివారి అలౌకిక శక్తులను గురించి నాకూ భాగ్చీమహాశయునికి ప్రతిరోజూ చర్చలు జరిగేవి.

దాని తరువాత ఐదారు సంవత్సరములకు మహాత్మా త్రైలింగస్వామివారి శిష్యుడైన మహాత్మా కాళీచరణ్ స్వామి, భాగ్చీమహాశయుని ఇంటికి వచ్చి దీక్ష ఇచ్చారు. దీక్షతీసుకొన్న తరువాత ఒక సంవత్సరానికి భాగ్చీ మహాశయులు తీవ్రమైన అనారోగ్యానికి గురి అయ్యారు. ఆ సమయంలో నేను డార్జిలింగ్‌లో ఉండేవాడిని. ఆయన మూడు నెలలు సెలవు పెట్టి నా దగ్గరకు వచ్చి నాతో గడిపారు. ఆ తరువాత ఆయనకు స్వస్థత చేకూరింది.

కొన్ని రోజుల తరువాత నేను పనిచేసే వైద్యశాలలోనే మేనేజర్‌గా పని చేస్తున్న

శ్రీ మహేంద్రలాల్‌ఘోష్ (ఈయన ఒక పాఠశాలలో అధ్యాపకులుగా పనిచేసేవారు. అందువల్ల అందరూ ఆయనను మాస్టర్ సాహెబ్ అని పిలిచేవారు). "ఉమాచరణ్! ఖాతాలో ఆరువందల రూపాయలు తక్కువ వస్తున్నాయి. ఆ రూపాయలు ఎవరికైనా ఇచ్చిరేమో జ్ఞాపకం చేసుకొని చెప్పండి" అన్నారు. నేను ఎంత జ్ఞాపకం చేసుకొన్నప్పటికీ ఆ రూపాయలు ఎవ్వరికీ ఇచ్చినట్లు జ్ఞాపకం రాలేదు. వైద్యశాలలో రెండు ఇనుప పెట్టెలు ఉండేవి. వాటికి నాల్గు తాళం చెవులు ఉండేవి. అందులో రెండు నా దగ్గర రెండు మాస్టర్‌గారి దగ్గర ఉండేవి. ఇనుపపెట్టెలుండే గదిలోనే నేను నిద్రించేవాడిని. మేమిద్దరం కలిసి ఎన్ని లెక్కలు వేసినా, తప్పు ఎక్కడా దొరకలేదు. అప్పుడు మా ఇద్దరిలో ఎవరో ఒకరు దొంగ కావాలిగదా అని మేము ఆలోచించసాగాము. అంతకుమించి మూడవ వ్యక్తిని అనుమానించటానికి ఆస్కారం లేదు. మాస్టర్‌గారు దొంగకావటానికి వీలు లేదు. అందరి దృష్టిలోనూ నేనే దొంగను అయ్యే ఆస్కారం ఉన్నది. క్రమక్రమంగా ఈ అనుమానం వ్యాపించసాగింది. ఆ విధంగా మూడు నెలలు గడిచింది. కాని డబ్బు సంగతి తేలలేదు. ఒక వేళ న్యాయం నిర్ణయించవలసివస్తే అందరూ నన్నే దొంగగా నిర్ణయిస్తారు. అన్ని విధాలా ఆలోచించి, భగవంతునిపైన భారంవేసి, ఒకసారి స్వామివారిని దర్శించవలెనని నిర్ణయించుకొన్నాను. ఎవరికీ చెప్పకుండా కాశీకి వెళ్లాను. స్వామివారికి నమస్కరించి వారి దగ్గర కూర్చున్నాను. వారు నా వైపు దృష్టి మరల్చి నవ్వి "ఏం నాయనా! డబ్బు అదృశ్యం కావటం వలన నా దగ్గరకు వచ్చావా?" అన్నారు. అందుకు నేను అవునన్నాను. అప్పుడు స్వామీజీ – "నీలాగానే నీ మాస్టరు గారు కూడా అయోమయంలో పడ్డారు. ఫలానా నెలలో ఫలానా రోజున 500 రూపాయలు కలకత్తాకు పంపించారు. అందులో 300 రూపాయలు నరసింహప్రసాద దత్తుకు, 200 రూపాయలు ఫలానా కంపెనీకి పంపారు. నీవే స్వయంగా పంపించి వచ్చావు కదా! దాని రశీదులు ఫలానా విభాగంలో ఉన్నాయి. రూపాయలు ముట్టినట్లు రశీదులు కూడా వచ్చినాయి. అయినా మీరు కండ్లు తెరవలేదు. ఖాతాలో ఖర్చుకూడా వ్రాయలేదు. ఇంకొక 100 రూపాయల బాకీని గురించి మీ మాస్టర్‌గారు చెబుతారు. అవి ఏమైనాయో ఎక్కడ ఉన్నాయో నేను చెప్పను" అని చెప్పి "నీవు ముంగేరులో నన్నుగురించి చాలా ప్రచారం చేశావు. అక్కడ నుంచి ఎవరెవరో వచ్చి దీక్ష తీసుకుంటామని ఒత్తిడి చేస్తున్నారు. నాకు ఇక్కడ ఉండటమే కష్టం అవుతున్నది. అందువలన నీవు ఇంక ముంగేరులో

ఉండలేవు. నీవు ముంగేరు వెళ్లి, చీఫ్ ఇంజనీర్‌గారిని కలిసి, షిల్లాంగ్‌కు కాని అస్సాంకు కాని వెళ్లిపోతానని విజ్ఞాపన పత్రం సమర్పించుకో" అన్నారు. అందుకు నేను వారికి నమస్కరించి "అయ్యా! నేను అందరికీ చెప్పలేదు. కేవలం ఇద్దరు ముగ్గురికే ఈ సంగతి చెప్పాను. అగ్నిని బూడిద కప్పియుంచలేదు కదా! మీ అద్భుతశక్తి, అలౌకిక కార్యకలాపాలు వాటంతట అవే వెల్లడి అవుతున్నాయి" అని విన్నవించుకొన్నాను. దాని తరువాత ఒక భయంకరమైన బాధాకరమైన విషయమును వారు చెప్పారు. అది విని నేను చాలా బాధపడ్డాను. వారు చెప్పినది "అయిదారు సంవత్సరాలకు నేను ఈ శరీరాన్ని పరిత్యజిస్తాను. ఈ సమాచారం నీకు ముందుగానే తెలుపుతాను. నీవు ఎక్కడ ఉన్నా అప్పుడు ఇక్కడికి రావాలి. ఇప్పుడు నీవు ఇక్కడ ఉండవద్దు. రేపే ముంగేరు వెళ్లిపో" అని.

రెండవరోజు ముంగేరుకు వెళ్లాను. వైద్యశాలకు వెళ్లి మాస్టరుగారు, భాగ్చీ మహాశయులు అక్కడ ఉండటం చూశాను. నన్ను చూసి మాస్టర్‌గారు "ఉమాచరణ్ గారు! మూడు నాలుగు రోజులుగా మీరు కనిపించలేదు. ఎక్కడికి వెళ్లారు?" అని ప్రశ్నించారు. రూపాయల గందరగోళం విషయాలు తెలుసుకుందామని వెళ్లానని సమాధానం చెప్పాను. "అయితే మీరు కాశీధామం వెళ్లారా?" అని భాగ్చీగారు అడిగారు. "అక్కడికి కాక మరెక్కడికి వెళ్తాను" అని ఎదురు ప్రశ్నవేశాను. అప్పుడు వారిద్దరు ఎంతో కుతూహలంతో "త్రైలింగస్వామివారు ఏమన్నా"రని ప్రశ్నించారు. నేను రెండు రశీదులను చూపించాను. జరిగిన వృత్తాంతమంతా వివరించి చెప్పాను. వారిద్దరూ నిశ్చేష్టులయ్యారు. ఇక మిగిలిన వందరూపాయల విషయంలో మాస్టరుగారి కేక విని మేమిద్దరమూ వారి దగ్గరికి వెళ్లాము. మాస్టరుగారు నవ్వుతూ వందరూపయలనోటు దొరికిందని చెప్పి, రంగుకు అతుక్కొని చిక్కుకుపోయిన రంగు అంటిన నోటును నా చేతిలో పెట్టారు. మేము ఆశ్చర్యపోయాము.

ముంగేరును విడిచిపెట్టలేక, ఒక సంవత్సరం ఆలస్యం చేసి, అస్సాం చీఫ్ ఇంజనీరు గారికి దరఖాస్తు పెట్టుకొన్నాను. పదిరోజుల తరువాత 50 రూపాయల జీతము, 15 రూపాయలు భత్యముపైన నియుక్తిపత్రం పంపించి, శివసాగర్‌కు వెళ్లటానికి నన్ను ఆదేశించారు. ఈ విషయము తెలిసిన మాస్టర్‌గారు "అజీతమే మీకు ఇక్కడ ఇస్తాము కాని మిమ్మల్ని ఒదులుకోలేము" అని చెప్పారు. ఆవిధంగా నెలరోజులు గడిచిపోయాయి. అస్సాం నుంచి రెండు టెలిగ్రాంలు కూడా వచ్చాయి.

రాదలుచుకోకపోతే రానని తిరుగు టెలిగ్రాంలో తెలుపమని కూడా వారు తెలిపారు. అప్పుడు తీసుకోవలసిన నిర్ణయం కోసం శ్రీ స్వామివారిని అడగటానికి కాశీధామం వెళ్లాను. స్వామివారు నేను చెప్పినదంతా విని, నన్ను అస్సాం వెళ్లమనే ఆదేశించారు. ముంగేరులో ఉండటానికి వీలుపడదని కూడా చెప్పారు.

కాశీనుంచి ముంగేరుకు వెళ్లితే తిరిగి నా స్వగ్రామానికి వెళ్లలేనని ఆలోచించి, అక్కడినుంచే నా స్వగ్రామానికి వెళ్లి 8-10 రోజులుండి, అక్కడి నుంచే శివసాగర్‌కు వెళ్లాను. అక్కడికి వెళ్లిన తరువాత అంతకు ముందు స్వామివారు చెప్పినట్లు పూర్వజన్మలో నా స్వగ్రామం శివసాగర్ అని జ్ఞాపకం వచ్చింది. వారు చెప్పిన ప్రకారం పూర్వజన్మలోనే ఉండిన నా ఇంటిని వెదకి, ఆ కాలంలో నేను రెండో అంతస్తులో వ్రాసిన మూడు శ్లోకాలూ చూడాలని ఆ ఇంటికి వెళ్లాను. కాని అక్కడ ఉన్న గృహస్థును అడిగే సాహసం చెయ్యలేక తిరిగి వచ్చేశాను.

ఒక సంవత్సరం తరువాత నాకు శివసాగర్ నుండి ఘోలోఘాట్‌కు స్థానచలనం కలిగింది. 3,4 నెలల తరువాత ఒక యువకుడు ఓవర్సీర్ పదవిలో అక్కడికే వచ్చి చేరాడు. మేమిద్దరమూ ఒకే ఇంటిలో ఉండటంవలన, మాకు స్నేహం పెరిగింది. మేము కలసిన 3 నెలలలోపలే, ఆ యువకుని వివాహం, నా పూర్వజన్మ వృత్తాంతానికి సంబంధించిన శివసాగర్‌లోని గృహంలోనే జరిగింది. కాని వివాహా నంతరము ఒక సంవత్సరంలోనే ఉత్తరప్రదేశ్‌లోని సాగర్ జిల్లాకు ఆ యువకునికి బదిలీ అయింది. దానితో నా ఆశ నిరాశగానే మిగిలిపోయింది. అప్పుడు నన్ను నేను పరిచయం చేసుకొంటూ ఆ యువకుని మామగారికి ఒక ఉత్తరము వ్రాశాను. అదిచూసి ఆయన నన్ను తమ అల్లునికి దగ్గరి స్నేహితుడని భావించాడు 4,5 ఉత్తరములు వ్రాసిన తరువాత మీ ఇంటి రెండవ అంతస్తులోని దక్షిణ ద్వారమున్న గదిలో మూడు సంస్కృత శ్లోకాలు వ్రాయబడి ఉన్నాయని, మూడు శ్లోకాలు వ్రాసిపంపితే దానికి నేను ఎంతో కృతజ్ఞుడినై ఉంటానని, ఇంటికి తిరిగి వెళ్లేటప్పుడు మిమ్మల్ని కలిసి వెళ్తానని ఉత్తరం వ్రాశాను. అందుకు సమాధానంగా నా స్నేహితుని మామగారు తిరుగు టపాలో ఆ మూడు శ్లోకాలను వ్రాసి పంపుతూ, ముంగేరుకు వేళ్లేటప్పుడు తప్పక కలిసివెళ్లమని ప్రార్థిస్తూ జాబు వ్రాశారు. ఆ మూడు శ్లోకాలు ఇవి.

1. వాసాంసి జీర్ణాని యథా విహాయ
నవాని గృహ్ణాతి నరోపరాణి ।
తథా శరీరాణి విహాయ జీర్ణం
అన్యాని సంయాతి నవాని దేహీ ॥ – భగవద్గీత

2. రుచీనాం వైచిత్ర్యా దృజు కుటిల నానాపథ జుషామ్ ।
నృణా మేకో గమ్య స్త్వమసి పయసా మర్ణవ మివ ॥
– పుష్పదంతుని శివమహిమ్నస్తోత్రమ్

3. నిర్మస్య ప్రమేయస్య నిష్కళస్య శరీరిణః ।
సాధకానాం హితార్థాయ బ్రహ్మణో రూప కల్పనా ॥ –స్మృతి

వాటి తాత్పర్యాలు :

1. మానవులు జీర్ణవస్త్రాన్ని త్యజించి నూతన వస్త్రాన్ని ధరించునట్లుగా, దేహధారణ చేయు జీవుడు కూడ జీర్ణ శరీరమును త్యజించి నూతన శరీరాన్ని స్వీకరిస్తాడు.

2. అనేక మార్గాలగుండా ప్రవహించిన నదులన్నీ సముద్రంలోనే లీనమై నట్లుగా, ఉపాసనామార్గాలు వేరు వేరైనప్పటికీ చివరకు బ్రహ్మత్వాన్ని పొందటమే మానవుల అంతిమలక్ష్యం.

3. బ్రహ్మ నిరహంకరణానుశీలుడైనప్పటికీ, నిత్యపరిశుద్ధుడైనప్పటికీ, శరీర రహితుడైనప్పటికీ సాధకుల హితముకొరకు నానా రూపములను ధరించును.

పునర్జన్మను గురించి నాకు కలిగిన సందేహమును నివృత్తి చేయటానికే స్వామి వారు నన్ను నా పూర్వజన్మ ప్రదేశానికి పంపించి, ఆ యువకునితో పరిచయం కల్గించి, పూర్వజన్మలో నేను వ్రాసిన ఆ మూడు శ్లోకాలనూ నాకు తెలియబరిచారు. స్వామివారి అనుగ్రహానికి ఇది ఒక ప్రబల నిదర్శనము.

ఆ తరువాత వంగ సంవత్సరం 1294లో అగ్రహాయన (మార్గశిర) మాసంలో స్వామివారి నుంచి ఒక ఉత్తరం వచ్చింది. అందులో "నేను ఒక నెలతరువాత శరీరమును త్యజిస్తాను. శిష్యులకూ సేవకులకూ వర్తమానం పంపించాను. నీకు

కూడా వర్తమానం పంపుతున్నాను. తప్పక రావలయును. మనవిపత్రం ఇస్తే నీకు తప్పక సెలవు దొరుకుతుంది" అని ఉన్నది. నేను మూడు నెలలు సెలవు కోసం మనవిపత్రం ఇచ్చాను. తొందరగానే నాకు సెలవు లభించింది. నేను ఇంటికి వెళ్లకుండా కాశీధామం చేరుకొన్నాను. అక్కడకు వెళ్లగానే స్వామివారు శరీరమును త్యజించటానికి ఇంకా పదిరోజులే మిగిలి ఉన్నట్లు తెలిసింది. సదానందస్వామి, కాళీచరణ్‌స్వామి, బ్రహ్మానందస్వామి, భోలానాథ్‌స్వామి, మరి ఇద్దరు పరమ హంసలు, మంగళదాస్ ఠాకూర్ అంతా అక్కడే ఉన్నారు. శరీరమును త్యజించటానికి పూర్వము ఒకరోజు ముందువరకూ బాబాగారు మమ్మల్ని పిలిచి వివిధ విషయాలను ఉపదేశించారు. ఆ తరువాత "నేను పడుకొని నిద్రపోతాను. నా పొడవుకు సరిపడే ఒక పెట్టెను చేయించండి. నేను శరీరమును త్యజించగానే నన్ను ఆ పెట్టెలో పడుకోబెట్టి, పైన స్క్రూలు బిగించి, తాళం వెయ్యండి. పంచగంగా ఘాట్‌లో కొంతదూరంలో ఆ పెట్టెను నీటిలో వదిలి పెట్టండి. అంతిమ సంస్కారం చేయవలసిన అవసరం లేదు" అని చెప్పారు. శరీరమును త్యజించటానికి ముందు రోజున రేవులో ఒక నావను అద్దెకు తీసుకోవాలని, శరీరత్యాగము తరువాత ఆ పెట్టెను నావమీద పెట్టి అసీ ఘాట్ నుంచి వరుణా ఘాట్ వరకూ ఒకసారి త్రిప్పి, దానిని ఒక నిశ్చిత స్థానంలో నీటిలో నిక్షేపించవలయునని చెప్పారు. ఏదైనా అడగదలిస్తే నేటి రాత్రివరకే అడగాలి. రేపు మాట్లాడటానికి వీలులేదని చెప్పారు. రాత్రంతా మేము వారివద్దనే కూర్చొనియున్నాము. ఎందరో బ్రహ్మచారులు, పరమహంసలు వారితో మాట్లాడటానికి వచ్చారు. ఎవరికి దేనిపైన జిజ్ఞాస ఉన్నదో వారు దానిని గురించి తెలుసుకొన్నారు. నేను చేతులు జోడించి గురుదేవుని కొన్ని ప్రశ్నలు అడిగాను. "గురుదేవా! నాగతి యేమిటి? అందరి పనులు అయినాయి. నా పని కాలేదు". అని విన్నవించుకొన్నాను. దానికి స్వామివారు "నీవు ఏ ప్రకారం పనిచేస్తున్నావో ఆ ప్రకారమే చెయ్యి. దానిని మధ్యలో విడువవద్దు" అని ఆదేశించారు. తరువాత కాళీచరణ్ స్వామిని పిలిచి "ఇతనిని నీవు ఎప్పుడూ కనిపెట్టుకొని ఉండాలి. ఏ పరిస్థితులలోనూ ఇతనిని విడిచి పెట్టకూడదు. అవసరమైతే అప్పుడప్పుడు అతని ఇంటికి వెళ్లి అతను ప్రగతిని సాధించేటట్లు చూడాలి. అతని విముక్తి భారం మీమీదనే ఉన్నది.". అని చెప్పారు.

మహాత్మా త్రైలింగస్వామి శరీరమును త్యజిస్తారని తెలిసి కాశీలో అంతా కలవరం మొదలైంది. అందరూ ఆ విషయాన్నే చర్చించసాగారు. ఆ అపూర్వ సంఘటనను చూడాలని అందరూ కుతూహలపడసాగారు. రెండవ రోజున పెట్టె, పరుపు, దిండు, దుప్పటి మొదలైనవన్నీ సిద్ధం చేయబడినాయి. ఒక నావను కూడా అద్దెకు తీసుకొన్నారు. ఆ రోజున 8, 9 గంటలకు స్వామివారు తన గద్దెకు సమీపంలో ఉన్న గదిలో ప్రవేశించి, ఆసనంపైన కూర్చొన్నారు. ఆగది ద్వారాల నన్నింటినీ మూసివేయమని, తలుపుతట్టిన శబ్దం వచ్చేవరకూ తెరవవద్దని ఆదేశించి, స్వామివారు సమాధిస్థితిని పొందారు. తలుపులన్నీ మూసివేసి మేము జాగ్రత్తగా చూస్తూ కూర్చొన్నాము. మూడు గంటలకు తలుపుతట్టిన శబ్దం అయింది. అప్పుడు తలుపులు తెరిచాము. స్వామివారు బయటకు వచ్చి పెట్టెను తెరువమని ఆజ్ఞాపించారు. అందులో వారు యోగముద్రలో స్థిరంగా ఆసీనులయ్యారు. ఆ విధంగా క్రీ.శ. 1887కు సరియైన వంగీయ సంవత్సరం 1294లో పుష్యశుక్ల ఏకాదశినాడు సాయం సమయం అవుతుండగా శ్రీ త్రైలింగస్వామివారు దేహత్యాగం చేశారు. అప్పటికి వారి వయస్సు 280 సంవత్సరాలు. మేమందరం కలిసివారిని పెట్టెలో పడుకోబెట్టి, స్క్రూలు బిగించి, తాళం వేశాము. ఆ తరువాత పంచగంగా ఘాట్ వద్ద నావపైకి ఎక్కించి, ఆసీఘాట్‌నుంచి వరుణా ఘాట్ వరకూ ఊరేగించాము. నావ కదలగానే ఎంతోమంది స్వామివారి భక్తులు కూడా నావ మీదికి ఎక్కారు. పర్వదినాలలో గంగాస్నానానికి గుమికూడినట్లు అన్ని ఘాట్‌లలోను జనం గుమికూడారు. సాయంకాలం నిర్ణీత సమయంలో పెట్టెను గంగానదిలో పంచగంగాఘాట్‌లో వదిలిపెట్టాము. పెట్టె మునిగిపోయింది. దానితో నా ఆశలన్నీ కూడా మునిగిపోయాయి. నా హృదయం విదీర్ణమయింది. నా బలము, బుద్ధి, ఆశయములు అన్నీ పోగొట్టుకున్నట్లు భావన కలిగింది.

మహాత్మా త్రైలింగస్వామివారు ఎప్పుడూ మానవ కల్యాణాన్నే కోరేవారు. ఎవరైనా వారివద్దకు వచ్చి ఏదో అడగవలెనని వస్తే, వారు ప్రశ్నించకముందే దానికి తగిన సమాధానం చెప్పేవారు. హిందూధర్మము యొక్క అంతిమఫలం ఆత్మతత్త్వ పరిజ్ఞానము, బ్రహ్మజ్ఞాన ప్రాప్తి. వాటిని పొందకపోవటం వల్లనే ఆధునిక హిందువులు తమ ధర్మం మీద విశ్వాసాన్ని చూపలేక పోతున్నారు. శ్రీ త్రైలింగ స్వామివారు సాధనవలన ఆ సిద్ధిని సాధించారు. వారు "మీరు నిరాశాజీవులు

కావద్దు. శాస్త్రంలో దేనిని చరమస్థితి అని చెప్పినారో, గట్టి ప్రయత్నంవలన మీరు కూడా దానిని పొందటానికి అర్హులవుతారు" అని ప్రబోధించేవారు. అట్టి స్థితిని సాధించిన శ్రీ స్వామివారి దైవీశక్తులను, అలౌకిక కార్యకలాపములను చూసిన జనమంతా స్వామివారిని కదిలే దైవంగా భావించారు.

ప్రపంచంలో ఎవరు దేనికి తగినవారో వారికి అలాంటి ప్రణాళికను సిద్ధం చేసి దానికి తగిన తత్త్వజ్ఞానబోధ చెయ్యటానికి స్వామివారు స్వయంగా దేవతా మూర్తులను ప్రతిష్టించారు. జీవుడు తన మనస్సు యొక్క ధారణాశక్తిని అనుసరించి భగవంతుని శక్తిని తెలుసుకోగలుగుతాడు. త్రైలింగస్వామివారు హిందూ బ్రాహ్మణులు. హైందవాచార కర్మల ద్వారానే పవిత్ర జీవనాన్ని వారు అలవరుచు కొని, హిందూ ధర్మం యొక్క మహోత్కృష్టతను వారు చాటి చూపించారు. ఇతర మతాలలోని గుణదోషాలను వారు విమర్శించలేదు. వేరే మతాలను ద్వేషంతో చూడలేదు. శాంతస్వభావంతో హిందూ ధర్మసేవ చేశారు. ఆ విషయం వారి జీవన విధానాన్ని బట్టే వ్యక్తమవుతుంది. అత్యంత శక్తిమంతులైనా అన్ని విషయాలలోనూ పరమశాంతంగా ఉండేవారు. మానావమానాలను సమానంగా ఎంచేవారు. అందువలన వారిలో హింస- ద్వేషం వంటివి ఏ మాత్రం ఉండేవికావు. కనుక మానవుడు వారిని అనుసరిస్తే మానవోత్తముడు కాగలుగుతాడు.

భారతవాసులైన ఓ హిందూసంతతి జనులారా! మహాత్మా త్రైలింగస్వామివారి జీవితమును ఒకసారి పరీక్షించండి. నిస్స్వార్థభావంతో వారు ముక్తి సాధనమును వెదికి ఏ విధంగా ముక్తులయ్యారో పరిశీలించండి. అందరి ఉపాస్య దైవములకూ ఆ పరబ్రహ్మకూ మధ్యన తేడా లేదని వారు భావించారు. అందుకు కారణం భగవంతుడు ఒక్కడే! సహజ జ్ఞానంతోను, సంతుష్ట చిత్తంతోను భగవంతుని ఉపాసించేవారు ఎవరైనా సరే దివ్య జ్ఞానానుభూతిని పొందగలుగుతారు. దానికి విరుద్ధమైన మతాన్ని అవలంబించి వేరు వేరు దేవతలను ఉపాసిస్తే, ఎవరికీ ఆ దివ్యజ్ఞానం లభించదు.

మహాత్మా త్రైలింగస్వామి తమ సుఖదుఃఖాలను గురించి ఎలాంటి శ్రద్ధా తీసుకోలేదు. ఎందుచేతనంటే ఈ రెండు ప్రవృత్తులకూ ఎలాంటి సత్తాలేదు. ఏ ఒక్కటీ పరిపూర్ణమైనది కాదు. వారు తత్త్వజ్ఞానం పొందిన తరువాత వారి మనస్సులో పరమానంద భరితమైన బ్రహ్మదర్శన సౌఖ్యమును పొందారు. వారు

ప్రపంచాన్ని బ్రహ్మమయంగానే చూసేవారు. దుఃఖమనే పేరుగలది ఏదీ లేదు. వారు జీవన్ముక్తులై ఒకే భావంతో జీవితమంతా గడిపారు. సుదీర్ఘమైన 280 సంవత్సరాల వయస్సులో కూడా వారు ఎప్పుడూ బాధను అనుభవించలేదు. ఆ వయస్సులోనూ వారు సుఖదుఃఖాలను రెంటినీ ఒకే నాణానికి బొమ్మ - బొరుసు లాంటివిగా భావించేవారు. ఆ విధంగా వారు జీవన్ముక్తిని సాధించారు. భగవంతుని చేరటానికి భక్తియే వాస్తవమైన మూలపదార్థము. అదే మొదటి ప్రణాళిక. శారీరక-మానసిక-ఆత్మ ప్రవృత్తులపైనే జీవితము ఆధారపడి ఉన్నది. ఈ మూడింటి వికాసమే వాస్తవమైన భగవద్భావము. ఆ భావాన్ని వికసింపజేయటానికి తోడ్పడేది భక్తియే! వాస్తవానికి భక్తివలననే నిర్భరత కలుగుతుంది. సంపూర్ణ నిర్భరశీలమునుంచే బ్రహ్మజ్ఞానం కలుగుతుంది. నిష్కామజ్ఞానమే భగవత్ప్రాప్తి. మనస్సుయొక్క స్థూలభావం నుంచి భగవంతుని స్థూలభావమును, మనస్సు యొక్క సూక్ష్మభావం నుంచి భగవంతుని సూక్ష్మభావమును, మనోలయం వలన ఈశ్వర ప్రాప్తిని పొందవచ్చును. మనస్సును బుద్ధితో పరీక్షిస్తూ ఎవరూ నిరాకార నిర్గుణ రూపాన్ని ధరించలేరు. భావవికాసమువలన భావమయుడైన భగవంతుని వివిధ రూపాలు కూడా వికసిస్తాయి. భావం యొక్క ఘనీభూతస్థితినుంచి మూర్తి ప్రకాశిస్తుంది. ఎవరు మనస్సుతో విశుద్ధసత్తాను, సరళభావాన్నీ పొంది తమ ఆధీనంలో ఉంచుకొంటారో వారు మాత్రమే భక్తి - ప్రేమలతో భగవంతుని దర్శించి కృతార్థులవుతారు.

శ్రీ త్రైలింగస్వామివారు ఉపదేశ సమయాలలో శ్రీ ఉమాచరణ్ గారికి గంభీరమైన తరువాతి ప్రకరణంలోని పన్నెండు విషయాలను వివరించారు.

❀❀❀❀❀

మహాత్మా శ్రీ త్రైలింగస్వామి

జీవితము - ఉపదేశములు

ద్వితీయ భాగము

1. గురుశిష్యులు

గురువు అని ఎవరిని అంటారు? ఆయన ఆవశ్యకత ఏమిటి? 'గురు'శబ్దానికి 'గ' అంటే గతిప్రదాత అని, 'ర' అంటే సిద్ధిప్రదాత అని 'ఉ' అంటే అన్నీ చేయగల వాడని అర్థము. అందువలన ఈశ్వరుడు ఒక్కడే గురువని చెప్పబడతాడు. ఎందుకంటే ఆయన తప్ప జీవితానికి గతి – ముక్తులను ఇచ్చేవారు ఎవ్వరూ లేరు. అయితే గతి ముక్తులకు మార్గదర్శకత్వం చేసేవారిని కూడా గురువని చెప్పవచ్చును. అందువలన ఈశ్వరునికీ – గురువుకీ అసలు తేడా లేదని చెప్పవచ్చును. ఆ కారణంగానే గురువును సాకారమైన ఈశ్వరుడని చెప్పవచ్చును. కొందరు 'గు' శబ్దానికి అంధకారమని, 'రు' శబ్దానికి దానిని నివారించేవాడని, కనుక – అజ్ఞాన రూపమైన అంధకారాన్ని పోగొట్టేవారిని గురువు అనవచ్చని అంటారు. అందువలన గురువును ఎప్పుడూ సామాన్య మనిషిగా భావించకూడదు. గురువుదగ్గర ఉన్నప్పుడు ఏ దేవతను పూజించకూడదు. ఒకేవళ ఎవరన్నా చేసినా అది విఫల మవుతుంది. గురువే కర్త. గురువే విధాత. గురువు సంతుష్టుడైతే దేవతలంతా సంతుష్టులవుతారు. 'గురు' అనే అక్షరద్వయం ఎవరి నాలుక చివర ఉంటుందో, ఆయనకు శాస్త్రాధ్యయనం చెయ్యవలసిన అవసరం కూడా లేదు. 'గ' వర్ణోచ్చారణచేత మహాపాపములు నశించి పోతాయి. 'ఉ' వర్ణోచ్చారణచేత ఈజన్మలో చేసిన పాపాలు నశించిపోతాయి. 'రు' వర్ణోచ్చారణచేత పూర్వజన్మలో చేసిన పాపాలు కూడా నశించిపోతాయి. గురువే తల్లి, గురువే తండ్రి, గురువే గతిప్రదాత. ఒకవేళ ఈశ్వరునికి కోపం వచ్చినా గురువు రక్షించగలుగుతాడు. కాని, గురువుకే కోపం వస్తే ఎవరూ ఉద్ధరించలేరు. జగత్తులో గురువును మించిన శ్రేష్ఠవస్తువు మరొకటి లేదు. జపము, తపము, అర్చన, శాస్త్రము, మంత్రము మొదలైనవి ఏమీ గురువుకన్న గొప్పవి కావు. గురువుయొక్క మూర్తిని ధ్యానిస్తూ ఆయన తత్త్వాన్ని ఎప్పుడూ జపించేవారికి కాశీవాసఫలం లభిస్తుంది. గురువే తారకబ్రహ్మము.

గురుప్రణామ మంత్రభావార్థాన్ని హృదయంలో నిలుపుకోవాలి. లేకపోతే కేవల ఉచ్చారణ వలన ఏమీ ఫలము లభించదు. భక్తిభావంతో చేసిన పనులకే ఫలం లభిస్తుంది.

1. గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః ।
గురురేవ పరంబ్రహ్మ తస్మై శ్రీగురవే నమః॥

2. అఖండ మండలాకారం వ్యాప్తం యేన చరాచరమ్।
తత్పదం దర్శితం యేన తస్మై శ్రీగురవే నమః॥

3. అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజన శలాకయా ।
చక్షురున్మీలితం యేన తస్మై శ్రీగురవే నమః॥

1) గురువే బ్రహ్మ, గురువే విష్ణువు, గురువే దేవాధిదేవుడైన మహేశ్వరుడు, గురువే పరంబ్రహ్మ, అలాంటి గురువుకు నమస్కారము.

2) ఈ సమస్త బ్రహ్మాండము ఎవరి ఆకారమో, ఎవరు ఈ చరాచర జగత్తంతా వ్యాపించి యున్నారో, ఎవరు బ్రహ్మపదమును దర్శింపచేస్తారో, అలాంటి గురువుకు నమస్కారము.

3) అజ్ఞానాంధకారంలో ఉన్న గ్రుడ్డివారికి, జ్ఞానమనే అంజనశలాకచేత ఎవరు దృష్టిని ప్రసాదిస్తారో, అలాంటి గురువుకు నమస్కారము.

గురువులు రెండు రకాలుగా ఉంటారు. శిక్షాగురువు, దీక్షాగురువు అని. గురూపదేశం లేనిదే సామాన్యమైన వృక్షలతాదుల పరిచయం కూడా చక్కగా కలుగదు. మనస్సు, బుద్ధి, చిత్తము, ఇంద్రియములు మొదలైనవన్నీ ఏదో ఒక ప్రబలమైన శక్తిద్వారా ప్రేరేపింపబడనిదే, ఏ పనీ చేయలేవు. ఏ శక్తి ద్వారా ఆత్మ ఔన్నత్యాన్ని పొందుతుందో, మనము ముక్తిమార్గంలో ముందు ఉండగలుగుతామో, ఆ శక్తే మనకు గురువు. ఏపని అయినా రెండు శక్తుల మధ్య పరస్పర ఘర్షణ లేకుండా జరగదు. అంతేకాక, ఆరెండు శక్తులలో ఏది ప్రబలమై ఉంటుందో అదే రెండవదానికి గురువు అవుతుంది. చంద్రుడు సూర్యుడు, గ్రహములు, నక్షత్రముల మొదలైనవి ఏ శక్తుల యొక్క సైగల వలన తమ తమ పనులను నిరంతరంగా చేసుకొంటున్నాయో ఆ శక్తే జగద్గురువు. అలాంటి జగద్గురువును తెలుసుకోటానికి జీవుని మనస్సు - ప్రాణములు తపన చెందినప్పుడు, తత్త్వజ్ఞానోపదేశము చేసి, జీవుని మార్గాన్ని చక్కగా సుగమం చేయగలిగిన వారిని దీక్షాగురువు అంటారు. మాయాజాల స్వరూపమైన ఈ బ్రహ్మాండములో పరమాణువు నుండి అనంతమైన విశ్వం వరకూ గల అంతరంగ బహిరంగ విషయాల తత్త్వాన్ని బోధించే వారిని

శిక్షాగురువు అంటారు. వృక్షములు, లతలు, పశువులు, పక్షులు మొదలైనవన్నీ ఎంత సమయంలో ఎంత బోధిస్తాయనేది అందరికీ తెలిసిన విషయమే. తెలుసుకోవాలనే తపనతో ఎక్కడికి వెళ్లినా అక్కడ నేర్చుకోవలసినది ఏదో ఒకటి కన్పిస్తుంది. శిక్షణ వలన జీవికి పరమాత్మ దర్శనం కలగటంలో సహాయం లభిస్తుంది. సూక్ష్మతత్త్వ ప్రాప్తికి శిక్షణ మొదటి గురువు; దీక్ష రెండవ మెట్టు. శిక్షణ దీక్షకు అనుకూలంగా ఉండాలి. శిక్షణ విధివిధానంగా లేకపోతే ఫలవంతంకాదు. అందువలన శిక్షణ నివ్వటానికి సుశిక్షితుడు, దీక్షితుడు అయిన సద్గురువు తప్పక కావాలి. శిక్షణ - దీక్షల తత్త్వములు వేరువేరని భావించేవారు శిష్యుని చక్కగా సుశిక్షితుని చెయ్యలేరు. శైశవము యౌవనమునకు, యౌవనము ముసలితనమునకు పూర్వావస్థలైనట్లుగా, శిక్షణ దీక్షకు పూర్వావస్థ అవుతుంది. దీక్ష ద్వారా సంశయనాశము, యథార్థజ్ఞానము, దివ్యదృష్టి కలుగుతాయి. దీక్ష ద్వారా జీవుడు పరమారాధ్యయైన పరదేవతను దర్శించి కృతార్థుడవుతాడు. శిక్షణ- దీక్షలు ఇవ్వటానికి యోగ్యుడైనగురువునకు తప్ప మరెవ్వరికీ అధికారం లేదు.

గురువనగానే సామాన్యంగా దీక్షాగురువని లోకులు భావిస్తారు. కాని గురువు అనగానే జగత్తుకన్న ఉన్నతమైన లోకం అని తెలియాలి. మనలాంటి మనిషే అనటానికి భయం కలగాలి. వారితోపాటు ఏకాసనం మీద కూర్చోటం కాని, కూర్చునే సాహసం కాని చేయరాదు. వారి మాటలు వేదవాణి. వారి పాదోదకం అమృతము. వారి ఆజ్ఞ శిరోధార్యము. వారి దర్శనం వలన జీవితం సఫలమవు తుంది. అపారమైన ఈ సంసార సాగరాన్ని తరించటానికి గురువు విలక్షణమైన కర్ణధారి. అలాంటి పవిత్రమైన దీక్షాగురుపదంలో ఎవరిని ఎన్నుకోవాలి? మన దేశంలో ఇవాళ రేపు గురువులని ఎవరు చెలామణి అవుతున్నారో, గురుదక్షిణే ఎవరి ధ్యేయమో, అలాంటి వారిని సద్గురువులు అనేసాహసం చెయ్యకూడదు. కులగురువును త్యజించటమూ చెయ్యకూడదు. ఇలాంటి సంస్కారము మన దేశంలోని చాలా మంది గురువులను దుర్దశకు పాలుచేసింది. అయితే వారిలో ఒకరిద్దరు మంచి గురువులు ఉండవచ్చును. వారిని అందరూ భక్తిశ్రద్ధలతో ఆదరిస్తారు. కాని అశిక్షితులు, అసచ్చరిత్రులు, సాధనారహితులు అయిన గురువులకు దీక్షనిచ్చే అధికారం ఎక్కడిది? తాను అంధుడైనవాడు, ఇతరుల కండ్లు తెరిపించటానికి బదులు భయంకరమైన శలాకతో శిష్యుల కళ్లనే పోగొట్టుతాడు.

అలాంటి గురువులకు చరాచరవ్యాపి, అఖండమండలాకారుడైన పరమపురుషుని దర్శింపజేసే శక్తి ఉండదు కదా! తాను ముందుగా దర్శించనివాడు ఇతరులకు ఏమి దర్శింపజేస్తాడు? అలాంటివారు కేవలం సద్గురుప్రభువులు మాత్రమే!

పిత్రార్జితమైన వనములు -భూములు - గృహములు - సంపదలలాగా ఆ గురువులు కూడా శిష్యుల ఇళ్ళలో కూర్చొని అధికారం చెలాయిస్తూ ఉంటారు. దీక్ష ఇవ్వటం తమాషాకాదని వారు ఒక్కసారి కూడా ఆలోచించరు. శిష్యుని సంసారసాగరాన్ని తరింపజేసే గురుతర బాధ్యత వారిమీద ఉన్నది. అలాంటి తమ శిష్యుల బాధ్యతను గురించి భగవంతునికి సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుంది. ఏమీ తెలియని అలాంటి గురువులు మండే నిప్పులలో ఎందుకు చెయ్యి పెడుతున్నారో తెలియదు. హిందువులై ఉండి, శాస్త్రములను నమ్ముతూ వారు అలాంటి భయంకరమైన పనులు ఎందుకు చేస్తున్నారో చెప్పలేము. గురువు లక్షణమేమిటో ముందు వారు తెలుసుకొని, దీక్ష ఇవ్వటానికి అర్హత ఉంటే దీక్ష ఇవ్వవచ్చును. సకల శాస్త్రములను తెలిసినవాడు, కార్యదక్షుడు, శాస్త్ర రహస్యాలు తెలిసిన వాడు, చక్కగా మాట్లాడేవాడు, వికలాంగములు లేనివాడు, దర్శన మాత్రం చేతనే శుభాలను కలిగించేవాడు, జితేంద్రియుడు, బ్రాహ్మణుడు, శాంతచిత్తుడు, మాతాపితరుల హితము కోరేవాడు, ఆశ్రమ స్వీకారం చేసినవాడు, దేశీయుడు - ఇలాంటి లక్షణాలు కలిగిన పురుషుని గురువుగా స్వీకరించాలి. ఇలాంటి గుణవంతుడైన గురువు శిష్యునికి దీక్షనిస్తే గురుశిష్యులిద్దరికీ శుభం కలుగుతుంది. ఈ రోజులలో గురుత్వం అనేవి ఉద్యోగము, వ్యవసాయములలాగా ధనార్జనకు మార్గమైంది. కర్మదోషం వలన గురుపదమును కలుషితం చేస్తున్నారు. శిష్యుని ఉద్ధరించకపోతే గురువు మహాపాపపంకిలంలో పడిపోతాడు.

మంత్రదీక్ష ఇవ్వటానికి పూర్వం గురుశిష్యులిద్దరూ కనీసం ఆరు నెలల నుంచి ఒక సంవత్సరం దాకా ఒక చోట కలిసి ఉండాలి. ప్రీతికరమైన ప్రయోజనకరమైన బోధ చేసిన గురువును జ్ఞానభిక్ష ప్రసాదించమని కోరాలి. అప్పుడు గురువు దయ తలచి శిష్యునికి భవబంధాల నుంచి ముక్తుడు కాగలిగిన ఉపాయమును, తత్త్వ జ్ఞానమును ఉపదేశించి, దీక్షనివ్వాలి. చాలా సమయాలలో శిష్యుని సమ్మతి లేకుండానే గురువులు బలవంతంగా దీక్షనిస్తున్నారు. అట్లా చెయ్యటం మహా పాపము. అడగకముందే దీక్షనిస్తాననటం ధనలోభమే అవుతుంది. శిష్యుడు చేతులు

జోడించి ప్రార్థించనంత వరకూ సద్గురువు దీక్షనివ్వకూడదు. శిష్యుడు మంత్రజపం చేస్తున్నాడా, లేదా? సాధనలో ఎలాంటి విఘ్నాలైనా, వస్తున్నాయా, లేదా? శిష్యుడు ఎంత ఉన్నతిని సాధించాడు? ఇలాంటివన్నీ తెలుసుకోవలసిన అవసరం గురువుకు ఉన్నది. కాని ఈనాటి గురువులు పొరపాటున కూడా ఇలాంటి విషయాలు అడగరు. కాని శిష్యునికి ఎంత జీతం వస్తుంది? ఆపైన ఇంకేమైనా సంపాదిస్తు న్నాడా, లేదా? ఇలాంటి విషయాలు అడగటం మాత్రం మర్చిపోరు. అందువలన ఈ రోజులలో చదువుకొన్నవారు కులగురువు నుంచి దీక్షను తీసుకోకూడదు. యోగ్యుడైన గురువులభించినప్పుడే దీక్షాప్రయత్నం చెయ్యాలి.

సరియైన మార్గాన్ని చూపించే శక్తి మంచి గురువులకు తప్ప మరెవ్వరికి లేదు. క్షేత్రము - అంటే మానవ శరీరము - అందరికీ ఒకే విధంగా ఉండదు. అందువలన ఒకే రకమైన బీజమనే మంత్రాన్ని అందరికీ ఇవ్వటం కుదరదు. మహా పురుషులు తప్ప అలాంటి పని ఎవ్వరూ చెయ్యలేరు. పరంపరగా వచ్చే కుల గురువుల నుంచి మనకేదో లభిస్తుందన్న నమ్మకం కాని ఆశకాని ఎవ్వరికీ లేదు. ఎందుకంటే ఏ మార్గంలో నడవాలో వారికే తెలియదు. గ్రుడ్డివాడు గ్రుడ్డివారికి దారి చూపలేడు కదా! ఒకే ఇంటిలోని వారిలో ఒకడు సన్మార్గుడు, ఒకడు దుర్మార్గుడు, ఒకడు ధార్మికుడు, ఒకడు అధార్మికుడు, ఒకడు నాస్తికుడు, ఒకడు పండితుడు కావటం సర్వసామాన్యంగా కన్పించేదే! కాని కులగురువు మాత్రం ఎప్పుడూ అందరికీ ఒకే ఇష్టదేవతను, ఒకే బీజాక్షరాలతో కూడిన మంత్రాన్ని (కేవలం అక్షరాలను మాత్రం కొంచెం ఇటు అటూ మారుస్తారు) ఇస్తూ ఉంటారు. ఆ మంత్రం వలన శిష్యునికి శుభం జరిగినా, అశుభం జరిగినా, దాని బాధ్యత ఆయనకు పట్టదు. గురువంటే ఏమిటో అతనికే తెలియదు. శిష్యునికి దీక్ష ఇచ్చినందుకు తనకు ప్రతిఫలం లభించటమే అతనికి కావలసింది. దీక్ష తీసుకొన్న శిష్యుడు దానివలన ఏమి ఉపకారాన్ని పొందాడు అని అడిగితే భయభ్రాంతు డవుతాడు. ఒకవేళ శిష్యుడే ఆ విషయాన్ని గురించి అడిగితే ధర్మోపార్జన అనేది ఒక జన్మలో జరిగేది కాదని, దానికి జన్మ-జన్మాంతరాలు పడుతుందని చెబుతారు. ఇలాంటి మాటలు పూర్వజన్మలోను విన్నాము. ఈ జన్మలోనూ వింటున్నాము. ఈ విధంగా జన్మలు గడిచి పోతున్నాయి; కాని ఆ జన్మలో ఎట్లా ఉండింది, లేదా ఆ జన్మలోలేక ఈ జన్మలోనే ఉన్నది అనే చెప్పే యోగ్యత కూడా ఎవరికీ లేదు. అయినా వారు మాత్రం గురువు అని అనిపించుకోవాలని అభిమానపడుతూ ఉంటారు.

కాల్చిన గింజను పాతిపెడితే అది మొక్క మొలవదు కదా! అలాగే బీజాక్షరాలను సరిగ్గా చూడక దీక్షనివ్వరాదు. బీజాక్షరాలను సరిగ్గా చూసే శక్తి సద్గురువుకు తప్ప ఎవ్వరికీ ఉండదు. సద్గురువు సామాన్యంగా లభించడు. అట్లాగే దీక్ష తీసుకోటం కూడా సామాన్యమైన విషయంకాదు. కనుక అన్నీ చక్కగా కుదిరినప్పుడే దీక్ష తీసుకోవడం మంచిది. యోగ్యుడైన గురువు లభించకపోవటం వలన ఇలాంటి దుర్దశకలుగుతున్నది. కొన్ని సందర్భాలలో చిన్న వయస్సు బాలురు, లేదా కొందరు స్త్రీలు కూడా దీక్ష ఇస్తున్నారు. దీక్ష ఇవ్వటం ఎంత కష్టమో వీరిలో ఎవ్వరికీ తెలియనే తెలియదు. ఇలాంటి గురువుల వద్ద దీక్ష తీసుకొనే వారికి దీక్ష ఎందుకోసం తీసుకోవాలో కూడా తెలియదు. పూర్వకాలంలో యోగ్యులైన శిష్యులు చాలా మంది లభించేవారు; అందువలన సద్గురువులు కూడా లభించేవారు. భగవంతునిలో ఐక్యం చెందాలని ప్రాణి నిజంగా వ్యాకులపడి రోదిస్తే, భగవంతుడే స్వయంగా సహాయపడి సద్గురువుతో కలుపుతాడు.

సద్గురువు బజారులోనో, త్రోవలోనో, ఘాట్‌లలోనో, లేదా దగ్గరలోనే దొరకడు. భగవంతుని కలవటానికి ఎవరు పిచ్చివాళ్లయిపోతారో, ఆయనను పొందటానికి ఎవరు విరహవేదన పడతారో, ఆయన దర్శనానికి ఎవరిలో ఎక్కువ ఉబలాటం ఉంటుందో, ఆ భగవంతుడు లభించకపోతే ఏదీ చక్కగా అనిపించదో – అప్పుడు ఆ భగవంతుని దయవలననే సద్గురు దర్శనమవుతుంది. సత్–శిష్యుడు కాకపోతే సద్గురువు దొరకడు. ఎలాంటి శిష్యునికి అలాంటి గురువు లభిస్తాడు. ఒకవేళ శిష్యుడు గురువుపట్ల ఎక్కువ శ్రద్ధాళువు అయినప్పుడు, ఆ దీక్ష తీసుకొన్న మంత్రం మీదను భగవంతుని మీదను భక్తి విశ్వాసములతో ఉంటే, అప్పుడు అతని గురువు పరిపక్వతలేని వాడైనప్పటికీ, శిష్యుడు దీక్షకు అధికారి కాగలుగుతాడు. అందులో ఎలాంటి సందేహమూ లేదు.

పైన చెప్పిన లక్షణాలు కల శిష్యుడు జాగ్రత్తగా పరిశీలించి యోగ్యుడైన వ్యక్తిని గురువుగా ఎన్నుకొన్నట్లే, గురువు కూడా శిష్యుని స్వభావాన్ని తెలుసుకోకుండా అతనిని శిష్యుడుగా స్వీకరించరాదు. శిష్యుడు – పుణ్యాత్ముడు, ధార్మికుడు, విశుద్ధాంతఃకరణుడు, గురుభక్తి పరాయణుడు, జితేంద్రియుడు, దాన–ధ్యాన పరాయణుడు, ధీరస్వభావుడు కాకపోతే గురువు అతనికి దీక్షనివ్వకూడదు. సోమరి, మలినవేషధారి, డాంభికుడు, కృపణుడు, దరిద్రుడు అంటే డబ్బును ఉచిత రీతిని

ఖర్చు పెట్టనివాడు, రోగి, అసంతుష్ట చిత్తుడు, కోపి, లోభి, పరుషవాక్కు గలవాడు, అన్యాయంగా ధనార్జన చేసి ధనవంతుడైన వాడు, పరస్త్రీలోలుడు, ఆచార భ్రష్టుడు, ఇతరులకు నష్టం కలిగించేవాడు, తిండిపోతు దురాత్ముడు, గురునింద చేసేవాడు, గురునింద వినేవాడు - అయిన పాపిష్టి నరాధములను ఎప్పుడూ శిష్యునిగా స్వీకరించరాదు. మంత్రి చేసిన పాపము రాజును, స్త్రీ చేసిన పాపము భర్తను, శిష్యుడు చేసిన పాపము గురువును తప్పక చుట్టుకుంటుంది.

గురువు శిష్యుని ఇంటికి వచ్చినప్పుడు, శిష్యుడు ముందు నడచి ఆయనను తన ఇంటికి తేవాలి. ఆయన వెళ్లిపోయేటప్పుడు కొంచెందూరం ఆయన వెనుక వెళ్లాలి. ఆయన అనుమతి లేనిదే ఆయనముందు ఏ ఆసనం మీద కూర్చోరాదు. ఆయన ముందు శాస్త్ర వ్యాఖ్య చెయ్యకూడదు. తన గొప్పతనం ప్రదర్శించుకో గూడదు. గురు శిష్యులిద్దరూ ఒకే ప్రాంతం వారైతే, త్రికాలములలోనూ గురువుకూ నమస్కరించాలి. గురుధామము రెండు మైళ్ల దూరంలో ఉంటే ప్రతి నెలలో నాలుగు సార్లు, ఎనిమిది మైళ్లు లేదా అంతకన్న ఎక్కువ దూరంలో ఉంటే నాలుగు నెలలకు ఒకసారి వెళ్లి తప్పక నమస్కారం చెయ్యాలి.

గురువుగారి ఆజ్ఞను తప్పక పాటించాలి. అట్లా చెయ్యకపోతే ధర్మము, కర్మము, జపము, పూజ మొదలైనవన్నీ విఫలమై అధఃపతనం చెందుతాడు. గురువుగారివద్ద ఎప్పుడూ అప్పు తీసుకోటంకాని, క్రయ-విక్రయాలు కాని చెయ్యరాదు. గురు ప్రసాదాన్ని స్వీకరించనివాడికి అడుగడుగునా ఆపదలు వస్తాయి. భక్తి పూర్వకంగా గురు ప్రసాదాన్ని స్వీకరించేవాడి పాపాలన్నీ నశించిపోతాయి.

దీక్ష తీసుకొనే కోరిక ఉంటే ఈక్రింది విషయాలను హృదయపూర్వకంగా పాటించాలి.

1. అసత్యమును పలుకరాదు.
2. ఎవరినీ ఎప్పుడూ హింసించరాదు.
3. అన్ని జీవుల పట్ల సమానమైన దయను కలిగి ఉండాలి.
4. సాధ్యమైనంత వరకూ పరోపకారం చెయ్యాలి.
5. కామాదులను అణచివెయ్యాలి. అంటే తన వశంలో ఉంచుకోవాలి.

6. ఇతరుల వైభవాన్ని చూసి ఈర్ష్యపడరాదు; పైగా ఆనందించాలి.

7. తెలిసి తెలిసి అన్యాయపు పనులు చెయ్యరాదు.

8. వ్యర్థంగాను, అతిగాను మాట్లాడకూడదు.

9. లోభమును, వాసనలను త్యజించాలి.

10. కోరికలను త్యజించి ఉపాసన చెయ్యాలి.

11. సత్పురుషులతో స్నేహం చెయ్యాలి.

12. ఏ ధర్మము పట్ల అశ్రద్ధ చూపరాదు. అన్ని ధర్మములు సమానము. ఎవరికి ఏ ధర్మం మీద విశ్వాసం ఉంటుందో వారికి ఆ ధర్మం వల్లనే ముక్తి లభిస్తుంది. పొరపాటున కూడా ఎప్పుడూ మరొకరి విశ్వాసాన్ని భంగపరిచే పనులు చెయ్యరాదు.

❀ ❀ ❀ ❀ ❀

2. చిత్తశుద్ధి

హిందూ ధర్మము యొక్క సారము చిత్తశుద్ధి, హిందూ ధర్మము పట్ల అనురాగము కలవారు, హిందూ ధర్మ వాస్తవ స్వరూపాన్ని తెలుసుకోవలెనన్న కోరిక గలవారు, ఈ తత్త్వం పట్ల అత్యంత భక్తి శ్రద్ధలను చూపాలి. సాకారపూజ లేదా నిరాకారపూజ, ఈశ్వర వాదము, బహుదేవతా భక్తివాదము, ద్వైతవాదము లేదా అద్వైతవాదము, జ్ఞానవాదము లేదా కర్మవాదము అన్నీ దీనిముందు తీసికట్టే!

చిత్తశుద్ధి ఉంటే అన్ని మతాలు పవిత్రమైనవే! అది లేకపోతే అన్నీ అపవిత్రములే. చిత్తశుద్ధిలేనివారికి ఏ ధర్మమూలేదు. పవిత్రమైన చిత్తముకలవారికి క్రియారూప ధర్మము యొక్క అవశ్యకత లేదు. చిత్తశుద్ధి కేవలము హిందూ ధర్మము యొక్క సారమేకాదు; అది సర్వ ధర్మముల సారము కూడా. ఎవరి చిత్తము పవిత్రమైనదో, అతడు శ్రేష్టుడైన హిందువు; అతడు శ్రేష్ఠుడైన మహమ్మదీయుడు; శ్రేష్టుడైన బౌద్ధుడు. అట్లాగే మిగిలిన ధర్మములవారు కూడా. ఎవరికి చిత్తశుద్ధి లేదో, వారు ఏ ధర్మావలంబులైనా గణనీయులు కారు. కనుక చిత్తశుద్ధి అంటేనే ధర్మము. దాని గొప్పతనమంతా హిందూ ధర్మంలోనే ఉన్నది. కనుక చిత్తశుద్ధి లేనివారిని హిందువులని పిలవరాదు.

చిత్తశుద్ధి అంటే ఏమిటి? ఇది అనేక లక్షణములను బట్టియు, పనులను బట్టియు తెలుస్తుంది. చిత్తశుద్ధి యొక్క మొదటి లక్షణము ఇంద్రియ సంయమనము. ఇంద్రియ సంయమనమంటే ఇంద్రియఛేదమో, ఇంద్రియ నాశమో కాదు. ఇంద్రియములను మన వశంలో ఉంచుకోవటం. అంతేకాని, మనము ఇంద్రియముల అధీనంలో ఉండటంకాదు. అదే ఇంద్రియ సంయమనమంటే! అతిగా భుజించటం ఒకరకమైన ఇంద్రియవశత. అయితే దానిని వశపరచుకోవట మంటే అసలు భోజనం చేయకపోవటం కాదు. లేదా వాయుభక్షణమో లేదా అర్ధాశనమో, లేదా ఏదో కొద్దిగా తిని దినములు గడపటమో కాదు. శరీరము దాని ఆరోగ్య పరిరక్షణ కోసం ఏ ప్రకారమైన ఆహారం ఎంత పరిమాణంలో తీసుకోవాలో అంత తప్పక తీసుకోవాలి. దానివలన ఇంద్రియ సంయమనానికి భంగం కలగదు. ఇంద్రియ నిగ్రహము అంత కఠినమైన పనికాదు. ఏ ఇంద్రియానికీ లోబడక, దానిని మన వశంలో ఉంచుకోవాలి. అందువలన ఉత్తమ ఆహారం తీసుకోవటం

అనుచితంకాదు. అయితే దానిపట్ల ఆసక్తి ఉండరాదు. స్థూలంగా చెప్పాలంటే ఇంద్రియములపట్ల ఆసక్తి చూపకపోవటమే ఇంద్రియ సంయమనము. ఆత్మ రక్షణకు, లేదా ధర్మ రక్షణకు ఇంద్రియముల ఉపయోగము ఎంత అవసరమో, అంతకు మించి ఇంద్రియములను తృప్తిపరచాలని కోరుకోటమే ఇంద్రియ సంయమనం లేకపోవటము. ఆ విధంగా చెయ్యనివాడు ఇంద్రియనిగ్రహం లేని వాడే! ఎవరు ఇంద్రియ తృప్తిని కల్గించే సుఖములను కోరక, కేవలము వాటి ధర్మములను నిర్వహిస్తాడో, అతడు ఇంద్రియ నిగ్రహము కలవాడే అవుతాడు.

ఇంద్రియ సుఖముల నుండి విముఖులై కూడా, మనస్సులోని కలుషాలను తుడిచి వెయ్యలేనివారు ఎందరో ఉన్నారు. జనులు చూస్తారేమో అన్న భయం చేతనో, లేదా జనులలో కీర్తిని పొందటానికో, లేదా ఆధ్యాత్మికోన్నతికో, ధార్మికంగా కనిపించే మాయాజాలం చెయ్యటానికో, వారు జితేంద్రియులలాగా ప్రవర్తిస్తారు. కాని వారికి లోపల ఇంద్రియదాహం ప్రబలంగానే ఉంటుంది. ఆజన్మాంతము వారు స్ఖలితులు కానప్పటికీ, వారు ఇంద్రియ సంయమనానికి దూరంగా ఉన్నవారే! ఇంద్రియ పరితృప్తి కోసం మాటిమాటికీ ప్రయత్నించి సఫలమయ్యేవారికీ, పైవిధంగా చెప్పబడే కుహనా ధర్మాత్ములకూ ఏమీ భేదము లేదు. వారిద్దరూ ఒకే విధంగా ఇహలోకమనే నరకాగ్నిలో దగ్ధం కావలసినవారే! ఇంద్రియసంతృప్తి కలిగినా కలగకపోయినా, ఇంద్రియసంతృప్తి అనే భావన మనస్సులోకి పొరపాటున వచ్చి ధర్మరక్షణ కోసమో ఆత్మతృప్తి కోసమో ఇంద్రియతృప్తి కలిగించవలసివస్తే ఎవరికి సుఖం కంటే దుఃఖమే ఎక్కువ అనిపిస్తుందో, అలాంటివారికి ఇంద్రియ నిగ్రహం కలిగిందని తెలుసుకోవాలి. అదిలేకపోతే యోగము, తపస్సు, ఉపాసన, కఠోర నియమాలు అన్నీ వృథాయే!

కేవలం యోగం వల్లనో తపస్సు వల్లనో ఇంద్రియ నిగ్రహం కలగదు. ఈ సంసారంలోనే ఇంద్రియ సంయమనం కలుగుతుంది. అరణ్యంలో ఉండి, ఇంద్రియ తప్తిని కలిగించే సాధనాలకు దూరంగా ఉండి, అన్ని విషయాల పట్ల నిర్లిప్తంగా ఉండి, ఇంద్రియాలను జయించానని అనుకోవచ్చును. కాని, బాగా కాలని మట్టిపాత్ర స్పర్శమాత్రం చేతనే నిలవలేనట్లే, అలాంటివారి ఇంద్రియ నిగ్రహం కూడా లోభస్పర్శచేత నిలవదు. అందుకు ఎన్నో ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. స్వర్గం నుంచి ఒక అప్సరస దిగి రాగానే ఒక ఋషి మహోదయుని

యోగం భంగం అయింది. అంతే కాక తిరిగి ధైర్యం వహించటానికి ఇంద్రియ తృప్తి కలిగించక తప్పలేదు. ఏ దేశంలో ఏ వస్తువు దొరకదో అక్కడివారు ఆ వస్తువును తినరు; అమ్మరు. దాని భావము త్యాగమని అనకూడదు. ఇంద్రియ తృప్తినిచ్చే పదార్థాలతో ప్రతినిత్యం సంసర్గం కలవాడు, వాటితో యుద్ధం చేసి ఎప్పుడో విజయం పొందితే, అతడు విజయుడనబడతాడు. అదే ఇంద్రియ జయ మనబడుతుంది. పరాశరుడు కాని, విశ్వామిత్రుడు కాని మొదటనే ఇంద్రియాలను జయించలేక పోయారు. కాని, భీష్ముడు - లక్ష్మణుడు ఇంద్రియజయమును సాధించగలిగారు.

ఇంద్రియ సంయమనం చెయ్యాలనే కోరిక చిత్తశుద్ధిలోని మరొక గొప్ప లక్షణము. చాలా మందికి ఇంద్రియనిగ్రహం ఉంటుంది. కాని వారికి ఇతర కారణాల వలన చిత్తశుద్ధి ఉండదు. ఇంద్రియ సుఖాలను అనుభవించకపోయినా మనం చక్కగా ఉందాము; అందరూ మనను ప్రేమిస్తారు అనే వాసన మనస్సులో ప్రబలంగా ఉంటుంది. ధనము, అభిమానము, గౌరవము, కీర్తి, సౌభాగ్యము, ఉన్న పెద్దవాళ్లు తమను అందరూ ధార్మికుడని, మహాత్ముడని గౌరవించాలని కోరు కొంటూ ఉంటారు. కాని వారి మనస్సులో ఉన్న విషయాలపట్లనే వారు ఎప్పుడూ ఆసక్తి కలిగి ఉంటారు. అందువలన చెయ్యరాని పనులు చేస్తారు. అంతేకాక అన్నింటిలోనూ తమ మనస్సును లగ్నం చేస్తూ ఉంటారు. అలాంటి వారు ఇంద్రియాసక్తులకన్న నికృష్టులు. వారికి ధర్మముకాని, కర్మకాని, జ్ఞానము కాని, భక్తికాని ఏదీ ఉండదు. ఈశ్వరుడున్నాడని ఒప్పుకొన్నప్పటికీ, ఆయన ఉన్నాడా లేడా అన్న సందేహం పోదు. జగత్తు ఉన్నా దానిపట్ల నమ్మకం ఉండదు. ఇలాంటి ఇంద్రియాసక్తి పట్ల కోరిక, స్వార్థపరత్వము, చిత్తశుద్ధికి ఎక్కువ బాధకరమైనవి. స్వార్థపరత్వము, వాసనలను త్యజించడంవలన తప్పక చిత్తశుద్ధి కలుగదు. మనలాగానే ఇతరులు కూడా ఉన్నారు. మనము మన సుఖాలను కోరుకొన్నట్లుగానే ఇతరుల సుఖాలను కూడా కోరుకోవాలి. ఇతరులంతా మనకన్న గొప్పవారని భావించినప్పుడు, ఇతరులను మనలో చూడగలిగినప్పుడు, మన మనస్సు విశ్వవ్యాప్తి అవుతుంది. అప్పుడు మనకు చిత్తశుద్ధి కలిగినట్లు తెలుసుకొంటాము. అట్లాకాక, సంసారాన్ని త్యజించి కౌపీన-దండములను ధరించి, భిక్షావృత్తిని అవలంబించి, ఇంటింటికీ వెళ్లి హరినామ స్మరణ చేస్తూ తిరిగినా చిత్తశుద్ధి

కలుగదు. అంతకన్న మణిమాణిక్య మకుటధారియైన ఏ మహారాజు తన సింహాసనంపైన కూర్చొన్నా, ఒక బిక్షుకుని లాగా ఇతరుల దుఃఖాలను తన దుఃఖాలుగా భావిస్తాడో, అతనికి చిత్తశుద్ధి కలిగినట్లు, అన్ని పవిత్ర వస్తువులకు ఎవరు సృష్టికర్తయో, ఎవరు స్వయంగా పవిత్రుడో, ఎవరి దయవలన పవిత్రత చేకూరుతుందో, ఆయన పట్ల ప్రగాఢమైన భక్తి కలిగి ఉండటం చిత్తశుద్ధి యొక్క ప్రధానలక్షణము. అలాంటి భక్తియే చిత్తశుద్ధికి, ధర్మమునకు మూలము.

చిత్తశుద్ధి యొక్క ప్రధానలక్షణము హృదయములో ప్రశాంతత. రెండవ లక్షణము ఇతరులను ప్రేమించటం. మూడవ లక్షణము ఈశ్వరుని పట్ల భక్తి. ఎవరికైతే అలాంటి శాంతి, ప్రేమ, భక్తులు కలుగుతాయో, వారికి ఎలాంటి కోరికలు ఉండవు. అలాంటి వారికి సాలోక్యము అంటే మనతో పాటు నివసించటము; సామీప్యము అంటే మనకు సమీపవర్తులై ఉండటము; సాయుజ్యము అంటే మనతో సమానమైన ఐశ్వర్యము; సారూప్యము అంటే మనతో సమానమైన రూపము లేదా ఏకత్వము అనే అన్ని రకాల ముక్తులూ లభిస్తాయి. అలాంటివాడు భగవత్సేవను తప్ప మరేమీ కోరడు. ధనాశను పరిత్యజించటం, శ్రద్ధ కలిగి ఉండటం, హింసా త్యాగము, నిష్కామపూజ లేదా జపముల ద్వారా భగవత్ స్వరూప దర్శనము -స్పర్శనము స్తుతించటము, వందనము, అన్ని ప్రాణులలోను భగవంతుని దర్శించటము, ధైర్యము, వైరాగ్యము, గొప్పవారిని గౌరవించటము, దీనుల పట్ల దయ, తనతో సమానమైన వారిపట్ల మైత్రి, అంతరింద్రియాల దమనము, బాహ్యేంద్రియ నిగ్రహము, ఆత్మ సంబంధిత విషయముల శ్రవణము, భగవన్నామ సంకీర్తనము, సరళత్వము, సత్సంగము, నిరహంకారము మొదలైన గుణముల ద్వారా చిత్తశుద్ధి కలుగుతుంది. అలాంటివారు ఏ ప్రయత్నమూ లేకుండానే ఆ భగవంతుని పొందుతారు. సువాసన గాలితో కలిసి ఘ్రాణేంద్రియములను ఆశ్రయించినట్లు భక్తి యోగంతో కూడిన చిత్తము అప్రయత్నంగానే పరమాత్మను ఆత్మలో చేర్చుకొంటుంది.

ప్రాణులలో పరమాత్మ ఆత్మరూపంలో ఉన్నాడు. అన్ని ప్రాణులలోను ఉన్న జీవుడే తన హృదయంలో కూడా ఉన్నాడనే స్థితి కలగనంత వరకూ తన కర్మలలో లీనమై ఉపాసన లేదా జపము చెయ్యాలి. తమకు ఇతరులకు మధ్య భేదాన్ని పాటించేవారు, ఇతరుల దుఃఖాన్ని తన దుఃఖంగా భావించలేనివారు, ఈశ్వరుని,

ఈ బ్రహ్మమయ ప్రపంచాన్ని గురించి తెలుసుకోలేరు. ఈశ్వరుడు సర్వవ్యాపి., ఆయన అన్నిచోట్ల అంటే అడవిలోను, నగరంలోనూ, గ్రామంలోనూ, నీటిలోనూ, భూమిమీది, శూన్యంలోనూ, రాతిలోనూ అన్ని ప్రాణులలోను ఆత్మరూపంలో ఉన్నాడు. ఈశ్వరుడు సర్వవ్యాపి అని కేవలము నోటితో చెబితే లాభం లేదు. ఈశ్వరుడు సర్వవ్యాపి అని ఒప్పుకొన్నప్పుడు ఈ జగత్తు బ్రహ్మమయమని నిశ్చయింపబడుతుంది. ఈశ్వరుడు సర్వవ్యాపి, సర్వాంతర్యామి అని జ్ఞానం ద్వారా తెలుసుకొన్నవారు, ఈ బ్రహ్మమయ జగత్తు ఎట్లా ఉంటుందో చక్కగా తెలుసుకో గలుగుతారు. ఈశ్వరుడు ఏ పదార్థము, ఆయన ఆకారం ఎట్లా ఉంటుంది, ఏ మార్గంలో వెళ్తే ఆయన లభిస్తాడు అనే విషయాలను మనం నిరూపించలేక పోవచ్చును. కాని, వాటిని కేవలం అర్థం చేసుకోవచ్చును. వీటిని అర్థం చేసుకో టానికి ప్రయత్నిస్తే ముందుగా కారణరూపంలోను, ఆ తరువాత ప్రత్యక్షరూపం లోను, ఈశ్వరుని దర్శనం లభిస్తుంది. ఆయన రాత్రింబగళ్లూ మనముందే ఉన్నాడు. ఆయనను మనం అంతఃకరణంలో చూడాలని కోరుకోటం లేదు. అందుకే ఆయనను చూడలేక పోతున్నాము.

❀❀❀❀❀⑧

3. ధర్మము

ఈనాడు సర్వత్ర అందరినోటా బహిరంగంగాను, అంతరంగంలోను ధర్మం అనుమాట వినబడుతూనే ఉన్నది. ధర్మబోధ లేని పుస్తకం కాని, పత్రికకాని, ప్రబంధం కాని ఉండనే ఉండదు. కాని వాస్తవానికి ఈనాటి మానవ సమాజం లోను, సభ్యసంప్రదాయంలోను ధర్మం చాలా తక్కువగా ఉన్నది. అందరి మనుష్యుల చిలోను, అన్ని సంప్రదాయాలలోను హింసాద్వేషాలు నిండి ఉన్నాయి. కేవలం భావచౌర్యమే కన్పిస్తుంది. అంటే లోపల ఒకటి, బయట మరొకటి. ఈ రోజులలో కన్యాదానం చెయ్యటం చాలా కష్టమై పోతున్నదని చెప్పేవారే, తమ కుమారుని వివాహానికి కనీసం పదివేలు ఇవ్వనిదే రాజీపడటం లేదు. కేవలం నోటి నుంచి మాత్రమే ధర్మమనే మాట వెలువడుతున్నది. ఇంతటి కపటత్వం బహుశా ఈ ప్రపంచంలో ఎప్పుడూ కనిపించలేదు. ఇలాంటి దురవస్థ మానవ సమాజంలో ఎప్పుడూ ప్రాప్తించలేదు. మనిషి ఈనాడు ఎంతో అసంతృప్తితో ఉన్నాడు. అందుకే అతడు సుఖదుఃఖాల విషయంలో భిన్నంగా ప్రవర్తిస్తున్నాడు.

అసలు ధర్మం ఎక్కడి నుంచి వచ్చింది? ఎప్పుడు ప్రారంభమైంది? దాని సృష్టికర్త ఎవరు? అనే విషయాలను గురించి తెలుసుకోవాలి. వీటికి సమాధానం చాలా తేలిక అని అందరూ అనుకోవచ్చును. కాని అది అంత తేలికైనది కాదు. క్రైస్తవులు మూసాక్రీస్తులు ధర్మాన్ని తెచ్చారని చెబుతారు. మహమ్మదీయులు మహమ్మద్ ప్రవక్త ధర్మాన్ని తెచ్చినట్లు చెబుతారు. బుద్ధుడు ధర్మాన్ని తెచ్చినట్లు బౌద్ధులు చెబుతారు. హిందువులు స్వయంగా భగవంతుడే ధర్మాన్ని చెప్పాడంటారు. అంటే ధర్మము భగవంతుని లేదా ఋషుల బోధలని చెబుతారు. భూమి మీద ఉన్న అన్ని జాతులకూ ఒక్కొక్క ధర్మం ఉన్నది. ధర్మంలేని జాతి భూమిమీద ఏదీ లేదు. మరి వారి ధర్మం ఎక్కడినుంచి వచ్చింది? అయినా వారి ధర్మానికి స్రష్ట ఎవ్వరూ లేరు.

క్రీస్తునో లేదా మహమ్మదునో, మూసానో లేదా బుద్ధుడినో ధర్మ స్రష్టలని ఎవరు అంటున్నారో, వారు చాలా భయంకరమైన తప్పు చేస్తున్నారు. ఎందుకంటే వారెవ్వరూ ధర్మాన్ని సృష్టించలేదు. వారు ఆ కాలంలో ప్రచారంలో ఉన్న ధర్మానికి కేవలం ఉన్నతిని కలిగించారు. క్రీస్తు ధర్మానికి పూర్వం యెహూదీ ధర్మం ఉండింది. క్రైస్తవ ధర్మం దానిపైననే అభివృద్ధి చెందింది. మహమ్మద్ ప్రవక్తకు పూర్వమే అరబ్

దేశంలో ఇస్లాం ధర్మం ఉండింది. దానిపైనను, యెహూదీ ధర్మం పైనను మహమ్మదీయ ధర్మం అభివృద్ధినొందింది. శాక్య సింహునికి పూర్వమే వైదికధర్మం ఉండింది. బౌద్ధధర్మం కేవలం సంస్కరింపబడిన హిందూధర్మమే! మూసా ధర్మప్రచారానికి పూర్వమే యోహూదీధర్మం ఉండింది. మూసా దానిని కేవలం అభివృద్ధి పరచాడు. ఈ అన్ని ఆదిమ ధర్మాలు ఎక్కడి నుంచి వచ్చాయి? వాటి కర్తలు ఎవరు? అనే విషయాలకు చిరునామాలు దొరకవు. ధర్మం యొక్క ఉత్పత్తిని గురించి తెలుసుకోటానికి నాగరకజాతులు చేసిన పరిశోధనలు ఏవీ ఫలితాల నివ్వలేదు. ఎందుకంటే సభ్యసమాజంలోని ధర్మాలు చాలా ప్రాచీనమైనవి. వాటి ప్రాథమిక అవస్థలు ఈనాడులేవు. అవి ప్రాథమిక అవస్థల నుంచి పూర్తిగా మారిపోయాయి. ఈనాడు వాటిలో ఎక్కడా ఆనాటి ప్రాథమిక లక్షణాలు కన్పించవు. ఎట్లాగంటే వృక్షం ఎక్కడినుంచి వచ్చిందో దాని అంకురాన్ని బట్టి తెలుస్తుంది. కాని బలమైన కాండాన్ని బట్టి తెలియదు. కనుక సభ్యజాతుల ధర్మాలను తెలుసుకోవాలంటే అనాగరకజాతుల ధర్మాలను గురించి తెలుసుకోవాల్సి ఉంటుంది.

మనిషి ఎంత నాగరకుడు కాకపోయినా, శరీరంకన్న చైతన్యం పూర్తిగా భిన్నమైనదని అతనికి తెలుసు. ఒకడు నడుస్తున్నాడు, పనిచేస్తున్నాడు. మాట్లాడుతున్నాడు, తింటున్నాడు. కాని అతడు చనిపోయిన తరువాత ఆశరీరం ఏమీ చేయలేదు కాని, అతని శరీరం ఎప్పటిలాగే ఉన్నది. కాని ఆ శరీరము ఏమీ చేయలేదు. అతని శరీరంలో నుంచి ఏదో ఒక ప్రధానవస్తువు వెళ్లిపోయింది. అందువలననే అతడు ఏ పనీ చేయలేకపోతున్నాడు. దీని విషయంలో అజ్ఞానులైన మానవులు కూడా, శరీరంలోని జీవత్వానికి బలంకాక, శరీరంకన్న భిన్నమైన జీవపదార్థం మరొకటి ఉందని అర్థం చేసుకొంటారు. జ్ఞానులు దానినే జీవమనీ, ప్రాణమనీ అంటారు. అజ్ఞానులు దానికి పేరు పెట్టగలరో, పెట్టలేరో తెలియదు. కానీ, శరీరంలోపల ఒక ముఖ్యమైన పదార్థం ఉందని మాత్రం అందరికీ తెలుసు.

మరొక అడుగు ముందుకు వేసి ఆలోచిస్తే, అది కేవలం మనుష్యులలోనే కాక, చెట్లు - చేమలలో కూడా ఉంటుందని తెలుస్తుంది. చెట్లు చేమలలో ఆ వస్తువు ఉన్నంతవరకూ వాటికి పూలు పూస్తాయి. పండ్లు కాస్తాయి. ఆకులు వస్తాయి. వృద్ధి చెందుతాయి. ఆ వస్తువు లేకపోతే చెట్లు పుష్పించవు, ఫలించవు. ఎండిపోయి నశిస్తాయి. అందువలన చెట్లు - చేమలలో కూడా జీవం ఉన్నది. అయితే చెట్లు -

చేమలలో ఉన్న జీవపదార్థంలో ఒక తేడా ఉన్నది. అదేమిటంటే – చెట్లు కదలవు; ఊగవు; మాట్లాడలేవు తమ ఇష్టానుసారం ఏమీ చెయ్యలేవు. అందువలన మనుష్యుడు జ్ఞానమార్గంలో ఒక అడుగు ముందున్నాడు. కారణం ఏమిటంటే శరీరంలో జీవం కన్న భిన్నమైన మరొక పదార్థం ఉన్నదని, అది చెట్లు చేమలలో లేదని తెలుసుకొన్నాడు. దానిని జ్ఞానులు చైతన్యమని, జ్ఞానమని అంటారు.

మనిషి చనిపోయిన తరువాత, శరీరం ఉంటున్నది కాని, చైతన్యం ఉండటం లేదని అందరికీ తెలుసు. అయితే మనిషి నిద్రపోయినప్పుడు కూడా శరీరం ఉంటుంది కాని చైతన్యం ఉండటం లేదు. మూర్ఛవంటివి వచ్చినప్పుడు శరీరం ఉంటుంది. కాని, చైతన్యం ఉండదు. కనుక శరీరంకన్న భిన్నమైన మరొక వస్తువు చైతన్యమని అంగీకరించవలసి ఉంటుంది. అయితే ఇప్పుడు ఆలోచించవలసిన విషయం మరొకటి ఉన్నది. అది శరీరం లేనప్పుడు చైతన్యం ఉండగలదా, లేదా? అసలు ఉంటుందా, ఉండదా? అని. ఒకవేళ ఉంటే అది ఎక్కడ ఎట్లా ఉంటుంది? చైతన్యం శరీరాన్ని వదిలిపెట్టి ఎక్కడికి పోదలచుకొంటే అక్కడికి పోతుంది, ఎక్కడ ఉండదలచుకొంటే అక్కడ ఉంటుంది అని అందరికీ తెలిసినదే. దానికి ప్రమాణం ఏమిటంటే స్వప్నావస్థలో శరీరం ఒకచోట ఉంటుంది; కాని చైతన్యం ఎక్కడెక్కడో తిరుగుతూ ఉంటుంది. సుఖదుఃఖాలను అనుభవిస్తుంది; నానారకాల పనులు చేస్తుంది. కనుక శరీరం పోయినా చైతన్యం ఉంటుంది. ఇందులోసందేహం ఏమీ ఉండదు. జీవుడు తన ఇష్ట ప్రకారం పనిచేయగలుగుతున్నాడంటే కారణం జీవునిలో చైతన్యం ఉన్నది. జీవంలేనివాడు తన ఇష్టానుసారం ఏ పనీ చెయ్యలేడు. కనుక అచేతనుడు. దానినిబట్టి శరీరం పోయినా చైతన్యం ఉంటుందనే విషయం అందరికీ స్పష్టం అయి ఉంటుంది. అదే నమ్మకం ధర్మానికి మొదటి మెట్టు. జ్ఞానమే ధర్మానికి మూలం. జ్ఞానం లేనివారిక ధర్మం ఏమిటి? అధర్మం ఏమిటి?

జడపదార్థంలో చైతన్యాన్ని ఆరోపించటం ధర్మానికి రెండవమెట్టు. దీనిని ధర్మం అనికాక, ఉపధర్మం అనవచ్చును. ఉపధర్మమే సత్యధర్మపు మొదటిస్థితి. ఆకాశంలో మేఘాలు ఎక్కడి నుంచి వస్తాయి? వచ్చిన మేఘాలు ఎందుకు వర్షిస్తాయి. వర్షించి ఎక్కడికి పోతాయి? మేఘాలు వచ్చినా ఎప్పుడూ ఎందుకు వర్షించవు? ఎప్పుడు వర్షం అవసరమో, ఎప్పుడు వర్షిస్తే పంటలు పండుతాయో, అప్పుడు ఎందుకు వర్షించవు? మరొకసారి అట్లాకూడా జరగకపోవచ్చు కదా! దానికి కారణం

అదంతా ఆకాశం యొక్క ఇష్టము. మేఘాల యొక్క ఇష్టము. వర్షం యొక్క ఇష్టము. కనుక ఆకాశము, మేఘము, వర్షము అన్నీ సచేతనములని చెప్పవచ్చును. అట్లాగే సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, అగ్ని, వాయువు, తుఫాను, పిడుగులు, మెరుపులు, సముద్రము మొదలైన వాటి విషయంలోనూ అట్లాగే చెప్పవచ్చును. తుఫాను, వర్షము, పిడుగులు, మెరుపులు, అగ్ని మొదలైన వాటిని మించిన బలం వేటికి ఉంటుంది? వాటిని మించిన బలం కలవాడు సూర్యుడు. ఆయన ప్రచండ తేజము, తీవ్రమైన గతి, ఫలోత్పాదన శక్తి, జీవోత్పాదన శక్తి, కిరణములు అన్నీ ఆశ్చర్యకర విషయములే. ఆయనను జగద్రక్షకుడు అనటంలో కూడా ఆశ్చర్యంలేదు. సూర్యుడు ఉదయించనంత వరకూ జగత్తుయొక్క సర్వకార్యములు బహుశః ఆగిపోయి ఉంటాయి. ఈ జగత్తులోని శక్తిమంతములైన పదార్థములలోని సామర్థ్యాన్ని చూసియే ఉపాసనావిధానం ఉత్పన్నమైంది. దీనినే ధర్మము యొక్క మూడవ మెట్టు అని ఛెప్పవచ్చును. అందువలననే అన్ని దేశాలలోనూ, సూర్యుడు, చంద్రుడు, వాయువు, వరుణుడు, అగ్ని, ఆకాశము మొదలైన వాటి ఉపాసన జరుగుతున్నది. అందువలననే వేదాలలో ఇంద్రుడు, ఆకాశము, సూర్యుడు, వాయువు, అగ్ని మొదలైన దేవతల ఉపాసనా పద్ధతులు కన్పిస్తాయి. మెట్లు, కట్టలు,త్రాళ్లు మొదలైన నానారకాల ఉపాయాలతో ఇంటిపైకి వెళ్లగలిగినట్లే, ధర్మరాజ్యంలోకి వెళ్లటానికి ఎన్నెన్నో ఉపాయాలు మార్గాలు ఉన్నాయి.

అహింస, భక్తి, ప్రేమ అనేవి ధర్మానికి మూలములు. అన్ని చోట్ల అందరి నోట అంతరంగిక బాహ్య ప్రేమల మాటలు వినబడుతూ ఉంటాయి. కానీ ఎవ్వరూ ఎవ్వరినీ వాస్తవంగా అంతరంగంతో ప్రేమించరు. మనము - ఇతరులు అంతా సమానమే అనే పరిజ్ఞానం కలిగేటంతవరకు, పరస్పరం నిజమైన ప్రేమ కలగనంత వరకు, ధర్మాన్ని గురించి చర్చించటం వృథా అంతేకాక అదికేవలం ప్రతారణము మాత్రమే. ప్రేమ రెండు రకాలుగా ఉంటుందని అందరికీ తెలిసినదే. మొదటిది స్వాభావికమైన ప్రేమ - అది సంబంధాలను బట్టి కలుగుతుంది. ఎట్లాగంటే - తండ్రీకొడుకులకు, భార్యభర్తలకు కలిగేది. రెండవది గుణములను బట్టి కలిగే ప్రేమ - మిత్రులను బంధువులను చూసినప్పుడు కలిగే ప్రేమ. యథార్థమైన ప్రేమకు ఒక ప్రణాళిక ఉంటుంది. ఆ ప్రణాళిక ప్రకారం ప్రేమించినప్పుడే అది మహత్తర మైన ఫలాన్ని ఇస్తుంది. సంపూర్ణ రూపంలో అహంకారాన్ని తనను, సమస్త

జగత్తును, సమస్త ప్రాణులను, సమస్త జనులను, సమస్త జగత్తును ప్రేమించటం నేర్చుకొంటే, 'అసలైన ప్రేమ ఏమిటి' అన్న విషయం అర్థమవుతుంది.

మనం ప్రేమించే దానిలోని మంచి చెడులను చూడవలసిన అవసరం లేదు. అది మంచిదైనా ప్రేమిస్తాము, చెడ్డదయినా ప్రేమిస్తాము. జగత్తు మంచిదో, చెడ్డదో,అని పరీక్షించి చూసి దానిని ప్రేమించాలని అనుకోకూడదు. సమస్తజగత్తూ ఆ సచ్చిదానంద స్వరూపమే. అందువలన సమస్తజగత్తూ ప్రేమపాత్రమే. ఎందుకంటే ఆ అనంతపురషుడు ధ్యానావస్థలో తన ఆత్మాభిమానాన్ని వదిలిపెట్టి, అన్నింటినీ భగవద్భావంతో నింపివేశాడు. అతడే సమస్త జగత్తునూ ప్రేమించటానికి అర్హుడు. ఆయనే జగత్తును జగదీశ్వరుడని భావించి ప్రేమించగలుగుతాడు. నా అభిప్రాయంలో విజ్ఞులైనవారు దీనిని గ్రహించాలంటే, వారికి హిందూ శాస్త్రముల సంస్కారాలు కొన్ని చాలా అవసరము. హిందూ ధర్మం యొక్క ఆవశ్యకత, దానిని మించిన సత్యము ఉత్కృష్ట ధర్మములు ఉండవని అందరికీ తెలుసు. ఎవరైనా భగవంతుని దర్శించి ముక్తి పొందితే, లేదా ముక్తిని పొందాలనుకొంటే, అది హిందూధర్మం వల్లనే లభించింది. మనకు మార్గం చూపించగల సహాయకులు ఎవ్వరూ లేరు. అలాంటి విషయాలను గురించి సముచితంగా వ్యాఖ్యానించగల పండితులు ఈనాడు మనకు లేరు. ఈనాటి పండితులు తెలిసో తెలియకో, సత్యము, మిథ్య, మంచి-చెడు వంటి విషయాలను గురించి విచారించక, తమ పాండిత్యాన్ని మాత్రమే ప్రదర్శిస్తున్నారు. అంతేకాదు ఎంతో మంది మహాత్ములు తామే శ్లోకాలను వ్రాసి పురాణకథలలోనో వేదంలోనే చేర్చి, శాస్త్రాన్ని మభ్యపరుస్తున్నారు. కాని అసలైన తత్త్వాన్ని వాస్తవంగా ప్రదర్శించటం అత్యంత ఆవశ్యకమైన విషయము.

ఏదో ఒక విధమైన మార్గాన్ని అవలంబించకుండా ధర్మం ఎలాంటిదో తెలిసేది కాదు. పూజలు చేసినా, మంత్రాలు మననం చేసినా ధర్మం తెలియదు. ముక్కు మూసికొని ధర్మాన్ని ఆచరిస్తున్నానని లోకాన్ని వంచించటం ధర్మం కాదు. శరీరంలోని అన్ని అంగాలకు హరినామ ముద్రలు వేసికొని, హరినామం ఉన్న జోలెను వేసుకొని, వీధుల వెంట తిరిగితే అది కూడా ధర్మం కాదు. ధర్మానికి సన్నిహితత్వము ద్వేషభావములు లేవు. "ఆత్మవత్ సర్వభూతేషు" అన్న సద్భావన కలగనంతవరకూ ఎవరూ నిజమైన ధార్మికులు కాలేరు. సమదర్శి కానంతవరకు సిద్ధి లభించదు. కలహద్వేషములతో కూడిన జగత్తులో పాపం ఉన్నంత వరకు

వివాదపడటం ఉచితం కాదు. ఈశ్వరుడు అందరికీ సమానుడే. ఆయన ముందు జాతికాని, సంప్రదాయికమైన ధర్మంకాని ఏదీలేదు. బ్రాహ్మణుడు, శూద్రుడు, యవనుడు, చదువుకొన్నవాడు, చదువులేనివాడు, ధనవంతుడు, ధనహీనుడు వంటి భేదాలు లేవు. ఎవరు ఆయనను భక్తిభావంతో పిలుస్తారో, వారు భగవంతుని వారైపోతారు. ఆయన అందరివాడనే భావాన్ని వదిలిపెట్టి ధర్మమును గురించి వాదోపవాదాలు చేస్తూ ఉంటాము. ఇంతకన్న విచారకమైన విషయం మరేమి ఉంటుంది? ఆయన ఒక్కడే అయినా అందరివాడు. అందువలన జగత్తంతా ఒక్కడే. జగత్తులోని వారంతా ఒక్కటే. అన్ని ధర్మాలూ ఒక్కటే. ధర్మముయొక్క ప్రేమ చాలా ఉదారమైనది. ఎవరికి ఏ మతం పట్ల విశ్వాసం ఉంటుందో, వారు అదే మతం ద్వారా ధర్మలాభాన్ని పొందటానికి సమర్థులవుతారు. ఎవ్వరి ధర్మసంబంధమైన విశ్వాసాలనూ భంగపరచటం ఎప్పుడూ సముచితం కాదు.

ఈ సంసారాన్ని వదిలిపెట్టి అరణ్యాలకు వెళ్తే కాని ధర్మలాభం కలగదని చాలా మంది అనుకొంటూ ఉంటారు. అది చాలా భయంకరమైన తప్పు. ఒకవేళ జగత్తులోని వారంతా అడవిలోకి వెళ్తే, అప్పుడు ఆ అడవికూడా సంసారం అయిపోతుంది. లేదా సృష్టే నష్టమైపోతుంది. ఒకవేళ సృష్టే లేకపోతే ఈ సంసారసృష్టే వ్యర్థమైపోతుంది. అప్పుడు ఈశ్వరుని పనికి బాధకలుగుతుంది. సంసారమే ధర్మానికి ప్రధానస్థానము. వాయువులాగా దేనిలోనూ కలిసిపోకుండా, అన్ని పనులూ చెయ్యాలి. ధర్మమార్గం అందరికీ ఒక్కటి కాదనే విషయం అందరికీ తెలిసినదే. గృహస్థుడు ఒకవేళ వానప్రస్థమార్గమో లేదా బ్రహ్మచర్యమార్గమో అవలంబిస్తే, దానికి ఫలితం ఏమీ ఉండదు. అలాగే ఇంట్లో కూర్చొని ఎవరైనా కుంభకయోగం అవలంబించాలని ప్రయత్నిస్తే ప్రయోజనం ఏమీ ఉండదు. అన్ని నీళ్లు జలాయశయంలో కలిసినట్లు, మార్గాలు భిన్నమైనా కార్యం ఒక్కటే.

జగత్తులో రకరకాల సాధకులున్నారు. అందులో రెండు రకాల సాధకులు ప్రధానులు. మొదటిరకం వారు సంసార రూపమైన మాయా శృంఖలాలను త్రెంచుకొని, తమ ముక్తికోసం నిర్జరారణ్యాలకు వెళ్లి యోగమో తపస్సో చేస్తూ కాలక్షేపం చేస్తారు. రెండవ రకంవారు మానవసమాజాన్ని తమదిగా భావించి, వారిని ముక్తి మార్గంలో పెట్టి, వారిని ఎంతో ప్రేమతో ధర్మమార్గంలోకి తెస్తారు.

ఇతరుల ఇష్టాలను తమ ఇష్టాలుగా భావిస్తారు. అంతేకాక పరోపకారం కోసం పిచ్చివాళ్లయిపోతారు. బుద్ధుడు, చైతన్య మహాప్రభువు అలాంటివారే.

మానవుని సృష్టి జరిగినప్పటినుంచీ, మానవుడు మాట్లాడటం నేర్చుకొన్నప్పటి నుంచీ, మానవునిలో బుద్ధి వికసించినప్పటినుంచీ, మానవసమాజంలో ధర్మం కూడా విస్తరించసాగింది. ఆకాలంలో ధర్మమనే పేరుకాని, నియమనిబంధనలు కానీ ఇన్ని లేకపోయి ఉండవచ్చును. కాని అప్పుడు కూడా ఏదో ఒక ధర్మం తప్పక ఉండి ఉంటుంది. ఏది సత్యమో అది అనశ్వరమైనది. అంతేకాక అదే మానవులకు గ్రహణయోగ్యమైనది. వేదోక్తమైన సనాతన ధర్మమేదో అది అనశ్వరమైనది. అనంత సత్యంతోకూడినది. అందువలన దానిని అవలంచించాలి. అందరూ నోటితో ధర్మం-ధర్మం అంటారు. కాని దాని అసలు విషయం ఏమిటో, దాని కర్తవ్యం ఏమిటో ఆలోచించాలి. మనస్సును స్థిరంగా ఉంచి, భక్తిభావంతో ఆత్మచైతన్యాన్ని విశ్వచైతన్యంతో కలపటమే పరమధర్మము. అంతేగాక ఏ మార్గంలో నడిస్తే ఆవిధంగా కలపటానికి వీలవుతుందో అదే ధర్మపథము.

ధర్మం అంటే ఏమిటి? దాని ఆవశ్యకత ఏమిటి? అంటే, ధర్మశబ్దం యొక్క అర్థ నిర్ణయం చేస్తే దాని ఆవశ్యకత ఏమిటో తెలుస్తుంది. ధర్మశబ్దం 'ధృ'ధాతువునుండి నిష్పన్నమైంది. ధారణచేసే దానిని ధర్మం అంటారు. ఏది దేనిని ధారణచేస్తుందో అది దాని ధర్మము. ఒక పదార్థముయొక్క స్వభావమును ధర్మమని చెప్పవచ్చును. ఎట్లాగంటే సూర్యుని యొక్క ధర్మము తాపము; జలముయొక్క ధర్మము రసము; అగ్నియొక్క ధర్మము దహనశక్తి; అట్లాగే జీవుని ధర్మము ఆత్మజ్ఞానము. ఏ వస్తువు లేకపోతే పదార్థంలోని పదార్థత్వం ఉండదో, ఆ వస్తువు అన్నిటికన్నా ప్రయోజనకరమైనది. దానిని మళ్లీ వివరించవలసిన అవసరం లేదు. ధర్మము జగత్తు యొక్క ప్రతిష్ఠాస్వరూపము. ధర్మము వలన పాపములు నశిస్తాయి. కనుక ధర్మము అన్నిటికంటే శ్రేష్ఠమైనది. విద్య, ధనము, శరీరము, సత్కులములో జననము, రోగములు లేకపోవటం, ముక్తి మొదలైనవన్నీ ధర్మం వల్లనే లభిస్తాయి. ధర్మం వృద్ధి చెందితే అవన్నీ వృద్ధి చెందుతాయి; అది క్షీణిస్తే అన్నీ క్షీణిస్తాయి. మనుష్యుడు తప్పక ధర్మాన్ని ఆశ్రయించాలి. లేకపోతే మనిషిలో మనష్యత్వం నశించి, పశుత్వమో లేదా మరొక హీనత్వమో ప్రాప్తిస్తుంది.

ధర్మమునకు మూలము హృదయము. మనస్సు - శక్తులతో భగవంతుని పైన భక్తివిశ్వాసములను ఉంచుకోవాలి. ప్రతివాడూ తనవారిని, సమస్త జగత్తును తనది అనేది భావించటం, తెలిసితెలిసి ఇతరులకు అన్యాయం చెయ్యకపోవటం, అన్ని జీవులపట్ల దయ, అహింస, లోభరాహిత్యము, క్రోధరాహిత్యము, సత్యవాక్కు, క్షమ, సత్సంగము, జితేంద్రియత, శౌచము, గురుభక్తి, అన్ని ప్రాణులలోను మాతృత్వము, ఈశ్వరునియందు పితృత్వము - ఇలాంటి పరిజ్ఞానమే ధర్మము అనబడుతుంది.

శాస్త్రము అనంతమైనది. కాని ఆయువు అత్యల్పమైనది. అంతేకాక, మానవ జీవితంలో విఘ్నాలు ఎక్కువ. అందువలన అన్ని శాస్త్రాలలోని సారమును మాత్రం తెలుసుకోవాలి. కొంచెం జ్ఞానంతోనే ధర్మజ్ఞానం కలుగవచ్చును. ఎన్నో శాస్త్రాలు చదవనక్కరలేదు. ఎక్కడ ధర్మం ఉంటుందో అక్కడ తేజస్సు ఉంటుంది. ఎక్కడ భక్తి ఉంటుందో అక్కడ సంపద ఉంటుంది. ఎక్కడ సత్సాంగత్యం ఉంటుందో అక్కడ సద్బుద్ధి ఉంటుంది. ఎక్కడ ధార్మికులుంటారో అక్కడ భగవంతుడు విరాజిల్లుతాడు. ధర్మలాభము ఏ మతాన్ని అపేక్షించదు. ఎవరు దానిని ఎట్లా ఆరాధిస్తారో, అది కూడా వారి కోరికలను అట్లా పూర్తి చేస్తుంది. ఏ విధంగా నదులు నానా దిశలలోను ప్రవహించినా, చిట్టచివరకు సముద్రంలో కలిసినట్లు, భగవంతుని ఉపాసన ఏ భావంతో చేసినా, ఆ ఉపాసన పరబ్రహ్మలోనే అర్పితమవుతుంది.

❀❀❀❀❀

4. ఉపాసన

ఉపాసన అని దేనిని అంటారో ముందు తెలుసుకోవాలి. భగవంతుని గురించి తెలుసుకోవాలన్నా, ఆయనను పొందాలన్నా ఉపాసన చాలా అవసరము. అలాంటి కోరికలు లేకపోతే ఉపాసనయొక్క అవసరం ఉండదు. తనను ఎవ్వరైనా సంతోష పెట్టాలని ఈశ్వరుడు కోరడు. అందరి పట్లా ఆయనకు సమానమైన దయ ఉన్నది. ఉపాసన లేదా ఆరాధన భగవంతుని విశుద్ధశక్తిని ఆకర్షించే యంత్రంలాంటిది. ఆయనను తెలుసుకోవాలనుకొంటే, ఏ మార్గంలో వెళ్తే ఆయనను తెలుసుకోవచ్చునో దానినే ఉపాసన అంటారు.

మనుష్యుడు సుఖాన్ని కోరుకొంటాడు. కాని, అసలైన సుఖం అని దేనిని అంటారో అది ఎవరికీ తెలియదు. దుఃఖముయొక్క చరమనివృత్తియే మహాసుఖము. సుఖము ఏ అడవులను వెలుగులతో నింపిందో, మనస్సుయొక్క సంపూర్ణ శాంతి ఏ సాగరగర్భంలో దాగిఉన్నదో, దానిని గురించి ఆలోచించాలని ఎవ్వరూ అనుకోరు. దుఃఖము లేకపోతే సుఖము ఎట్లా ఉంటుందో ఎవరూ తెలుసుకోలేరు ఏదో ఒకరకమైన అన్యాయం పనిచేసినప్పుడే కష్టం అనుభవించవలసివస్తుంది. ఈశ్వరుడు మనుష్యులకు కష్టం కల్గిస్తున్నాడంటే, సుఖాన్ని పొందటానికే! మనిషి ఎప్పుడూ సన్మార్గంలో నడిచి, ఎప్పుడూ సుఖాన్నే అనుభవించాలనే ఆయన కోరిక. బంగారంధర ముప్పైఅయిదు వందలైతే, దానిలో ఎంత కల్తీ కలిస్తే అంత విలువ తక్కువ అవుతుంది. స్వర్ణకారుడు దానిని రసాయనంలో వేసి, అది పూర్తిగా శుద్ధి అయ్యేంతవరకూ దానిని సుత్తితో కొడుతూ ఉంటాడు. అట్లాగే ఈశ్వరుడు కూడా మనుషులకు కష్టాలను కల్గించి, అతనిని అన్యాయపు పనులు నుంచి పూర్తిగా తొలగించి, అతడు విశుద్ధుడై తిరిగి మంచి మార్గంలో నడవటానికి యోగ్యునిగా చేస్తాడు. జీవునికి కష్టం కలిగించటం కూడా ఆయన పరమదయలోని భాగమే! దానిని బట్టి సుఖదుఃఖాలు రెండు సమానములని తెలుసుకోవాలి. అందువలన అన్యాయపుపని చేసి దుఃఖాన్ని అనుభవించటం కన్న, అసలు అన్యాయం చెయ్యక పోవటమే మంచిది. శరీరానికి మాలిన్యం అంటించుకొని దానిని కడుక్కోవాలను కొనటం కన్న అసలు మాలిన్యం అంటించుకోకపోవటమే మంచిదని అందరూ ఒప్పుకొంటారు కదా.

ఈశ్వరోపాసన ఎల్లప్పుడూ ఆవశ్యకమే! అలాంటి ఆలోచన మనస్సులో స్థిరపడి, దృఢవిశ్వాసం కలిగినప్పుడు, మొదట ఆసనము అవసరమవుతుంది. ఆసనములు అనేకవిధాలుగా ఉన్నాయి. కాని సంసారులైన వారికి ఏది

ఉపయోగకరమో దానిని గురించి తెలుసుకోవాలి. అందువలన ఇక్కడ దానిని గురించే వివరింపబడుతున్నది. నిర్జనము, ప్రశస్తము ఐన ఒక గదిలో మొదట దర్భాసనము, దానిమీద తివాచీ, దానిమీద ఒక వస్త్రము పరిచి, దానిమీద సాధకుడు ఉత్తరముఖంగా కూర్చోవాలి. అట్లా కూర్చున్నప్పుడు శరీరము, తల, మెడ అన్నీ ఒకే రేఖలో ఉండాలి. కుడిముంగాలి మధ్యభాగములో ఎడమ పాదతలమును, ఎడమముంగాలి మధ్యభాగములో కుడిపాద తలమును నిలపి సూటిగా కూర్చోవాలి. తరువాత కళ్ళుమూసుకొని, ముక్కు చివరనకాని, లేదా భ్రూమధ్యమున కానీ దృష్టిని నిలిపి, శాంతము స్థిరము అయిన చిత్తముతో గురువు ఉపదేశించిన బీజాక్షర మంత్రమును జపించాలి. దీనిలో బ్రాహ్మణుడు శూద్రుడు అన్న భేదంలేదు. ఆవిధంగా ప్రతిరోజూ ప్రాతః సాయంకాలములలో కనీసం అరగంట వరకూ నిశ్చలమైన మనస్సుతో కూర్చోవాలి. ఎంతవరకూ కాంతి కనిపించదో అంతవరకూ క్రమంగా ధ్యానసమయాన్ని పెంచుతూ పోవాలి. మనస్సును స్థిరపరచటానికి అంతకన్న మరొక సూటియైన మార్గంలేదు. మనస్సు చాలా చంచలమైనది. అందువలన దానిని నిరోధించి పనిలో పెట్టాలి. కొన్ని రోజులు అట్లా అభ్యాసం చేస్తే మనస్సు మన అధీనం అవుతుంది. మనస్సుతోనే మనస్సును వశపరచుకోవాలి. అది మనవల్ల అవుతుందా కాదా అని పొరపాటున కూడా అనుకోకూడదు. కాకపోతే ఏమీఫలం లభించకపోవచ్చును. అయితే అదే మన ప్రధాన కర్తవ్యమని, అది మనకు చాలా ఆవశ్యకమని, ముఖ్యంగా మనం ఆలోచించాలి. అది సాధించే వరకూ మనం దానిని వదిలిపెట్టకూడదు. ఈ విధంగా దృఢమనస్కులమై ప్రయత్నిస్తే ఫలితం తప్పక లభిస్తుంది. మనస్సు స్థిరపడిన తరువాత ఏ సాధన అవసరంలేదు. ఆసనం యొక్క అవసరము లేదు.

బుద్ధి, మనస్సు, ప్రాణము, శరీరము, అహంకారము, ఇంద్రియములకన్న చిత్‌రూపమైన ఆత్మ భిన్నమైనదని నిశ్చయంగా తెలుసుకోవాలి. ఆ ఆత్మయే ఈశ్వరుడు. అది నిర్మలము, నిరాకారము, జన్మ మృత్యు-జరా-వ్యాధి వర్జితము అయినది. అది చిన్మయము, ఆనందమయము, అశరీరము, పూర్ణము,

జ్యోతిర్మయము, నిత్యము, శుద్ధము, జ్ఞానమయము, సర్వదేహస్థితము, సర్వాతీతము అయినది. ఏకాగ్రచిత్తముతో ఈవిధమైన చింతన చెయ్యాలి. కొందరు నాస్తికులై ఈశ్వరుడు లేడని, అన్నీ సహజంగానే అవుతాయని అంటారు. అలాంటి మూర్ఖులు అజ్ఞానులు జగత్తులో ఎవ్వరూ ఉండరు. ఈశ్వరుడు ఒక్క క్షణం ఈ శరీరాన్ని వదిలిపెడితే, కళ్లు మూతలుపడి జీవనలీల సమాప్తమైపోతుంది. ఈనాడు ఎవరిలోనో ఒకరిలో ధర్మపిపాస జాగృతమవుతున్నది. కాని దానికోసం శ్రమ పడటానికి ఎవ్వరూ అంగీకరించటం లేదు. రెండు మూడు రోజులు కళ్లమూసుకొని కూర్చొని, ఏమీ లభించకపోతే అంతా మిథ్యయని, వృథాగా శ్రమపడటంవలన ఏమీ లాభం లేదని అనుకొంటారు. ఆత్మవిశ్వాసంతో ఈశ్వరుని తమ చిత్తంలోకి ప్రవేశింపజేయగలిగితే, విశ్వాసం కలుగుతుంది. ఒకరికి విశ్వాసం కలిగినా కలగక పోయినా జగత్తుకు దానివలన నష్టం ఏమీలేదు. అలాంటి వారికి దూరంగా ఉండాలి. వారి నిద్రమత్తు తొలగిపోయినప్పుడు వారే సరియైన మార్గంలో నడుస్తారు.

మొదట అరుణోదయంలాగా వారిలో వృత్తిరూపమైన జ్ఞానోదయం కలిగి, అజ్ఞాన రూపమైన అంధకారం నశిస్తుంది. దాని తరువాత ఆత్మ సూర్యునిలాగా స్వయంగా ప్రకాశిస్తుంది. భ్రాంతివలన ముడుచుకొని ఉన్న చెట్టు మనిషిలాగా కన్పించినట్లు, బ్రహ్మ పదార్థము జీవునిలా కన్పిస్తుంది. కాని ఆ భ్రాంతి నశించగానే జీవుని యథార్థ స్వరూపం దర్శనమిస్తుంది. అంతేకాక జీవుని యొక్క జీవన వ్యవహారం నివృత్తమవుతుంది.

చిత్తౌన్నత్యం కోసం మనిషి ఏదో ఒక ఉన్నతస్థితిని పొంది, చరమాదర్శ స్వరూపుడైన ఆ మహాపురుషుని ఆదర్శాలను గూర్చి చింతన చేస్తూ వాటిని ఎప్పుడూ హృదయంలో నిలుపుకొని, ఆ ఆదర్శాలతోనే ఓన్నత్యాన్ని పొందటానికి ప్రయత్నించాలి. మన మనస్సు చాలా చంచలమైనది. కనుక ఏదో ఒక ఆదర్శచరిత్రను మనస్సులో ధారణ చెయ్యటం సహజమైన పనికాదు. అందువలన ఎవరో ఒక ఆదర్శ పురుషునితో మన మనస్సును ఎట్లాగైనా బంధించాలి. అట్లా మహా పురుషునితో బంధనాన్ని దృఢపరచుకోటానికి దృఢమైన భక్తి అవసరము. ఎందుకంటే భక్తి లేకపోతే ఈశ్వరోపాసనలో అగ్రేసరులం కాలేము.

సంపూర్ణజ్ఞాని అయిన విశిష్టయోగి జ్ఞానచక్షువుద్వారా తన ఆత్మలో సమస్త జగత్తును ఆ ఆత్మనే జగత్తులోను చూస్తాడు. ఈ జగత్సముదాయమే ఆత్మ. ఆ ఆత్మకు భిన్నమైన వస్తువులేదు. ఎట్లాగంటే ఘటము, కలశము మొదలైనవి మట్టి యొక్క రూపాలే. మట్టి లేకపోతే ఘటము కలశము అనే వస్తువులు లేనేలేవు. అట్లాగే జ్ఞాని అయిన వ్యక్తి తన ఆత్మలోనే సమస్త సముదాయమును చూస్తాడు.

వాయువు అంతటా ప్రసరించినా, ఏ వస్తువుకూ అంటుకోనట్లు జ్ఞాని అయిన వాడు అనిత్యమైన బాహ్యసుఖములను వదిలిపెట్టి, ఆత్మసుఖంతో పరిపూర్ణుడై, నిశ్చలమైన దీపంలాగా నిర్మలమైన అంతరంగంతో ప్రకాశిస్తాడు. అంతేకాక మౌనిలాగా ఆలోచిస్తాడు. ఉపాధి నశించగానే ఆ మౌని సర్వవ్యాపియైన పరమాత్మలో ప్రవేశిస్తాడు. నీటిలో నీరు, తేజస్సులో తేజస్సు, ఆకాశంలో ఆకాశము కలిసిపోయినట్లు పరమాత్మలో లీనమవుతాడు. ఎట్లాగంటే భ్రమరము ఒక పురుగును పట్టుకొన్నప్పుడు, ఆ పురుగు ఆ భ్రమరమును గురించే ఆలోచించి ఆలోచించి, చివరకు ఆ భ్రమరంలాగానే మారిపోయినట్లుగా ఆత్మజ్ఞానియైన పురుషుడు ఆత్మరూపియైన ఆ సచ్చిదానంద స్వరూపాన్ని గురించి ఆలోచించి ఆలోచించి, తనలో పూర్వం ఉండిన ఉపాధిరూప గుణాలను వదిలిపెట్టి, సచ్చిదానంద భావమును పొందుతాడు. అలాంటి వ్యక్తినే జీవన్ముక్తుడంటారు.

జ్యోతిర్మయుడు – ఆనందమయుడు అయిన ఆ పరబ్రహ్మాను ఆశ్రయించుకొని, బ్రహ్మ నుంచి పిపీలికాది పర్యంతము, తమతమ తారతమ్యములను బట్టి ఆనందాన్ని పొందుతారు. పాలలో నెయ్యి ఉన్నట్లుగా అన్నింటిలోనూ బ్రహ్మపదార్థ మున్నది. అంతేకాక సాంసారిక వ్యవహారాలు కూడా ఆయనకన్న భిన్నం కావు. శ్రవణము, మననము, అజ్ఞానము కువాసనలతో విషయాకృష్టుడై ఉన్నాడు జీవుడు. అతనిని విషయముల నుంచి వెలికిలాగి ఆత్మలో నిలిపి, జ్ఞానాగ్నిలో తపింపజేస్తే, ఉపాధిమాలిన్యముల నుండి ముక్తుడై, ఆత్మ బంగారంలాగా ప్రకాశితమవుతుంది.

సర్వవ్యాపి, సమస్తము, నీకు ఆధారభూతమైన ఆత్మ హృదయాకాశంలో సూర్యునిలాగా ఉదయించి, అజ్ఞానాంధకారాన్ని హరించి, అన్నింటినీ ప్రకాశింప జేస్తుంది. నిష్క్రియుడు, దిక్ దేశ కాలాది అపేక్షారహితుడు, శీతోష్ణాదుల కతీతుడు, సర్వవ్యాపి, నిత్యసుఖ స్వరూపుడు అయిన ఆత్మను ఎవడు భజిస్తాడో, అతడు సర్వవ్యాపి, సర్వజ్ఞుడు, అమృతుడు అవుతాడు.

ధర్మమువలన భక్తి, భక్తివలన జ్ఞానము, జ్ఞానమువలన ముక్తి లభిస్తుంది. మనస్సును ప్రాణాన్ని ఈశ్వరునికి అర్పించటమే ధర్మము. కనుక ముముక్షువు కాదలచిన వ్యక్తి ధర్మముకొరకు ఈశ్వరుని మీద ఆధారపడాలి. సచ్చిదానంద స్వరూపుడైన బ్రహ్మ మాత్రమే సర్వమయుడు. అందరు దేవతలు ఆయన సూక్ష్మాంశలే! ముముక్షువైనవాడు విధివిధానంగా అనుష్ఠానం చేసి, చిత్తశుద్ధి పొందిన తరువాత, ఆత్మజ్ఞాని అవుతాడు. ధర్మమార్గానికి అనిష్టకారకములైనవి కనుక కామాది అరిషడ్వర్గాన్నీ హింసనూ ఒకేసారి ఒదిలిపెట్టాలి. ప్రయత్న పూర్వకంగా ఈపని చేయగలిగినవారికి తత్త్వజ్ఞానం లభిస్తుందనటంలో సందేహం లేదు. తత్త్వజ్ఞానం కలిగిన తరువాత ఆత్మ ప్రత్యక్షం అవుతుంది. ఆత్మ ప్రత్యక్షమైతే ముక్తి లభిస్తుంది.

మనోసంయమనమే సాధన యొక్క ప్రధాన లక్షణము. బాహ్యావిషయాలలో ఆసక్తిశూన్యులై, అంతరంగంలో పరమానందాన్ని అనుభవించేవారు బ్రహ్మ సంయుతులై అక్షయసుఖాన్ని పొందుతారు. ఒక ప్రజాపాలకుని కన్నను, ప్రజారంజకుడైన రాజు కన్నను, యుద్ధములో విజయం సాధించిన యోధుని కన్నను, మనస్సును స్వాధీనం చేసుకొన్నవాడు మహాపురుషుడనిపించుకొంటాడు. ఈదుతూ సముద్రమునైనా దాటడం సహజం కావచ్చును కాని, మనస్సును వశపరచుకొనటం మాత్రం చాలా కష్టమైనది. ఒకవేళ భక్తి విశ్వాసములతో పనులు చేయగలిగితే మనస్సుపైన విజయం సాధించటం సహజం కావచ్చును. దయయే సాధనకు మూలము. అభిమానము నరకానికి త్రోవ. అహంకార శూన్యుడు, క్షమాశీలి, సుఖదుఃఖములందు సమభావన కలవాడు, నిత్యసంతోషి, మనస్సును బుద్ధిని భగవదర్పితం చేసినవాడు, ఎవరికీ దుఃఖము కలిగించనివాడు, భయ-క్రోధ విముక్తుడు, కోరికలు లేనివాడు, సుఖములు కల్గినప్పుడు సంతుష్టుడు - దుః ఖములు కల్గినప్పుడు దుఃఖితుడు కానివాడు, పాప-పుణ్య-రహితుడు, శత్రువులపట్ల మిత్రులపట్ల సమభావన కలవాడు, మానావమానాలను సమభావంతో చూసేవాడు, నిందాస్తుతులను సమానంగా స్వీకరించేవాడు, శరీరరక్షణార్థము దొరికిన దానిని మాత్రమే తిని సంతోషపడేవాడు, ఈశ్వరపరాయణుడు, శ్రద్ధాళువు, భక్తి పరాయణుడు అయినవారే భగవంతుని పొందగలుగుతారు. వారికి ముక్తి తప్పక లభిస్తుంది.

ఇతర సాధనలములన్నిటికన్నను జ్ఞానమే ముక్తికి ప్రధాన కారణము. అగ్ని లేకపోతే వంట సాధ్యంకాదు. అజ్ఞానంవలన నిర్మలమైన ఆత్మ మలినంగా అనిపిస్తుంది. మేఘాలు తొలగిపోయిన తరువాత సూర్యుడు ప్రకాశించినట్లు ఆత్మయే స్వయంగా ప్రకాశిస్తుంది. జీవుడు అజ్ఞానం కన్న మలినమైనవాడు. జ్ఞానమే అతనిని నిర్మలంగా చేయగలుగుతుంది. స్వప్నావస్థలో నిద్రలో చూసిన వస్తువులు సత్యంగా కన్పించి, జాగ్రదవస్థలో మిథ్యగా ప్రతీయమానమైనట్లు, రాగద్వేషములతో నిండిన ఈ సంసారము అజ్ఞానంచేత వాస్తవంగా కన్పించి, ఆ అజ్ఞానం నశించగానే మిథ్య అని విశదమవుతుంది.

ఈశ్వరుడు కేవలం నిరాకారుడే కాదు శబ్ద స్పర్శ రూప రసగంధాదులకు భక్తి, దయాది గుణాలకు అతీతుడు. ఈనాడు నిరాకారోపాసన చేస్తున్నవారికి, తాము చేసే ఉపాసన సరిగ్గా జరుగుతున్నదో లేదో తెలియదు. భక్తిని గురించి చర్చించటం వలన వారికి మానసికోన్నతి కలుగుతున్నదేకాని, అసలైన ఫలితంకానీ, అంతకన్న అధికంగా కానీ ఏమీ లభించటం లేదు. నిరాకారోపాసనలో జ్ఞానలాభానికి భక్తి - మానసిక వృత్తుల స్ఫురణ ఆవశ్యకమని వారికి తెలిసినప్పుడు, ఈశ్వరతత్త్వజ్ఞాన ప్రాప్తికి ఏదోరకమైన ఇతర సాకారమైన పదార్థము యొక్క ఆలంబనం లేకుండా అన్ని వృత్తుల స్ఫురణ చేయగల కోరిక ఉండాలి. అదే నిరాకారోపాసన. ఈశ్వర తత్త్వజ్ఞానానికి సాకారచింతనను ఆలంబనంగా చేసుకొంటే అది సాకారోపాసన అవుతుంది. అట్లాకాక, సాకారచింతన లేక జగద్వ్యాపియైన ఈశ్వరుని మహిమ-శక్తి-గుణము మొదలైన విషయాలను హృదయంలో నిలుపుకోవటం నిరాకారోపాసన అవుతుంది. సగుణోపాసనను వదలి నిర్గుణోపాసన ఉండదు.

ఉపాసన నాలుగు రకాలుగా ఉంటుంది. మొదటిది ఈశ్వరోపాసన. రెండవది దేవతోపాసన. మూడవది సూర్యుడు అగ్ని మొదలైన శక్తిమంతమైన పదార్థముల ఉపాసన. నాల్గవది ధార్మిక మనుష్యుల ఉపాసన. గోవు, వృక్షము, నది, గంగ, ధాన్యములు మొదలైనవాటి ఉపాసన కూడా ఒక రకమైన ఉపాసనయే. హిందువైన కమ్మరి కొలిమిని, వడ్రంగి సుత్తిని - రంపాన్ని, కుమ్మరి చక్రాన్ని, బ్రాహ్మణులు పుస్తకాలను పూజిస్తారు. అట్లా ఉపాసన చేసేటప్పుడు అచేతన వస్తువులను సచేతనములుగా భావించి పూజిస్తారు. ఆదిమమానవులు ఇలాంటి ఉపాసనే చేసేవారు. వేరే తరహా ఉపాసనలో అచేతనములలో అచేతన భావనే ఉంటుంది. అలాంటి ఉపాసనము జడ-ఉపాసన అంటారు. అలాంటిది చేయటం కూడా

తప్పుకాదు. ఎందుకంటే అలాంటి దానివలన కూడా కొన్ని రకాల చిత్తవృత్తి స్ఫూర్తులను సాధించవచ్చును.

భగవంతుని మనం చూడలేము. కాని ఆయన పనులను, శక్తిని, దయా లక్షణాన్ని తెలిసికొన్న తరువాత సాకారమైన దేవతోపాసన కాక ఇతరములైనవి ఆకులు లేని చెట్లలాగా అంగహీనోపాసనలని గ్రహిస్తాము. హిందూధర్మంలోని వివిధోపాసనా పద్ధతులను బాగా తెలుసుకొన్న తరువాత, ఆ హిందూధర్మం ఎంత గొప్పదో స్పష్టమవుతుంది. కాని దౌర్భాగ్య వశాత్తు హిందూధర్మం వికృతిని పొందుతున్నది. హిందూధర్మంలో ఒక్క ఈశ్వరుడు తప్ప, అంతకన్న భిన్నమైన అన్యదేవతలు లేరు. అందుకు అనేక ప్రమాణాలు ఉన్నాయి. హిందూ ధర్మంలో ఉన్న సారవంతములైన మాటలుకాని, అంతకన్న ఉన్నతములైన ఉదార భావములుకాని ఇతర మతాలలో కన్పించవు. ఈశ్వరుడు విశ్వస్వరూపుడు. అందువలన అన్ని చోట్లా ఆయనను ఉపాసించవచ్చును.

ఏ ప్రణాళికద్వారా అజ్ఞానాంధకారం దూరమవుతుందో ఆ ప్రణాళికను అనుసరించటమే అసలైన ఈశ్వరోపాసనము. ఈశ్వరుని అస్తిత్వమును మన అంతరంగములో అనుభవించటమే అసలైన ఈశ్వరోపాసనము. దేనివలన చిత్తము శుద్ధము, ఉన్నతము, నిర్మలము అవుతుందో అదే ఉపాసన. మసకబారిని అద్దంలో వస్తువుయొక్క ప్రతిబింబము సరిగ్గా కన్పించనట్లు, చిత్తము నిర్మలము కానంత వరకూ అందులో ఈశ్వరుని జ్యోతి ప్రతిబింబించదు. చిత్తమును పరిశుద్ధంగా చేసుకోటానికి ఎవరైనా ఏ దేవత సూక్ష్మశక్తినైనా సహాయంగా తీసుకొంటే, ఆ దేవతారాధన కూడా ఉపాసనే అనిపించుకొంటుంది.

హిందూ శాస్త్రకారులు ఈశ్వర స్వరూపాన్ని గురించి చెబుతూ - ఆయన నిరాకారుడు, నిర్గుణుడు, విశ్వవ్యాపి, విశ్వరూపి, అనాది, అనంతుడు, సత్య స్వరూపుడు, జ్ఞానస్వరూపుడు, ఆనందస్వరూపుడు, శుద్ధుడు, జరారహితుడు, అమరుడు, శాంతుడు, నిర్మలుడు, అంతర్యామి, విశ్వవేత్త, విశ్వజన్మస్థానము, సృష్టి -స్థితి-లయ- ఉద్ధారణకారణుడు అని వర్ణించారు. అతడు వాక్కులకు - మనస్సుకు అగోచరుడు అన్నారు. వాటి అర్థాలను సరిగ్గా తెలుసుకోవాలి. మొదట నిరాకారశబ్దం యొక్క అర్థం తెలుసుకొందాము. రూపము ఆకారము అనే రెండు శబ్దాలను చాలా సార్లు ఒకే అర్థంలో వ్యవహరిస్తూ ఉంటాము. ఒక పదార్థము

యొక్క రంగును రూపం అంటాము. కాని ఆకారం కూడా రూపమే. కళ్లకు కనిపించని వస్తువులకు రూపం లేదని చాలమంది అనుకొంటూ ఉంటారు. అట్లాగే కళ్లకు కనిపించే వస్తువునే ఆకారం కలది అని అనుకొంటారు. వాయువు కళ్లకు కన్పించదు. కాని వాయువుకు కూడా ఆకారం ఉన్నది. శబ్దము, గంధము, చిన్న చిన్న కీటకములు వంటివి కళ్లకు కనిపించకపోయినా వాటికీ ఆకారం ఉన్నది.

కేవలం నోటితో మనము 'భగవంతుడు, భగవంతుడు' అని అనటం వలన అది ఆయనను ఉపాసించటం కాదు. ఉపాసన చేసే ముందు ఈశ్వర శబ్దం యొక్క అర్థమును ముందు మనము హృదయంలో పదిలపరచుకోవాలి. ఈ విశ్వవ్యాప్తమైన జగత్తు ఏ శక్తిచేత నడిపింపబడుతున్నదో అదే ఈశ్వరుని అనంతశక్తి. స్థూలజగత్తు సూక్ష్మజగత్తులలో ఎన్ని రకాల శక్తిక్రియలు కన్పిస్తాయో, అవే ఈశ్వరుని అనంతశక్తి రూపాలు. ఆ శక్తినే మనం చైతన్యశక్తి అని ఒప్పుకోవాలి. ఎవరు తన శక్తిని ఆ అనంతశక్తితో సమ్మిళితం చేయగలడో, అతడే సాక్షాత్తు ఈశ్వరుని చక్కగా తెలుసుకోగలడు. ఈ అన్ని జగత్తుల సమష్టి భావమే ఈశ్వరుడు. దానిని బాగా అర్థం చేసుకొంటే ఈశ్వరుడు నిరాకారుడు, నిర్గుణుడు, అనంతుడు అన్న పదాలను స్పష్టంగా అర్థం చేసుకోగలుగుతాడు. ఈశ్వరుని పనులను, శక్తిని భక్తిభావంతో అర్థం చేసుకొంటే సాధకుడు క్రమంగా పూర్ణుడవుతాడు.

సృష్టికర్తను గురించి తెలుసుకోటానికి సృష్టిని గురించిన అధ్యయనము, దాని భావగ్రహణము, అవశ్యకము. ప్రళయకర్తను గురించి తెలుసుకోవాలంటే ప్రళయ తత్త్వాన్ని తెలుసుకోవాలి. అట్లాగే పాలనకర్తను గురించి తెలుసుకోవాలంటే పాలన తత్త్వాన్ని తెలుసుకోవాలి. దృఢచిత్తముతో అనాదిరూప సర్వకారణుడైన ఈశ్వరుని స్వరూపాన్ని తెలుసుకోటానికి చేసే ప్రయత్నమే ఉపాసన. ఈశ్వరతత్త్వాన్ని తెలుసుకోవాలన్న జిజ్ఞాస లేకపోతే, నదీ తీరంలోనో దేవాలయంలోనో కూర్చొని ప్రార్థన చేయటమో, ఏ దేవతనో గురించి భజన చేయటమో ఈశ్వరోపాసన అనిపించుకోదు. కాళికాదేవి శక్తి అనంతమైనది. ఆమెను ఉపాసించటం వలన ఐహికమైన - పారలౌకికమైన అనేక ఫలితాలు లభిస్తాయి. అలాంటి విశ్వాసంతో, కాళికాదేవి విగ్రహాన్ని ముందుంచుకొని ఉపాసిస్తే, అది కాళికాదేవి ఉపాసన అవుతుంది. కాని అది ఈశ్వరోపాసనకాదు. ఒకవేళ ఏదైనా సాకారమైన పదార్థాన్ని ఈశ్వరస్వరూపమని ఉపాసిస్తే అది ఈశ్వరోపాసన అవుతుంది.

ఏదైనా సాకార రూపాన్ని అదొకటే ఈశ్వరరూపమని భావిస్తే ఈశ్వరుని మహిమ పట్ల గర్వించినట్లు అవుతుంది. అట్లా చేస్తే ఉపాసకుడు భ్రాంతిలో పడిపోతాడు. కాళికాదేవి రూపాన్ని మనము ఈశ్వరుని మరొక రూపమని భావించి ఆ కాళీ రూపాన్ని మన అంతరంగంలో అనుభూతి పొందితే, అప్పుడు మనము ఈశ్వరుని ఆ రూపాన్ని కూడా వాస్తవమని తెలుసుకొంటాము. అలాంటి ఉపాసనకు తగిన ఫలం ఉండదనుకోకూడదు. ఎందుకంటే - అలాంటి సాకారోపాసన వలననే నిరాకారుడు, సర్వవ్యాపి, నిర్గుణుడు అయిన ఈశ్వరుని మహిమను తెలుసుకో గలుగుతాము.

మనుష్యులు చేసిన కర్మలకు తగిన ఫలమునిచ్చే శక్తే దేవత. అనిత్యసుఖమనే ప్రలోభంతో దేవతలు మనుష్యులను ముగ్ధులను చేసి ఉంచారు. అందువల్లనే మనుష్యుడు ఈశ్వరసంబంధం విషయంలో ఘోరాంధకారంలో పడి ఉంటాడు. మనిషిహృదయంలో సామాన్యమైన అనిత్య సుఖసంబంధమైన కోరికలు ఎప్పటి వరకూ ప్రబలంగా ఉంటాయో, అప్పటివరకూ సాధకుడు నిత్యసుఖాన్ని ఇచ్చే ఈశ్వరుని తెలుసుకోలేడు. భగవంతుని చేరాలన్నా - చూడాలన్నా మొదట కోరికలను వదిలిపెట్టాలి. ఈ సకామకర్మ దేవతోపాసన, నిష్కామకర్మ ఈశ్వరోపాసన అవుతుంది.

మట్టితోనో, లోహంతోనో, రాతితోనో చేసిన విగ్రహాన్ని చూసి, అదే ఈశ్వరుడని భావించే అజ్ఞాని కేవలం భ్రమలో పడతాడు. కల్పిత విగ్రహాలు ఈశ్వరుడైతే, కలలో లభించిన రాజ్యం కూడా వాస్తవమే కావాలి. ఈశ్వరుని మనము సహజరూపంలో చూడలేము. అందువలననే ఆ దేవతా స్వరూపాలను అజ్ఞానంతో నిర్మించుకొని పూజలు అర్చనలు చేసి మన కోరికలను పూర్తి చేసుకొంటాము. అలాంటి విగ్రహాలు ఆయన శక్తి స్వరూపాలు కలిగినవి కావాలి. కాని, జగత్తంతా వ్యాపించిన ఆ ఈశ్వరునిశక్తి అంతా ఆ విగ్రహాలలో లేకపోవటంవలన అవి పూర్తి ఈశ్వరరూపాలు కాలేవు.

మనిషి చేసిన కర్మయే శుభాశుభఫలములను ఇస్తుంది. ఆ కర్మాత్మకశక్తియే దేవత అని తెలుసుకొని వేదాంతశాస్త్రంలో చెప్పిన బ్రహ్మను, సాంఖ్యంలో చెప్పిన నిర్గుణ పురుషుని, యోగశాస్త్రంలో చెప్పిన నిర్వికల్ప సమాధి ద్వారా పొందవలసిన గమ్యం వరకూ పోవచ్చును. బ్రహ్మసాక్షాత్కారం కాకుండా నిత్యసుఖము, నిర్వాణ

ముక్తి లభించవు. దేవతోపాసనవలన భోగములు - ఐశ్వర్యలాభము కలుగుతాయి. అందువలన సమాధి సుఖం నుంచి వంచింపబడతారు. ఏకాగ్రచిత్తంతో ఎవరు ఎలాంటి కోరికలను కోరుకొంటే, వారి వారి ఏకాగ్రతా కారణంగా వారు కోరుకొన్న ఫలితాలు లభిస్తాయి. భోగములు ఐశ్వర్యముల కోరికలు ఉంటే, ఆ భోగ - ఐశ్వర్యములను ఇచ్చే దేవతానుగ్రహం కలుగుతుంది. అట్లాకాక నిష్కాములయితే అంటే బ్రహ్మజ్ఞానం తప్ప ఇతర కోరికలు లేకపోతే, నిర్గుణ నిరాకారశక్తియొక్క సహాయం లభిస్తుంది. బ్రహ్మసాక్షాత్కారము, కామకర్మలతో దేవతోపాసన, నిష్కామకర్మలు - అవే ఈశ్వరోపాసన. బ్రహ్మజ్ఞానాన్ని పొందాలనే కోరిక కలిగి, భోగములు ఐశ్వర్యములపట్ల కోరికలు లేక, సాకారోపాసన చేస్తే యథార్థంగా ఈశ్వరోపాసన చేసినట్లు అవుతుంది.

మనము దేనిని చేస్తామో దానిని కర్మ అంటారు. కర్మ రెండు రకాలు. 1. స్థూల కర్మ 2. సూక్ష్మకర్మ. మనం ఎక్కడికన్నా వెళ్లాలని అనుకొని, అక్కడికి వెళ్తే అది స్థూలకర్మ అవుతుంది. ఎందుకంటే శరీరంలో అంగపరిచాలనశక్తి వ్యయం అయింది కనుక. ఒకవేళ కేవలం ఆలోచన మాత్రంచేసి అక్కడికి వెళ్లకపోతే మానసికశక్తి మాత్రమే వ్యయమవుతుంది. చిత్తైకాగ్రతారూపమైన కర్మబీజములు ఉత్పన్నమై అవి చాలాకాలం స్థిరంగా ఉండిపోతాయి. దేవతోపాసనే వేదంలోని ఉపాసనాకాండ వంటిది. ఈశ్వరుడు నిష్కాముడు. అందువలన నిష్కామోపాసన చేస్తేనే ఈశ్వరుడు లభిస్తాడు. కోరిక -ఆశలు ఉంటే ఈశ్వరప్రాప్తి కలుగుతుందనే ఆశ ఉండదు. హిందువులు మాత్రం మోక్షం తప్ప ఈశ్వరుని ఏమీ కోరరు. నిత్యస్వరూపుడైన ఈశ్వరునికి నిత్యఫలమైన మోక్షం తప్ప ఇంకేరకమైన ఫలం ఇవ్వటం తెలియదు.

ఉపాసన లేకుండా ఏకాగ్రచిత్తుడై నోటితో కేవలం ఈశ్వరుడు జగద్రచయిత, అద్వితీయుడు, దయామయుడు, సర్వశక్తిమంతుడు, అచింత్యుడు, అవ్యక్తుడు మొదలైన మాటలు అనటం వలన, ఈశ్వర సంబంధమైన జ్ఞానం అతనికి ఏ మాత్రం కలగదు.

రాగద్వేషాది దోషమువలన శుభాశుభకర్మలు ఉత్పన్నమవుతాయి. కర్మయే ప్రపంచముయొక్క ఉత్పత్తికారణము. అందువలన అవిద్యను అన్ని విధాలా వదిలి పెట్టటమే కర్తవ్యము. ఒకవేళ ఎవరైనా అపకారం చేస్తే అపకారం పొందిన వ్యక్తి ఆ

అపకారం ఎవరికి చేశారు అని ఆలోచించాలి. అట్లా ఆలోచిస్తే, ద్వేషం అసలు కలగనే కలగదు. ఆత్మ వదిలిపోయిన తరువాత పంచభూతమయమైన ఈ శరీరము జడపదార్థమైపోతుంది. దానిలో జ్ఞానము చైతన్యము ఏమీ ఉండవు. అప్పుడు దానిని నిప్పుతో కాల్చినా, నక్కలు మొదలైనవి తిన్నా, దానికి ఏమీ తెలియదు. అలాంటి జడపదార్థానికి అవమానం ఏమిటి?

తన ఆత్మతో జగత్తు యొక్క ఆత్మను కలపటమే యోగము అంటారు. ఇలాంటి యోగ యుక్తాత్ముడైన ఆత్మ కలవాడు (యోగి) తనను సర్వభూతస్థుడనుకొంటాడు. జనమంతా ఒక్కచోట కూడినప్పుడు ఒకరకమైన పెద్ద శబ్దం వినబడుతుంది. అంతేకాని వేరువేరు శబ్దములు ప్రత్యేకంగా వినబడవు. కేవలము హెూ-హెూ అన్నధ్వనులే వినబడతాయి. దానిపేరే యోగము. అనేక స్వరములను ఒకే లయలో కలిపి వాయించినప్పుడు కేవలం ఒక్క శబ్దం మాత్రమే వినబడుతుంది. ఆ స్వరమే యోగము. ఈ విధంగా ప్రపంచంలోని సర్వభూతముల చైతన్యాన్ని ఎవరు అనుభవించగలుగుతారో, అతనికే చైతన్యము లేదా యోగము అంటే ఏమిటో తెలుస్తుంది. ఆ చైతన్యమే జగత్తుయొక్క ఆత్మ.

ఉపాసన ద్వారా ఉపాస్య దేవతతో ఉన్న సంబంధం 'సోహం' అనే దాని అర్థంగా 'సః ఏవ అహమ్' అన్న జ్ఞానం కలుగుతుంది. అతడే మనమెవరమో అని చక్కగా తెలుసుకోగలుగుతాడు. మనసంబంధము హస్తపాదాదులతోను, మనస్సుతోను గట్టిగా ముడిపడి ఉన్నది. అలాంటి అనుభవంవల్లనే హస్తపాదాదులు మనస్సు పట్ల మనవి అనే భావన కల్గింది. అట్లాగే మనకు ఈ ప్రపంచంతో ఎంతగట్టి సంబంధం ఉన్నదో అన్న విషయాన్ని మనిషి ఎంత ఉన్నతిని సాధిస్తే అంత ఎక్కువగా తెలుసుకోగలుగుతాడు. అనుభవశక్తి వికసించిన కొద్దీ మనుష్యులు ఈసంబంధాన్ని స్పష్టంగా అనుభవిస్తారు. తన ఆత్మజ్ఞానముతో ఈ జగత్తును కలుపుకోవటమే అసలైన యోగము. ఏ భిన్న భిన్న శక్తులతో ఈజగత్తు నడుస్తున్నదో ఆశక్తులన్నింటి క్రియలను మానవుడు ప్రయత్నించి తనలోనే చూడగలుగుతాడు. అందుకే మానవుని ఒక చిన్న బ్రహ్మాండమన్నారు.

❀ ❀ ❀ ❀ ❀

5. పూర్వజన్మము - పరజన్మము

పూర్వజన్మ – పరజన్మలు ఉన్నాయా? లేవా? అని తెలుసుకోవాలనే కోరిక ఉంటే వాటిని గురించి స్థిరమైన మనస్సుతో ఆలోచించాలి. అప్పుడు పూర్వజన్మ వర్తమాన జన్మ భవిష్యత్ జన్మ అనే మూడు జన్మలుగా స్పష్టంగా ఉన్నట్లు కన్పిస్తుంది. పూర్వజన్మలో మనము ఏమేమి కర్మలు చేశామో, ఎలాంటి స్వభావంగల వ్యక్తులమై ఉన్నామో, ఆ కర్మల ఫలాన్ని అనుసరించి, వాటి ప్రమాణాలను బట్టి, తరువాతి జన్మలో వర్తమాన శరీరం నిర్మించబడింది. వర్తమాన జన్మలో మనం చేస్తున్న మంచి చెడు కర్మలు మనకు చక్కగా తెలుసు. మంచి పని చేస్తే మంచి ఫలము, చెడు పనులు చేస్తే దుష్ఫలము అనుభవించవలసి వస్తుంది. దీనిని అందరూ అంగీక రించాలి. వర్తమాన జన్మలో మనము ఎలాంటి మనష్యులంగా తయారవు తున్నామో, ఈ పనుల వలన భవిష్యజ్జన్మలో ఎలాంటి స్వభావంకల వ్యక్తులము అవుతామో తెలుస్తుంది. చక్కగా ప్రయత్నంచేస్తే మనంతట మనమే అదంతా తెలుసుకోగలము. ఇతరుల సహాయం అక్కరలేదు.

వర్తమాన జన్మ యొక్క ఇహలోకమే పూర్వజన్మయొక్క పరలోకము. అలాగే వర్తమాన జన్మయొక్క పరలోకము భవిష్యత్‌జన్మ యొక్క ఇహలోకము. ఈ స్థూల శరీరంలోపల మరొక శరీరం కూడా ఉన్నది. దాని పేరే సూక్ష్మశరీరము. దానిలోపల మరొక శరీరం ఉన్నది. అదే కారణశరీరము. అరటిచెట్టులోని పొరలలాగా ఒకదానిలో ఒకటిగా ఉన్న ఈ త్రివిధ శరీరమే సంసార ప్రవాహంలో ప్రకాశిస్తున్నది. మానవశరీర నిర్మాణము –ఆకృతి, వర్ణము, స్వభావము, పండితుడు లేదా మూర్ఖుడు, కఠోర స్వభావుడు లేదా నమ్ర స్వభావుడు, ధార్మికుడు లేదా అధర్మవర్తి, సాధువు లేదా అసాధువు, సరళస్వభావుడు లేదా కుటిలుడు, రాజు లేదా జమీందారు, మధ్యతరగతివాడు లేదా పేదవాడు, ఉన్నత వంశస్థుడు లేదా నిమ్నవంశస్థుడు వంటివి అన్నీ పూర్వజన్మ కర్మానుభవంవలన వర్తమాన శరీరంగా ఏర్పడినవి. అదేవిధంగా తిరిగి ఈ జన్మయొక్క ఫలాన్ని అనుసరించి, భవిష్యత్ జన్మయొక్క శరీరము తయారవుతుంది.

జన్మనుంచి మృత్యువు వరకూ ఉన్న కాలమును ఆయువు అంటారు. ఆధ్యాత్మిక దృష్టిలో చూస్తే జీవుని ఆయువు అనంతమైనది. జీవుడు అక్షరుడు, అపరుడు.

జీవుడు నశించిన తరువాతనే ఆయన ఉపకరణములు నశిస్తాయి. జీవుడు ఎంత పుణ్యాత్ముడైతే అతని ఆయువు కూడా అంత ఎక్కువగా ఉంటుందని, అతడు అంత ఎక్కువ కాలం జీవిస్తాడని సాధారణంగా నమ్ముతారు. కాని అది పొరపాటు. జీవుడు ప్రపంచానికి ఎంతో దూరంగా ఉంటాడు. ఆయనను పాపము స్పృశించదు. జీవుడు కర్మఫలాన్ని అనుభవించటానికి ఈలోకానికి వస్తాడు. ఎందుకంటే ప్రపంచము కర్మఫలమును అనుభవించే స్థానము. పుణ్మాత్ములైనవారు ఎప్పుడు కర్మఫలమును అనుభవించలేరు. అందువల్లనే జీవుడు కర్మఫలమును పూర్తిగా అనుభవించిన తరువాతనే పాపముల నుండి విముక్తుడవుతాడు. అంతవరకూ అతడు ప్రపంచంలోనే ఉండవలసి వస్తుంది. పుణ్యాత్ములైనవారు చాలా రోజుల వరకు ప్రపంచంలో ఉండాలి. అలాగే పాపాత్ములైనవారు కూడా ఈ ప్రపంచంలోనే ఉండి తమ కర్మఫలాన్ని అనుభవించాలి. కర్మఫలము సమాప్తమైనవారు ఈ ప్రపంచం నుండి విముక్తులవుతారు. జీవితము ఎంత తొందరగా లయించిపోతే అతడు అంత పుణ్యాత్ముడు. పాపం నుండి విముక్తుడయ్యాకనే ఈశ్వరునిలో లయమవుతాడు. అప్పుడు అతని ఆయువు అనంతమై, భగవంతుని సంకల్పం ఉన్నంత వరకూ అతని శక్తి ఉంటుంది. మనిషి ఈవిధంగా పాపపుణ్యాల ఫలాన్ని అనుభవిస్తూ ఉంటాడు. అందువల్లనే కర్మఫలము పరిసమాప్తముకాకపోతే మళ్లీ మళ్లీ ఈ ప్రపంచంలో పుట్టవలసి వస్తుంది. పంచ భూతముల ప్రతిమ అయిన ఈ మానవుడు మృతి చెందిన తరువాత ఎక్కడికి వెళతాడు. లేక మృత్యువే చివరిదా? అని అడిగితే మనష్యులు తమ కర్మఫలమును ఈ జన్మలోనే అనుభవిస్తారని, మృత్యువే చివరిదని, ఇంగ్లీషు వారంటారు. ఆవిధంగా అనటం అన్ని విధాలా పొరపాటని చెప్పనవసరం లేదు. ఈశ్వరుడు ఉన్నాడంటే పరజన్మ కూడా ఉన్నదని తప్పకుండా స్వీకరించాలి. ఒకవేళ ఈశ్వరుడు ఉన్నాడంటే మనుష్యుని ఆత్మకూడా ఉన్నదని ఒప్పుకోవాలి. ఈశ్వరుని నశింపజేయలేనప్పుడు, ఈశ్వరునిశక్తిని, మనిషిని, ఆత్మను నశింప జేయలేము. ఒకవేళ పరజన్మ లేదంటే ఈశ్వరుని దయామయుడని ఎప్పుడూ అనలేము. అందుకు కారణము ఈ జీవితంలో ఒకడు రాజుగా, ఒకడు ప్రజగా, ఒకడు ధనవంతుడుగా, ఒకడు దరిద్రుడుగా, ఒకడు పెద్ద ఇంట్లోను మరొకడు చిన్న ఇంట్లోను ఎందుకు పుడతారు? పూర్వజన్మలో చేసిన కర్మప్రకారము దాని ఫలము పూర్తి కాకపోతే, మిగిలిన కర్మఫలము ననుసరించి మరొక శరీరము ధరిస్తారు. అందుకు స్పష్టమైన ప్రమాణము పుట్టుకతో

గ్రుడ్డివారైన వారు ఈ జన్మలో ఏమీ చూడలేరు. కాని మిగిలిన వారందరూ చక్కగా చూడగలుగుతున్నారు గదా! దానికి కారణం ఏదైనప్పటికీ పూర్వజన్మ పాపఫలాన్ని అనుభవిస్తున్నామని మాత్రం ఒప్పుకోరు. ఈ జన్మలో లభించిన శరీరము, ఆకారము, స్వభావము, జ్ఞానము మొదలైనవన్నీ పూర్వజన్మ కర్మఫలము వలననే సంభవించినాయని నమ్మాలి. ఈ జన్మలో దొంగతనం వృత్తిగా స్వీకరించి జీవనము గడుపుతున్నవాడు పూర్వజన్మలో కూడా వాని ఆకారము, స్వభావము, రాక్షసునివలె కఠినమై ఉండి ఉంటుంది. అలాగే ఈ జన్మలో ధర్మాచరణముతో జీవితము గడుపుతున్నవాని ఆకారస్వభావములు పూర్వజన్మలో కోమలంగా ఉండి ఉంటాయి.

ఒకడు తన జీవితాన్ని సంపూర్ణంగా ధర్మాచరణతో గడుపుతూ ఉన్నప్పటికీ సుఖంగా లేడు. ప్రపంచంలో నానారకాలైన కష్టాలనూ పొందుతున్నాడు. మరొకడు అతిగర్హితములైన పనులు చేస్తూ లంపటుడై రాక్షసప్రవృత్తిలో తన జీవితాన్ని ఆనందంగా గడుపుతున్నాడు. ఇదంతా పూర్వజన్మకు ప్రమాణము మాత్రమే. కాని ఒకడు జీవితంలో ధర్మాచరణ చేసినా సుఖమును పొందటంలేదు. అయినప్పటికీ అతడు ఎప్పుడో ఒకప్పుడు సుఖమును పొందవచ్చును. కాని ఈ జన్మలో కష్టపడుతున్నాడంటే అదంతా పూర్వజన్మ కర్మఫలమనే చెప్పవచ్చును. వాటిని అనుభవించే సమయం ఆసన్నమైనా, అతడు కష్టాలను పొందుతున్నాడు. రెండోవ్యక్తి పూర్వజన్మలో చేసిన సుకృతమునకు అనుభవించటానికి సమయం ఆసన్నమైనది కనుక అతడు సుఖజీవనం గడుపుతున్నాడు. కాని దాని తరువాత అతడు ఎన్నో కష్టాలను అనుభవించవలసి వస్తుంది. పాపకర్మలు అనుభవించటం ఈశ్వరునివల్లనే అని, అట్లాగే పుణ్యకర్మలు అనుభవించటమూ ఈశ్వరుని దయే అని కొందరు అనుకొంటారు. ఇదంతా అజ్ఞానంతో కూడిన అభిప్రాయము. మన ప్రవృత్తులు, ఇంద్రియములు మంచి చెడులను చేయిస్తాయి. కోపపడితే అనిష్టం జరుగుతుంది. కామం ఉంటే కావాలనే కోరిక నెరవేరవచ్చును. లోభం ఉంటే ఇతరుల ద్రవ్యాలను అపహరించే చేష్టలు జనిస్తాయి. అహంకారంవలన ఇతరులకు అనిష్టం చేసే ఆలోచన కలుగుతుంది ఇట్లా ఏది దేని ధర్మమో, అది ఆ పని చేయిస్తుంది. అందువల్లనే భగవంతుడు మనిషికి హితాహిత విచక్షణాశక్తినిచ్చి, జీవరాశిలో శ్రేష్ఠునిగా చేశాడు. మృత్యువుతో ఆత్మ నశించదు. అట్లా కాకపోతే ఈశ్వరునకు ప్రతిరోజూ అనేక ఆత్మలను సృష్టించవలసి వచ్చేది. దానివలన భగవంతుని పని ఎంతో పెరిగిపోయేది. అది సర్వశక్తిమంతమైనది.

శరీరం నశించిపోయినా ఆత్మకు ఎలాంటి హానీ కలుగదు. ఇల్లు నాశనమై పోయినా ఇంటిలోని ఆకాశానికి ఎలాంటి క్షితీ కలుగదు కదా! ఆత్మ దేనినీ చంపదు. దేని చేతనూ చంపబడదు. ద్వేషము సంతాపమునకు, సంసార బంధమునకు కారణము. ద్వేషమునకు మృత్యువునకు సంబంధము. అందువలన బలవంతంగానైనా ద్వేషమును త్యజించాలి. సుఖదుఃఖములు మనస్సుకు ఉంటాయి. కాని ఆత్మకు ఉండవు. ఆత్మ వాయువులాగా నిర్మలము, నిర్లేపము. అయినా ఈశ్వరమాయచే మోహితులమై, మనము సుఖము దుఃఖములను అనుభవిస్తూ ఉంటాము. విశ్వమోహిని - అనాది-అవిద్యా అనే వాటి పేరే మాయ. కేవలం పుట్టుక చేతనే ఆ అవిద్య లేదా మాయతో జీవునకు సంబంధం ఏర్పడుతుంది. అప్పుడది సంసార బంధమవుతుంది.

మనస్సు, బుద్ధి, అహంకారములు జీవునకు సహకరిస్తాయి. ఎవరు చేసిన కర్మఫలాన్ని వారే అనుభవించాలి. అంటే ఎవరి కర్మఫలం ఎట్లా ఉంటుందో, వారు అలాంటి ఫలాన్నే అనుభవిస్తారు. తిరిగి జన్మించినప్పుడు జీవుడు మనస్సు మొదలైనవాటన్నింటితో సంబంధం కలిగి, శరీరధారణ చేసే బాధ్యత వహిస్తుంది. జీవుడు ముక్తుడు కానంతవరకూ అదే ప్రకారం పరిభ్రమించవలసి ఉంటుంది. శరీరమే మనస్తాపమునకు మూలము. శరీరమే సంసార కారణము. కర్మఫలము వల్లనే ఈ శరీరము పుట్టినది. కర్మ రెండు రకాలు: పాపము, పుణ్యము అనేవి. పాపపుణ్యముల ననుసరించియే శరీరధారికి సుఖదుఃఖాలు కలుగుతాయి. ఎంత పాపం చేస్తే అంత దుఃఖము, ఎంత పుణ్యం చేస్తే అంత సుఖము లభిస్తాయి. రాత్రి పగళ్లలాగా అవి ఒకదాని తరువాత ఒకటి వస్తాయి. ఈ అనుభవములు పూర్తి కానంత వరకూ ముక్తి లభించదు.

జీవుని శరీరమునకు కర్త ఆత్మ. ఆత్మహీనమైన శరీరానికి సుఖదుఃఖములు కలుగవు. శబ్దస్పర్శ రూపరస గంధములలో దేనికీ జ్ఞానం ఉండదు. ఆత్మ శరీరమునకు కర్త అని నిశ్చయమైంది. సుఖదుఃఖముల అనుభవము శరీరమునకు ఆత్మ లేకుండా కలుగవు. ఆత్మ ఏకాకిగా వెళ్లిపోతుంది. శరీరము దాని వెంటపోదు. అందువలన కేవలము ఆత్మను శిక్షించటం అసంభవము. ప్రతిఒక్క శరీరంలోను భగవంతుడు ఆత్మ రూపంలో ఉన్నాడు. జీవాత్మ పరమాత్మ యొక్క అంశమాత్రమే! పాపము అనేక రకాలు అయినట్లు, వాని శిక్ష కూడా అనేక రకాలుగా ఉంటుంది.

అట్లాగే పుణ్యము కూడా అనేకరకాలు. దానివలన కలిగే ఆనందం కూడా అనేక రకాలుగా ఉంటుంది. చేసిన పాపానికి శిక్ష పరితాపమే. అట్లాగే చేసిన పుణ్యానికి పురస్కారము ఆనందము. పాపపుణ్యములను నిర్ణయించటానికి మానవహృదయమే ఒక త్రాసు పుణ్యం వలన సంతోషము, పాపంవలన పరితాపము అనేవి మానవ హృదయంలోనే జన్మించి, అతను చేసిన కర్మకు తగిన ఫలాన్ని ఇస్తాయి. ఈ పరిణామాలను గ్రహించినవారు బుద్ధిమంతులై, పాపమునుంచి తమను తాము మరల్చుకొంటారు. ఆ విధంగా పాపపుణ్యములను గురించి ఆలోచన, వాటి ఫలభోగము ఈజగత్తులోనే అవుతాయి. పంచభూతములు కేవలము పరమాణువుల సమాహారమే. పరమాణువు అవినాశకము. అందువలన పంచభూతములు కూడా అవినాశకములే. మృతశరీరము పంచభూతములు కూడా అవినాశకములే. మృత శరీరము పంచభూతాలలో కలిసిపోతుంది. ఈనాడు నీ ముందున్న శరీరము పూర్వజన్మలోని ఏదో జీవియొక్క శరీరపరమాణువులచేత నిర్మితమైనది. అందువలన ఒకప్పుడు ఉండిన జీవియొక్క పూర్వజన్మఫలమే నీ ముందున్న మానవుడు.

ఏ ఆత్మ ఎంత పరిమాణంలో పాపం నుంచి విముక్తి పొందుతుందో, ఏ ఆత్మ విషయభావనా శూన్యమైనదో, ఆ ఆత్మ అంత గొప్పది. ధార్మికుని ఆత్మ పాపి యొక్క ఆత్మ కంటె గొప్పది. ఆ ఉన్నత ఆత్మ శరీరాన్ని త్యజించినప్పటికీ అది ఉన్నతమైన ఆత్మగానే ఉంటుంది. ఆత్మ పురుషుడు; శరీరము ప్రకృతి. ఆత్మ-ప్రకృతికి సమీపంకానంత వరకూ అది వాసనాత్మకమై ఉంటుంది. అది శరీరమును త్యజించగానే పూర్వస్థితిని పొందుతుంది. ఆత్మ ప్రారంభదశలో నిర్గుణమైనప్పటికీ, శరీరస్థమైనప్పుడు సగుణ సంపన్నమవుతుంది. అది పాపం నుంచి విముక్తిని పొందనంతవరకూ పాపఫలమును అనుభవిస్తూనే ఉంటుంది.

పశుశరీరము నుంచి మనుష్యశరీరాన్ని ధరించటానికి, దాని స్వభావంలో మార్పు తీసుకొని రావటానికి ఎంతో ప్రయత్నం చేయవలసి ఉంటుంది. పశువునుంచి మనుష్యుడు కావటం ఎంత కష్టమో, మనిషి నుంచి పూర్ణ మనుష్యత్వం పొందటం అంతకష్టము. మనిషి నుంచి దేవత్వం పొందటం ఎంతకష్టమో, మనిషి నుంచి ఉత్తమ మనుష్యత్వం పొందటం అంతకన్న కష్టము. శుభకార్యములను అనుష్ఠించి మనుష్యుడు దేవుడు కావచ్చుకాని, అనాయాసంగా

నిజమైన మనుష్యుడు మాత్రం కాలేడు. సమస్త భోగాల మీది ఆశలను త్యజిస్తే కాని ముక్తి మందిరంలో చేరలేడు. సకామమైన శుభకార్యములవల్ల ముక్తిమార్గం మరీ దుర్లభమై పోతుంది. స్వర్గలోకభోగము లనుభవించటం పూర్తి అయిన తరువాత జీవుడు తిరిగి మర్త్యలోకంలో ప్రవేశించటానికి యోగ్యమైనది అవుతుంది. అందువలన మహాపురుషులు ఎప్పుడూ స్వర్గలోకమును కోరుకోరు. ఎందుకంటే – కర్మఫల భోగము తప్ప, స్వర్గము కూడా చిరస్థాయియైనది కాదు. అసలైన మనుష్యత్వాన్ని పొందటానికి ఇంద్రియాల విజృంభణను అరికట్టాలి. అరిషడ్వర్గ వశీకరణము, అంతఃకరణ విశుద్ధీకరణ, అన్నింటియందును సమదృష్టి, అభిమాన త్యాగము మొదలైనవి మనుష్యత్వసిద్ధికి ప్రధాన మార్గములు. అవేకాక – శమము, దమము, తితిక్ష, సమాధానము శ్రద్ధ, ఉపరతి వంటి గుణాలు కూడా మానవునిలో ఉండాలి.

మనుష్యత్వం పొందినప్పటికీ మానవునికి సహజంగా ముక్తి మీద కోరికుండదు. విషయభోగాలలో ఎంతవరకూ కష్టం అనుభవించడో, అంతవరకూ జీవుడు మహాజితేంద్రియుడు – యోగీంద్రుడు అయినప్పటికీ మోక్షమును సాధించలేడు. మోక్షమును సాధించటానికి ప్రధానోపాయము వాసనలను త్యజించటమే. ముక్తి కావాలనుకొన్నా ముక్తి కూడా లభించదు. మహాత్ముల సత్సాంగత్యం వలన తొందరగా ముక్తి లభిస్తుంది. జీవునికి తన సుకృతం వలననే ఆ సత్సాంగత్యం లభిస్తుంది. సాధువులు సాధారణంగా నిర్జన ప్రదేశాలలో ఉంటారు. వారు సహజంగా కనిపించినా వారిని మనము గుర్తించలేము. ఒకవేళమనం వారిని గుర్తిస్తే, వారు మనను తమ సమీపంలో ఉండనివ్వరు. ఒకవేళ వారికి సమీపంలో ఉండగలిగే అధికారం సంపాదించుకొన్నా వారి నిర్మలహృదయ సహాయమును సాధించలేము. ఒక సాగరమును తరించటానికి నావ సహాయం అవసరమైనట్లు గానే, ఈ సంసార సాగరాన్ని తరించటానికి మహాత్ముల నిర్మలహృదయ సహాయం అవసరము. సత్సాంగత్యము వలన అంతా సులభం అవుతుంది. ధార్మికుని ఆత్మ ధర్మబలంచేత క్రమంగా ఉన్నతిని పొంది, ఆ తరువాత మోక్షమును పొందుతుంది. అలాంటి ఉన్నతి ఒక నెలలోనో, ఒక సంవత్సరంలోనో సాధ్యం అయ్యేదికాదు. ఎంతోకాలం ప్రయత్నం చేస్తే కాని మోక్షం లభించదు. దానికి వ్యతిరేకంగా పాపాత్ముని ఆత్మ అధోగతిని పొందుతుంది. స్వర్గనరకములు ఏవీలేక, ఆత్మకు

ఉన్నతి - అవనతి మాత్రమే ఉంటాయి. ఆత్మోన్నత్యము. ఆత్మ అవనతుల ననుసరించి వివిధ అవస్థలను పొంది మానవుడు జన్మిస్తాడు.

ఈ విశాల ప్రపంచంలో ఎవరు ఎక్కడ జన్మిస్తారో పరిశోధించి తెలుసుకోలేము. అందువలననే మానవులు పునర్జన్మను విశ్వసించరు. పూనర్జన్మనుకాని, పూర్వజన్మనుకాని మనము చూడలేము. పునఃజన్మించిన వారెవ్వరూ వచ్చి చెప్పలేదు. కేవలము అనుమానము - యుక్తుల చేత మాత్రమే నమ్మవలసి ఉంటుంది. లేకపోతే - ధర్మా ధర్మములకు, పాపపుణ్యములకు ఎలాంటి తేడా ఉండదు. మనుష్యుడు పాపం చెయ్యటానికి ఎందుకు భయపడతాడు? అందుకు కారణము పరజన్మమీది విశ్వాసమే! పరజన్మలో ఘోరమైన నరకయాతనలు అనుభవించవలసి వస్తుందనే భయమే అందుకు కారణము. ఈ జీవితంలో ఒకరు విద్వాంసుడు, ఒకరు మూర్ఖుడు, ఒకరు పండితుడు, ఒకరు జ్యోతిష్యుడు, ఒకరు గొప్ప గాయకుడు, ఒకరు గొప్పవాద్య నిపుణులు కావటానికి కారణము వారు పూర్వజన్మలో అందులో సంపాదించిన నైపుణ్యమే. ఈ శరీరములోని ఆత్మ అదే కాని శరీరము మాత్రం భిన్నమైనది. అందువలన వారికి ఆ విషయాలు సహజంగా లభిస్తాయి. అంతేకాని నేర్చుకోటానికి ప్రత్యేకంగా కృషి చేయనక్కరలేదు. కర్మఫలం లేకపోతే అలాంటి భేదాలు ఉండవు. మంచి కర్మలకో, చెడు కర్మలకో అతడు ఇంత కష్టపడవలసిన అవసరం ఉండదు. మంచి పనులు చేస్తే ఉచ్చదశ లభిస్తుంది; చెడ్డపనులు చేస్తే నీచదశ లభిస్తుంది.

❀ ❀ ❀ ❀ ❀

6. ఆత్మబోధ

ఆత్మబోధకు అర్థము - మనను మనం తెలిసికొనటం. మనను మనం తెలుసుకోగలిగితే భగవంతుని కూడా తెలుసుకోగలము. మనను మనం తెలుసుకోలేనంత వరకూ భగవంతుని తెలుసుకోవాలని ప్రయత్నించినా తెలుసుకోలేము. మనమేమిటో తెలుసుకోవాలంటే ఆత్మ- మనస్సు- బుద్ధి అన్న మూడింటి తత్త్వాన్ని తెలుసుకోవలసిని అవసరం ఉన్నది.

సూర్యుడు భూమికి ఎట్లా కర్తో, అట్లాగే ఆత్మ శరీరానికి ప్రధాన వస్తువు, యజమాని, కర్త. సూర్యుని కిరణాల ప్రసరణవల్లనే, అన్ని జీవులు తమ తమ కార్యాలను చేసుకోగలుగుతున్నాయి. వాస్తవానికి సూర్యుడు ఏమీ చెయ్యడు. అలాగే మనుష్యశరీరంలో ఆత్మయే సూర్యునిలాగా కర్తయై ప్రకాశిస్తూ ఉంటుంది. ఆ ప్రకాశం వల్లనే ఇంద్రియాలు పనిచేస్తాయి. అంతేకాని ఆత్మ నిజంగా ఏమీ చెయ్యదు. ఇప్పుడు ఆత్మ సాకారమా నిరాకారమా అని తెలుసుకోవాలి. అంతేకాక, శరీరంలో ఏ స్థానంలో, ఎట్లా అది ఉన్నదో తెలుసుకోవాలి. ఆత్మ అని చెప్పబడే దానికి హద్దులున్నాయి. కాని దానికి దేనితోనూ పోల్చగల ఆకారం లేదు. మన ఆత్మ - ఇతరుల ఆత్మ రెండూ ఒకే రకమైనవి. ఒక కాగితం మీద నానా రకాల చిత్రాలు చిత్రింపబడినప్పటికీ వాటన్నింటికీ ఆ కాగితమే ఆధారమైనట్లు, జగత్తులోని అన్నింటి ఆత్మ ఒక్కటే! ఆత్మను గురించి మనం కొన్ని రోజులు మననం చేసినప్పుడు, ఆ ఆత్మ అగ్నికణంలాగా ప్రకాశిస్తున్నదని నిశ్చయంగా తెలుసుకొంటాము. ఆత్మ ఉన్నది కనుక పరమాత్మ కూడా ఉన్నట్లే. అదే ఈశ్వరుడు. ఆత్మ యొక్క విశిష్ట రూపమే ఈశ్వరుడు. అందువలన ప్రయత్నం చేస్తే అది తప్పక కన్పిస్తుంది. ఎందరో మహాపురుషులు దానిని చూశారు. ఇంకా ఎందరో చూస్తారు. కనుక ఆత్మ సాకారమైనదనటంలో సందేహం లేదు. ఆత్మను తెలుసుకొంటే పరమాత్మను తెలుసుకోవచ్చు. అట్లాగే పరమాత్మను తెలుసుకొంటే భగవంతుని లేదా ఈశ్వరుని తెలుసుకోవచ్చు. ఆత్మ పరమాత్మ యొక్క అంశమే అనేది నిశ్చయమైన విషయము. అందువలన, ఆత్మను తెలుసుకొంటే పరమాత్మను తెలుసుకోవచ్చు.

మనస్సు-బుద్ధి సాకారములా, నిరాకారములా అని తెలుసుకోవాలని చాలా మందికి కోరిక ఉంటుంది. మనస్సు విశ్వవ్యాపి కాదు. అది కొన్ని పరిధులు వరకే పరిమితమై ఉంటుంది. కనుక మనస్సు ఒక వస్తువిశేషమే అని నిశ్చయమవుతుంది. కొంతమంది ఇది మా మనస్సు, ఇది నీ మనస్సు అని అంటారు. ప్రతి మనిషీ చేసే పనులు వేరు వేరుగా ఉంటాయి. అట్లాగే మనస్సు చేసే పనులు కూడా వేరువేరుగా ఉంటాయి. ఇదికూడా ఆలోచిస్తే తెలుస్తుంది. అందువలననే మనస్సు కూడా సాకారమైనది. ఒకవేళ మనస్సు స్థానవ్యాపకతా రూపమైన ధర్మమును స్వీకరించకపోతే, దానిని వస్తువు అనరాదు. అప్పుడు మనస్సును ఏదో ఒక ప్రకారమైన స్థానవ్యాపకతాధర్మ విశిష్ట వస్తువు యొక్క గుణమని అనాలి. సామాన్యంగా స్థూల ఇంద్రియాల సహాయం లేకుండా, ఏద్రవ్యమూ ఆకారమును పొందదు. కనుక మనస్సు యొక్క ఆకారము ఏ రూపంలో ఉన్నదో అర్థం కాదు. ఆకార శబ్దపు యథార్థ అర్థం తెలిస్తే ఎవరికీ ఏరకమైన ఇబ్బందీ ఉండదు. ఒక్కసారి ఆలోచించి చూడు- నీ మనస్సు నీ శరీరం కన్న సంపూర్ణమైన భిన్నవస్తువుగా ఉండికూడా, నీ శరీరంలోని ఏ భాగంలోను లేదు. అట్లా ఉండటం కూడా ఎప్పుడూ జరుగదు. కనుక మనస్సు సాకారమైనదని నిశ్చయమవుతుంది. అంతేకాక దానిని బట్టి మనస్సు యొక్క కార్యములు కూడా విభిన్నములని తెలుస్తుంది.

బుద్ధి జగద్వ్యాపి కాదు. కాని దానికి ఏదో ఒక హద్దు ఉన్నదనేది నిశ్చయమైన విషయము. కనుక బుద్ధి కూడా ఒక వస్తు విశేషమే. అందరికీ బుద్ధి సమానంగా ఉండదు. అది ఒక్కొక్కరికి ఒక్కొక్క విధంగా ఉంటుంది. ఎవరికి బుద్ధి తక్కువగా ఉంటుందో వారిని బుద్ధిహీనులని అంటారు. బుద్ధి ఒక స్థానాన్ని ఆశ్రయించి ఉన్నప్పుడు అది సాకారమైనదనటంలో సందేహం లేదు. బుద్ధి మంచి చెడులను విచారిస్తుంది అనేది తెలిసిన విషయమే. మనస్సు-బుద్ధి రెండూ తలలో ఉంటాయిని సహజంగా తెలుసుకోవచ్చును. జీవ శరీరంలో బుద్ధి అద్దంలాగా ఉంటుంది.

ఒక్క ప్రణవ మంత్రం వల్లనే ఈ జగత్తులో సృష్టి స్థితి లయ కార్యములు జరుగుతున్నాయి. ఆ ప్రణవ మంత్రాధిదేవత అగ్ని. ఈ అగ్నిలోని శక్తి వల్లనే జగత్ చక్రం తిరుగుతున్నదని హిందువులు అనుకొంటారు. కాని అగ్నిగత శక్తి చైతన్య వంతమైనదని వారు భావించరు. హిందువులకు ప్రణవమంత్ర లక్ష్యం అగ్నిగతశక్తి. అది బ్రహ్మ. దాని గుణము చైతన్యము.

మన వ్రేలు మన చేతితో కలిసి ఉన్నంతవరకూ అది చైతన్యవంతమై ఉంటుంది. ఆ వ్రేలిని కోసి దానిని మన నుంచి వేరుచేస్తే దానిలో చైతన్యం ఉండదు. అది అచేతనమైన జడపదార్థం అయిపోతుంది. ఈ సమస్త జగత్తు చేతనామయుడైన ఒక పురుషుని శరీరము మాత్రమే. అది భిన్న భిన్న శక్తులకు ఆధారము. అగ్ని, వాయువు, నదులు, పర్వతములు, మట్టి మొదలైనవన్నీ ఆ శరీరము యొక్క అంగములు. అగ్ని అచేతనామయ పురుషునికన్న భిన్నముకాదని తెలిస్తే అందులో చైతన్యం ఉన్నట్లు తెలుస్తుంది. అచేతనామయ పురుషునితో అగ్నికి సంబంధం లేదనుకొనేవాడు అగ్ని జడపదార్థం అనుకొంటాడు.

ఆత్మ ఎల్లప్పుడు అంతటా వ్యాపించి ఉన్నప్పటికీ అది అన్ని చోట్లా ప్రకాశించదు. అది నిర్మలబుద్ధియందు మాత్రమే ప్రకాశిస్తుంది. ఇంద్రియాలు తమ తమ పనులలో నిమగ్నమై ఉండటంవల్ల ఆత్మయే అన్ని పనులలోనూ నిమగ్నమై ఉన్నట్లు అవివేకులు అనుకొంటూ ఉంటారు. ఉదాహరణకు – మేఘములు పరిగిడుతూ ఉండటం వలన చంద్రుడు పరిగిడుతూ ఉన్నట్లు మనకు అనిపిస్తుంది. సూర్యకిరణముల ఆధారంగా మనుష్యులు తమ తమ పనులు చేసుకొంటూ ఉన్నట్లు, శరీరము – ఇంద్రియాలు – మనస్సు – బుద్ధి అనేవి చైతన్యస్వరూపమైన ఆత్మను ఆశ్రయించి తమ తమ పనులు చేస్తూ ఉంటాయి.

అనురాగము, కోరిక, సుఖము, దుఃఖము మొదలైన వృత్తులు బుద్ధిలోనే కలుగుతాయి. ఆత్మలోకాదు. కారణమేమిటంటే – సుషుప్తి అవస్థలో ఆత్మ ఉంటుంది, కాని బుద్ధి ఉండదు. కనుక, ఆసమయంలో రాగము – కోరిక వంటివి ఉండవు. ఏ విధంగా సూర్యుని లక్షణము ప్రకాశము, జల లక్షణము శీతలత్వము, అగ్ని లక్షణము ఉష్ణత అయి ఉన్నాయో, అట్లాగే సత్యము, చైతన్యము, ఆనందము, నిత్యత, నిర్మలతలు ఆత్మ స్వభావములు. ఆత్మ యొక్క అస్తిత్వము, చైతన్యపు అంశ, బుద్ధి వృత్తుల సంయోగం వల్లనే అవివేకులైన వారిలో 'మాకు తెలుసు, మేము చేస్తున్నాము' వంటి ప్రవృత్తులు కలుగుతున్నాయి.

ఆత్మకు ఎలాంటి వికారమూ లేదు. ఏ పరిస్థితులలోను బుద్ధి ఆత్మను ప్రబోధించలేదు. అందువలన జీవుడు ఆ సంయోగవస్తువును తెలుసుకొని, 'మేము జ్ఞానులము, మేము ద్రష్టలము' అన్న జ్ఞానంతో ముగ్ధులవుతున్నారు. ఎట్లాగంటే – త్రాడులో సర్పభ్రాంతి కలిగినప్పుడు, సర్పభయం కలుగుతుంది. కాని అది త్రాడు

అని తెలిసిన తరువాత ఆ భయం ఉండదు. అట్లాగే జీవునిలో ఆత్మకు జీవజ్ఞాన మున్నట్లు భావిస్తే భయం కలుగుతుంది. మనము జీవులము కాము, మనము పరమాత్మయే అనుకొన్నప్పుడు ఇక భయం ఉండదు.

మనస్సు, బుద్ధి, మొదలైన ఇంద్రియాలను ఆత్మ ప్రకాశింపజేస్తుంది. అచేతన మైన బుద్ధి మొదలైన ఇంద్రియాలు ఆత్మను ప్రకాశింపజేయలేవు. ఎట్లాగంటే - దీపం అన్ని వస్తువులనూ ప్రకాశింపజేస్తుంది. కాని, దీపాన్ని ఏ వస్తువూ ప్రకాశింపజేయలేదు. దీపానికి దాని స్వరూపమైన ప్రకాశం ఉండగా మరొక దీపం యొక్క అవసరం లేనట్లు, ఆత్మకు కూడా తన స్వరూపము తెలిసిన తరువాత మరొక జ్ఞానము యొక్క అవసరం ఉండదు.

అవిద్యవలన ఉత్పన్నములైన దృశ్యవస్తువులన్నీ నీటి బుడగలలాగా నశించి పోయేవే! ఈ సమస్త వస్తువులకూ పైన ఏ నిర్మల బ్రహ్మమున్నదో అదే మనమని తెలుసుకోవాలి. ఇది మన శరీరము కాదు. మనము శరీరము కాదు. శరీరము కన్న మనము భిన్నులము అని తెలియాలి. ఆ కారణంగా జన్మ, జర, మత్యువు మొదలైన శరీర ధర్మాలు మనలో లేవు. ఇంద్రియాలు కూడా మనవి కావు. అందువలననే ఆ విషయాలతోను వాటి పనులతోను మనకు సంబంధంలేదు.

మన మనస్సు లేనేలేదు. అందువలన దుఃఖము, రాగము, ద్వేషము, భయము వంటి మనస్సంబంధి కార్యములు మనలో లేవు. మనము అప్రాణులము, అమలినులము, శుద్ధ ఆత్మ స్వరూపులము, అన్నది వేద ప్రసిద్ధ వాక్యము. నిర్గుణము, క్రియారహితము నిత్యమూ అయిన ఆత్మ ఏదో అదే. మనకు ఆకార వికారములు లేవు. ఎప్పుడూ మనము ముక్తులమే. మనకు నాశమే లేనప్పుడు, మనము అచలులము, ఎప్పుడు శుద్ధులము, నిర్మలులము, అంతేకాక ఆకాశంలాగా అన్ని వస్తువులకూ లోపల - బయట సమభావంతో ఉన్నాము. ఏ వ్యక్తి తనను గురించి తాను బ్రహ్మభావన చేస్తాడో అలాంటి వ్యక్తి ముందు దృశ్యమాన వస్తువులన్నీ నష్టమైపోతాయి. జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయము అన్న భేదములు పరమాత్మకు లేవు.ఆయన చైతన్యమయ ఆనందస్వరూపుడై స్వయంగా ప్రకాశిస్తాడు.

ఆకాశం ఘటంలో ఉన్నప్పుడు ఘటాకాశమని, వేరేవాటిలో ఉన్నప్పుడు ఆయా పేర్లతోనూ పిలవబడుతుంది. ఘటము పగిలిపోగానే ఆకాశమంతా ఒకటి

అయిపోతుంది. భిన్నభిన్న ఆకాశములంటూ ఉండవు. అట్లాగే పరమాత్మ కూడా భిన్నభిన్న ఉపాధులచేత విభిన్నమైన పేర్లతో చెప్పబడతాడు. ఉపాధి తొలగిపోయాక ఆ పరమాత్మ ఒక్కడుగానే మిగిలిపోతాడు. కనుక పరమాత్మ భిన్నభిన్నంగా లేడు. రసములో ఉప్పు ఎరుపురంగులను కలపటం వలన దానికి రుచి రంగు వచ్చినట్లు రకరకాల ఉపాధులైన జాతిపేరు, ఆశ్రయముల వంటి అన్ని వస్తువులు పరమాత్మ మీద ఆరోపింపబడినాయి.

ధాన్యాన్ని దంచితే బియ్యం వెలికి వచ్చినట్లు శరీరంలో ఆవరించిన పరమాత్మను యుక్తి ద్వారా శరీరం నుంచి వేరుచేసి భావనచేయటం వలనా ఆ భగవంతుని శుద్ధ స్వరూపము ప్రకాశితమవుతుంది. వేడి అగ్నిని ఆశ్రయించి ఉండునట్లు ఇంద్రియాది జడవస్తు సమితి – అద్వితీయము, నిశ్చలము, నిత్యజ్ఞాన స్వరూపము అయిన ఆత్మను ఆశ్రయించి తన తన పనులను నిర్వర్తిస్తూ ఉంటుంది. దానినే సర్వాంతర్యామి, జ్ఞానమయుడు, నిత్యుడు అయిన ఆత్మ అని తెలుసుకొనవలెను. అందువలన ఆత్మ అంటే మనమే. మనము అన్నప్పుడు అది అన్యపదార్థమని భావించరాదు. మనమే అది; అదే మనము; ఇతరము ఏదీలేదు. మనదేమీ లేదు. అంతా దానిదే అని తెలుసుకోవాలి.

మానవరూపము వాసనారూప వాయువు ద్వారా సంచలితమై జన్మజన్మాంతరాలలో పొందే దుఃఖము మాటలకు అతీతము. నామ, రూప, స్మృతులు అనే ప్రాణరూపమైన వాయువు ద్వారా పునర్జన్మకు హేతువులవుతున్నాయి. ఇది నాది - ఇది నాదికాదు వంటి భ్రమే సంసార బంధనమునకు కారణము. మనము అన్నప్పుడు ఆత్మకన్న భిన్నమైనది మరేదీ లేదు. అంతా బ్రహ్మమే అన్న భావన కల్గినప్పుడు ముక్తి లభిస్తుంది. అలాంటి ఉపాయములు కూడా మన అధీనంలోనే ఉన్నాయి. అలాంటి స్వాధీనోపాయములున్నప్పటికీ హద్దులు లేని సంసార నియంత్రణలను అనుభవించక తప్పదు. అది తేలికగా త్రోసివేయదగినది కాదు.

❀ ❀ ❀ ❀ ❀

7. తన్మయత్వము

జీవితంలోని ప్రతిదశ ఒక్కొక్క నిర్దిష్ట కార్యానికి నిర్ణీతమై యున్నది. మానవ జీవితములో ఆయా సమయాలలో చేయవలసిన పనులు చెయ్యాలి. దాని అర్థం ఒక సమయంలో చెయ్యవలసిన పనిని ఇంకొక సమయంలో చెయ్యకూడదని కాదు. ఒక వయస్సులో నిర్దిష్టమైన పనిని ఇతర వయస్సులలో కూడా చెయ్యవచ్చు. అయితే సమయానుసారంగా చేసిన పనులు విఫలం కావు. అసమయంలో చేసిన పనులే విఫలం కావచ్చును. ఒకటి రెండు సఫలమైనప్పటికీ, మొత్తం సఫలం కావు. కొన్ని కొంచెమే సఫలం అవుతాయి. యోగమునకు వార్ధక్యము సరియైన దశ. అప్పుడు మనస్సులో ఎలాంటి చెడు భావనలు ఉదయించవు. మానవుని ఇంద్రియాలు శిథిలమవుతూ ఉంటాయి. అందువల్లనే ఉపాసనకు అది మంచి సమయము. అయితే యౌవనదశలో ఉత్తేజితమయ్యే వృత్తులను జయించగల క్షమత ఎవరిలో ఉంటుందో వారు కూడా యోగ శిక్షణకు అర్హులే. కనుక యౌవనంలో ప్రవృత్తులను నివృత్తులుగా చేయటం వల్లనే యోగ శిక్షకు పాత్రులు కాగలుగుతారు.

యోగసాధన చెయ్యటం అంత సులభమైనదికాదు. యోగమనగా తన్మయత్వం చెందటం. తన్మయత్వ భావము హృదయంలో కుదుట పడకపోతే, యోగము కుదరదు ఒకవేళ కుదిరినా ప్రయోజనకారికాదు. ఒకవేళ తన్మయత్వం పొందినా, నీకూ ఈశ్వరునికీ భేదం లేకపోయినా, నీవు యోగశిక్షణను పొంది మంచి లాభాన్ని పొందవచ్చును. అంతేకాక యోగశిక్షణకు మంచి అధికారివి కావచ్చును. యోగ సంబంధ నియమాలన్నింటిలోను షట్చక్రభేదనము చాలా ప్రధానమైనది. షట్చక్ర భేదనము కాక మిగిలిన సాధనలు ఏవీ ప్రయోజనవంతములు కావు. ఏక మాత్రా కాలం షట్చక్రభేదన చేయగలిగితే స్వర్గ రాజ్యాధికారం పొందగలిగినంత సామర్థ్యం వస్తుంది. షట్చక్రములు యోగశాస్త్రము యొక్క సర్వస్వము. షట్చక్ర భేదనము చేయటం వలన చిదానంద స్వరూపుడైన పరబ్రహ్మ సాక్షాత్కారం పొందటానికి అర్హుడవుతాడు. సమస్త వృత్తులను నిరోధించటంలో బిందు మాత్రమైనా వ్యతిక్రమం జరిగితే, అది విఫలమవుతుంది. యోగ్యతగల వ్యక్తి పరిశ్రమ లేకుండానే షట్చక్ర భేదనం చేయగలుగుతాడు. మొదట షట్చక్రము లేమిటో తెలుసుకోవాలి. అప్పుడు యోగ్యత ఉంటే, వానిని భేదించే ప్రయత్నం చెయ్యాలి. అప్పుడే వాటి గొప్పతనము, ఆవశ్యకతలు అనుభవంలోకి వస్తాయి.

జీవశరీరంలో – అన్నమయకోశం ఆధారంగా మనోమయకోశము, మనోమయ కోశం ఆధారంగా ప్రాణమయకోశము, ప్రాణమయకోశం ఆధారంగా విజ్ఞానమయ కోశము, విజ్ఞానమయకోశం ఆధారంగా ఆనందమయ కోశము ఉన్నాయి. బొటనవ్రేలి చివరి కణుపంత పరిమాణంగల జీవాత్మ ఆనందమయ కోశం ఆధారంగా ఉన్నది. ఈస్థితి నాలుగు రకాలుగా ప్రవర్తిల్లుతూ ఉంటుంది. మొదటిది విశ్వావస్థ – అది శరీరములో ఉండి శరీరమును నడుపుతూ ఉంటుంది. అది జీవుని చేతనావస్థ. రెండవది తైజసావస్థ అది జీవుని స్వప్నావస్థ. మూడవది ప్రాజ్ఞావస్థ – అది జీవుని నిద్రావస్థ. నాల్గవది బ్రహ్మావస్థ ప్రాణులలో సర్వకాల సర్వావస్థలలోను జీవశరీరంలో బ్రహ్మ ఉంటుందని గ్రహించాలి. ఆ నాలుగు రకాల అవస్థలను అ,ఉ,మ,ఊ అన్న మంత్రం ద్వారా సాధించవచ్చును. నాడులలో నిరంతరంగా ప్రవహించే వాయువు పంచవాయువు అనబడుతుంది. వీటన్నింటి లోను నాడీ ప్రధానమైన సుషుమ్న, లోపలి పైభాగంనుంచి బయల్దేరి, తలలోని కేశమూలాల వరకూ వ్యాపించి ఉన్నది. ఈనాడిలో ప్రవేశించి, జ్ఞానము ఆనంద మయము అయిన అంతరాకాశములో పద్మాకారంలో ఉన్న గుహలో ఆత్మ ఉంటుంది. అక్కడే భూః – భువః ప్రభృతులు ఉన్నాయి. ఈ షట్చక్రభేదన చేసి, నాడీప్రధానమైన సుషుమ్నను, సంయమనం చేసిన ఆత్మలో ప్రవేశపెట్టి సచ్చిదా నందముతో కలపాలి. ఈ సమ్మేళనమే షట్చక్రభేదనం అనిపించుకొంటుంది.

కఠినయోగము కన్న సరళయోగమే సహజంగాను, అధిక ఫలం ఇచ్చేదిగాను ఉంటుంది. కఠినయోగం శరీరానికి మనస్సుకు రెంటికీ శిక్షణ అవుతుంది. కాగా, సరళయోగం కేవలం మనస్సుకే శిక్షణ అవుతుంది. మానసిక శిక్షణ లభించిన తరువాత శారీరక శిక్షణ యొక్క అవసరమే ఉండదు. కఠినయోగము – కుంభకము, వికుంభకము, అనుమీనము,

ఉత్క్రాంతి, దార్ఢ్ని – అవుతుంది. సరళయోగము – సత్యము, సత్ నిర్వికారము అవుతుంది. సరళయోగము సహజ సాధ్యము. దానిని సాధారణ వ్యక్తి గ్రహించ గలుగుతాడు. కఠిన యోగము సామాన్య మానవునికి సాధ్యం కాదు. సరళ యోగానికి అరణ్యవాసంకాని, శారీరక క్లేశముకాని అవసరంలేదు. కేవలం చిత్తవృత్తిని తన వశంలో ఉంచుకొని, దానిని సన్మార్గములో ప్రచలితం చేయగలిగితే మహాఫలాన్ని ఇస్తుంది. మనస్సులో చిన్మయమూర్తిని ప్రతిబింబింపజేసుకోగలిగితే,

శరీరక క్లేశము, తీర్థయాత్రలు, ఉపవాసము మొదలైనవాటి అవసరం లేదు. సద్వృత్తుల ఆలోచనల, సద్వృత్తుల అనుశీలన వలన ఫలం లభిస్తుంది. కాని తీర్థయాత్రలవలన లభించదు. మనస్సు పరిశుద్ధమై ఆత్మ పరిశుద్ధమై చిత్తము నిర్మలమైనప్పుడు, సాధకునకు హృదయంలోనే సర్వతీర్థములు దర్శనమిస్తాయి. అనగా సర్వతీర్థములు మానవశరీరంలోనే ఉన్నాయి. నాసికారంధ్రాలలో గంగ, ముఖంలో యమున, హృదయంలో వైకుంఠము, నుదుట వారణాసి, నాభిలో హరిద్వారము వంటి స్వర్గమర్త్యలోకాలలోని తీర్థరాజములన్నీ మానవ శరీరంలోనే ఉన్నాయి. ఏ నగరంలో ప్రవేశించటానికి ఎలాంటి అడ్డుకాని, సంకోచం కాని ఉండదో, అదే వైకుంఠము. భయమునకు మూలము పాపము. పాపియైనవాడు ఎప్పుడూ సంకుచితంగా ఉంటాడు. పాపరహితునకు ఎలాంటి శంకా ఉండదు. అతను ఎప్పుడూ అడ్డులేనివాడై, వైకుంఠధామంలోనికి వెళ్లటానికి అధికారి అవుతాడు. అతని హృదయంలో సచ్చిదానందమయ స్వరూపమైన వైకుంఠము విరాజమానమై ఉంటుంది.

వైకుంఠమనేది హృదయమునకు క్రింది భాగంలో ఇడా – పింగళనాడుల సంగమము. లేదా చంద్ర సూర్యుల సంగమము, అంటే గంగా యమునల సంగమము, ఈ సంగమంలో స్నానం చేయటంవలన జీవుని పాపాలన్నీ ప్రక్షాళిత మవుతాయి. గంగా యమునల సంగమము హృదయానికి క్రింది భాగంలో ఉంటుంది. ఇడ – ఆత్మజ్ఞానమని, పింగళ – వివేకమని చెప్పబడుతుంది. గంగా – యమునల సంబంధం ఎలా ఉంటుందో ఇడ– పింగళల సంబంధము సరిగ్గా అలాగే ఉంటుంది. పింగళ–అంటే వివేకం నుంచి, ఇడ–అంటే ఆత్మజ్ఞానము, ఉత్పన్నమవుతుంది. మనస్సును ఈ పింగళామార్గంలో ప్రవేశపెట్టి, క్రమంగా నివృత్తి ద్వారా ఇడతో సమ్మిళితం చెయ్యాలి. ఆ తరువాత, ఇడపింగళల సంయోగం ఎక్కడ అవుతుందో–అంటే ఆత్మజ్ఞానము వివేకములు ఏకమైనాయో మనస్సును అక్కడికి తీసుకొని వెళ్లి స్నానం చేయించటం వలన అంటే మనస్సును ఆత్మజ్ఞాన రూపమైన నీటిలో స్నానం చేయించటం వలన మహాఫలం లభిస్తుంది. ఆత్మ జ్ఞానము కలిగిన తరువాత, యోగము సహజసిద్ధమైపోతుంది. యోగము యొక్క ఫలము ఆత్మజ్ఞానమును పొందటమే! అంటే ఆత్మజ్ఞానాన్ని పొందటానికి యోగశిక్షణ తీసుకోవలసి ఉంటుంది. అందుకు ఇల్లువదలి పెట్టటము, అరణ్యవాసం

చెయ్యటము అవసరంలేదు. కేవలము కొన్ని నియమములను గురించి ఆలోచించటము ఆచరించటము చేస్తే యోగఫలము, ఆత్మజ్ఞానలాభములు కలుగుతాయి. ఆత్మజ్ఞానమును పొందటానికి ఇతరములైన సాధనముల అవసరంలేదు. కేవలం ఆ నియమాలను ధ్యానించటం వలననే యోగఫలం లభిస్తుంది. దానినే సరళ యోగం అంటారు. యోగఫలం సిద్ధించటానికి కావలసిన అన్ని వృత్తుల నిరోధానికి ఏకాంతం అవసరము. అట్లా చెయ్యకపోతే యోగఫలము సిద్ధించదు. ఆ నియమములు ఈ క్రింది నియమావళిలో ఉన్నాయి. వాటినా చరించటం వలనను, హృదయంలో వాటి భావాన్ని గ్రహించటం వలనను, యోగఫలం తప్పక లభిస్తుంది.

1. అసంతుష్టుడైన వ్యక్తి ఎవరినీ సంతుష్టుని చెయ్యలేడు. సంతుష్టుడైనవాడే అందరినీ సంతోషపరచగలుగుతాడు.

2. నాలుక పాపకథలు చెప్పటానికి అలవాటు పడింది. అందువలన దానిని నియంత్రించాలి.

3. అన్ని అనర్థాలకు మూలము ఆలస్యమే! అందువలన ఎన్ని ప్రయత్నాలు చేసి అయినా ఆలస్యాన్ని పరిత్యజించాలి.

4. ఈ ప్రపంచము ధర్మాధర్మములకు పరీక్షాస్థలము. అందువలన సావధాన చిత్తులై, ధర్మాధర్మ పరీక్ష చేసి పనులను చెయ్యాలి.

5. ఏ ధర్మము పట్ల అశ్రద్ధ చూపకూడదు. అన్ని ధర్మములలోను సారమున్నది. వాటిలో సత్యం నిజంగానే అంతర్హితమై ఉన్నది.

6. దరిద్రునికి దానం చెయ్యాలి. ధనవంతునికి దానం చెయ్యటం వృథా.

7. సజ్జన సహవాసమే స్వర్గము. దుర్జన సహవాసము నరకానికి మూలము.

8. ఆత్మజ్ఞానము, సత్పాత్రదానము, సంతోషంగా ఉండటము అనేవి మోక్ష ప్రాప్తికి హేతువులు.

9. శాస్త్రపఠనం చేసి, దాని మర్మములను తెలిసికూడా ఆచరించనివాడు పాపి కన్నను అధముడు.

10. ఏ పని చేసినా దానికి మూలం ధర్మమే కావాలి. లేకపోతే కార్యసిద్ధి జరుగదు.

11. ఎవరినీ ఎప్పుడూ హింసించకూడదు. మంచి ఉద్దేశ్యంతోకాని, చెడు ఉద్దేశ్యంతో కాని ఏ ప్రాణిని ఏ సమయంలోను హింసించకూడదు.

12. పాప పంకిలాన్ని ప్రక్షాళన చేసుకోకుండా, మితాచారం లేనివాడు, సత్యాభిమాని కానివాడు, రంగుబట్టలు ధరించి బ్రహ్మచారి అయినా, అతడు ధర్మము యొక్క కళంకరూపుడే!

13. కప్పులేని ఇంటిలో వర్షధారలు కురిసినట్లు, చింతాహీనమైన మనస్సులో శత్రుగణము ప్రవేశిస్తుంది.

14. పాపి అయిన వ్యక్తి ఈ జీవితంలో అనుతాపరూపమైన విశ్వంలో అన్నీ మర్చిపోతాడు. అతనికి తన చెడ్డపనులు జ్ఞాపకం వచ్చినప్పుడు, వెంటనే ఆ అనుతాపము జాగృతమవుతుంది.

15. (అ) చింతన శీలము (ఆత్మవిమర్శన) అమరత్వము పొందటానికి మార్గము. (అధర్మ) చింతనయే మృత్యువునకు మార్గము.

(ఆ) ఎవ్వరూ ఎప్పుడూ గర్వించకూడదు. అట్లాగే కామోపభోగచింతన చేయకూడదు.

16. చెడుమార్గంలో నడిచే మనస్సు చేసే అనిష్టం కన్న బద్ధ శత్రువు కూడా ఎక్కువ అనిష్టం చేయలేడు

17. తేనెటీగ పూలసౌందర్యము సుగంధములు చెడకుండా తేనెను మాత్రం ఎట్లా గ్రహిస్తుందో, అట్లాగే నీవు కూడా పాపములు అంటకుండా జ్ఞానసముపార్జన చెయ్యి.

18. అజ్ఞానియైన వ్యక్తి - వీడు నా పుత్రుడు, ఇదినా సంపద అని భావించి కష్టాల అనుభవిస్తాడు. ఆ నిజంలో నిజం లేదు. పుత్రులు కాని సంపదలు కాని అతనికి ఎట్లా చెందుతాయి?

19. కొంతమంది మాత్రమే అవతలి ఒడ్డుకు చేరుకొంటారు. ఎక్కువమంది ధర్మాన్ని గుడ్డిగా అనుసరించి ఇవతలి ఒడ్డుననే పరిగిడుతూ ఉంటారు.

20. యుద్ధంలో లక్షలమందిని జయించినవాడు నిజమైన విజేతకాడు. తనను తాను జయించినవాడే అసలైన విజేత.

21. పాపము మనమీదికి దండెత్తదని భావించి నిశ్చితంగా ఉండరాదు. ఒక్కొక్కసారి ఒక్కొక్క చుక్క చొప్పున పడిన నీటివల్ల కూడా బిందె నిండినట్లు జ్ఞానియైన వ్యక్తి కూడా పాపమయుడవుతాడు.

22. ఎవరితోను కఠోరంగా మాట్లాడకూడదు. ఎందుకంటే కఠోర వాక్యమలు పలికినప్పుడు, కఠోర వాక్యములు వినవలసి వస్తుంది కూడా. దెబ్బలు కొడితే, దెబ్బలు తినవలసివస్తుంది. ఎవరినైనా ఏడిపిస్తే మనమూ స్వయంగా ఏడవవలసివస్తుంది.

23. వాసనలను జయించలేనివాడు దిగంబరుడై, జటాధారియై, భస్మం పూసుకొని, భూశయనం చేసి ఎన్ని సాధనలు చేసినా పవిత్రుడు కాడు.

24. ఇతరులకు ఉపదేశించే ముందు, నీవుకూడా అట్లా ఆచరించు. తనను తాను వశం చేసుకొన్నవాడే ఇతరులను కూడా వశపరచుకోగలుగుతాడు. తననుతాను వశపరచుకోవటమే చాలా కష్టం!

25. పాపపుణ్యములు మనము చేసుకొన్నవే. ఒక వ్యక్తి రెండవ వ్యక్తిని పవిత్రునిగా చెయ్యలేడు.

26. ఈ జగత్తు నీటి బుడగలాంటిది; ఎండమావి వంటిది. అలాంటి జగత్తును ఎవరు తుచ్ఛంగా భావిస్తారో, వారిని మృత్యువు తేరిపారచూడలేదు.

27. తరుముకు వచ్చే కష్టాలలాగా ప్రకోపించే కోపాన్ని అదుపు చేయగలవాడే నిజమైన సారథి. ఇతరులు కేవలము కాంతికిరణాలను పట్టుకోవాలని వ్రేలాడేవారే!

28. ప్రేమద్వారా క్రోధమును జయించు. శుభము ద్వారా అశుభమును జయించు. నిస్వార్థతద్వారా స్వార్థతను జయించు. సత్యము ద్వారా అసత్యమును జయించు

29. గురువు ఇచ్చే ఉపదేశాన్ని మనస్సుతో విని, దానిని పాటించాలి.

30. అనవసరమైన మాటలు మాట్లాడకు. ఎక్కువగా మాట్లాడేవారు అబద్ధాలు ఎక్కువ చెబుతారు. శాంతి కొరకు ఎంతవరకు అవసరమో అంతవరకే కొద్దిగా మాట్లాడాలి.

యోగశిక్షణకు అరణ్యవాసము, నిరాహారములు అక్కరలేదు. చిత్తవృత్తి నిరోధమే యోగము. చిత్తమునకు వశీభూతమైన ఇంద్రియములను ఇష్టసాధనకు నియోగించ గల క్షమత గలవారికి ఈ జగత్తుఅయినా అరణ్యమైనా ఒకటే. ఏకాగ్రతయే యోగమునకు ప్రాణము. ఏకాగ్రతలో జీవాత్మ - పరమాత్మలు ఒకటైనప్పుడు, జీవాత్మ-పరమాత్మలలో తేడా ఉండదు. అప్పుడే సాధకుడు అసలైన యోగి అవుతాడు. ఈశ్వరుని పొందటానికి యోగాంగ సాధన అవసరంలేదు. భక్తి ద్వారానే భగవంతుని పొందవచ్చును. భక్తుడు భక్తిద్వారా ఆయనను ప్రసన్నుని చేసికొని, ఆయనలో లీనమైపోవచ్చును. దాన్ని కూడా సమాధి అంటారు.

సమాధి అంటే బ్రహ్మలో మనస్సును స్థిరీకరించటం. జీవాత్మ - పరమాత్మల ఏకీకరణము మొదలైనవి సమాధియోగము యొక్క ఫలస్వరూపములు. చిత్తము వశీభూతమై ఇతర కార్యముల నుండి నిస్పృహమై, ఆత్మలో నిలిచినప్పుడు, దానిని సమాధి అంటారు. ఏ స్థితిలో విశుద్ధమైన అంతఃకరణ ద్వారా ఆత్మావలోకనం చేసి ఆత్మలోనే తృప్తి, బుద్ధిలాభము, అతీంద్రియత్వము వంటి ఆంతరంగిక సౌఖ్యములను పొందుతారో, ఏస్థితిలో ఉండటం వలన ఆత్మతత్త్వ విచ్యుతి కలుగదో, ఏ స్థితిని పొందిన తరువాత సాధకుడు ఇతర లాభములను లాభములుగా భావించడో, ఏ స్థితిలో ఉండగా గురుతరములైన దుఃఖములు కూడా చలింపజేయలేవో, ఆ స్థితి పేరే యోగము. మనసును ఆత్మలో నిలిపి, స్థిరమైన బుద్ధితో మెల్లిమెల్లిగా విరతిని అభ్యసించాలి. చంచలమైన మనస్సు ఏయే విషయాల కోసం చరిస్తూ ఉంటుందో, వాటిని గురించి ఆలోచించకుండా, దానిని పట్టి లాగి ఆత్మకు వశపరచాలి. రజోగుణ - తమోగుణ విహీనులైన యోగిగణము ఈ ప్రకారంగానే మనస్సును సర్వదా వశీభూతం చేసి, అనాయాసంగా బ్రహ్మసాక్షాత్కారం పొంది, సర్వోత్కృష్ట సుఖాన్ని పొందుతారు. అంతటా బ్రహ్మదర్శనం చేయగలవాడు, తన మనస్సును సమాహితం చేసి, సకలభూతములలో ఆత్మను, ఆత్మలో సకలభూతములను దర్శిస్తాడు. నిష్కామంగా యోగాభ్యాసం చేసేవాడు మాత్రమే సమాధిస్థితికి లేదా మోక్షానికి అర్హుడవుతాడు. ఈశ్వరునిలో లీనమైన జీవాత్మా పరమాత్మతో లీనమవటమే ముక్తి.

సమాధి అంటే తన్మయభావము. ఎక్కడ జీవాత్మ - పరమాత్మ వేరనే భావం ఉండదో, ఎప్పుడు జీవుడు బాహ్యజ్ఞానశూన్యుడవుతాడో, ఎప్పుడు బాహ్యేంద్రి

యములు చలనము లేనివవుతాయో దానిని సమాధి అంటారు. మనస్సును ఇంద్రియాలకు వశం చెయ్యక, ఇంద్రియములను మనస్సుకు వశీభూతం చెయ్యటమే యోగాభ్యాసంలో ప్రధానోపాయము. మొదట ఇంద్రియాల నుంచి పుట్టిన చిత్తవృత్తులను నియంత్రించి, చిత్తమును వశీభూతం చేసుకోవాలి. ఆ తరువాత చిత్తమును చిత్తమునకు వశ పరచి అంటే సాంసారికమైన ఇంద్రియ వృత్తులకు వశీభూతమైన చిత్తమును నిష్కామమైన చిత్తంగా చెయ్యాలి. చిత్తమును వివిధ లక్ష్యముల నుంచి మరల్చి, అభీష్ట లక్ష్యమునకు మార్గదర్శకంగా చెయ్యాలి. వివిధ చింతనల నుంచి క్రమక్రమంగా నియంత్రించి ఎల్లప్పుడు ఆత్మచింతనలోనే నియోగించాలి. యోగము రెండు రకాలు 1. సకామయోగము. 2. నిష్కామ యోగము. సకామయోగాభ్యాసం చేసేవాడు మోక్షమును పొందలేడు. నిష్కామ యోగాభ్యాసియే మోక్షాన్ని పొందుతాడు. నిష్కామ ధర్మపాలనమే యోగమునకు మూలము.

ఆత్మతత్త్వము యోగమునకు ఒక అంగము. అంతేకాక అది యోగము యొక్క ఫలస్వరూపము కూడా! తన్మయత్వభావము కలిగిన తరువాత మరే అనుష్ఠానము అవసరంలేదు. తన్మయత్వభావమే యోగసిద్ధి. అలాంటి భావము లభించిన తరువాత దృష్టి అంతా కామ్యవస్తువుపైననే ఉంటుంది. మరేవస్తువుపైనా ఉండదు. అన్యచింతన ఉండదు. మనస్సులో కామ్య వస్తువు, కామ్య వస్తువుపై మనస్సు మాత్రమే ఉంటాయి. కామ్యవస్తువు మినహా జగత్తులోని మరే వస్తువు అతనికి కనబడదు. అ కామ్య వస్తువే మనస్సంతా నిండి ఉంటుంది. అప్పుడతడు జగత్తులో ఉండి కూడా, జగత్తులోని మనిషికాడు. అతని అస్తిత్వము కామ్యవస్తువే అవుతుంది. ఆ కామ్యవస్తువు లేనప్పుడు అతని అస్తిత్వమే ఉండదు. అట్లా కామ్యవస్తువులో కలసిపోతాడు. దాని పేరే తన్మయత్వము.

ఏదైనా పనిని చేసేటప్పుడు ఆ పనిలో తన్మయులు కావటం తప్పనిసరి. అట్లా చేస్తే ఆ పని విఫలము కాదు. ఆ పని తప్పక సిద్ధిస్తుంది. భావన ఎట్లా ఉంటుందో, సిద్ధికూడా అట్లాగే ఉంటుంది. కోరినదానిపట్ల ఎంతగా మనస్సు లగ్నమైఉంటుందో, దాని ఫలితం కూడా అంత ఎక్కువగానే ఉంటుంది. ఏ పనియైనా సంపూర్ణంగా సిద్ధించాలంటే, దానిపట్ల, సంపూర్ణ తన్మయత్వం పొందాలి. ఏకాగ్రత లేకుండా

తన్మయత్వం రాదు. ఏ పనినైనా చేయటానికి అది అవసరం కనుక, ముందుగా ఏకాగ్రతలో శిక్షణను పొందాలి. ఏకాగ్రత లేకపోతే ఆ పనిలో తన్మయత్వం కలుగదు. పనిలో విశ్వాసం లేకపోతే సిద్ధి కలుగదు. కార్యసిద్ధికి మూలం విశ్వాసమే.! కనుక పనిపట్ల విశ్వాసాన్ని పెంచుకోవాలి. తన్మయత్వము, ఏకాగ్రత, ఫలసిద్ధి, వీటన్నింటికీ మూలం విశ్వాసమే.

సృష్టిచేసే సమయంలో భగవంతుడు అన్నిటికన్నా మొదట మాయను సృజించాడు. ఆ మాయ జ్ఞాత-జ్ఞేయము-జ్ఞానములలో కార్యకారణ రూపములలోను, సత్వ-రజ-స్తమో గుణములలోను, విశిష్టమై యున్నది. దానికి రెండు శక్తులు ఉన్నాయి. మొదటిది ఆవరణ శక్తి - అంటే, మాయచేత జీవుడు ఆచ్ఛాదింపబడి ఉండటం వలన నిత్యసత్య స్వరూపుడైన పరమాత్మను పొందలేక, అహంకారంతో తనను తాను స్వతంత్రుడనని భావిస్తాడు. రెండవది విక్షేపశక్తి - దీనివలన జీవుడు అసత్యమైన వస్తువును సత్యముగా భావించి జగత్తును నిత్యంగాను సత్యంగాను భావిస్తాడు. అంతేకాక భగవంతుని మరచిపోయి, అనిత్య విషయవస్తువులోనే ఉండిపోతాడు.

తాంత్రిక విధానంలో షట్చక్ర భేదనము :

సత్వరజస్తమో గుణ విశిష్టమైనది, చంద్ర సూర్యాగ్ని రూపమైనది, స్వచ్ఛమైనది అయిన సుషుమ్న నాడి ఇడ-పింగళ నాడులకు మధ్యలో ఉన్నది. చతుర్దళాకారంలో ఉన్న ఆనాడి, మూలాధార పద్మంనుంచి, శిరస్సులోని బ్రహ్మరంధ్ర పర్యంతము విస్తరించియున్నది. ఈనాడికి చుట్టబడి ఆసనము, లింగము,నాభి, హృదయము, కంఠము, భ్రూమధ్యము, శిరస్సులలో వరుసగా - మూలాధారము, స్వాధిష్ఠానము, మణిపూరము, అనాహతము, విశుద్ధము, ఆజ్ఞా, సహస్రారము అనే ఏడు పద్మాలు ఉన్నాయి. ఈ సుషుమ్ననాడి మధ్యలో మణిలాగా ప్రకాశించే వజ్రా అనే నాడి ఉన్నది. మరల దానిలో చంద్ర సూర్య అగ్ని రూపమైన, బ్రహ్మ విష్ణు శివులతో కూడిన చిత్రా (చిత్రిణి) అనే నాడి సాలెపురుగు దారములాగా ఉన్నది. నిర్మలమైన జ్ఞానోదయము లేకపోవటం వలన ఈ నాడిని ఎవరూ తెలుసుకోలేరు. మరల ఆ చిత్రానాడిలోపల అతిసూక్ష్మమైన విద్యున్మాలలాగా ఉజ్జ్వలంగా ప్రకాశిస్తూ బ్రహ్మ నాడి అనే మరొకనాడి ఉన్నది. ఈ బ్రహ్మనాడిలోని రంధ్రం ద్వారా బ్రహ్మరంధ్రం

లోని సహస్రార పద్మంనుండి సుధ ప్రవహిస్తూ ఉంటుంది. యోగులు ఆ సుధను మూలాధార పద్మం వద్దనున్న కుండలినీశక్తి ద్వారా పానం చేసి, సిద్ధానందమును అనుభవిస్తారు.

1. మూలాధారచక్రము ఆసనములో ఉన్నది. ఇది చతుర్దళములు, స్వర్ణకాంతి, అధోముఖముతో ఉండే పద్మము. సాధనకాలంలో సాధకుల ఊర్ధ్వముఖులై చింతన చెయ్యాలి. ఈ చక్రపు నాలుగు దళములలో "వం, శం, షం, సం" అనే నాలుగు వర్ణాలు ఉన్నాయి. మధ్యలో చతురస్రాకారంలో పృథ్వీచక్రం ఉన్నది. ఆ చక్రము ఉజ్జ్వలము, పీత వర్ణము, అష్టశూల సంయుతము అయినది. దాని మధ్యలో 'భం' అంటే పృథ్వీబీజం ఉన్నది. దానితో కలిసి లక్ష్మీబీజం ఉన్నది. ఆ చక్రానికి అధిదేవత ఇంద్రుడు. ఆయన ప్రక్కన చతుర్ముఖుడైన బ్రహ్మ చతుర్వేద పారాయణచేస్తూ, భౌతిక పదార్థాలను సృష్టిస్తూ ఉంటాడు. ఆ చక్రంలో రక్తవర్ణము - చతుర్‌బాహువులు కలిగి, ద్వాదశాదిత్యులతో సమానమైన డాకినీ శక్తి ఉన్నది. వజ్రానాడి ప్రారంభంలో కామరూపమనే పీఠం ఉన్నది. ఆ పీఠం మీద త్రికోణయంత్రం ఉన్నది. ఈ యంత్రం నుంచి బయటికి వచ్చిన కందర్ప వాయువు జీవాత్మను పట్టుకొని ఉన్నది. ఈ త్రికోణ యంత్రంలో శరత్కాల చంద్రునిలాగా లింగరూపియైన స్వయంభువు దున్నాడు. ఆ లింగము వద్ద మూడున్నర సార్లు చుట్ట చుట్టుకొని ఉన్న బ్రహ్మనాడి ఉన్నది. ఆ బ్రహ్మనాడీ ముఖమును ఆనుకొని కుండలినీ శక్తి నిద్రాణమై ఉన్నది. అక్కడే విద్యుత్ రూపిణియైన మహామాయ తుమ్మెదలాగా మధురమైన గున-గున-శబ్దము చేస్తున్నది. అదే శబ్దజనని. శ్వాస-ప్రశ్వాసల ద్వారా ప్రాణులను రక్షించేది అదే! ఈ కుండలినీశక్తి శరీరంలోని పరమకళ. త్రిగుణాత్మకమైన అంశ రూపాత్మక మైన సమస్త బ్రహ్మాండమును ప్రకాశింపజేస్తున్నది.

2. స్వాధిష్ఠాన చక్రము లింగమూలమున ఉన్నది. ఇది షడ్దళ-అరుణవర్ణ పద్మము. దీని ఆరుదళములలో "బం, భం, మం, యం, రం, లం" అనే వర్ణాలు ఉన్నాయి. దానిలో పద్మాకారంలో ఉన్న వరుణ దేవతాచక్రం ఉన్నది. ఆ చక్రంలో శరత్కాల చంద్రకాంతి, తలలో అర్ధచంద్రధారి - మకరవాహిని - వం బీజరూపి అయిన వరుణదేవత ఉన్నది. ఆ దేవత ప్రక్కన 24 లక్షణాలు కలిగి, పీతాంబరధారి అయిన నారాయణుడు ఉన్నాడు. ఆ చక్రానికి శక్తి లక్ష్మీరూపిణియైన రాకిణి.

3. మణిపూరచక్రము నాభిమూలములో ఉన్నది. అది దశదళ-నీలవర్ణ పద్మము. దాని పది దళాలలో "టం, డం, ణం, తం, థం, దం, ధం, నం, పం, ఫం" అనే పది వర్ణాలు ఉన్నాయి. దానికి సరిగ్గా మధ్యభాగంలో టం ఆకారాత్మక త్రికోణాకార అగ్ని బీజం ఉన్నది. దానిని ఆవరించి స్వస్తికాకార మండలం ఉన్నది. అక్కడ ఉన్న అగ్ని దేవత చతుర్బాహువై, మేఘవాహనుడై, ఎట్టని సూర్యునితో సమానంగా ప్రకాశిస్తున్నాడు. ఆయన ప్రక్కన ఆయనకు ఇష్టదేవత - సంహారకారి అయిన మహాకాళుడు ఉన్నాడు. ఆ చక్రానికి శక్తి లాకిని. ఆమె నల్లని వర్ణముకలది.

4. అనాహత చక్రం హృదయంలో ఉన్నది. అది ద్వాదశదళ సింధూర వర్ణపద్మము దాని పన్నెండు దళాలలో "కం, ఖం, గం, ఘం, ఙం, చం, ఛం, జం, ఝం, ఞం, టం, ఠం, అనే 12 వర్ణాలున్నాయి. దాని మధ్యలో షట్కోణాకారంలో ధూమ్రవర్ణంలో ఉన్న వాయుమండలం ఉన్నది. దానిలోపల యం ఆకారాత్మక వాయు బీజదేవత ఉన్నది. అది కృష్ణవర్ణంలో, మృగవాహినియై ఉన్నది. ఆ బీజంలో హంసలాగా స్వచ్ఛమైన వర్ణములో అభయ వరదుడైన ఈశానుడు ఉన్నాడు. ఆ చక్రానికి శక్తి కాకిని. ఆ శక్తిలో స్వర్ణ వర్ణాత్మకమైన బాణలింగ రూపంలో మహాదేవుడు ఉన్నాడు. ఆ పద్మంలో మరొక అష్టదళ పద్మం ఉన్నది. దానిమీద ఒక కల్పవృక్షం ఉన్నది. దాని క్రింది మణిపీఠంలో హంసరూపియైన జీవాత్మ ఉన్నది. సాధకుడు ఇక్కడ నిలిచి గురూపదిష్టమైన దేవతను ధ్యానించాలి. అట్లా చేస్తే ఆత్మదర్శనమవుతుంది.

5. విశుద్ధచక్రం కంఠంలో ఉన్నది. ఇది ధూమ్ర వర్ణంలో ఉన్న షోడశ దళ పద్మము. దాని 16 దళములలో "అ, ఆ, ఇ,ఈ,ఉ, ఊ, ఋ, ౠ, , , ఏ, ఐ, ఓ, ఔ, అం, అః"అన్న 16 స్వరములు ఉన్నాయి. ఆ పద్మ కర్ణికలో తెల్లని ప్రకాశవంతమైన శరీరముగలవాడు, తెల్లని వస్త్రములు ధరించినవాడు, గోళాకార ఆకాశ చక్రధారి అయి ఏనుగు నధిష్ఠించి ఉన్నాడు. ఆ చక్రములో హంసాకారి, పాశాంకుశధారి, ద్విబాహువు, అభయవరదాత అయిన ఆకారబీజ మున్నది. దాని ప్రక్కన పంచముఖములు, త్రినేత్రములు, దశభుజములు కలిగిన ఈశ్వరగౌరి ఉన్నది. దానిలోని చంద్రమండలం నుంచి సుధాపానం చేస్తూ, పీతవర్ణ - చతుర్భుజ అయిన సాకినీశక్తి ఉన్నది.

6. ఆజ్ఞాచక్రము భ్రూయుగ్మ మధ్యనున్నది. ఇది ధ్యానం చెయ్యవలసిన ప్రదేశము. అది తెల్లని ద్విదళపద్మము. దాని దళములలో "హ, క్ష" వర్ణములు ఉన్నాయి. ఈ ప్రదేశంలోనే ఇడ - పింగళనాడులు, వరుణ - అసినదుల రూపంలో కలిసి వారణాసీ తీర్థమును చేసినాయి. ఆ పద్మంలో శుక్లవర్ణ షణ్ముఖి అయిన హాకినీశక్తి ఉన్నది. ఆమె నాలుగు చేతులలో పుస్తకము, కపాలము, డమరుకము, జయమాల ఉన్నాయి. ఈ పద్మమును ధ్యానించటం వలన బ్రహ్మజ్ఞాని అవుతారు. ఈ పద్మంలో మనస్సు, కర్ణికలో త్రికోణ యంత్రము ఉన్నాయి. ఇక్కడ పరమ లయస్థానం ఉన్నది. అక్కడ శుక్ల అనే పేరుగల మహాకాళుడు త్రినేత్రుడు అయిన సిద్ధలింగము ప్రకాశిస్తున్నది. ఈ శివుడు అర్ధనారీశ్వరుడని ప్రఖ్యాతి గాంచినాడు. ఆజ్ఞాచక్ర పరిజ్ఞానం కలిగిన తరువాత జీవునకు అద్వైత భావన కలుగుతుంది.

7. ఆజ్ఞాచక్రానికి కొద్దిగా పైభాగంలో శుద్ధము - జ్ఞానము- జ్ఞేయము - దీపశిఖవలె జ్యోతిర్మయము, ఓంకారాత్మకము అయిన అంతరాత్మ నిరంతరముగా ఉంటాడు. దానిమీద అర్ధచంద్రాకారము, దానిపైన బిందువు రూపంలో ఓం అన్న నాదము, శక్తిరూపక సాకారాత్మక పూర్ణచంద్రునిలాగా ప్రకాశిస్తున్న ఉజ్జ్వల శివలింగము ఉన్నవి. ఆ 'ఓం' కారంపైన రెండు భుజములు కల మహానాదము అన్నపేరుగల శిఖాకారవాయువు యొక్క లయస్థానం ఉన్నది. ఆ ఆజ్ఞా చక్రంపైన శంఖిణి అన్న పేరుగల నాడికి ముందు ఆకాశంలో విసర్గ (ః) లాంటి రెండు బిందువులున్నాయి. దానిక్రింద పూర్ణచంద్రునిలాగా శుభ్రవర్ణము, బాలసూర్య ప్రభాభాసమైన కేసరములతోనున్న సహస్రదళ పద్మము అధోముఖియై ఉన్నది. దానిలో పంచాశత్ (50) మాతృకావర్ణములు యథాస్థానంలో ఉన్నాయి. ఆస్థానంలో నిర్మలమైన కుందేలు చంద్రుడు ఉన్నాయి. ఆ చంద్రునిలో విద్యుదాకారంలో త్రికోణయంత్రం ఉన్నది. ఆ యంత్రంలో అతిరహస్యమైన చిద్రూపాకార స్థానం ఉన్నది. అక్కడ పరమాత్మ స్వరూపుడైన పరమశివుడు విరాజిల్లుతున్నాడు. అతడు యోగానందము -జ్ఞానము-శుభముల నొసగేవాడు. అతనినే పరమహంస అనికూడా అంటారు. ఇక్కడే శైవుల కైలాసము, వైష్ణవుల గోలోకము, శాక్తేయుల మహాశక్తినివాసము ఉన్నాయి. ఆ సహస్రదళ పద్మంలోపల లేత సూర్యునివంటి ఎఱ్ఱని కాంతి, అతిసూక్ష్మము, విద్యున్మాలవంటి జ్యోతిర్విశేషము, శుద్ధము, నిర్వికారము, నిత్య ప్రకాశమానము, ఉదయాస్తమయ రహితము, అధోముఖి

అయిన పూర్ణానందపరంపర నుండి అమృతధార కురుస్తూ ఉంటుంది. దానిని ధరించేది 'అమా' అనే చంద్రకళ. దానిలోపల వెంట్రుక కొనలో వెయ్యోవంతు ఉండే అర్థచంద్రాకార ద్వాదశాదిత్య ప్రభావిశిష్టమైన, ప్రాణులకు ఇష్టమైన నిర్వాణకళ ఉన్నది. అది మహాకుండలిని అనే పేరుతో ప్రఖ్యాతమై ఉన్నది. తిరిగి ఆ నిర్వాణకళలోపల కోటిసూర్యప్రభాభాసమైన శివలింగమున కర్మ ఫలదాయిని యైన నిర్వాణశక్తి ఉన్నది. ఆ నిర్వాణశక్తి మధ్యభాగంలో యోగి, మహాత్ములచే చింతన చేయబడేవాడు, పరమ సుఖమయమైన నిత్యానంద స్వరూపుడు అయిన తురీయబ్రహ్మ ఉన్నాడు.

యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధి, తపస్సులతో యోగి దీర్ఘజీవనము, ఆకాశగమనము, అంతర్ధాన శక్తి, పరకాయ ప్రవేశము, దూరదర్శనము, భూత-భవిష్యత్-వర్తమాన త్రికాల దర్శనము, అణిమ, మహిమాచైవ గరిమా లఘిమాప్రాప్తి ప్రాకామ్యము - ఈశత్వము - వశిత్వము - కామావసాయిత్వము ఇత్యాది అష్టసిద్ధులను పొందుతాడు. అణిమ అంటే అణువులాగా చిన్న దేహమును ధరించే శక్తి. మహిమ అంటే పెద్దది. మాహాత్మ్య యుతమైనది అయిన శరీరాన్ని ధరించే శక్తి. గరిమ అంటే బాగా బరువెక్కడం. లఘిమ అంటే తేలికగా అయిపోయి ఆకాశ గమనం చేయగలశక్తి. ప్రాప్తి అంటే ఈ విశ్వంలోని అన్ని వస్తువులనూ హస్తగతం చేసుకొనేశక్తి. ప్రాకామ్యమంటే యథేచ్ఛగా చేయగలశక్తి. ఈశత్వమంటే ప్రభుత్వశక్తి. వశిత్వమంటే అన్నింటినీ తన వశంలో పెట్టుకోగల శక్తి. కామవసాయిత్వమంటే అన్ని కోరికలను తీర్చుకొని నిష్కాములు కావటం. భక్తి లేకుండా సాధకుడు తన పురుషకార సాధన ద్వారా ఎంత ఉన్నతిని పొందినా, అతనికి పతనావకాశం సిద్ధంగా ఉంటుంది. తపస్సులో చివరి మెట్టుమీదికి వెళ్లినప్పటికి, దానిలో ఒక్కొక్కసారి అవిశ్వాసము నైరాశ్యము చోటుచేసుకొని ఉంటాయి. కాని వాటితోపాటు భక్తికూడా ఉంటే, అవిశ్వాసం ఎప్పుడూ కలుగదు. అప్పుడు యోగి అనాయాసంగా ముక్తిని పొందగలుగుతాడు. ఆత్మలో పరమాత్మ సంయోగం చెందటమే తన్మయత్వము. ఏదైనా ఒక విషయం మీద మనస్సును లగ్నంచేసి ఇతర విషయాలపట్ల మనస్సు లాగకుండా ఉండటమే తన్మయత్వము. తన్మయత్వం వల్లనే బంధమోచనమై ముక్తి లభిస్తుంది.

❀ ❀ ❀ ❀ ❀

8. కొన్ని సారోక్తులు

శిష్యుడు : భూమిని సృష్టించటానికి పూర్వం ఎవరున్నారు

గురువు : పంచభూతములు – ఈశ్వరుడు.

శిష్యుడు : భూమిని జీవరాశిని ఎవరు సృష్టించారు?

గురువు : ఈశ్వరుడు.

శిష్యుడు : సృష్టిని ఎవరు వృద్ధిపరుస్తారు?

గురువు : బ్రహ్మ

శిష్యుడు : బ్రహ్మ ఎవరు?

గురువు : ఈశ్వరుని శక్తి.

శిష్యుడు : సృష్టిని పాలించేది ఎవరు ?

గురువు : విష్ణువు లేదా నారాయణుడు.

శిష్యుడు : విష్ణువు ఎవరు?

గురువు : ఈశ్వరుని శక్తి

శిష్యుడు : సృష్టిని లయము లేదా ధ్వంసము చేసేది ఎవరు?

గురువు : మహేశ్వరుడు – అంటే మహాదేవుడు.

శిష్యుడు : మహాదేవుడెవరు?

గురువు : ఈశ్వరుని శక్తి

శిష్యుడు : బ్రహ్మణి ఎవరు?

గురువు : బ్రహ్మ యొక్క శక్తి.

శిష్యుడు : లక్ష్మీ ఎవరు?

గురువు : విష్ణువు యొక్క శక్తి.

శిష్యుడు : దుర్గ ఎవరు?

గురువు : మహాదేవుని శక్తి

శిష్యుడు : సంసార సాగరాన్ని తరింపజేసేది ఎవరు?

గురువు : ఈశ్వరుడు.

శిష్యుడు : బంధనమంటే ఏమిటి?

గురువు : విషయానురక్తి

శిష్యుడు : ముక్తి అంటే ఏమిటి?

గురువు : విషయముపట్ల విరక్తి చెంది ఈశ్వరునిలో లీనం కావటం.

శిష్యుడు : ఘోరమైన నరకం ఏది?

గురువు : మన శరీరము.

శిష్యుడు : స్వర్గం ఎక్కడ ఉన్నది?

గురువు : ఆశలు అంతరిస్తే ఈ భూమియే స్వర్గము.

శిష్యుడు : సంసారబంధనం ఎట్లా తొలగిపోతుంది?

గురువు : ఆత్మజ్ఞానము వలన

శిష్యుడు : ఏమి చేస్తే ముక్తి లభిస్తుంది?

గురువు : తత్త్వజ్ఞానము వలన

శిష్యుడు : నరకమునకు కారణమేది?

గురువు : పురుషునియందలి లింగభేద భావము

శిష్యుడు : స్వర్గ ప్రాప్తికి కారణమేమిటి?

గురువు : అహింస.

శిష్యుడు : మనిషికి శత్రువు ఎవరు?

గురువు : అతని ఇంద్రియములే

శిష్యుడు : మనిషికి మిత్రుడు ఎవరు?

గురువు : వశీకృతములైన ఇంద్రియాలు

శిష్యుడు : దరిద్రుడు ఎవరు?

గురువు : చాలా లోభి అయినవాడు.

శిష్యుడు : ఐశ్వర్యవంతుడు ఎవరు?

గురువు : ఎప్పుడూ సంతుష్టుడుగా ఉండేవాడు

శిష్యుడు : జీవన్మృతుడు ఎవరు?

గురువు : ప్రయత్నమేచెయ్యని పురుషుడు

శిష్యుడు : మాయ అంటే ఏమిటి?

గురువు : అతిప్రేమ

శిష్యుడు : మహా అంధుడెవరు?

గురువు : కామాతురుడు

శిష్యుడు : మృత్యువంటే ఏది?

గురువు : అపకీర్తియే మృత్యువు. మనుష్యుడు అమరుడు.

శిష్యుడు : చిరకాలముండే రోగమేది?

గురువు : సంసారము

శిష్యుడు : ఆ రోగమునకు మందేమిటి?

గురువు : నిర్లిప్తుడై ఉండటమే

శిష్యుడు : ప్రధాన తీర్థమేది?

గురువు : పవిత్రమైన మనస్సు

శిష్యుడు : త్యాజ్యమేది?

గురువు : అర్థము - దురాశ.

శిష్యుడు : వినదగినదేది?

గురువు : గురుసన్నిధిలో వేదాంతబోధ

శిష్యుడు : బ్రహ్మజ్ఞానప్రాప్తికి ఉపాయమేమిటి?

గురువు : సత్‌సాంగత్యము

శిష్యుడు : సాధువు ఎవరు?

గురువు : మోహము, అనురాగములు లేనివాడు

శిష్యుడు : జీవునికి జ్వరమేది?

గురువు : చింత

శిష్యుడు : మూర్ఖుడెవరు?

గురువు : అవివేకియైనవాడు

శిష్యుడు : నాస్తికుడెవరు?

గురువు : ఈశ్వరుని అస్తిత్వమును ఒప్పుకోనివాడు

శిష్యుడు : పండితుడెవరు?

గురువు : జ్ఞాని

శిష్యుడు : ధార్మికుడెవరు?

గురువు : యథార్థ పండితుడు

శిష్యుడు : చేయవలసిన పని ఏమిటి?

గురువు : భగవంతునిపట్ల భక్తి.

శిష్యుడు : విద్య అంటే ఏమిటి?

గురువు : బ్రహ్మజ్ఞానాన్ని ప్రసాదించేది.

శిష్యుడు : లాభమంటే ఏమిటి?

గురువు : బ్రహ్మజ్ఞాన ప్రాప్తి.

శిష్యుడు : జగద్విజేత ఎవరు?

గురువు : మనస్సును జయించినవాడు

శిష్యుడు : విషమంటే ఏది?

గురువు : విషయము

శిష్యుడు : దుఃఖితుడు ఎవరు?

గురువు : విషయానురక్తి కలవాడు

శిష్యుడు : సుఖవంతుడు ఎవరు?

గురువు : ఏరకమైన చింతలేనివాడు

శిష్యుడు : ధన్యుడెవరు?

గురువు : పరోపకారి

శిష్యుడు : పూజనీయుడెవరు?

గురువు : తత్త్వజ్ఞానియైన వ్యక్తి.

శిష్యుడు : కర్తవ్యం ఏమిటి?

గురువు : ధర్మోపార్జన

శిష్యుడు : కర్తవ్యము కానిదేది?

గురువు : మోహము -పాపము

శిష్యుడు : బుద్ధిమంతుడెవరు?

గురువు : స్త్రీకి వశుడు కానివాడు.

శిష్యుడు : ఉత్తమ వ్రతమేది?

గురువు : సత్పాత్రదానము

శిష్యుడు : సంకెల ఏది?

గురువు : స్త్రీలోలత్వము

శిష్యుడు : లోకులకు తెలియనిది ఏది?

గురువు : స్త్రీ మనస్సు, స్త్రీ చరిత్ర

శిష్యుడు : ఎవరు పశువు?

గురువు : మూర్ఖుడు

శిష్యుడు : ఎవరితో సాంగత్యం చెయ్యకూడదు?

గురువు : మూర్ఖునితో, పాపితో, దుర్గార్గునితో నీచునితో

శిష్యుడు : కనిష్ఠుడు ఎవరు?

గురువు : యాచించేవాడు.

శిష్యుడు : జ్యేష్ఠుడెవరు?

గురువు : ఎవరినీ ఏదీ యాచించనివాడు

శిష్యుడు : జన్మించిన వారెవరు?

గురువు : తిరిగి జన్మించవలసిన అవసరంలేనివారు.

శిష్యుడు : చనిపోయినవారెవరు?

గురువు : తిరిగి చనిపోవలసిన అవసరంలేనివారు.

శిష్యుడు : విశ్వాసముకల వారెవరు?

గురువు : తత్త్వజ్ఞానియైన వ్యక్తి.

శిష్యుడు : విశ్వసించదగనివారెవరు?

గురువు : స్త్రీ (యోగసాధకునికి)

శిష్యుడు : ఏమిచేస్తే దుఃఖము కలుగదు?

గురువు : ధర్మము -ఉపాసన

శిష్యుడు : ఎవరికోరిక నివృత్తి కాదు?

గురువు : శత్రుభావం కలవానిలో

శిష్యుడు : దుఃఖమునకు మూలమేది?

గురువు : మాయ

శిష్యుడు : ఏది దానయోగ్యమైనది?

గురువు : అభయ ప్రదానము

శిష్యుడు : మనోవినాశనమంటే ఏమిటి?

గురువు : మోక్షము

శిష్యుడు : ఎలాంటి భయమూ లేనిది ఎక్కడ?

గురువు : ముక్తిలో

శిష్యుడు : ఏ పనివలన మృత్యు భయం ఉండదు?

గురువు : ఈశ్వరచింతనలో నిమగ్నమైనప్పుడు

శిష్యుడు : రాక్షసుడెవరు?

గురువు : చెడువాసన

శిష్యుడు : దానం చేసిన కొద్దీ పెరిగేది ఏది?

గురువు : విద్య.

శిష్యుడు : దినదినమూ తరిగిపోయేది ఏది

గురువు : పరమాయువు

శిష్యుడు : చిరస్థాయి అయినదేది?

గురువు : కాలము

శిష్యుడు : దేనివలన భయపడాలి

గురువు : లోకాపవాదం వలన

శిష్యుడు : అసలైన మిత్రుడెవరు?

గురువు : ఆపత్కాలంలో సహాయం చేసేవాడు.

శిష్యుడు : తల్లిదండ్రులు ఎవరు?

గురువు : పెంచి పోషించేవారు.

శిష్యుడు : ఏది తెలిసిన తరువాత మరేమీ తెలుసుకోనక్కరలేదు?

గురువు : పూర్వజ్ఞాన స్వరూపమును.

శిష్యుడు : దుర్లభమైనదేది?

గురువు : సద్గురువు ఆత్మజ్ఞానము

శిష్యుడు : మిత్రుడు - శత్రువు కూడా అయినవారెవరు?

గురువు : కుమారుడు - కుమార్తె మొదలైనవారు

శిష్యుడు : చంచలమైనవి ఏవి?

గురువు : మనస్సు, ధనము, యౌవనము, ఆయువు.

శిష్యుడు : ఉత్తమమైన దానమేది?

గురువు : తత్త్వజ్ఞానము.

శిష్యుడు : చేయకూడని పని ఏది?

గురువు : పాపకర్మము

శిష్యుడు : ప్రాణమిచ్చి అయినా చేయవలసినది ఏది

గురువు : ఈశ్వరోపాసన

శిష్యుడు : ఏ పని మంచిది?

గురువు : ఈశ్వరునికి ప్రీతిజనకమైనది ఏదో అది.

శిష్యుడు : దేనికోసం ప్రయత్నం చేయకూడదు?

గురువు : సంసారం కోసం

శిష్యుడు : రాత్రింబవళ్లూ దేనిని గురించి ఆలోచించాలి?

గురువు : సంసారము యొక్క మిథ్యాతత్త్వమును ఆత్మతత్త్వమును గురించి

శిష్యుడు : ఈశ్వరుడు ఉన్నాడో లేదో ఎట్లా తెలుస్తుంది?

గురువు : నీవు ఉన్నావో లేదో నీకు ఎట్లా తెలుస్తోంది? (అట్లాగే)

శిష్యుడు : ఆకారం లేనిదానిని ఎట్లా తెలుసుకోవాలి?

గురువు : జీవనము, మనస్సు, బుద్ధి మొదలైనవి (ఆకారం లేకపోయినా) ఉన్నాయో లేవో ఎట్లా తెలుసుకోగలుగు తున్నావు? (అట్లాగే)

శిష్యుడు : మనకు జీవితం ఉన్నది. అందువలననే మనము ఇచ్ఛాను సారంగా అన్నీ చేయగలుగుతున్నాము. దానివలననే మనను గురించి మనం తెలుసుకోగలుగుతున్నాము.

గురువు : తనను గురించి తాను తెలుసుకోగలిగినవాడు పరమేశ్వరుని గురించి కూడా తెలుసుకోగలుగుతాడు.

శిష్యుడు : మనము ఏ వస్తువును చూడలేమో, దాని పట్ల మనకు సహజంగా విశ్వాసం ఉండదు కదా!

గురువు : వాయువు, సుగంధము వంటి వస్తువులకు ఆకారంలేదు కదా! కాని వాటిని గురించి అనుభవాన్ని ఏ జ్ఞానంతో తెలుసుకొంటు న్నావు?

శిష్యుడు : వాయువు, సుగంధము మొదలైనవాటిపట్ల నమ్మకము, అవిచేసే పనులవల్ల తెలుస్తుంది.

గురువు : నీవుకాని, వాయువుకాని, ఈశ్వరుని యొక్క పనులుకారా? ఈశ్వరుడు ఉన్నాడో లేదో ఇప్పుడు ఆలోచించు

శిష్యుడు : సరే, ఈశ్వరుడున్నాడనుకొందాము. కాని ఆయనపట్ల భక్తి ఉపాసనలను ఎందుకు చెయ్యాలి?

గురువు : నీవు నీ సంతానం పట్ల ప్రేమ, తల్లిదండ్రులపట్ల భక్తి ఎందుకు చూపిస్తున్నావు? (అందుకే)

శిష్యుడు : మమత అధోగతికి, భక్తి ఊర్ధ్వగతికి దోహదం చేస్తాయా?

గురువు : అందువలననే ఈశ్వరుని పట్ల భక్తి కలిగి ఉండాలి. కండ్లు ఉన్నాయి కాని చూసే శక్తి ఎక్కడి నుంచి వచ్చింది? చూసే వస్తువేలేనప్పుడు కండ్లు ఉండి మాత్రం ఏమి లాభము? నీవు నీ తాతను చూడలేదు. కాని వారు ఉండేవారన్న జ్ఞానము ఎట్లా కలుగుతుంది? కనుక ఆకారంలేకపోయినా ఈశ్వరుడున్నాడు అన్నది నిశ్చయము.

❀ ❀ ❀ ❀ ❀

9. తత్త్వజ్ఞానము

తత్త్వజ్ఞానమంటే పరమాత్మ లేదా ఈశ్వర సంబంధమైన జ్ఞానము. ఒకవేళ ఈశ్వరుడు ఉన్నాడని నమ్మితే అతనిని గూర్చి అనుసంధానం చెయ్యాలి. ఆ నమ్మకం లేకపోతే అనవసరంగా వాదన చేసి ఇతరులతో వివాదం పెట్టుకొనటం, తన మతాన్నే స్థాపించుకోవాలనుకొనటం, తన మార్గాన్ని ఉపేక్షచేయటమే అవుతుంది. ఎవరికైతే ఆ విశ్వాసం ఉంటుందో, దానితో ఆ భగవంతుని పొందే మార్గం వెతుకుతూ ఉంటారో, వారికి "మన మెవరము" అన్న విషయము బాగా తెలియాలి. ఒక ప్రణాళికను అనుసరించి, భక్తి విశ్వాసములతో సాధన చేస్తే మూడు నెలలలోనే ఆత్మదర్శనము తప్పక అవుతుంది. ఆత్మదర్శనం అయిన వ్యక్తి శాంతితో ముక్తిమార్గంలో అగ్రగామిగా ఉంటాడు. జీవుడు ఆత్మ పరమాత్మలను తెలుసుకోనంత వరకూ ముక్తి లభిస్తుందన్న ఆశ లేదు. యోగపూర్ణుడైన వ్యక్తి సూక్ష్మ శరీరాన్ని ధరించి తన ఇష్టానుసారం గమనాగమనములు చేస్తూ ఉంటాడు. అతనికి ఈశ్వర కరుణ, శక్తి లభించి చివరికి సర్వజ్ఞుడవుతాడు.

మనము ఎవరము? అంటే పంచభూతములు, పంచప్రాణములు, పంచ కర్మేంద్రియములు, పంచ జ్ఞానేంద్రియములు, మనస్సు, బుద్ధి అనేవాటి సమాహారము. అవికాక ఇడ-పింగళ-సుషుమ్న-చిత్ర నాడులు, అరిషడ్వర్గమనే మనః శత్రువులు, వాసన, చింత, మాయ, ఆశ వంటి పదార్థముల సమాహారమే శరీరము. అవేకాక - జ్ఞానము, చైతన్యము, (ఆత్మ) జీవాత్మ, పరమాత్మలు కూడా ఉన్నాయి. ఈ అన్ని విషయాల తత్త్వమూ బాగా తెలిసిన తరువాత మనమెవరము, ఈశ్వరుడు మానవ శరీరంలో ఉన్నాడా లేడా అన్న విషయములు చక్కగా తెలుస్తాయి. మనను మనం గుర్తించగలిగితే ఈశ్వరుని కూడా తెలుసుకో గలుగుతాము. ఈశ్వరుడు ఉన్నాడనే విశ్వాసం ఉంటే, ఆయన మనకు చాలా సమీపంలో ఉంటాడని తెలుసుకోవాలి. ఆయన మీద విశ్వాసం లేకపోతే ఆయన మనకు చాలా దూరంలో ఉంటాడు. అయితే ఆయన సాక్షాత్కారం మనకు అవుతుందా లేదా అనేది ఇక్కడ చెప్పలేము.

ఆలోచించి చూస్తే పాదము నుంచి మస్తకము వరకూ ఉన్న వాటిలో 'మనము' అనేది ఏదీ లేదు. జ్ఞానస్వరూపమే మనము. కేవల విశుద్ధచైతన్యమే 'మనము' అనే

రూపంలో ప్రకాశిస్తుంది. శరీరము, ఇంద్రియములు, మనస్సు, చైతన్యములు ఒకే రకమైన భావము కలవి అయినప్పటికీ వాటికి పరస్పర సంబంధము ఏదీ లేదు. అన్ని అంగాలూ ఉన్నప్పటికీ శవదర్శన - స్పర్శనాదులు ఎందుకు చేయకూడదు? శరీరము - శవములు ఒకే రకమైన పదార్థములే కదా! మనలో చైతన్యము ఉన్నది కనుకనే మనము చూడగలుగుతున్నాము, వినగలుగుతున్నాము. కనుక మనము శరీరము కాదు. దానిలో ఎలాంటి సందేహము కలగరాదు. కనుక మనము శరీరము కన్నా భిన్నులము, నిత్యులము, స్వయం ప్రకాశులము అయి ఉన్నాము. ఎక్కడ ఆత్మ ఉంటుందో అక్కడ మనస్సు ఇంద్రియములు ఆత్మ మొదలైనవి ఏమీ ఉండవు. రాజు ప్రక్కనే సామాన్య వ్యక్తి నిలువలేదు. తిలల నుంచి తైలమును తీసివేసిన తరువాత తెలకపిండికి తిలలకు ఎలాంటి సంబంధమూ ఎట్లా ఉండదో, అట్లాగే శరీరము -మనస్సు- ఇంద్రియయములతో మనకు ఎలాంటి సంబంధమూ లేదు. మనస్సూ మనము కాదు. జీవమూ మనము కాదు. ఎందుకంటే అవన్నీ చైతన్యము చేతనే తెలుసుకోబడుతాయి. జీవునకు తనదైన స్వతంత్రత ఏమీలేదు. అది కేవలము సాక్షి మాత్రమే. ముత్యాలహారంలోని ముత్యాలు దారం చేత ఎట్లా గ్రుచ్చబడి ఉన్నాయో, అట్లాగే భగవంతుని రూపమైన ఆత్మ పదార్థంలో జీవ పదార్థములన్నీ గ్రుచ్చబడి ఉన్నాయి. దారానికి ముత్యాలకూ ఏమీ సంబంధము లేదు. అట్లాగే శరీరానికి - ఆత్మకూ ఏమీ సంబంధము లేదు. శరీరము జడ పదార్థము. కాని మనము అమరులము. జీవుడు మృతుడా, జీవితుడా అన్నది కేవలం భ్రమ మాత్రమే. మనము అంటేనే ఆత్మకన్న భిన్నమైనది మరేదీ లేదు. ఇది జ్ఞానోదయమయిన తరువాత తెలుస్తుంది.

బాహ్యజగత్తు మనముకాదు. అనిత్యమైన శరీరము మనము కాదు. పంచ ప్రాణములుకాని, వాయువుకాని మనముకాదు. ఎందుకంటే అవన్నీ అచేతనములు. మనము చైతన్యము కలవారము. పంచజ్ఞానేంద్రియములు మనము కాము. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు మనము కాము. అయితే మన మెవరము? మనము ఆలోచనలకు మించిన నిర్మల -శాంత-విశుద్ధ-చేతన స్వరూపులము. బాహ్యా అభ్యంతర స్థానాలలో వ్యాపించి ఉన్నవారము. మనము దీపంలాగా అన్ని పదార్థములను ప్రకాశింపజేస్తున్నాము. మనము అన్నింటిలో ఉండే ఆత్మ స్వరూపులము. దీపం సహాయంతో చీకటిలో ఉన్న తెల్లని-నల్లని వస్తువులు ఎట్లా

తెలుస్తాయో, అట్లాగే మనలోని ఆత్మ పదార్థం వలన అన్ని వస్తువుల పరిజ్ఞానం మనకు కలుగుతుంది. అద్దంలో అన్ని వస్తువులూ ఏ విధంగా ప్రతిబింబిస్తాయో, అట్లాగే జాగృతమైన అన్ని వస్తువులకు మనము అనుభవస్థానము. అనాది - అనంతము - సర్వాంతర్యామి - చిన్మయము అయిన ఆత్మయే మనము. స్థావర - జంగమములైన పదార్థ సముదాయమే మన శరీరము. ఇంత పెద్దపరిమాణం ఉన్నా, దానికి ఉనికి లేదు. ఎప్పటినుంచీ ఉన్నది, ఎప్పటివరకూ ఉంటుంది. అనే హద్దు కూడా లేదు. అంతేకాక, ఎంత దూరం వ్యాపించి ఉన్నది అనే పరిమాణం కూడా లేదు.

మనము స్వయంప్రకాశులము. పుష్పంలో పరిమళము, బీజములో వృక్షము, జలములో శీతలత, అగ్నిలో తేజస్సు, సూర్యునిలో కిరణము, దీపములో ప్రకాశము, కాంతిలో రూపము, రూపములో అనుభవము అయి ఉన్నాము. పాలలో నెయ్యి, నీటిలో రసము, చక్కెరలో తీపితనము ఉన్నట్లే, మనం కూడా అన్ని పదార్థాలలోనూ శక్తి రూపంలో ఉన్నాము. మనము ఆత్మ కనుకనే ఎవరి ప్రార్థనా లేకుండా ఈ విశాలమైన జగత్తంతా వ్యాపించి ఉన్నాము. నీవు - మనము-మనది- అనేవి అన్నీ మిథ్యాభ్రమలే!

మనస్సు : మనస్సుకు ఎక్కడా ఏమీ దొరకదు. అందువలననే దూర దూరాంత రాలలో త్రోవతప్పి తిరుగుతూ ఉంటుంది. మనస్సు యొక్క వృత్తి తరంగాల లాగా చంచలమైనది. మనస్సు యొక్క తేజస్సు అగ్ని కన్నకూడా అధికమైనది. దానిని అతిక్రమించటం పర్వతములను అతిక్రమించటం కన్నా కష్టతరమైనది. మనస్సును వశపరచుకొనటం - సముద్రాన్ని ఆపోశన పట్టటం కన్నను, సుమేరుపర్వతం ఎత్తటం కన్నను, అగ్నిభక్షణం కన్నను చాలా కఠినమైనది. కాని మనస్సు క్షీణిస్తే, అంటే వాసనా శూన్యమైతే, జగత్తు నష్టమవుతుంది. అనంతమైన సుఖదఃఖాలు ఈ మనస్సు నుంచే పుడుతున్నాయి. అలాంటి మనస్సు వివేకం వలన క్షీణించిపోతే, సుఖ దుఃఖాలన్నీ వినష్టమైపోతాయి. మనస్సు నటునిలాగా అన్ని విషయాలలోను క్షణికానందము, క్షణిక విషాదము, క్షణిక ప్రసన్నతలనుభవిస్తుంది. నిర్మల బుద్ధియోగంతో ఇప్పుడే ఆ మనసునకు తగిన మందు వెయ్యకపోతే, దానికి ప్రతీకారం చేసే సమయం. ఎప్పుడు వస్తుంది? మనస్సు యొక్క శక్తి వలననే దృశ్య మాన వస్తువుల దర్శనం కలుగుతుంది. మనోచ్ఛేదము వలన దృశ్య దర్శనోచ్ఛేదము

కూడా కలుగుతుంది. మనస్సే జగత్కర్త. మనస్సే పురుషుడు. మనో నిశ్చయం వలన సంపాదితమయ్యేది మనస్సు యొక్క ప్రతిబింబమే అవుతుంది. ఈ ఆకాశము విస్తృతమైనది, అనంతమైనది. చిదాకారమైన ఈ విస్తృత మనస్సులోని ఏ అంశంలో చైతన్య ప్రతిబింబం పడుతుందో, ఆ అంశం ప్రకాశితమై, స్థిరత్వాన్ని పొందుతుంది.

మనస్సు యొక్క శక్తి ఎంత ప్రబలమైనదంటే, ఏకీకృత మనస్సుతో ఏది చేస్తే అది తప్పక సఫలమవుతుంది. చివరకు బ్రహ్మవరకూ అన్నీ పొందవచ్చును. మనస్సు చైతన్యశక్తి నుంచి చైతన్యభావమును పొంది, బ్రహ్మభావాపన్నము అవుతుంది. మనస్సు - శరీరములు అభిన్నములు. ఆత్మయే మనస్సు - శరీరములను ప్రకాశింపజేస్తూ ఉండటంవల్ల మనస్సు శరీరముల అన్ని చేష్టలు కూడా సఫలములవుతాయి. మనస్సు ఏ వస్తువును వెతుకుతుందో అది తప్పక లభిస్తుంది. మనస్సు ద్వారానే మనను మనమే పవిత్ర మార్గంలో పెట్టుకోవాలి. మనస్సు దేనికి అనుసంధానమవుతుందో కర్మేంద్రియములు దానికి అనుగుణంగా స్పందిస్తాయి. మాలిన్యయుక్తమైన మనస్సునే చిత్త మనవచ్చును. మనస్సు చిత్తములు ఆత్మయొక్క క్రియా స్వరూపములే. దానికన్న బిన్నమైనది ఏదీలేదు. వాసనలు చిత్తము యొక్క అంశ మాత్రమే. మనస్సు తన వినాశన క్రియను తనలోనే చేసుకొంటుంది. మనస్సు కేవలము తన వినాశము కోసం ఆత్మదర్శనం చేసుకొంటుంది. అన్ని దుఃఖములనుండీ దూరము కావటానికి మూలము మనోనాశమే. వివేకంతో శోధించటం వలన మనోనాశము అవుతుంది.

మనస్సు ఎంత శక్తిని ధారణచెయ్యగలదనే విషయాన్ని తేలికగా స్పష్టం చెయ్యవచ్చును. నీ మనస్సు ఒకవేళ వేరే విషయం మీద లగ్నమై ఉంటే, నీవు తినే పదార్థాల రుచి కూడా నీకు తెలియదు. మనస్సు అన్యత్ర లగ్నమైతే నీకేమీ కనపడదు; వినపడదు. శరీరం వరకూ నిశ్చేష్టితం అవుతుంది. మనస్సు - చిత్తములు రెండూ పరస్పర సాకారులు కనుక రెండూ సమానమైనవి. అయినా మనస్సు ఆరెంటిలో ఉత్కృష్టమైనది. ఎందుకంటే మనస్సు నుంచే చిత్తము యొక్క క్రియ పుట్టినది; అంతేకాని చిత్తము నుంచి మనస్సు పుట్టలేదు. సుఖమును దుఃఖమని భావించటము,దుఃఖమును సుఖమని భావించటము కేవలము మనస్సు యొక్క పని. మనస్సు దర్శించని వస్తువనేది లేదు. గింజనుండి వృక్షము, లత,

పత్రము, పుష్పములు పుట్టినట్లు, మనస్సు నుంచే జగత్తు స్వప్నము, వాసన, చింత, విలాసములు అన్నీ పుడతాయి. నాట్యశాలలో ఒకే నటుడు నానా ప్రకారములైన వేషాలు ధరించి, నానా రకాల భావాలను ఎట్లా ప్రదర్శిస్తాడో అట్లాగే మన మనస్సు కూడా జాగ్రత్-స్వప్న రూపాలలో పుట్టి, అన్ని సమయాలలోనూ నానారకాల ఆలోచనలు చేస్తుంది. మనస్సు స్వయంగా నిరాకారం అయినప్పటికీ ఎప్పుడూ తాత్కాలిక సాకారమైనది కావటం వలన, జీవుడు ఎప్పుడూ పుడుతూ చస్తూ ఉంటాడు. తిలలో తైలము ఉన్నట్లు, మనస్సులో సుఖదుఃఖములు ఎప్పుడూ ఉంటూనే ఉంటాయి. సమయాన్ని బట్టి అప్పుడప్పుడు తగ్గటం, అప్పుడప్పుడు పెరగటం జరుగుతుంది. ఎవరి మనస్సు నిశ్చలము, ఒకే విషయముమీద లగ్నము కాగల శిక్షణను పొందుతుందో, అదే పరబ్రహ్మ యొక్క ధ్యానం చెయ్యటంలో సమర్థవంతమైనది అవుతుంది.

మనోసంయమనంవలన సాంసారిక విలాసాలలో శాంతి లభిస్తుంది. ఉద్వేగ రహితమైతే మనోజయం లభిస్తుంది. మనస్సును జయించినవారికి త్రిలోక విజయం కూడా తుచ్ఛమైనదిగానే అనిపిస్తుంది. మనోజయమంటే తాను తన భావంలో అంటే పూర్ణబ్రహ్మంలో స్థిరంగా ఉండటమని అర్థము. చంచలత్వము మనస్సు యొక్క రూపము. అగ్ని యొక్క ధర్మము ఉష్ణత అయినట్లు, మనస్సు యొక్క ధర్మము చంచలత. స్పందన లేకుండా వాయువు యొక్క శక్తి అనుభవంలోనికి రానట్లు, చంచలత్వం లేకపోతే మనస్సు యొక్క ఉనికి తెలియబడదు. చంచలత్వములేని మనోస్థితియే మోక్షము. మనోనాశమైతే దుఃఖమునకు శాంతి లభిస్తుంది. మనస్సు యొక్క చంచలత్వమును, అవిద్యావాసనలను వాటి వివేచన ద్వారా వదలిపెడితే మోక్షం లభిస్తుంది. సత్-అసత్తుల మధ్యనుండేది చిన్మయత్వము. చిన్మయత్వా-జడత్వముల మధ్యనున్న అవస్థను మనస్సు అని అంటారని తెలిస్తే జడత యొక్క అభ్యాసం వలన మనస్సు జడముగాను, వివేకము యొక్క అభ్యాసము వలన మనస్సు చైతన్యరూపంగాను మారిపోతాయి. భావనాయుతమైన అస్థిర మనస్సును వివేకయుతమైన మనస్సుతో ఉద్ధరించాలి. రాజు తప్ప మరెవ్వరూ ఇతర రాజును జయించలేనట్లు, మనస్సును మనస్సే తప్ప మరేదీ జయించలేదు. ఆత్మకు ముక్తి కలగటానికి, మనస్సును జయించటం తప్ప వేరే ఉపాయంలేదు. మనస్సే కర్మఫలమును అనుభవిస్తుంది. మనస్సులోనే అనంతమైన సుఖదుఃఖములు

కలుగుతాయి; శరీరంలో ఏమీ కావు. జడశరీరము సుఖదుఃఖములను అనుభవించలేదు. మనస్సు కర్త. అందుకే మనస్సును మానవునిగా గుర్తించాలి.

మనస్సు యొక్క ఆద్యంతములు నశించిపోయేవే అయితే, దాని మధ్య భాగములను కూడా అసత్ అనే చెప్పాలి. మనస్సు యొక్క ఈ అసత్ రూపం ఎవరికి తెలియదో వారికి దుఃఖానుభవము అనివార్యము అవుతుంది. మనస్సు దేనిని చేస్తుందో అదే అవుతుంది; దేనిని చేయదో అది కానేకాదు. ఈ విశ్వము మనోవృత్తి స్వరూపము. మనస్సే అన్ని కర్మలకు, అన్ని చేష్టలకు, అన్ని భావాలకు, అన్ని గతులకు బీజము. ఈ మనస్సు పరిత్యజించగలిగితే, అన్ని కర్మలూ పరిత్యక్త మౌతాయి. అదే అన్ని దుఃఖాలకూ లక్ష్యం అవుతుంది. అన్ని కర్మలకూ భయహేతు వవుతుంది.

పట్టుపురుగు తాను ఉండటానికి గూడు కట్టుకొన్నట్లే మనస్సు కూడా తాను ఉండటానికి ఈ శరీరాన్ని నిర్మించుకొన్నది. పట్టుపురుగు గూడు ఆ పట్టుపురుగు కన్న వేరుకానట్లు మనస్సు - శరీరాలలో తేడాలేదు. మనస్సే శరీరమునకు ఉపాదానము. అంతేకాక మనస్సులోనే అన్నీ సంభవిస్తాయి. మనస్సులో పుట్టని శక్తి అనేది ఏదీ లేదు. చిత్‌ప్రతిబింబ స్వరూపమైన మనస్సే జీవుడై, తానే కల్పించు కొన్న భూత భవిష్యత్ వర్తమాన కాలాత్మకమైన జగత్తు యొక్క నిర్మాణ పరివర్తన - వినాశములకు కర్తయై, స్వయం వ్యక్తమవుతుంది. ధాన్యంలో బియ్యం ఉన్నట్లుగా ఈ ప్రపంచమంతా బ్రహ్మలోనే ఉన్నది. ఈ జడజగత్తుకు అస్తిత్వములేదు. దుఃఖము - సంతోషము అనేవి ఆత్మ కృతములే! తిరిగి అవి ఆత్మలోనే లయమవుతాయి.

మనస్సు పురుషుడు కనుక, అది మంచిమార్గంలో ముందు నడవాలి. చిత్తము ప్రకృతి స్వరూపము. మనస్సు ధర్మ విశిష్టమవుతుంది. అది దర్శన ధర్మాన్ని పొందినప్పుడు కళ్ళుగాను, శ్రవణ ధర్మాన్ని పొందినప్పుడు చెవులుగాను అవుతుంది. అందువలన మనము మనస్సును కర్మబీజ మనవచ్చును. ప్రస్తుత శరీరములో మనస్సు అన్ని వస్తువులలోను ఉండి, నరుడనే పేరుతో వ్యక్తమవుతున్నది. మనస్సే జీవము. మనస్సే నిర్మలత్వాన్ని పొంది పరబ్రహ్మ సాక్షాత్కారాన్ని పొందుతుంది. ఇందులో ఎలాంటి సందేహమూ లేదు.

మనష్యుడు అంటే మనోమయము. అంతకు తప్ప మరేమీ లేదు. ఈ సంసారంలో మనస్సే పుడుతుంది. బాగా ఆలోచించి చూస్తే మోక్షము మనస్సుకే

కలుగుతుంది. మనస్సే ప్రకృతిరూపంలో ఉన్న సంసారి. జరామరణములు మనస్సుకే! మనస్సే అన్ని సమయాలలో అన్నింటినీ సర్వనాశనం చేస్తున్నది. జ్ఞానోదయమైతే మనస్సు నశిస్తుంది. అద్దం ముందుంచిన వస్తువును ప్రక్కకు జరిపినప్పుడు దాని ఛాయ ఎట్లా కన్పించదో, అట్లాగే ప్రాణశక్తులను నిరోధించి నప్పుడు మనోనాశము అవుతుంది. ఎందుకంటే మనస్సు ప్రాణము యొక్క రూపాంతరమే! ప్రాణమే తన స్పందన శక్తి ద్వారా దేహాంతరములైన అన్ని వస్తువులను హృదయంగమము చేసుకొని దాని అనుభవమును పొందుతుంది. ఆ విధంగా మనస్సు తయారవుతుంది. రాతిలో మండే శక్తి లేనట్లుగానే, మనస్సుకు అనుభవ శక్తి ఉండదు. అనుభవశక్తి ప్రాణవాయువులో ఉన్నది. ప్రాణవాయువు – ఆత్మ అనే ఉభయ శక్తుల సంయోగాన్నే మనస్సంటారు. మనస్సేకర్త. మనస్సు దేనిని సంకల్పిస్తే అదే అవుతుంది. ఎక్కడ మనస్సు ఉంటుందో అక్కడ ఆశ–సుఖదుః ఖాలు ఉంటాయి. 'మన్' అంటే మననము చేసేది అని అర్థము. కల్పించగల సామర్థ్యం కలిగినది కావటం వల్ల మనస్సు అనిపించుకొంటుంది. మనస్సు, చైతన్యము జడముల మధ్యన ఉండి, జీవవృద్ధి, చిత్తము మొదలైన వాటితో కలిసి అభిహితమవుతూ ఉంటుంది. మనోనాశము అయ్యే వరకు వాసనాక్షయము కాజాలదు.

చిత్తము : చిత్తము యొక్క స్వాభావిక ధర్మము విషయానురాగము. ఒడ్డున ఉన్న చెట్టును నది గ్రసించినట్లుగానే వృత్తిశాలియైన చిత్తము మనుష్యుని గ్రసిస్తూ ఉంటుంది. జల ప్రవాహము ఆనకట్టలతో బంధింపబడినట్లు మనుష్యుడు చిత్తము చేత బంధింపబడతాడు. వ్రేలాడు త్రాడు పైకీ క్రిందకీ వ్రేలాడునట్లు, మనుష్యుడు కూడా చిత్తము మనస్సుల ద్వారా ఒకసారి ఊర్ధ్వగామి మరొకసారి అధోగామి అవుతాడు. గ్రద్ద హఠాత్తుగా చేపను పట్టుకొన్నట్లు, చిత్తము యొక్క సాహసము వలన విషయములందు ఆసక్తి కలుగుతుంది. చంచలచిత్తముగల మనుష్యులు ఏ విషయం మీదా ఏకాగ్ర చిత్తులు కాలేరు. బుద్ధిలో ఉన్న ఆత్మయే చిత్తము. చిత్తము యొక్క వాసనలు క్షణిక క్రియాదశలో ఉన్నప్పుడు, చిత్తము జీవి అనబడుతుంది. అది భ్రమించినప్పుడు శరీరము అనబడుతుంది. చిత్తము యొక్క కల్పన శాంతించి నప్పుడు అది పరబ్రహ్మమని గ్రహించాలి.

విషయ వాసనలతో కప్పబడిన చిన్మాత్రలో ఉన్నది, వికల్పముల చేత కలుషిత

మైనది అయిన చిత్-తత్త్వమే జీవుడని చెప్పబడింది. చిత్తము యొక్క స్వరూపమే ఈ ప్రపంచమంతా నిండిన దృశ్యము. యోగాసక్త చిత్తము ఏ కర్మనూ చేయక పోయినప్పటికీ కర్త అవుతున్నది. చిత్తము నుంచే సంసారము వచ్చింది. ఈ సంసారము చిత్తమయము. చిత్తమునందే ఈ సంసారము నిలిచి యున్నది. చిత్తము ఎట్లా ఉంటే పురుషుడు కూడా అట్లా ఉంటాడు. ఆత్మయే చిత్తము. అదే చిత్తమునకు కారణము. ఆ చిత్తము ద్వారానే కర్మమయములు, వాసనామయములు, మనోమయములు అయిన అన్ని శక్తులు సంచరిస్తూ ఉంటాయి. దృశ్యమాన మవుతాయి. అనుభవము ద్వారా తెలుస్తాయి. వాస్తవానికి అన్ని జీవములు, అన్ని పదార్థములు బ్రహ్మ నుంచే పుడుతున్నాయి. అందులోనే విలీనమై పోతున్నాయి.

మోహము వలన జర, మృత్యువు వలన చిత్తము బాధింపబడతాయి. ఆత్మ యొక్క ఇచ్ఛావికృతియే చిత్తము. అది తన ఉత్పత్తికి కారణమైన ఆత్మ పదమును మర్చిపోయి, కల్పనా ప్రసూతములైన అనర్థములకు కారణమవుతున్నది. ఆత్మ తేనెటీగలాగా బంధనములలో చిక్కుకుపోతుంది. శబ్దాది తన్మాత్రల సమూహము దాని అవయవ స్వరూపము. జరామృత్యువులచే చుట్టబడిన విషవృక్ష సదృశమైనది చిత్తము. చిన్న గింజలో మహాకాండమున్న వటవృక్షము ఉన్నట్లే, ఆశాపాశములను తయారుచేసే అఖిల సంసారము చిత్తములోనే వ్యవస్థితమై యున్నది. అదే చిత్తము. అగ్ని కీలలో దగ్ధమై, కోశరూపమైన కొండచిలువ ద్వారా చర్వితమై, కామ తరంగములచే కొట్టబడి, ఆత్మరూపుడైన పితామహుని (మూలకారణుడు) మర్చి పోతుంది. శోకము చేత విలుప్తమైన చైతన్యము విషయాగ్నిలో దగ్ధమవుతూ ఉంటుంది. అలాంటి చిత్తము వర్తమాన శరీరమును వదలవలసివచ్చినప్పుడు, దాని విచ్ఛేదమునకు ఎక్కువ భయపడుతుంది. ఎందుకంటే అది దేహము. ఇంద్రియములనే శత్రువులలో ఎట్లా విశ్వాసంతో ఉంటుంది? ఈదృశ్య ప్రపంచమయ లక్షణమే చిత్త స్వరూపము. అది తప్ప దానికి వేరే స్వరూపం లేదు. ఈ జగత్తు - ప్రపంచము అన్నీ కేవలము ఆత్మయే. అట్లా తెలుసుకోకపోతే ఈదృశ్య జగత్తంతా దుఃఖప్రదమే అవుతుంది. తెలుసుకోగలిగితే మోక్షసుఖాన్ని ప్రసాదిస్తుంది. ద్రష్ట-దృశ్యములకు మధ్యవర్తియైన అవస్థయే చైతన్యము.

చిత్తము కల్పన మీద ఆధారపడి ప్రకాశించినప్పుడు అది తన చిత్తస్వభావమును మర్చిపోయి, జడత్వం చేత చుట్టబడుతుంది. బొమ్మలోని రాజు ఆకారము

భయంకరమైన యుద్ధము చేయలేనట్లు, మృత దేహము ఎక్కడికీ పోలేనట్లు, శిలాఖండము మధురగీతాన్ని ఆలాపించలేనట్లు, కృత్రిమ సూర్యుడు చీకటిని పోగొట్టలేనట్లు, మిథ్యాభ్రమతో మునిగిన చిత్తము ఏ పనీ చేయలేదు. వాస్తవంలో ఏదో చేస్తున్నట్లు కన్పించేది ప్రాణాది వాయువుల క్రియయే! చీకటిలోకి వెలుగు రేఖ ప్రకాశించినప్పుడు చీకటి దూరమైపోయినట్లు, పరమాత్మ సాక్షాత్కారం కాగానే చిత్తము యొక్క అస్తిత్వం ఉండదు. అందువలననే చిత్త ప్రకాశము విడిగా ఉండదు. మనమే ఆత్మ, మనమే జీవము, అనే జ్ఞానము పేరే చిత్తము. అంతేకాక, అలాంటి చిత్తము అనాది అనంతము అయిన దుఃఖమును విస్తరింపజేస్తుంది. చిత్తమును నాశనము చేయదలిస్తే, మొదట చిత్తవృత్తులను నాశనము చెయ్యాలి. అప్పుడు చిత్తము సహజంగానే నాశనమవుతుంది.

ఘటంలో ఘటాకాశం ఉన్నట్లే, చిత్తము లోపల సంసార మున్నది. ఘటము నాశనము కాగానే ఘటాకాశము ఉండనట్లే, చిత్తనాశముకాగానే సంసారము కూడా ఉండదు. చిత్తనాశనమునకు పెద్ద ప్రయత్నము చేయనక్కరలేదు. అజ్ఞానము అంతరిస్తే చిత్తనాశనము అవుతుంది. చిత్తము అజ్ఞానముతో ఎప్పటి వరకూ కప్పబడి ఉంటుందో, అప్పటివరకూ అది ఘనీభవించి ఉంటుంది. ఎలా ఎలా జ్ఞానానుభవం కలుగుతూ ఉంటుందో,అలా అలా చిత్తము కూడా క్షీణిస్తూ పోతుంది. చిత్తము ఒట్టి మిథ్య. అందువలన ఉపదేశములతో దానికి ఏమీకాదు. కేవలము ఆలోచన ద్వారానే దానిని నాశనము చేయవచ్చును. చిత్తము చేసేదానినే నీవు అనుభవిస్తావు. చిత్తము చెయ్యని దానిని నీవు అనుభవించలేవు. చిత్తము యొక్క కలయిక వలననే మనము స్వస్థానలాభమును పొందలేకపోతున్నాము. పక్షులు భ్రాంతిచేత వలలో తగులుకొన్నట్లుగానే, మనం కూడా చింతాజాలముతో తగులు కొంటున్నాము.

వాసన : విషయాత్మికమైన అంతఃస్థిత మనోవృత్తియే వాసన. మనుష్యుడు ఏదైనా కార్యమును చేసినా చెయ్యకపోయినా, అతని మనస్సులోని కోరికను బట్టియే స్వర్గఫలమో నరకఫలమో కలుగుతుంది. తత్త్వజ్ఞానము కలిగినవానికి వాసనలు శిథిలమైపోతాయి. అంతేకాక అతడు తన సర్వకర్మ ఫలమైన ఆత్మకంటె భిన్నమైన అనుభవమును పొందుతాడు. వాసనలోనే జగత్‌జాలమంతా ఉన్నది. వాసనలతో దృఢమైన చిత్తము తనలో ఎవరిని చూడలేదు. వాసనలు శాంతించినచో, చిత్తము

మూడులోకాలను తృణప్రాయంగా చూస్తుంది. వాసనలు క్షీణించకపోతే, ఏ స్థితిలోను చిత్తవృత్తులను నిరోధించలేదు. వాసనలు నశించకపోతే తత్త్వజ్ఞానలాభం కలుగదు. మరి తత్త్వజ్ఞానం కలగకపోతే వాసనలు కూడా నశించవు. అందువలననే తత్త్వజ్ఞానము, చిత్తనాశము, వాసనాక్షయము - ఇవన్నీ పరస్పరము ప్రకాశించ టానికి చాలా కష్టమును కలిగిస్తాయి. వాసనాక్షయము, చిత్తనాశము, తత్త్వజ్ఞానము ఇవన్నీ ఒకే సమయంలో కోరిన ఫలాన్ని ఇస్తాయి. అందువలననే ఈ మూడింటిని ఒకేసారి నాశనం చేసే ప్రయత్నం చెయ్యాలి.

బుద్ధి : బుద్ధి జగద్వ్యాపి కాదు. కాని అది కొన్ని పరిధులు ఉన్న స్థానాలలో వ్యాపించి ఉంటుందనేది నిశ్చయము. కనుక బుద్ధి ఒక వస్తువిశేషము. అంతేకాక అది ఒక విలక్షణమైనది. ప్రతివారికీ ఇంతో అంతో బుద్ధి ఉంటుంది. కాని ఎవరికి బుద్ధి తక్కువగా ఉంటుందో వారిని మందమతులు అంటారు. కనుక బుద్ధి ఒక పరిమితి వరకే వ్యాపించి ఉంటుందని విశదమవుతుంది. కనుక బుద్ధి సాకారమైనదే కదా! అందులో ఎలాంటి సందేహమూ లేదు. బుద్ధియే మంచి-చెడులను గురించి ఆలోచిస్తుంది. ఉత్కృష్టమైనదో నికృష్టమైనదో కోరేది కూడా బుద్ధియే. అంతేకాక, నానావిధములైన నూతన వస్తువులనూ ఆవిష్కరిస్తూ ఉంటుంది. ఎవరైనా ఒకరు విద్యలేనివాడైనప్పటికీ, బుద్ధిగలవాడయితే, అతడు తన పనులన్నీ చేసుకో గలుగుతాడు. కాని బుద్ధి లేకపోయినా విద్యలేక పోయినా గట్టి పరిశ్రమను చేసి కొంత విద్యను సంపాదించినా అది విశేష కార్యం కాదు. బుద్ధి జీవశరీరంలో అద్దంలాంటిది.

తృష్ణ : తృష్ణ మనుష్యుని ఎంతగా దహిస్తుందంటే, ఆ మంటను అమృతం కూడా ఆర్పలేదు. తృష్ణయే మనిషిని భయభ్రాంతుని, దుఃఖితుని, గ్రుడ్డివానిని చేస్తుంది. తృష్ణయే అలభ్యమైన వస్తువుమీద ఆసక్తిని కలిగిస్తుంది. దొరకదని తెలిసి కూడా, ఆ విషయాన్ని ఆకాంక్షిస్తుంది. అంతేకాక ఒకచోట అది స్థిరంగా ఉండదు. అంతఃపురంలో ఉండేవారిని కూడా అతికష్టమైన ప్రదేశాలకు అది తీసుకొని పోతుంది. ఈ తృష్ణయే ఆత్మతత్త్వాన్ని ఆచ్ఛాదించి, మనిషిలో ఎక్కువ అజ్ఞానాన్ని సృష్టిస్తుంది. తృష్ణలోనే మనస్సు చిక్కుకొని ఉన్నది. తృష్ణయే మోహంతో నిండిన ఏనుగును కూడా బంధిస్తుంది. తృష్ణయే జరామరణ దుఃఖములకు కారణము.

చింత : చింతను త్యజించగలిగితే మనుష్యుడు సమస్త దుఃఖాలను తరించ గలుగుతాడు. చింత అనంతకాలం వరకూ అన్ని విషయాలలోనూ ఆసక్తిని కనబరుస్తుంది. చింతన ఛేదించటం దుస్సాధ్యమైన పనే అయినప్పటికీ జ్ఞానులు వివేకమనే ఖడ్గంతో దానిని ఛేదిస్తారు. తత్త్వజ్ఞానోదయం కానంత వరకూ చింత వదిలిపోదు. అట్లాగే చింత శాంతించనంతవరకూ తత్త్వజ్ఞానం కలుగదు. చింతకు సొంత సోదరుడు ధనము. మనం ఎట్లా ధనవంతులం అవుతాము? ఏ ఉపాయాన్ని అవలంబిస్తే ధనోపార్జన అవుతుంది? ఇలాంటి చింతలతోనే మనుష్యులంతా జీర్ణించి పోతున్నారు. చింత అన్ని సమయాలలోనూ అస్థిరంగానే ఉంటుంది. ఒక చింత తరువాత మరొక చింత ఎక్కడి నుంచి వస్తుందో సరిగ్గా చెప్పలేము. అందువలననే చింతకు అంతంలేదు. చింతా శూన్యుడైన మనిషీ లేడు. మనిషి ఎలాంటి చింతా లేకుండా గడిపినా రోజు ఏ ఒక్కటీ ఉండదు. చింత లేనివారు మహా సుఖవంతులు. చింతవలన శరీరము జీర్ణించి పోతుంది. అట్లాగే చింత సమాప్తికాగానే ముక్తిమార్గం సుగమవుతుంది.

మాయ : మాయ జగత్తు యొక్క ఉత్పత్తికి కారణము. ఈ మాయ చేతనే వివేకము కప్పబడి ఉంటుంది. ఈ మాయ ఏమిటనేది తెలుసుకోలేని విషయము. ఈ జగత్తు అత్యద్భుతమైనది. వివేకంతో నడవకపోతే మాయ వృద్ధిచెంతుంది. అట్లాగే వివేక దృష్టితో చూస్తే ఏమీ ఉండదు. ఈ మాయా స్వరూపం అవగతం కాకపోవటం వలన దాని మాహాత్మ్యమును అనుభవించలేము. సంసార బంధన కోసం ఈ మాయ ఆశ్చర్యజనకమైన పనులు చేస్తుంది. ఎందుకంటే ఈ మాయ ఎప్పుడూ అసత్యమైనదే అయినా, అది సత్యంలాగానే అనుభూతిని కలిగిస్తూ ఉంటుంది. ఈ సంసారరూపమైన మాయ పరమపదమునకు భిన్నంగా ప్రవర్తిస్తుంది. ఈ మాయకు పారమార్థిక సత్తాలేదు. ఒకవేళ నీవు ఏకాగ్ర చిత్తుడవై భావనా బలంతో ఆత్మయొక్క వాస్తవిక స్వరూపాన్ని తెలుసుకోగలిగితే, అప్పుడు నీకు అన్ని విషయాల మర్మములు అవగతమవుతాయి. మాయ ఎక్కడి నుంచి వచ్చిందని ఆలోచించవలసిన అక్కరలేదు. కాని, ఈ మాయను ఎట్లా అంతమొందించ గలమనే ఆలోచించాలి. ఈ మాయ పూర్తిగా అంతరించి సంపూర్ణ రూపంలో మనస్సుకు వశమైపోయాక, అప్పుడు నీకు ఈమాయ ఎక్కడి నుంచి పుట్టింది, దాని స్వరూపం ఏమిటి, చివరికి అది ఎట్లా అంతరించింది అనే విషయాలు స్పష్టమవుతాయి. ఈ

మాయ అసత్యమైనది. ఇది కనబడనిది. అజ్ఞానం వల్లనే అది సత్యమైనట్లుగా భాసిస్తున్నది. అందువలన దానిని బలవంతంగా నశింపజేస్తే దాని తత్త్వాన్ని నీవు తెలుసుకోగలుగుతావు. మాయవలననే ఈ జీవరాశి జగద్రూపమైన ఇంద్రజాలాన్ని విరచించింది. అది ఎంతవరకు అజ్ఞానంలో ఉండి ఆత్మదర్శనం చేసుకోలేని స్థితిలో ఉంటుందో అంతవరకూ నీటిలోని సుడిగుండం లాగా జీవుడు సంసారంలో తిరుగుతూ ఉంటాడు. కాని ఆత్మ దర్శనం చేసుకోగల సమర్థత కలదైనప్పుడు అసత్యరూపాన్ని వదిలి, సత్యరూపాన్ని పొంది, సమయానుకూలంగా మాయా పాశాలను త్రుంచి పరమపదాన్ని పొందుతుంది.

ఈ రకంగా మాయమయమైన సంసారంలో అపారమైన సుఖభావనను చేసే వారిని కూడా కాలం ఛేదిస్తుంది. కాలంయొక్క కరాళదంష్ట్రలలో పడని వస్తువు ప్రపంచంలో ఏదీలేనేలేదు. కాలము ఒక్కొక్కసారి గాఢాంధకారంలాగా నల్లని రంగు లోను, మరొకసారి కమనీయమైన వర్ణంలోను, ఇంకొకసారి మరొక రంగులోను ఉంటుంది. కాలమునకు గతి-స్థితులు కాని, ఉదయ అస్తమయములుకాని లేవు. కాలమహిమ ఎవరి బుద్ధికీ అవగతమయ్యేది కాదు. అంతేకాదు. ఈ జీవలోకంలో కాలమే అన్నింటికన్నా బలవంతమైనది.

మనిషి దృష్టి రజోగుణ దూషితమైనది. ఆ తరువాత తమోగుణము ఉత్తరోత్త రాభివృద్ధి చెందుతున్నది. సత్త్వగుణము దూరంగా పారిపోయింది. అందువలన తత్త్వజ్ఞానము ఎందులోనూ లేదు. జీవనము అస్థిరమైనది. మృత్యువు అనివార్య మైనది. ధైర్యము విఫలమవుతుంది. అన్ని విషయాలలోనూ ఆసక్తి కలుగుతుంది. సుఖములలో ఇష్టం పెరుగుతుంది. మూర్ఖత్వ దోషాలలో బుద్ధి లగ్నమవుతుంది. శరీరం వినాశకారులకు వశమవుతుంది. శరీరాన్ని ముసలితనము తొందర పెడుతూ ఉంటుంది. పాపము పెరుగుతూ ఉంటుంది. ఎంత ప్రయత్నించినా యౌవనం నిలవదు. సత్సాంగత్యం పరాస్తమవుతుంది. సత్యము అసలు ఎక్కడా ఉండనే ఉండదు. అంతఃకరణము మోహము చేత కప్పబడుతుంది. సంతోషం దూరంగా పారిపోతుంది. కరుణావృతి అసలే ఉదయించదు. కేవలం నీచత్వమే సమీపిస్తూ ఉంటుంది. ధైర్యము అధైర్యంగా మారిపోతూ ఉన్నది. సత్సాంగత్యము దుర్లభమైపోయింది. విషయవాసన బంధన హేతువైనది. జీవసమూహాన్ని మృత్యువు ఎప్పుడూ ఎక్కడికో లాక్కుపోతూ ఉంటుంది. సిద్ధ గుణాలు కూడా నశించి పోతూ

ఉంటే, మనలాంటి మనుష్యులకు స్థిరత్వం ఎట్లా ఉంటుంది? ధ్రువుని జీవితం కూడ చిరస్థాయి కాదు. దేవతలకూ కూడా మృత్యువు ఉంటుంది. బ్రహ్మకు సమాప్తి ఉన్నది కదా! అగ్ని కూడా శాశ్వతంగా ఆరిపోతుంది. విష్ణువు కూడా సంహార దశను పొందుతాడు. ఈశ్వరుడు కూడా లేకుండా పోతాడు. కాలము యొక్క కాలనియతి కూడా లయమైపోతుంది. ఆకాశము కూడా నశించిపోతుంది. అందువలన అసారమైన ఈలోకపు స్థితి ఎక్కడ ఉంటుంది? అలాంటి వస్తువు ఒక్కటి ఉన్నది. అది తనలోనే తాను తిరుగుతూ మాయాశక్తి ద్వారా విశ్వసందర్శనం చేయిస్తుంది. దానిలో లేనిది మూడు లోకాలలోనూ లేదు. స్వర్గంలోని దేవగణము, భూమిలోని మనుష్యగణము, పాతాళంలోని సర్పగణము దాని కల్పనా మాత్రం చేతనే పుడుతూ నశిస్తూ ఉంటాయి.

నీటిలో పడితే శరీరానికి అంటకుండా ఉండదు కదా! అట్లాగే ఈ ప్రపంచంలో ఉంటూనే ఏ వ్యవహారాలు చేయకపోయినా అట్లాగే ఉండిపోలేము. అగ్ని కీలలు దాహక శక్తి లేకుండా ఉండునట్లు, ఈ ప్రపంచంలో రాగద్వేష శూన్యము, సుఖ దుఃఖ వర్జితము అయిన సదనుస్థానము కూడా అసంభవమైనది. తత్త్వబోధ, యుక్తి, ఉపాసనలు లేకుండా అస్తిత్వానికి అంతం కలుగదు. అజ్ఞానం నుంచే ఈ సంసారో త్పత్తి అయింది. అట్లాగే అజ్ఞాననాశంవల్లనే ఈ సంసారానికి అంతం కలుగుతుంది. ఈ జగత్తులో పురుషుడొక్కడే అస్తిత్వముకలవాడు. తక్కినవన్నీ అస్తిత్వం లేనివే. పురుషుడంటే ఆత్మయే. అదే బ్రహ్మ అదే అజ్ఞాన వశాత్తు ఈ సంసారంలో జీవ రూపంలో బద్ధమై ఉన్నది. ఆ అజ్ఞానం నశించిపోగానే స్వస్వరూపంలో కలిసిపోతుంది.

మనిషి తనకు కావలసిన వస్తువు పొందటానికి ఒక సరియైన ప్రణాళికను వేసుకొని ప్రయత్నిస్తే అతడు దానిని తప్పక పొందగలుగుతాడు. త్రిలోకాధిపతి కావటం వల్లనే ఇంద్ర పదవికి అంత గౌరవం ఉన్నది. అది కూడా ఏదేదో జీవ విశేషముల ప్రయత్నంతో లభిస్తుంది. ఎన్నో జన్మల విశేషకృషివలన బ్రహ్మ తన పదవిని అధిష్ఠించగలిగినాడు. తన కర్మఫలాన్ని పొందటానికి ఎలాంటి ఫలం లభిస్తుందో దానినే దైవం అంటారు. పూర్వం చేసిన కుకర్మలు సత్కర్మల ద్వారా నశించిపోతాయి. అందువలన ప్రయత్నం పూర్వకంగానైనా సత్కర్మలు చెయ్యాలి.

శరీరంలో కర్తయై ఉండి అన్ని పనులనూ చేయించేవాడే కర్మ ఫలాన్ని అనుభవించేవాడవుతాడు. దేనిని దైవమంటున్నామో అదే మనస్సు. ఆ మనస్సే పురుషుడు. ఆత్మకన్న భిన్నమైనవన్నీ అనిత్యములే. దీనివలన నిశ్చయింపబడేది ఏమిటంటే దైవమనేది లేదు ఈ సంసారం నుంచి ఉద్ధరింపబడటానికి ఏకైక ఉపాయము జ్ఞానము. దానము, తపస్సు, కఠోర వ్రతములు, తీర్థయాత్రలు - ఇవన్నీ అందుకు ఉపాయములు కావు. ఈ సంసారంలో దుఃఖమే అనంతమైన సుఖము! అందువలన సుఖం కోసం వెతుక్కోకూడదు. వివేకాన్ని ఆశ్రయించి, వైరాగ్యాన్ని అభ్యసించటం వలన ఈ సంసారసాగరం నుండి బయటపడవచ్చును. ధనము, మిత్రులు, బాంధవులు, దేశాంతరాగమనము, శరీరకష్టము, పిరికితనము, లేదా కొన్ని మంత్రోచ్చారణల వలన ఆ పదము లభించదు. కేవలం మనస్సును జయించటం వల్లనే ఆ పదము లభిస్తుంది.

శమము, సత్సంగము, ఆలోచన, ఆనందము అనేవి నాలుగూ మోక్షమునకు నాలుగు ద్వారాలు. ఒకటి వైరాగ్యము, రెండు ముముక్షత్వము, మూడు ఉత్పత్తి. నాలుగు స్థితి, ఐదు ఉపశాంతి, ఆరు నిర్వాణము అనేవి యథార్థ సత్యములు. వీనికి మూలకారణము లేదు. దేనికైతే కారణములేదో దాని పరమార్థమే 'సత్' అనేది. ఆ సత్ పదార్థమే బ్రహ్మ. ఏ విధంగా సరోవరంలో పద్మాల పెరుగుదలవలన సరోవర అభివృద్ధి జరుగుతాయో, అదేవిధంగా జ్ఞానంవల్ల శమదమాదుల వృద్ధి, శమదమాదుల వలన జ్ఞానాభివృద్ధి జరుగుతాయి. ఆత్మ యొక్క స్వరూపము ఆకాశంలాగా నిరాకారమైనది. అంతేకాక చైతన్య స్వరూపమైనది. అదే జీవుడై జగత్‌దర్శనం చేస్తున్నది. ఈ జగత్ దర్శనము స్వప్న దర్శనం వంటిది. జగత్ దర్శనము సత్యమైనది. కాని, జగత్తు మిథ్యయే. అట్లాగే స్వప్న దర్శనం సత్యమైనది. కాని, స్వప్నంలో దర్శించిన వస్తువులన్నే మిథ్యలే. ఈ జగత్తులో పుట్టిన ప్రతిదీ పెరుగుతుంది. నశించిపోతుంది. విముక్తిని పొందుతుంది. స్వర్గాన్నో నరకాన్నో పొందుతుంది.

పరమాత్మలో సంయోగం చెందటం కేవలం జ్ఞానయోగంతోనే కలుగుతుంది. కష్టపడి అనుష్ఠానాదులు చేసినా లభించదు. పరమాత్ముడు దూరంగానులేడు, దగ్గరగాను లేడు. సులభుడూ కాడు, దుర్లభుడూకాడు. పూర్ణానంద స్వరూపుడైన ఆ బ్రహ్మను మన శరీరంలోనే పొందవచ్చును. యోగం ద్వారా పరమాత్మను

పొందిన ఆత్మ మీద, మృత్యువు కూడా దండెత్తలేదు. కామాదులను వదిలిపెట్టకపోతే ఏదీ ఫలప్రదము కాదు. రాగాదులకు వశీభూతుడై ఇతరులను వంచించి సంపాదించిన ధనాన్ని ఇతరులకు పంచిపెట్టినప్పటికీ దాని ఫలము పూర్వాధికారికే చెందుతుంది. తత్త్వజ్ఞానము కలుగకుండా బ్రహ్మ సాక్షాత్కారము కలుగదు. తత్త్వజ్ఞానప్రాప్తికి శాస్త్రములకు అవిరోధికావాలి. యాదృచ్ఛికంగా లభించిన జీవికతో సంతుష్టుడు కావాలి. భోగ వాసనలను వదిలిపెట్టాలి. ఉద్యోగస్థుడైనా సాధుసాంగత్యము, సత్‌శాస్త్రానుశీలనము చెయ్యాలి. ఏ శాస్త్రంలో తత్త్వజ్ఞాన విషయం ఉంటుందో అదే సత్‌శాస్త్రము.

పరమాత్మ అతిసన్నిహితంగా ఉన్నాడు. ఎంత సన్నిహితంగా ఉన్నాడంటే మన శరీరంలోనే చైతన్య స్వరూపుడై యున్నాడు. ఈ పూర్ణస్వభావ చేతన యొక్క దృశ్యరూప దర్శనము నివృత్తమైన తరువాత, బహిర్ముఖమైన గతి అడ్డగింపబడి, అంతర్ముఖమైన గతి ఉత్పన్నమవుతుంది. ఆ తరువాత దాని తాత్కాలిక పూర్ణావస్థ ప్రకాశితమవుతుంది. దానిపేరే ఆత్మ సాక్షాత్కారము. అప్పుడు పరాత్పరుడైన బ్రహ్మను తెలుసుకోగలుగుతారు. వారి హృద్గ్రంథి అంటే మాయామోహములు విచ్ఛిన్న మవుతాయి. అన్ని సందేహాలూ దూరమవుతాయి. సంచితకర్మ లయమవు తుంది. చిత్త నిరోధం వలన దృశ్యదర్శనములు లోపించవు. అంతేకాక అది జ్ఞానమవుతుంది. రూపరహితమైన ఆకాశంలో నీలము మొదలైన రంగులు కనబడినట్లే, చిన్మయుడైన బ్రహ్మ పదార్థంలో బ్రహ్మ స్వరూపాన్ని తెలుసుకోవచ్చును, చూడవచ్చును. అలాంటి జ్ఞానం కలిగినప్పుడు, చైతన్యమే మిగిలి ఉంటుంది. ఈ కన్పిస్తున్న విశాల బ్రహ్మాండం ఉత్పన్నమైనది కాదు. అది ఆ నిర్మలమైన బ్రహ్మ చైతన్యంలో కల్పితమైనది. అంటే అది ఆయన స్వరూపమే. అసలు ఈ జగత్తు పుట్టకనే పోతే, ఇక దాని అస్తిత్వం ఎక్కడ? ఆకాశంలో వృక్షాలు పుట్టటానికి అవకాశంలేదు. అట్లాగే జగత్తూ లేదు. బయట నుంచి రాగము, ద్వేషము, భయము వంటివి చేసేది ఏదో అది లోపల మాత్రం ఆకాశంలాగా స్వచ్ఛంగా ఉంటుంది. అతడే జీవన్ముక్తుడు. ఎవరి వలన ఇతరులు ఉద్విగ్నులు కారో, ఇతరుల వలన ఎవరు ఉద్విగ్నుడు కాడో, ఎవరిని శోకముకాని ఆనందముకాని అంటవో, అతడు కూడా జీవన్ముక్తుడే. జల ప్రవాహము కన్న జలము భిన్నము కానట్లు, తేజస్సుకన్న కిరణము భిన్నము కానట్లు, వాయువుకన్న స్పందన భిన్నముకానట్లు, ఆకాశము

శూన్యముకన్న భిన్నము కానట్లు, త్రిభువనములు కూడా పరబ్రహ్మ కన్న భిన్నములు కావు. దృశ్యమాన జగత్తంతా ఎవరిచేత చూడబడుతున్నదో, కాలము నుంచి ఎవరు వుడుతున్నారో, తేజస్సు యొక్క ప్రకాశము చైతన్యములను ఎవరు తెలుసుకుంటున్నారో, అవన్నీ బ్రహ్మ పదార్థము తప్ప వేరుకావు. దేని ప్రభావము వలన తెలుసుకొంటున్నామో, ఆ జ్ఞానమే తత్త్వజ్ఞానము. ఆ జ్ఞానమే బ్రహ్మ.

బ్రహ్మ : మంచుగడ్డ – శైత్యములలో ఏమీ భేదము లేనట్లే, అగ్ని ఉష్ణములలో ఏమీ బేధము లేనట్లే, బ్రహ్మ జగత్తులలో ఏమీ తేడా లేదు. జగత్ కారణాభావం వలన ఏది ఇదివరలో లేదో, ఏది ప్రస్తుతం లేదో, ఏది భవిష్యత్తులో ఉండదో, అలాంటి దానికి అస్తిత్వం ఎక్కడ ఉంటుంది? అదే దానికి కారణమైన బ్రహ్మ. అదే కార్యరూపంలో విశ్వాకారంలో ఆకారంతో ఉన్నది. అజ్ఞానము (బ్రహ్మవిస్మృతి) ఈ విశ్వానికి కారణమైనప్పటికీ, అది విశ్వాన్ని సృష్టించటంలేదు. స్వప్నావస్థలో వస్తుదర్శనము కార్యాచరణములలాగా, జాగ్రదావస్థలో ఈ జగత్తు కన్పిస్తున్నది. స్వప్నంలో అన్నీ కన్పించినా అవన్నీ కేవలం భ్రమయే అయినట్లు, బ్రహ్మలో జగత్తు నిత్యమూ ప్రకటమై లేకపోయినా అజ్ఞానవశాత్తు అట్లా కన్పిస్తుంది. కన్పించే జగత్తంతా పరమాత్మలో నిత్యంగా ఉన్నది. దానికి ఉదయాస్తమయాలు లేవు. బ్రహ్మయే త్రిభువనముల ఆకారంలో ఉన్నాడు. స్వప్నాన్ని అనుభవించే వానిలోని పరిజ్ఞానమే నగరాదిరూపంలో పరిణామం చెందినట్లు ఆత్మ కూడా బ్రహ్మలో జగదాకార రూపంలో పరిణతి చెందుతుంది. ద్రష్ట ఉన్నప్పుడు దృశ్యం ఉంటుంది. దృశ్యం ఉన్నప్పుడు ద్రష్ట ఉంటాడు. ఆ విధంగానే పరస్పర సంబంధం ఉంటుంది. కాని ఒక్కటి లేకపోయినా రెండూ ఉండవు. భగవంతుడు ఆత్మభావమును మరుగుపరచి, పరమపదమును వదలి, సంసారమనే ఉపాధి వలన జీవుని పొందాడు. ఈ దృశ్యమాన జగత్తు చిదాకాశం మినహా మరేమీలేదు. నిర్మలమైన ఆకాశంలో ముత్యం అనే భ్రమ కలిగినట్లుగానే, నిర్మలమైన ఆత్మలో జగత్తనే భ్రమ కలుగుతుంది. అజ్ఞానుల దృష్టిలో ఇది స్థూల జగత్తే అయినా, జ్ఞానుల దృష్టిలో అది పరమాణువు లాగా సూక్ష్మంగానే ప్రతీయమానమవుతుంది. బ్రహ్మజ్ఞానం లేకపోతే ఈ జగత్తు యొక్క సూక్ష్మ భావమును తెలుసుకోలేము.

జ్ఞానశక్తి – ఇచ్ఛాశక్తి – క్రియాశక్తి అనే మూడునూ స్థూలశరీర ధర్మాలు. స్థూల శరీరము క్రియాశక్తికి ఆశ్రయమైనది. సూక్ష్మశరీరము ఇచ్ఛాశక్తికి ఆశ్రయము.

కారణ శరీరము జ్ఞానశక్తికి ఆశ్రయము. బ్రహ్మ యొక్క స్వరూపము చైతన్యము; కాని దాని విశాలశక్తి ఆకాశము కన్న సూక్ష్మమైనది. ఆకాశంలో సూర్యలోకం ప్రతిబింబించినట్లుగా, ఈ దృశ్యజగత్తు చిన్మయ బ్రహ్మమున ప్రతిబింబిస్తున్నది. చిత్తాకాశము, చిదాకాశము, ఆకాశము ఈ మూడింటిలో చిదాకాశము శూన్యతర మైనది. ఆ చిదాకాశంలోనే మృత్యువు తరువాత పుణ్యాత్ముల ఆత్మ ఉంటుంది. అక్కడికి వెళితే అన్ని అనుభవాలూ కలుగుతాయి. ఒక్క ముహూర్తకాలంలో చిత్తము ఎంతెంత దూరమో వెళ్లగలదు. అన్ని చిత్తవాసనలనూ వదలి చిదాకాశంలో ఉండగలిగితే సర్వాత్మకమైన పరమతత్త్వం లభిస్తుంది. అది ఎంత చక్కగా విరచింప బడిందంటే అందులోని ఏ వస్తువునూ ఇతరులు చూడలేరు. అట్లాగే తత్త్వజ్ఞానము లేకుండా ఎవ్వరూ బ్రహ్మదర్శనం చెయ్యలేరు. జ్ఞానచక్షువు లభిస్తే అన్నీ గోచరిస్తాయి.

స్వప్నావస్థలో జాగ్రదవస్థలోని జ్ఞాపకాలు లుప్తమైనట్లుగా, మృతి చెందిన తరువాత పూర్వస్మృతి ఉండదు. క్షణికమైన మరణము, మోహములను అనుభవించిన జీవుడు పూర్వ సంసార స్మృతిని మరచి, రెండవ రూపాన్నే దర్శిస్తూ ఉంటాడు. అప్పుడు చిదాకాశంలోని ఆకాశరూపియైన జీవుడు, ఇప్పుడు నేను ఈ ఆధారంలో ఆధేయరూపంలో ఉన్నానని అనుకొంటాడు. చిదాకాశమే తన ప్రభావం వలన జగదాకారమును చూపుతుంది. దృశ్యవస్తువు ఏమీ లేకపోవటం వలన ద్రష్ట – దృశ్యముల తెలియవు. జీవుడు క్షణకాలం పాటు మరణరూపియైన మోహంలో త్రిభువనములను చూసినట్లుగా, పూర్వ స్మృతి ప్రకారం తాను చూసిన తండ్రి, తల్లి, స్నేహితులు, సేవకులు, వర్ణములు, జ్ఞానము, చేష్టలు, క్షయము,

ఉదయములు ఇదివరలో తనకు ఎట్లా కనిపించినాయో చిత్‌శరీరంలో కూడా వాటన్నింటి అనుభవమునూ పొందుతాడు. నేను ఈ జన్మను ఎత్తాను, నేను పిల్లవాడిగా ఉండినాను, ఈమె నా తల్లి ఈయన నా తండ్రి – అని పూర్వస్మృతిని బట్టి ఇలాంటి బోధ కలుగుతుంది. అంతేకాక జీవుడు ఒక్క క్షణకాలమును ఒక్క యుగంవంటి అనుభవమును పొందుతాడు. కళ్లు తెరవగానే నానా రకాల రూపాలు కనిపించినట్లుగానే, మరణకాలంలో కూడా అసంఖ్యాకమైన దృశ్యజగత్తు దృగ్గోచరమవుతుంది. దిక్కులు, కాలము, ఆకాశము, ధర్మము, కర్మము ఇంకా ఎన్నో అసంఖ్యాక వస్తువులు ఆ చిదాత్మలోనే ప్రస్ఫుటమవుతాయి. జీవుడు తన

జీవితంలో ఎప్పుడూ అనుభవం పొందనిది. చూడనిది కూడా తత్క్షణ స్మరణంతో ఆ వస్తువు వస్తుంది. ఈ ప్రపంచంలో అత్యంత విస్తారమైనదే ముక్తి. తత్త్వజ్ఞానమే ముక్తికి కారణము అనే జ్ఞానం కలగగానే ప్రపంచమంతటికీ పరబ్రహ్మకన్నా వేరుకాదన్న జ్ఞానం కలుగుతుంది.

పరమాత్మయే కార్యకారణరూపియై చిదాకాశంలో ఉన్నాడు. సమాధిస్థితి ప్రభావం వలన స్థూల శరీరాన్ని వదిలిపెట్టి చిద్రూపమైన పవిత్ర దృష్టిని పొంది, విమలమై, చిదాకాశంలో ఉన్న వ్యోమాత్మస్వరూపమైన సృష్టి దర్శనమవుతుంది. ఆ ప్రకారం లోకులు స్వర్గదర్శనం చేస్తారు. ఈ స్థూల శరీరము సృష్టిదర్శమునకు బాధకమవుతుంది. బ్రహ్మయే బ్రహ్మను చూడగలుగుతాడు. బ్రహ్మ కానివాడు బ్రహ్మను చూడలేడు. బ్రహ్మయే తాను కల్పించిన సృష్టి - జగత్తు వంటి పేర్లతో అభివ్యక్తమవుతున్నాడు. అభ్యాసం వలన నీలోని భేదజ్ఞానాన్ని దూరం చేసుకోలేనంత వరకూ నువ్వు బ్రహ్మస్వరూపాన్ని పొందినా, బ్రహ్మదర్శనం చేసుకోలేవు. నీ శరీరంలోని నగరాన్నే తెలుసుకోలేనివాడివి, ఇంకొక శరీరాన్ని ఆశ్రయించి, ఆయన సంకల్పించిన నగరాన్ని ఎట్లా తెలుసుకోగలుగుతావు? అందువలననే నీవు ఈ శరీరాన్ని వదిలిపెట్టి చిన్మయ శరీరాన్ని ఆశ్రయిస్తే ఆయన సంకల్పించిన నగరాన్ని చూడగలుగుతావు. సమాధిస్థితిలో ఉండి, మన శరీరాన్ని ఇక్కడే ఉంచి, విశుద్ధమైన సత్య స్వరూపంలో చిత్తమును మాత్రము తీసుకొని అక్కడకు వెళ్లవలసి ఉంటుంది. దేవీ-దేవతల శరీరము ఆకాశమంతా నిండి ఉన్నది అన్న విషయంలో విగ్రహ శూన్యత ప్రతిబంధకం కాదు. శరీరమంతా శుద్ధ సత్త్వగుణంతో నిర్మితమైంది. అందువలన చిత్ స్వరూపము ఆభాసమాత్రమే. కనుక పరబ్రహ్మకన్న భిన్నమైనది ఏమీ లేదు. సుగంధంలో వాయువు, నీరులో నీరు, అగ్నిలో అగ్ని,వాయువులో వాయువు ఎట్లా కలిసిపోతాయో, అట్లాగే ఆయన మనోమయ శరీరము మరొక మనోమయ శరీరంతో కలిసిపోతుంది. మరణానంతరం జీవుడు మాత్రం అతివాహిక శరీరాన్ని పొందుతాడు. కాని ఆ శరీరాన్ని ఎవరూ చూడలేరు. లోకులు మృతజీవి యొక్క స్థూల శరీరాన్ని మాత్రమే చూస్తారు. మనుష్యులు ఇంట్లోనే ఉండి స్వప్నంలో ఉజ్జ్వలమైన నగరాన్ని చూసినట్లు, చిత్ పదార్థంలో ఈ అసత్ సంసారం కూడా సత్పదార్థంలాగా ఉజ్జ్వలంగా కన్పిస్తుంది. ఆకాశంలో వాయువు, వాయువులో సుగంధము అదృశ్యరూపంలో ఉన్నట్లుగా జీవుడు మరణించిన

తరువాత జీవాకాశమై, గృహాకాశంలో అదృశ్య రూపంలో ఉంటాడు. అంగుష్ఠ మాత్రమైన ఆకాశంలో అనేక రాజ్యాలూ ఉన్నాయి. కాని భ్రాంతి వశాత్తు అవి కోటి యోజనాలు వ్యాపించి ఉన్నట్లు అనిపిస్తుంది. పరమాకాశమునకు ఆది-మధ్య-అంతములు లేవు. పరమాకాశము చాలా పెద్దది. ఆ నిర్మలాకాశానికి హద్దులు లేవు. ఆ పరమాకాశంలో ఈ విశాల జగత్తు, ఇంకా అంసఖ్యాక బ్రహ్మాండాలు ఉన్నాయి. ఆ బ్రహ్మాండాలను లెక్కించలేము.

చేష్టలు చిత్తమును అనుసరిస్తాయి. చిత్తము చైతన్యమును అనుసరిస్తుంది. ఆ చిత్తము యొక్క అసలు స్వరూపము ఆకాశము వంటిది. దానిని నిరోధించలేము. అతివాహికశరీరము చిత్తాకాశములో నున్నది. దానిని ఏవిధంగానూ అడ్డగించలేము. జ్ఞాన ప్రభావము వలన ఈ భౌతిక శరీరము ఆతివాహిక శరీరమును పొందుతుంది. ఈ చిత్తాకృతి శరీరము ఎంత చిన్నదంటే అది తన ఇష్టానుసారము ఆకాశంలోనికి కానీ పర్వతం మీదికి కాని పోగలుగుతుంది. ఈ శరీరము అనంత ఆకాశవ్యాపియై కూడా అణువంత కాగలుగుతుంది. చిత్తమునకు అలాంటి ప్రత్యేక శక్తి ఉన్నది. ఈ ప్రపంచంలో మరణము, మూర్ఛ వంటివి అందరి అనుభవంలోనికి వస్తాయి. ఆ మూర్ఛ ప్రళయరాత్రి వంటిది. ఆ రాత్రి గడవగానే జీవుడు తిరిగి సృష్టిని విస్తరిస్తూ ఉంటాడు. ఎవరి జ్ఞాన కర్మలు ఏ ప్రకారం ఉంటాయో, అతడు అలాంటి సృష్టి యొక్క అనుభవాన్ని పొందుతాడు. పూర్వజన్మ సంస్కారమే జన్మ మృత్యువులకు కారణమవుతుంది. మరణ మూర్ఛల తరువాత జీవునిలో సృష్టిభావం ఉదయిస్తుంది. అదే సృష్టికి ప్రణాళిక అవుతుంది. జీవుని అతివాహిక శరీరము సూక్ష్మమైన బుద్ధిమయ ఇంద్రియపంచకమే. అనేక కల్పాల తరువాత ఆ అతివాహిక శరీరము, తాను స్థూలమన్న భావనతో ఆధిభౌతికతను పొందుతుంది. అప్పుడు వాయు స్పందనలాగా భువన భ్రాంతి పొందుతుంది. అది స్వప్నంలో సంభోగం లాగా సత్యం లాంటిది అయినా మిథ్యయేకదా! జీవుడు ఎక్కడ చనిపోతాడో అక్కడే అలాంటి జ్ఞానం కలుగుతుంది. ఈ ఆకాశవ్యాపియైన సూక్ష్మజీవి వాస్తవానికి జన్మాది శూన్యుడయినప్పటికీ, భవిష్యశరీర భావన వలన నేను పుట్టాను, నేను జగత్తును చూస్తున్నాను అనే రకరకాల భ్రమలను అనుభవిస్తాడు.

ఈ స్థూల జగత్తు మనస్సు తప్ప మరేమి కాదు. ఒకవేళ,మనస్సు చంచలమైనది, ఈ జగత్తు స్థిరమైనది అని అంటే, ఈ జగత్తు కూడా చంచలమైనది, క్షణభంగుర

మైనది కాదా అని ఆలోచించు. చిదాకాశమే మనస్సు అంటే మనస్సుకు ఆశ్రయ భూతమైనది. ఆ చిదాకాశమే పరమపదము. ఏది దృశ్యమో, అదే ద్రష్ట. అనాది మిథ్యారూపియైన, మాయ, చిదాకాశము లేదా చిత్తాకాశములో నామరూపాలతో నిండి ఉండి, వివిధ వస్తు దర్శనకారియైన జీవభావనను స్ఫురింపచేస్తుంది. ఆస్ఫురణయే జగత్తు. అదంతా కేవలము మనమే అన్న జ్ఞానము కలిగినప్పుడు జగత్తు యొక్క పరమార్థ స్వరూపము అనుభూత మవుతుంది. కాని 'నీవు' అనే (తనలో 'నేను అనే) జ్ఞానంతో జగత్తు ఆరోపింపబడి ఉంటుంది అని తెలుస్తుంది. చిద్వస్తువు సర్వగామి. అందులోనే యథార్థ జ్ఞానోదయము అవుతుంది. అది అతివాహికము – సూక్ష్మము అయినది. అలాంటి సూక్ష్మమైన సర్వతోగామియైన అతివాహిక దేహాన్ని అడ్డగించగల వస్తువేదీ లేదు.

ఈ జగత్తంతా ఆత్మపదార్థమే. నీవు చూసేదంతా ఆనంద స్వరూపమైన చిన్మయ బ్రహ్మమే! ఆధ్యాత్మిక జ్ఞానం వలన శరీరం దూదిపింజలాగా తేలిక అవుతుంది. జ్ఞానోదయం వలన ఈ స్థూల శరీరము ఆకాశగమన యోగ్యమవుతుంది. రజ్జువు నందు సర్పభ్రాంతి కలిగినట్లు ఈ స్థూల శరీరానుభవము భ్రాంతిమాత్రమైనది. స్వప్నంలో కన్పించిన వస్తువు మెళకువ వచ్చిన తరువాత ఎక్కడికి పోతుందో తెలియనట్లు, విచారశీలియైన జ్ఞానికి ఈ అధిభౌతిక శరీరము అసత్యమైనది. అతనికి స్వప్నము – ఈ జగత్తు రెండూ ఒకేరకమైనవి. జాగ్రదవస్థలో స్వప్నం అసత్యమైనట్లు, జ్ఞానోదయం అయిన తరువాత ఈ జగత్తు స్థూల శరీరములు ఆకాశంలో కలిసిపోతాయి.

అతివాహిక శరీరం పొందిన తరవాత, అధిభౌతిక శరీరం ఏమీ జ్ఞాపకం ఉండదు. పత్రములు, పుష్పములు, ఫలములు అన్నీ ఒకే పదార్థమైనట్లు, ఈ జగత్తులోని పదార్థాలన్నీ కలిసి ఒక్కటియే అదే బ్రహ్మ. మంచుగడ్డ కన్న నీరు వేరుకానట్లు, స్ఫటికము కన్న శిల వేరుకానట్లు, జగత్తు కూడా ఈశ్వరుని కన్న వేరుకాదు. అన్ని ప్రాణులలోను ఉన్న పరబ్రహ్మ జ్ఞానమే జగత్తులో మనము అని ప్రతీయమానమవుతుంది. స్ఫటికశిల కిరణకాంతికన్న అభిన్నమైనదైనప్పటికీ, అది విభిన్న రూపాలలో కన్పిస్తుంది. అట్లాగే చిన్మయ పరమేశ్వరుడు ఈ జగత్తు మనము అంతా అభిన్నులము అయినప్పటికీ, విభిన్న రూపాలలో కన్పిస్తాము. నీటిలో అలలు పైకి లేచి, తిరిగి నీటిలో విలీనమవుతాయి. అయినా అవి ప్రవాహ జలం కన్నా

భిన్నం కావు. అట్లాగే ఈ సృష్టి ప్రపంచము పరమేశ్వరుని నుంచి ఉద్భవిస్తుంది. ఆయనలోనే విలీనమవుతుంది. ఆయనకన్న భిన్నమైనది కాదు. తేజస్సు సూర్య కిరణములు భిన్నములు కానట్లు, చిద్బ్రహ్మ యొక్క కల్పనాభేదములతోనే ఈ ప్రపంచము తయారయింది. చేతులు - కాళ్లు శరీరం కన్న భిన్నం కానట్లు జగత్తు బ్రహ్మపదార్థం కన్న భిన్నము కాదు. అగ్నిలోని ఉష్ణత, మంచులోని శీతలత, ఆత్మలోని జ్యోతి, మనస్సులోని చంచలతల లాగా, జీవత్వము కూడా అలాంటిదే.

ఈ విశ్వము దీర్ఘమైన స్వప్నంలాంటిది. ఈ స్వప్నమయ విశ్వంలో దర్శకుడు దేనిని మానవుడని భావిస్తాడో, వానిని క్షణికమానవుడని గుర్తిస్తాడు. ద్రష్టయొక్క స్వరూపము చైతన్యము. అది స్వప్నాకాశంలో ఉన్నది. ఆ చైతన్యము స్వప్న ద్రష్ట యొక్క వాసనల ననుసరించి ఆ వాసనల ఆధారాలతో కలిసి ఒకటియై ప్రకాశిస్తుంది. ఆ చైతన్య ప్రభావం వలననే మానవత్వబోధ కలుగుతుంది. ఈ జగత్తు సత్తూకాదు. అసత్తూ కాదు. కేవలము భ్రాంతి మాత్రమే. నీటిలో తరంగాలలాగా బ్రహ్మలో ఈసృష్టి ఉన్నది. సూర్యకిరణాలలో ధూళికణాలు కన్పించు నట్లు, పరమాకాశంలో 'బ్రహ్మాండ రూపమైన' ధూళికణాలు తిరుగుతూ కన్పిస్తాయి. సర్వాంతర్యామి అయిన బ్రహ్మ ఎక్కడ ఎలాంటి వాసనలను సృష్టిస్తాడో, అక్కడ అలాంటి దృశ్యం ఏర్పడుతుంది. ఆత్మ సర్వవ్యాపి - సర్వశక్తిమంతమైనది. దృఢమైన వాసనలలో ఎప్పుడు ఏ శక్తి ఉదయిస్తే అప్పుడు దానికి అనుగుణమైన దృశ్యం ఏర్పడి ప్రకాశమానమవుతుంది.

మనుష్యులు మూడు రకాలుగా ఉంటారు. మూర్ఖులు, ధారణా నిష్ఠులు, యుక్తిమంతులు అని. ధారణా నిష్ఠుడు, యుక్తిమంతుడు అయినవాడు అభ్యాసంతో సుఖంగా శరీరాన్ని త్యజిస్తాడు. ధారణానిష్ఠులు, యుక్తిమంతులు కానివారు మూర్ఖులు. విషయాసక్తుడైన వ్యక్తి వాసనలకు వశీభూతుడై మరణకాలంలో బహు దుఃఖాన్ని అనుభవిస్తాడు. నాలుగు దిక్కులూ మేఘావృతమైనట్లు అన్ని దిశలలో అంధకారం అలముకొన్నట్లు అతనికి కన్పిస్తుంది. పగటి సమయంలోనే అతనికి నక్షత్రాలు ఉదయించినట్లు కనబడతాయి. అపరిమితమైన బాధలో అతనికి భూమి ఆకాశంగాను, ఆకాశం భూమిగాను కన్పిస్తుంది. ఒకసారి ఆకాశంలోకి ఎగిరినట్లు గాను, మరొకసారి అంధకార కూపంలో పడిపోయినట్లుగాను అనుభవమును పొందుతాడు. ఏదో మాట్లాడాలని అనుకొన్నప్పటికీ, నాలుక యొక్క జడత్వం వలన

ఏమీ చెప్పలేకపోతాడు. పైకి ఎగురుతూ ఉన్నట్లు తిరిగి క్రింద పడిపోతున్నట్లు అతని మనస్సులో భావన కలుగుతుంది. తన నిశ్వాస ధ్వనిని విని కూడా వ్యాకులుడవుతాడు. జ్ఞాపకశక్తి క్షీణిస్తుంది. అన్నీ మర్చిపోతాడు.

ఎవరికి ఏ విషయం మీద అనురక్తి కలుగుతుందో, వారికి ఆ విషయగతి తెలుస్తుంది. ఒక విషయం మీద అత్యంత అనురక్తి కలిగినప్పుడు, మరొక విషయం మీది అనురక్తి నశించి పోతుంది. మూఢులైనవారు ఈ జన్మలో స్వనాశమును, పరజన్మలో దుఃఖమును అనుభవించటానికి మరొక జన్మను గ్రహిస్తారు. తన ఆత్మను దర్శించటంలో అసమర్థుడైన వ్యక్తికి జీవన్మరణములు రెండూ సమానమే! ఆత్మ సర్వాత్మకమైనది. అందువలన దాని సాక్షాత్కారం కాగానే అదే మిగిలిపోయి, తక్కినదంతా ఆత్మ రూపములోనే దృగ్గోచరమవుతుంది. ఈ ఆత్మ పరమాకాశము కన్ననూ సూక్ష్మమైనది కనుక గోచరించదు. సర్వాత్మకమైనది కనుక శూన్యము కాదు. అయినా ఉన్నదో లేదో కూడా చెప్పలేము. కారణమేమిటంటే ఉన్నదో లేదో చెప్పవలసినవాడు కూడా ఆత్మ పదార్థమే కదా! బంగారంతో ఎన్నో రకాల ఆభరణాలు తయారవుతాయి. వాటి పేర్లు వేరయినా బంగారం మాత్రం ఒక్కటే. ఆత్మకు శక్తిలేదు. దానిని ఏ యుక్తితోను సప్రమాణంగా చూపలేము. కర్పూరమును పెట్టెలో దాచి ఉంచినా, సువాసన చేతనే దాని అస్తిత్వము తెలిసినట్లు ప్రత్యేక రూపంలో ఉన్నప్పటికీ ఆ ఆత్మయే కన్పిస్తుంది. చైతన్యము దేహములు అభిన్నములు. అదే ఇంద్రియముల సారము. అందువలన దృశ్యరూపంలో కన్పించి నప్పటికీ అదే ప్రత్యక్షంగా కన్పిస్తుంది. ఎప్పటివరకూ అలంకారములన్న జ్ఞానం ఉంటుందో అప్పటి వరకూ బంగారమన్న భావన ఉండదు. అట్లాగే దృశ్యజ్ఞానం ఉన్నంతవరకూ దర్శనము అంటే ఆత్మచైతన్య జ్ఞానము ఉండదు. అలంకార జ్ఞానము నష్టముకాగానే, సువర్ణ జ్ఞానమే కలుగునట్లు, దృశ్యజ్ఞానంపోగానే, ఆ పరబ్రహ్మ లేదా పరమేశ్వరుడు ఒక్కడే కనబడతాడు. చంచలమైన ఈ జగత్ చైతన్యముకన్న అతిరిక్తమైనది ఏదీలేదు. ఒక్క ఆత్మయొక్క ప్రకాశమే అన్నిచోట్లా అన్ని రకాలుగా ప్రకాశమానమవుతుంది.

జీవుని దేహము పరమపదము నుంచి పుట్టి, పరమపదములోనే విలీనమవు తుంది; అవుతూ ఉంటుంది. ఫలములు - పుష్పములు చెట్టు నుంచి పుట్టినట్లుగానే జీవుని దేహం కూడా బ్రహ్మ నుంచే పుట్టి అతనిలోనే లీనమవుతుంది. జీవుని

వాసన ఎక్కడ ఏ ప్రకారం ఉంటుందో, అట్లాంటి ఫలమే ప్రాప్తిస్తుంది. అజ్ఞాన వశమును పరబ్రహ్మనే చిత్తమనీ జీవమనీ అనుకొంటారు. ఆత్మ ఎక్కడికీ పోదు. శరీరనాశము కాగానే ఆత్మ అనంతాకాశంలో లీనమైపోతుంది. అంటే పరబ్రహ్మలో కలిసిపోతుంది. శరీరము కేవలము మృత్యురూపమైన గుడ్డ చేత ఆచ్ఛాదింపబడి ఉన్నది. ఆత్మ బయటకు వెళ్లిపోవటమే మృత్యువని చెప్పబడుతుంది. సృష్టికి ముందు ఈ జగత్తు ఏమీలేదు. తరువాత కూడా ఏమీ ఉండదు. కేవలం మధ్యలో మాత్రమే దృగ్గోచరమవుతుంది.

ఈ జగత్తును ఎవ్వరూ విరచించలేదు. అది స్వతస్సిద్ధంగానే ఉద్భవించింది. ఆ పదార్థముల శక్తులు ఆత్మ నుండే ప్రకాశితములై వ్యవహార దశను పొందుతున్నాయి. ఆత్మ కేవలము సాక్షిరూపంలో ఉంటుంది. ఒక్క బ్రహ్మ నుంచే ఇదివరలో ఎన్నో జీవములు పుట్టాయి. ఇప్పుడు పుడుతున్నాయి. ముందు కూడా పుడతాయి. ఈ జీవులు తమ వాసనలకు చిక్కి అతివిచిత్ర దశలో పడి, నీటి బుడగలలాగా పైకిలేస్తాయి; తిరిగి విలీనమవుతాయి. ఈ జీవులలో కొన్ని ఒక్కసారి జన్మిస్తాయి. కొన్ని ఇప్పుడే జన్మిస్తున్నాయి. కొన్ని కైవల్యాన్ని పొందాయి. కొన్ని సహస్ర కల్పాలవరకూ మళ్లీమళ్లీ జన్మిస్తూ ఉంటాయి. కొన్ని ఒకే యోనిలోనే ఉంటాయి. కొన్ని ఇతర యోనులలో పుట్టతాయి. కొన్ని నరకములో పడి దుస్సహమైన దుః ఖాన్ని పొందుతాయి. కొన్ని మర్త్యలోకంలో ఉండి కొంచెంగా సుఖాలను అనుభవిస్తాయి. కొన్ని సూర్యులు, కొన్ని ఇంద్రులు, కొన్ని వరుణులు, మరికొన్ని బ్రహ్మ విష్ణు మహేశ్వరులు అయినాయి. కొన్ని బ్రాహ్మణులు, కొన్ని క్షత్రియులు,కొన్ని వైశ్యులు, కొన్ని శూద్రులు, కొన్ని చండాలురుగా అయినాయి. కొన్ని గడ్డిపోచలుగా, కొన్ని ఫలములుగా, కొన్ని పక్షులుగా, కొన్ని పురుగులుగా అయి, జలములోనో, భూమి మీదనో ఉంటాయి. కొన్ని పెద్దపెద్ద వృక్షాల రూపంలో ఉన్నాయి. కొన్ని ధనవంతులుగా, కొన్ని రాజులుగా, కొన్ని మంత్రులుగా, కొన్ని సామంతులుగా అయినాయి. కొన్ని నార చీరలను ధరించి, మౌనముద్రలో ఉండే మునులయ్యాయి. కొన్ని పాములు, కొన్ని కొండచిలువులు, కొన్ని క్రిములు, కొన్ని చీమలు అయినాయి. కొన్ని సింహాలు, కొన్ని పులులు, కొన్ని జింకలు, కొన్ని మహిషములు, కొన్ని గోవులు, కొన్ని గుఱ్ఱములు, కొన్ని ఏనుగులు, కొన్ని మేకలు అయ్యాయి. కొన్ని వాయువుగా, కొన్ని ఆకాశంగా అయ్యాయి. కొన్ని జీవన్ముక్తులై

పరమ కల్యాణకారి రూపంలో చింతన చేస్తున్నాయి. కొన్ని విదేహముక్తిని పొంది, పరమాత్మలో పరిణతమయ్యాయి. కొన్ని ముక్తి లభించటంలో చాలా రకాల ఆలస్యాలు ఎదుర్కొంటున్నాయి. కొన్ని జీవులు విషయ లగ్నములై ఉన్నాయి. కొన్ని ఆత్మముక్తిని ద్వేషిస్తున్నాయి. కొన్ని నదులుగా అయ్యాయి. కొన్ని సమాధిస్థితిలో ఉన్నాయి. ఈ జీవులన్నీ తమతమ వాసనలకు బద్ధులై అనేక స్థితులు పొంది ఉన్నాయి. ఈ జీవులు వాసనాశరీరములను ధరించి, ఆశాపాశములతో బద్ధులై, పక్షులు ఒక చెట్టు మీదనుంచి మరొక చెట్టు మీదికి పోయినట్లుగా, ఒక శరీరం నుంచి మరొక శరీరానికి రాకపోకలు జరుపుతూఉంటాయి.

కొందరు ఆత్మదర్శన శక్తి కలిగి ఉండి కూడా, బుద్ధిహీనులై అధఃపతనమును పొంది నరకమునకు పోతున్నారు. మరికొందరు అదే శక్తిబలం వలన దేవభావాన్ని పొందుతున్నారు. ఈజగత్తులో జీవుడు ఎలాంటి వ్యవహారాలలో ఉంటాడో, అలాంటి ఆకృతులను ప్రకృతులను పొంది, ఆ అవస్థలలోనే ఉంటాడు. ఆ పరబ్రహ్మనుంచే అసంఖ్యాకజీవులు నిజంగా పుడుతున్నాయి. అనేక శరీరాలను పొంది, సమయానుగుణంగా పరమపదంలో విలీనమవుతున్నాయి.

ఈ జగత్తు ఒక దీర్ఘ స్వప్నంలాంటిది. ఎవరికి అజ్ఞాన నిద్రాభంగం అయిందో, వాసనా సమూహము నశించిందో, అలాంటి స్థిరచిత్తులు ఈ సంసార స్వప్నమును చూడరు. (అన్నిజీవులకు) మోక్షపదం లభించిన తరువాత కూడా జీవుల స్వభావ సంకల్పితమైన ఈ సంసారము పరమాత్మలో సూక్ష్మరూపంలో ఉంటుంది. ఈ సంసారము మనస్సు యొక్క వికాస మాత్రమైనదే. ముక్తిని పొందటానికి సంకల్పాన్ని దృఢంగా చేసుకోవటం ఒక్కటే ఉపాయము. కారణమేమిటంటే ఈ జగత్తు సంకల్పం కాక మరేమీ కాదు. అక్కడ దుఃఖము తప్ప సుఖమనేది లేదు. పంకల్పం ద్వారా సంకల్పాన్ని, మనస్సు ద్వారా మనస్సును ఛేదించి, కేవలం నీ ఆత్మలో నిలుపుకో. అప్పుడు ఈ సంసార దుఃఖము సమూలంగా నష్టమైపోతుంది. సంకల్పము, మనస్సు, చిత్తము, బుద్ధి, వాసన, జీవుడు అన్ని ఒకే పదార్థములు పేర్లు మాత్రమే భేదము.

అన్ని పదార్థాలలోను బాధ ఉంటే, అప్పుడు భావనలకు విలువ ఏముంటుంది? దేనిని సత్యమని భావిస్తామో, అది ఒకవేళ అసత్యమైనదయితే, వాసనలు ఎట్లా నిలుస్తాయి? వాసనాక్షయమైతేనే ఆత్మతత్వం సిద్ధిస్తుంది. అభ్యాసవశం చేత అన్ని

పదార్థములపట్ల అవహేళన ఎక్కువైతే, అప్పుడు అన్ని పదార్థాలు అసత్యంగానే గోచరిస్తాయి. పరమాత్ముడు ఇచ్ఛావిహీనుడు, ఉదాసీనుడు. అందువలన ఆయనకు ఏమీ పట్టదు. అయినా ఆయన అన్ని వస్తువులనూ ప్రకాశింపజేస్తాడు. అందువలన అన్నీ అనుభవిస్తాడు. అన్నీ చేస్తాడు. ఆత్మయే ఆత్మను తెలుసుకోగలుగుతుంది. వాసనా క్షయమే మోక్షమని చెప్పబడుతుంది. మనస్సు వాసనా శూన్యుడైన వారికి కర్మ, ప్రాణాయామము, సమాధి, జపము వంటి వాని వలన ప్రయోజనం లేదు. ఆత్మ సాక్షాత్కారము కన్న జగత్తులో వేరే సుఖములేదు. అదే అన్ని విధాలా ఏ దుఃఖమూ లేనిది. నిప్పు ఉన్నచోట మసి ఉండునట్లు అన్ని (లౌకిక) సుఖాలకూ చివర దుఃఖం ఉన్నది.

నీవు చూస్తున్న ఈ దృశ్యమాన జగత్తు, పరబ్రహ్మ యొక్క ప్రకాశరూపము మాత్రమే! వాస్తవంగా మరేమీలేదు. మనోమయ దేహమే సుఖదుఃఖాలను పొందుతుంది. మాంసమయ శరీరం కాదు. జగత్తుకు

ఉత్పత్తి వినాశములు లేవు. అవి భ్రాంతి మాత్రములే. జాగ్రత్ స్వప్న సుషుప్తి అనే మూడు అవస్థలనూ ఆత్మయే పొందుతుంది. శరీరం ఏమీ పొందదు. ఆత్మ జీవభావాన్ని పొందినప్పుడు అందులోనే దేహభావం ప్రకాశితమవుతుంది. అరటి చెట్టుకు – దాని ఆకులకు తేడా లేనట్లు బ్రహ్మ పదార్థంలోను సృష్టిలోను తేడా ఏమీలేదు. అజ్ఞానమువలన సృష్టి సత్యంగా కన్పిస్తుంది. కాని జ్ఞానోదయం కాగానే అది అసత్యమైపోతుంది.

సంసారాపేక్షయే దుఃఖానికి నిలయము. మరేమీ కాదు. శ్మశానంలో పడి ఉన్న శవంతో మాట్లాడే మూర్ఖుడు ఎవరూ ఉండరు. దేహి యొక్క దేహంలో ఎన్నో రకాల కీటకాదులు జన్మిస్తున్నాయి. ఆ శరీరం వదలిన మలంలో కూడా ఎన్నో రకాల కీటకములు జన్మిస్తున్నాయి. ఈ రకంగా జీవుడు నానారకాలుగా జన్మించి కష్టం అనుభవించటం తప్ప మరేమీలేదు. అజ్ఞానంతో రోజులు గడపక ఎప్పుడూ చక్కగా విచారణ చెయ్యాలి. విషయాసక్తుడైన మనిషికీ పశువుకూ తేడాలేదు. ఎందుకంటే పశువు త్రాడుతో బంధింపబడినట్లు, అజ్ఞాని చిత్తము విషయములచేత బంధింపబడి ఉంటుంది. ఆత్మనుంచి వేరే మనస్సు పుడుతుంది. దానిని గురించి తెలుసుకోక పోతే మనస్సే పుట్టదు. మనమే ఆత్మలము, జీవులము కాదు అనే జ్ఞానం కలగటమే చిత్తమునకు శాంతస్థితి. కట్టెలను వెయ్యటం వలన మంట

పెరిగినట్లు, చింతన వలన చింత పెరుగుతుంది. కట్టెలను తీసివేస్తే మంట చల్లారి పోయినట్లు, చింతన వలన చింత తగ్గిపోతుంది. విషయ చింతనమే చిత్తవృత్తి అని చెప్పబడుతుంది. ఆ చింతతో కూడిన చిత్తమే ఆశతో కలిసి ప్రకాశిస్తుంది. అందు వలన ఆశ అంతరిస్తే చింతకూడా అంతరిస్తుంది. ఆశయే జీవునికి బంధన కారణము ఆ బంధనం తెగిపోగానే, ఎవరైనా సరే ముక్తుడు కాకుండా ఉండలేదు.

ఈ బ్రహ్మాండంలో మోక్షమనే ఒక స్థానం ఉన్నది. దానికి భగవత్ స్వరూపమైన ఆత్మయే రాజు. మనస్సు అతనికి మంత్రి. మట్టిలోనే చేయదలచిన కుండ ఉన్నట్లు, మనస్సు లోపలనే వాసనారూపంలో ఈవిశ్వం ఉన్నది. ఆ మనస్సును జయిస్తే, అన్నింటినీ జయించవచ్చు. అన్నింటినీ పొందవచ్చును. మనస్సు జయింపరానిదని భావిస్తే కేవలం యుక్తి ద్వారానే దానికి వినాశం కలుగుతుంది. ఈ దృశ్యమాన విషయముల నుండి క్రమంగా వైరాగ్యాన్ని అలవరచుకోవాలి. అందరూ మోక్షాన్నే కోరుకొంటారు. ఎవరు దానిని కట్టి వేయగలరు? జ్ఞానోదయం అయినప్పటికీ అది కట్టబడదు. మనిషి మృతుడూ కాదు; జీవితుడూ కాదు. ఈ జగత్తు ఎవరిదీ కాదు. ఏ వస్తువూ ఎవరిదీ కాదు. మనిషి కూడా జగత్తుకు సంబంధించినవాడూ కాదు. ఎవరికీ ఎవరూ కారు. జీవుని ఆత్మలో నిలపాలి. ఆత్మదర్శనం చెయ్యటానికి ఎలుగెత్తి అరవనవసరంలేదు. శరీరంలోనే దానిని దర్శింపవచ్చును. ఓంకారోచ్చా రణ చేస్తే కొంచెం సేపటిలోనే ఆత్మదర్శనమవుతుంది. ఆత్మ అజ్ఞానంతో ఉన్నంత వరకూ శరీరం ఉంటుంది.

అజ్ఞానమే పాపము. ఆపాపము చింతనవల్ల దూరమవుతుంది. అందువలన పాపమును నిర్మూలించే చింతనను ఎప్పుడూ వదిలిపెట్టకూడదు. హరియే అఖిల జగత్తుకూ ఆత్మ. ఆ ఆత్మలో ఎలాంటి ప్రతిబింబం పడితే, జీవుడు దానినే దర్శించి, మననం చేస్తాడు. వాసనలకు వశీభూతమైన ఈ జగత్తును భ్రమ రూపంలో నీవు చూస్తున్నావు. బీజంలో వృక్షం దాగి ఉన్నట్లుగా మన మనస్సులో ఈ జగత్తు దాగి ఉన్నది. అంకురం నుంచి బయటికి వచ్చి ఆకులతో తన రూపాన్ని ఆవిష్కరించు కొన్న వృక్షంలాగా, చిత్తంనుంచి ఉత్పన్నమైన పృథ్వి మొదలైన అన్ని పదార్థాలు ప్రకాశిస్తాయి. వాస్తవానికి పృథ్వి మొదలైనవి మనస్సులోనే ఉన్నాయి. భూమి నుంచి పెకిలించిన చెట్టుకు పండ్లు, పూలు ఎట్లా మొలవవో, అట్లాగే వాసనావిముక్తమైన జీవునికి తిరిగి జన్మ ఉండదు. నీటిలో ఉన్న రత్నం తన ప్రకాశం చేతనే

తెలియబడునట్లు, పూర్ణ ప్రకాశుడైన బ్రహ్మ జగదాది పదార్థముల రూపంలో ప్రకాశితుడవుతాడు. ఎందుకంటే బ్రహ్మ పదార్థం కానిది ఎక్కడా ఏదీలేదు. ఆత్మయే ఆత్మకు బంధువు. అందువలన వివేకంతోనే ఆత్మను ఉద్ధరించాలి. పునర్జన్మలేకపోయినప్పుడే ఆత్మ ఉద్ధరింపబడినట్లు.

ఎప్పుడూ తోడుండే మనస్సు యొక్క విచారణతోనే ఆత్మోద్ధరణ జరుగుతుంది. అంధకారం పోగానే వెలుతురు వచ్చినట్లు, అహంకారం దూరమైనంత మాత్రముననే ఆత్మ దర్శనమవుతుంది. మేము, మనది అనే భావనను వదిలి, మనస్సుతో మనస్సును భేదించటం వలన, ఆత్మదర్శనమవుతుంది. సూర్యోదయం కాగానే భూతలము ప్రకాశవంతమైనట్లు, జ్ఞానోదయం కాగానే బ్రహ్మ స్వరూపమైన జ్ఞేయ వస్తువు స్వయం ప్రకాశితమవుతుంది. స్థిరమైన మనస్సుతో ఆలోచిస్తే భగవంతుడు మనిషిని తన మనస్సుకు తోచినట్లు తయారుచేసి తన సంపూర్ణ శక్తిని ప్రసాదించి, ఆ మనుష్యశరీరము లోపల, బయట కూడా వ్యాపించి ఉన్నాడని స్పష్టమవుతుంది.

❀ ❀ ❀ ❀ ❀

10. ఈశ్వరుడు

ఈశ్వరుడు అనగానే ఏదైనా గుణం కాని వస్తువుకాని స్ఫురిస్తుందా? ఆయనను తెలుసుకోటానికి లేదా ప్రత్యక్షం చేసుకోటానికి ఏదైనా ఉపాయం ఉన్నదా? అందరూ అంగీకరించిన విషయం ఏమిటంటే – ఈశ్వరుడనే శబ్దంలో ఏదో ఒక గొప్ప శక్తి ఉన్నది అని. ఈశ్వరుడు సర్వవ్యాపి, ఈశ్వరుడు విశ్వవ్యాపి అని అన్నప్పుడు, ఈశ్వరునిలో స్థాన వ్యాపకతా గుణము ఉన్నదని స్పష్టమవుతుంది. అందులో ఎవరికీ ఎలాంటి సందేహములేదు. ఒక పుస్తకము కొంత స్థానం ఆక్రమించి ఉన్నది అంటే దానికి ఆకారము ఉన్నట్లేకదా! కాని ఈశ్వరుడు ఒక స్థానంలో ఉన్నాడు అన్నప్పటికీ ఆయనను నిరాకారుడని ఎందుకు చెబుతారు? కొంత స్థలాన్ని ఆక్రమించిన వస్తువు సాకారమైనదిగా చెప్పబడుతుంది. కాని విశ్వవ్యాపియైన ఈశ్వరుడు మాత్రం అట్లా హద్దులున్న స్థలంలో లేడు. ఈ విశ్వము అనంతమైనది, హద్దులు లేనిది. అట్లాగే అందులో ఉన్న ఈశ్వరుడు కూడా హద్దులు కాని, అంతము కాని లేనివాడు. అందువలననే ఆయన నిరాకారుడు.

ఎవరైనా కల్పనా లక్షణం వలన విశ్వానికి హద్దులు ఉన్నాయని అనవచ్చును. అప్పుడు ఆ హద్దులకు అవతల కూడా ఆయనకు స్థానమున్నదో లేదో ఆలోచించాలి. ఆ విధంగా ఎవ్వరూ ఆలోచించలేరు. బుద్ధితో తెలుసుకోలేరు. అందువలన విశ్వానికి హద్దులులేవు. అప్పుడు ఈశ్వరునికి కూడా హద్దులు లేవు. విశ్వంలో ఎన్ని చోట్లు ఉన్నాయో, ఆ అన్నింటిలోను ఆయన వ్యాపించియున్నాడు. అందువలన ఆయన నిరాకారుడు. అంతేకాదు. భగవంతుని ఆకారాన్ని తులతూచ గల శక్తి కూడా మనుష్యుని జ్ఞానంలో కాని బుద్ధిలోకాని ఏదీలేదు. అందువలన అతని ఆకారాన్ని అంచనా వెయ్యలేము. కనుక ఆయన నిరాకారుడు.

ఈశ్వరుడు నిర్గుణుడు. ఎట్లా? అన్ని గుణాలు ఉన్నవాడు, బుద్ధికి అగోచరుడైన వాడు అయిన ఆయనను నిర్గుణుడని ఎట్లా చెబుతాము? ఈశ్వరుని గుణాలకు హద్దులేవు. అట్లాగే ఆయనకు ఎన్నిరకాల గుణాలు ఉన్నాయో వాటికి కూడా హద్దులేదు. ఆయన గుణములు తులలేనివి. అందువలన ఆయన నిర్గుణుడు. ఎవరి పరిమాణాన్ని లెక్కించలేమో ఆయన సీమారహితుడు. ఆయన గుణాలను కూడా లెక్కించలేము కనుక ఆయన నిర్గుణుడు. ఈ జగత్తులోని గుణములన్నీ ఈశ్వరుని

ఒక్క గుణం నుంచి పుట్టినవే! అదే గుణము ఆయనలో ఉన్నదని, దానికి విపరీతమైన గుణములేదని ఎవరూ చెప్పలేదు. ఈ జగత్తులో ఎన్ని రకాల గుణాలు ఉన్నాయో అవన్నీ ఆయనలోని అనిర్వచనీయ గుణంలో అంతర్గతంగా ఉన్నాయి. అందువలన ఆయన గుణాలకు హద్దులేదు. మన ఇంద్రియాలకు ఆయన అంతుపట్టడు. అందువలన ఆయన నిర్గుణుడు.

ఈశ్వరుని రూపం ఎట్లా ఉన్నది? ఈ జగత్తులో ఎన్ని రకాల రూపాలు ఉన్నాయో అవన్నీ ఈశ్వరుని రూపం నుంచే వెలువడినాయి. అయినా అవి భిన్నభిన్నమైన పేర్లతో ప్రకాశిస్తున్నాయి. అయినా ఆ ఈశ్వరుని రూపంతో పోల్చి చెప్పగల రూపం ఒక్కటీ ఈ జగత్తులో లేదు. ఆయన జ్యోతిర్మయుడు. ఆనంద స్వరూపుడు. కనుక ఆయనను విశ్వరూపుడంటారు. బ్రహ్మ, విష్ణువు,మహేశ్వరుడు, అట్లాగే దేవుళ్లు, దేవతలు అందరూ ఆయన స్థూల రూపాలే! ముముక్షువైనవాడు భగవంతుని స్థూల రూపాన్ని ఆశ్రయించాలి. లేకపోతే ఆయన సూక్ష్మరూపం గోచరింపదు. క్రమ క్రమంగా ఆ భగవంతుని అవినాశకమైన పరమ రూపమును ధారణ చేస్తూ ఉంటే, ఆయన విశ్వరూపం అతనికి అనుభవంలోకి వస్తుంది. ఆయన రూప మాధుర్యాన్ని చూడని వారిని గురించి ఏమని చెప్పాలి? ఆయనను దర్శించని వారు ఆయనను గురించి వర్ణించటంలో అసమర్థులు. ఎందుకంటే, ఆయనను వర్ణించి చెప్పగల యోగ్యత ఏ భాషకూ లేదు. అంతేకాక ఆయన రూపాన్ని చూడగానే లోకులు మోహితులై అవాక్కులవుతారు. లేదా జ్ఞాన శూన్యులవుతారు.

ఈశ్వరుడు చేతనుడా? అచేతనుడా? అంటే ఈశ్వరుడు చేతనుడు కాడు. అచేతనుడు కాడు. ఆయనలోని అనవచ్ఛిన్న నిర్గుణ శక్తినే చైతన్యగుణమంటారు. చైతన్య గుణమంటే ఏమిటో అది అందరికీ తెలిసినదే. కాని, అనవచ్ఛిన్న చైతన్య గుణము ఎట్లా ఉంటుందో తెలుసుకోటానికి మనకు శక్తి లేదు. ఈశ్వరుడు విశ్వరూపుడు, నిరాకారుడు, నిర్గుణుడు. అందువలన ఆయన ఆకారము, రూపము, గుణములను తెలుసుకోవటం మన శక్తికి మించిన విషయము. ఈశ్వరుని గుణములను కూడా మనం ఆలోచించలేము. ఎందుకంటే అది మనస్సుకు అగోచరమైనది. అందువలన ఆయనను ఉపాసించటం కూడా చాలా కష్టమైనపని. ఒకవేళ ఎవరైనా ఈశ్వరుని నిరాకార రూపమును చూడగలుగుతున్నామని చెబితే, వారికి నిరాకారమనే శబ్దానికి అర్థం కూడా తెలియదని స్పష్టమవుతుంది.

అందువలన మనం ఈశ్వరుని సగుణ రూపాన్ని ధ్యానించి, చింతన చెయ్యాలి. ఈశ్వరుని సగుణ రూపాన్ని ధ్యానిస్తూ ఉంటే, మనస్సు ఎంత నిర్మలంగా అవుతూ ఉంటుందో, అంతగా ఆత్మ ప్రకాశము అంతరంగంలో అవుతూ ఉంటుంది. అప్పుడు మనస్సు యొక్క సహాయం లేకుండానే ఈశ్వరాకార అస్తిత్వ అనుభవాన్ని పొందగలుగుతాము.

సగుణ ఈశ్వరుడని ఎవరిని అంటారు అని ఎవరైనా జిజ్ఞాసువులు అడగ వచ్చును. ఎవరైతే అత్యున్నత స్థితిని పొందినారో, వారే ఈశ్వరునిలో లీనమై పోతారు. అప్పుడు ఆయనలో ఎలాంటి మార్పు ఉండదు. అలాంటి ఉన్నత శీలం గలవారు సమస్త బ్రహ్మాండాన్నీ తమలోనే చూడగలుగుతారు. ఆ ఉన్నత పురుషులే మనుష్య దశలో చరమస్థాయిని పొందిన వారవుతారు. వారే సగుణ ఈశ్వరులు. ఏ మనిషి రూపంలో సమస్త విశ్వమూ ప్రతిబింబించి ఉంటుందో ఆయనే సగుణ ఈశ్వరుడు. ఎవరైతే కర్మ చేస్తూ కూడా నిష్క్రియుడో, ఎవరు మనుష్య రూపంలో ఉన్న అంతరంగంలో విశ్వరూపుడో, ఎవరి తత్త్వజ్ఞానం వలన బ్రహ్మాండోత్పత్తి అయిందో, ఎవరికి మేమే బ్రహ్మపదార్థమనే జ్ఞానం ఉంటుందో, ఆ ఆత్మజ్ఞానులే భగవత్ స్వరూపులై ఈశ్వరుడనిపించుకొంటారు.

ఈశ్వర తత్త్వాన్ని తెలుసుకోవాలన్న జిజ్ఞాస ఎవరి మనస్సులోనైనా కలిగితే, అలాంటి ఉన్నత పురుషులతో సంబంధం పెట్టుకొని అవిరామంగా చింతన చెయ్యాలి. మన ఆత్మ జిజ్ఞాసను అలాంటి ముక్తాత్ముల గుణములతో కలిపే ప్రయత్నం చెయ్యాలి. అప్పుడు ఏదో ఒక అజ్ఞాత శక్తి మీకు మార్గదర్శనం చేయిస్తూ, మిమ్మల్ని తనవెంట నడిపిస్తున్నట్లు మీకు క్రమంగా అనుభవంలోకి వస్తుంది. సగుణుడు, నిర్గుణుడు, నిరాకారుడు, విశ్వవ్యాపి సచ్చిదానంద స్వరూపుడు ఒక్క ఈశ్వరుడే అనే విషయం స్పష్టంగా తెలుసుకోగలుగుతారు.

ఎవరు-నాలుగు దిక్కులా లోపల బయట నిరవచ్ఛిన్నంగా నిలిచి ఉన్నారో, ఎవరి సంజ్ఞా మాత్రము చేతనే బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుడు, ఇంద్రుడు, చంద్రుడు, సూర్యుడు, వాయువు, వరుణుడు మొదలైన వారంతా తమతమ కర్తవ్య పాలనలను చేస్తారో, ఎవరి శక్తివలననే మనము జీవించి ఉన్నామో, కాళ్లు లేకపోయినా ఎవరు అంతటా సంచరించ గలుగుతారో, చెవులు లేకపోయినా మనస్సులోని భావాల వరకూ ఎవరు వినగలుగుతారో, కళ్లు లేకపోయినప్పటికీ

ఎవరు అన్నీ చూడగలుగుతారో, మనము చూస్తూ ఉన్నప్పటికీ ఎవరిని మనము చూడలేమో, కామ-క్రోధ-లోభ-దురాశా- విషయవాసనలు ఎవరిని చూసి దేహం విడిచి పారిపోతాయో, జ్ఞానము కూడా ఎవరి స్వరూప వర్ణనను చేయటంలో అసమర్థమైనదో, కల్పనా శక్తి కూడా ఎవరిని కొలవటం కాని తూచటంకాని చెయ్యలేదో, మనస్సుకాని ఆత్మకాని ఎవరి దగ్గరకు పోయినా మళ్లీ తిరిగి వస్తుందో, మాయ ఎవరిని ఆవరించలేదో, వాక్యములు ఎవరిని వ్యాఖ్యానించలేవో-ఆయనే ఈశ్వరుడు. ఎవరికి హారతి పట్టడానికి సూర్యచంద్రులు దీపాలను వెలిగిస్తున్నారో, గాలి చామరములను వీస్తూఉంటుందో, తరులతలు పుష్పరాశి ద్వారా సుగంధ దానం చేస్తూ ఉంటాయో, పక్షి గుణములు సంకీర్తన చేస్తూ ఉంటాయో, వజ్రం లాంటి శంఖము ధ్వని చేస్తూ ఉంటుందో, భక్తి-శ్రద్ధ-శాంతి-కరుణ- ముక్తులు ఎవరి పాదసేవ చేస్తాయో, వైరాగ్యం, జ్ఞానము యోగము ధర్మము ఎవరి ద్వారం వద్ద కాపలాకాస్తూ ఉంటాయో, ఎవరు జీవుని కర్మానుసారం ఫలాన్ని ఇస్తూ ఉంటారో, ఎవరు తనను మరచిపోయినవారిని కూడా వదల పెట్టడో, మాయ నిద్రను వదలి జాగ్రదవస్థకు ఎవరు అందరినీ ఆహ్వానిస్తూ ఉంటారో, తాను నిర్గుణుడై ఉండికూడా త్రిగుణములతో త్రిజగత్తులను ఎవరు బంధించి ఉంచుతాడో, తాను రూపహితుడై ఉండికూడా ఆశ్చర్యకరమైన రూపములో త్రిభువనములను ఎవరు మోహింపజేస్తూ ఉంటాడో, తాను స్వయముగా చైతన్యస్వరూపుడై ఉండికూడా మాయమోహములతో జీవులను అచేతనులుగా చేశాడో ఆయనే ఈశ్వరుడు.

బ్రహ్మ జగత్తును ఆవరించియున్నాడు. కానీ బ్రహ్మను ఏ వస్తువూ ఆవరించిలేదు. అయినా బ్రహ్మచే ఆవరించబడిన దృశ్య పదార్థాలన్నీ కేవలం ఎడారిలోని ఎండ మావులలాగా మిథ్యాజ్ఞాన మాత్రములే. చూడబడేది. వినబడేది అయిన ప్రతి వస్తువూ బ్రహ్మ కన్న అభిన్నములు. కారణమేమిటంటే జ్ఞానోదయం కాగానే అదే వస్తువు అద్వితీయము, సచ్చిదానందము అయిన బ్రహ్మ తప్ప మరేమీ కాదని స్పష్టమవుతుంది. జ్ఞానియైనవాడు జ్ఞానచక్షువుతో సర్వవ్యాపి -నిత్యము - జ్ఞాన స్వరూపము అయిన ఆత్మను దర్శిస్తూ ఉంటాడు. గ్రుడ్డివాడు సూర్యుని చూడలేనట్లు, జ్ఞానచక్షువు లేకుండా మనిషి దానిని దర్శించలేడు. సూక్ష్మము కానివాడు, స్థూలముకానివాడు, హ్రస్వముకానివాడు, దీర్ఘము కానివాడు, జన్మవినాశ రహితుడు, రూప-గుణ-వర్ణ-నామరహితుడు, నిత్యమూ ఒకే

రూపంలో దగ్గరలోను - పైన - క్రింద - అన్ని దిక్కులలో ఉండేవాడు, పూర్ణము - సత్యము - చైతన్యము-ఆది- అంతములు లేనివాడు, అద్వితీయ ఆనంద మయుడు ఎవరో ఆయనే ఈశ్వరుడు.

ఏ లాభాన్ని మించిన లాభంలేదో, ఏ సుఖాన్ని మించిన సుఖంలేదో, ఏ జ్ఞానాన్ని మించిన జ్ఞానం లేదో, ఎవరిని చూసిన తరువాత చూడవలసిన దృశ్యమేదీ ఉండదో, ఎక్కడికి చేరుకొన్నాక మళ్లీ జన్మ ఉండదో, ఎవరిని తెలుసుకొన్న తరువాత ఇంకా తెలుసుకోవలసినవి ఏమీ ఉండవో - ఆ బ్రహ్మపదార్థమే ఈశ్వరుడు.

సూర్యుడు, చంద్రుడు, మొదలైన ఉజ్జ్వల వస్తువులు కూడా ఎవరిని ప్రకాశింప జేయలేవో, ఎవరి ప్రభావంతో సూర్యచంద్రాదులు ప్రకాశిస్తారో, ఎవరి వలన ఈ బ్రహ్మాండము ప్రకాశిస్తూ ఉన్నదో, అగ్ని లోహపుముద్దలో ప్రవేశించి దానిని కూడా దీపింపజేసినట్లు అన్ని వస్తువులకూ లోపల బయట వ్యాపించి ఉండి ఈ జగత్తును ఎవరు ప్రకాశింపజేస్తారో, ఆయనే బ్రహ్మ లేదా ఈశ్వరుడు.

ఎవరు - మనిషి, దేవత, బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు, శూద్రుడు, గృహస్థు, బ్రహ్మచారి, వానప్రస్థుడు, రాజు, భిక్షువుకాని వాడో; అయినా సర్వవ్యాపి, సర్వాంతర్యామి, జ్యోతిర్మయుడు, జ్ఞానస్వరూపుడు అయినవాడో, ఎవరు అద్వితీయుడో; నిత్యజ్ఞాన స్వరూపమైన ఆత్మను ఆశ్రయించి తమ తమ పనులను నిర్వహింపజేయటంలో ఎవరు లగ్నమై ఉంటారో - ఆయనే బ్రహ్మ లేదా ఈశ్వరుడు.

సూర్యోదయము అందరి వ్యవహారానికి కారణభూతమైనట్లు, మనస్సు - బుద్ధి అహంకారము - చిత్తము అనే చతురింద్రియములు, పంచ జ్ఞానేంద్రియములు, పంచ కర్మేంద్రియములు తమ తమ పనులు చేయటానికి ఎవరు కారణభూతుడో, ఎవరు ఉపాధి రహితుడో, ఆకాశంలాగా సర్వవ్యాపి మనోహరుడో, సృష్టిద్వారా సర్వదా గోచరమవుతూ ఉంటాడో - ఆయనయే బ్రహ్మ లేదా ఈశ్వరుడు.

ఎవరు అద్దము -జలము-తైలము ఇత్యాది వస్తువులలో ముఖం ప్రతిబింబిం చినట్లు దర్శనమిస్తాడో, ఆ ప్రతిబింబించిన ముఖం కన్న ఎవరు అభిన్నుడో, అట్లాగే బుద్ధిలో ఆత్మ యొక్క ప్రతిబింబంలా భాసిస్తూ జీవాత్మకన్న అభిన్నుడో - ఆయనే బ్రహ్మ లేదా ఈశ్వరుడు.

ఎవరు అసలైన మనోచక్షువు, ఇంద్రియముల కన్న భిన్నుడై ఉండి కూడా మనస్సుకు మనస్సు, ప్రాణమునకు ప్రాణము, కంటికి కన్ను, చెవికి చెవి అయి కూడా, మనస్సు చక్షువు మొదలైన ఏ ఇంద్రియములచేతను గ్రహింపబడడో - ఆయనే బ్రహ్మ లేదా ఈశ్వరుడు.

భిన్నభిన్న పాత్రలలోని జలాలలో సూర్య కిరణాలు పడి నానా ప్రకారాలుగా కన్పించునట్లు స్వయం ప్రకాశుడు, విశుద్ధ జ్ఞాన స్వరూపుడు, అద్వితీయుడు అయికూడా నానా ప్రకారమైన జీవుల బుద్ధిలో నానా ప్రకారములుగా భావింప బడుతూ ఉంటాడో - ఆయనే బ్రహ్మ లేదా ఈశ్వరుడు.

అన్ని వస్తువులను ప్రకాశింపజేసే సూర్యుడు తాను ఒక్కడే అయినప్పటికీ అందరి కండ్లలోనూ ఒకేసారి ప్రకాశింపజేసినట్లు, ఒకే సమయంలో ఎంతో మంది బుద్ధులలో ప్రకాశిస్తూ ఉండే ఆ నిత్యజ్ఞాన స్వరూపుడైనవాడే బ్రహ్మ లేదా ఈశ్వరుడు.

సూర్యకిరణాల ద్వారా ప్రకాశించే రూపములను గ్రహించి, ప్రకాశింపని రూపాలను గ్రహించటంలో సమర్థముకాని కండ్లలాగా, చైతన్య జ్యోతి ద్వారా ప్రకాశిస్తూ ఇతర రూపాలను ప్రకాశింపజేస్తూ ఉండే ఆ సూర్యుడే నిత్య జ్ఞాన స్వరూపుడైన బ్రహ్మ లేదా ఈశ్వరుడు.

సూర్యుడు ఒక్కడే అయి ఉండి కూడా చంచలమైన నీటిలో అనేక రూపాల తోను, స్థిరమైన జలంలో ఒకేరూపంతోను కన్పించునట్లు, తాను ఒక్కడే అయి ఉండి కూడా చంచలమైన బుద్ధిలో ఎన్నో రకాలుగా ప్రతీయమానమయ్యే నిత్యజ్ఞాన స్వరూపుడే బ్రహ్మ లేదా ఈశ్వరుడు.

అజ్ఞాని అయినవాడు మసక కళ్లతో చూసి సూర్యుడు మేఘావృతుడై ఉన్నాడని కాంతిహీనుడై ఉన్నాడని చెప్పునట్లు, నిత్యుడు - శుద్ధుడు - చైతన్యుడు అయిన ఈశ్వరుడు జ్ఞానులకు చాలా దగ్గరలో ఉన్నట్లు కనబడతాడు. ఆ నిత్యజ్ఞాన స్వరూపుడే బ్రహ్మ లేదా ఈశ్వరుడు.

తాను ఒక్కడే అయినా, అన్నింటిలోనూ అంతర్యామియై ఉంటూ కూడా, ఏ వస్తువుచేత స్పృశింపబడలేనివాడు, ఆకాశంలాగా సర్వవ్యాపి అయినవాడు బ్రహ్మ లేదా ఈశ్వరుడు.

ఆత్మ పృథ్వికాదు. ఎందుకంటే పృథ్విలో ఉండే గంధగుణం ఆత్మలో లేదు. అది కేవలం గంధమును ప్రకాశింపజేస్తుంది. ఆత్మజలము కాదు. ఎందుకంటే జలములోని రసలక్షణము ఆత్మలో లేదు. అది కేవలం రసలక్షణము తెలిసినది. ఆత్మకు తేజస్సు ఉన్నదని చెప్పలేము. ఎందుకంటే తేజస్సులోని రూపం ఆత్మలో లేదు. అది ఆరూపాన్ని కేవలం చూపిస్తుంది. ఆత్మ వాయువని కూడా చెప్పలేము. ఎందుకంటే వాయువుకు ఉన్న స్పర్శగుణం దానికి లేదు; ఆకాశాన్ని కూడా ఆత్మ అని చెప్పలేము. ఎందుకంటే ఆకాశంలాగా ఆత్మకు శబ్దగుణం లేదు; అది కేవలం ఉచ్చరించగలుగుతుంది.

ఆత్మ ఇంద్రియం కూడా కాలేదు. ఎందుకంటే – ఇంద్రియాలు చాలా ఉన్నాయి. కాని ఆత్మ ఒక్క భావము మాత్రమే. భూమి నుంచి వేరైనది, నిత్య మంగళ స్వరూపమైనది ఏదో అదే ఆత్మ–అదే బ్రహ్మ లేదా ఈశ్వరుడు.

ఏ సచ్చిదానంద బ్రహ్మకు స్థానము, పరిమాణము, వర్ణములు లేవో; ఎవరికి ఏ ఆకృతి విశేషమూ లేదో; ఎవరికి దర్శనము, దృశ్యము, శ్రవణము, శ్రావ్యములు ఏవీ లేవో; ఎవరు వృక్షరూపం అయి ఉండికూడా మూలము, బీజము, శాఖలు, పత్రములు, లతలు, పల్లవములు, పుష్పములు, సుగంధము, ఫలములు ఛాయాదులు ఏవీలేవో ఆ నిత్యజ్ఞానమయుడే బ్రహ్మ లేదా ఈశ్వరుడు (బహుళ గుణాదులు లేవని భావము).

ఎవరికి వేదము, శాస్త్రము, శైవము, సంధ్య, మంత్రము, జపము, ధ్యానము, ధ్యేయము, హెూమము, యజ్ఞము, వంటి కర్మల అవసరంలేదో; ఎవరికి ఊర్ధ్వము, అధమములు కూడాలేవో; ఎవరికి శివము, శక్తులు లేవో; ఎవరు పురుషుడు కాని, స్త్రీ కాని కారో; ఎవరు బ్రహ్మకాని, విష్ణువుకాని, గ్రహనక్షత్రములుకాని, మేఘమాల కాని సూర్యచంద్రులు కానీ కారో; ఎవరికి ఉదాయాస్తమయములు లేవో; ఎవరు స్వర్గంలోకాని, నరకంలోకాని, భూమిమీదకాని ఉండరో; ఎవరికి జాతిగతమైన లేదా జాతిరహితమై మిత్రత్వం ఉండదో; ఎవరు కేవలం నిర్వాణరూపి, పుణ్యమయుడు, జగత్తు యొక్క సారము, పాపపుణ్య విహీనుడు, సర్వమయుడు, చైతన్య స్వరూపుడు అయి ఉన్నాడో ఆయనే ఈశ్వరుడు.

కిరణాల వెలుతురు వలన చీకటి నాశనమైనప్పటికీ అంధకారము యొక్క తత్త్వము మాత్రము తెలియదు. అజ్ఞానము అంతరించిన తరువాత బ్రహ్మయే సర్వశక్తిమంతుడు, జీవాత్మ, సత్యము, చైతన్యము అని ఆయన స్వరూపము విశద మవుతుంది. బ్రహ్మమే సర్వస్వరూపమని, అంతకన్న భిన్నుడుకాడని తెలుసుకోవాలి. ఆకాశం మేఘావృతమైనప్పుడు ఆకాశ స్వరూపం తెలియదు. కాని మేఘాలు వెళ్లిపోగానే ఆకాశం అంతకు ముందులాగానే స్వచ్ఛంగా ప్రకాశిస్తూ ఉంటుంది. అప్పుడు ఆకాశం యొక్క అస్తిత్వం ఆకాశ రూపంలో కన్పిస్తుంది. అట్లాగే దృశ్య ప్రపంచం అంతరించగానే చిత్తశక్తి యొక్క స్వాభావిక శక్తి ఉదయిస్తుంది. ఆ శక్తి చిత్తముకన్న భిన్నమైనదికాదు. ఏ పదార్థం దేని నుంచి పుడుతుందో అది దానికన్న భిన్నం కాదు. ఎట్లాగంటే చెరుకురసం యొక్క మధురత, అగ్ని యొక్క ఉష్ణత, మంచుయొక్క శీతలత, తైలము యొక్క స్నిగ్ధత, వాటి కన్న భిన్నములుకావు. అట్లాగే చిత్తశక్తియే జగత్తు యొక్క శక్తి. జగత్‌శక్తి వల్లనే చిత్తశక్తిని తెలుసుకోవచ్చును. చిగురాకులలో ఉండే పై భాగం చిగురాకుల కన్న భిన్నం కానప్పటికీ, విభిన్నమైన రూపంలో కన్పించినట్లు, బ్రహ్మముకూడా జగత్తు కన్న అభిన్నము. బ్రహ్మము జగత్తుకు, జగత్తు బ్రహ్మమునకు అభిన్నులైనప్పటికి బ్రహ్మమే జగత్తును ధరిస్తున్నాడు. రాగము, ద్వేషము, ప్రాణము, వాయువు, మనస్సు, బుద్ధి, మాయ, ఆశ, వాసన, చింత మొదలైన వాటిని ఎవ్వరూ చూడలేదు. అవి అప్రత్యక్ష పదార్థము లైనప్పటికీ వాటి పనులను బట్టి వాటిని తెలుసుకోగలుగుతాము. అట్లాగే, ఈశ్వరుని ఎవ్వరూ చూడలేదు. కాని ఆయన చేసే అలౌకిక కార్యకలాపాలను చూసి, ఆయనను ప్రత్యక్షంగా చూడలేకపోయినప్పటికీ ఉనికిని తెలుసుకోగలుగుతాము.

❀❀❀❀❀

11. సృష్టి

విశ్వపతి యొక్క విశ్వసృష్టిలోని అపార కౌశలము సామాన్యంగా మనుష్య బుద్ధికన్న అతీతమైనదైనప్పటికీ, ఆయన నియమాలు ఎంత సరళమైనవంటే, ఆలోచించి మననం చేస్తే మనస్సు భక్తి రసంలో మునిగిపోతుంది. జీవ సృష్టికి ముందు ప్రారంభంలో జగత్తులో కేవలం పంచభూతములు లేదా పరమాత్మని అస్తిత్వం మాత్రమే ఉండింది. ఆ పంచభూతములే సృష్టికి ఉపాదాన రూపాలుగా గ్రహింపబడతాయి.

ఆ నిత్య చైతన్య స్వరూప పరమాత్మ నుంచే మొదట ఆకాశము సృష్టింపబడింది. ఆ ఆకాశం నుంచి వాయువు, వాయువు నుంచి అగ్ని, అగ్ని నుంచి జలము, జలము నుంచి పృథ్వి ఉత్పన్నమయ్యాయి. ఆవిధంగా ఉత్పన్నమైన తరువాత, ఆకాశాదుల కారణ గుణముల తారతమ్యము వలన సత్వరజస్తమోగుణముల ఉత్పన్నమయ్యాయి. ఈ అవస్థ యొక్క ఆకాశము సూక్ష్మ భూతము, మహాభూతము, పంచతన్మాత్రలు అని చెప్పబడుతుంది. ఈ సూక్ష్మ భూతం నుంచి సూక్ష్మశరీరము, అట్లాగే అన్ని స్థూల భూతములు ఉత్పన్నమయ్యాయి.

పదిహేడు అవయవాలతో కూడిన శరీరాన్ని సూక్ష్మశరీర మంటారు. ఆ పదిహేడు అవయవాలు - పంచజ్ఞానేంద్రియాలు, పంచప్రాణాలు, పంచకర్మేంద్రియాలు, మనస్సు, బుద్ధి అనేవి. పంచ జ్ఞానేంద్రియాలు - చక్షువులు, కర్ణములు, నాసిక, జిహ్వ, త్వక్ అనేవి. ఈ జ్ఞానేంద్రియములు ఆకాశము యొక్క వివిధ సాత్వికాంశముల నుండి పుట్టుతాయి. ఎట్లాగంటే - ఆకాశము యొక్క సత్వాంశం నుండి చెవులు, వాయువు యొక్క సత్వాంశం నుండి చర్మము, తేజస్సు యొక్క సత్వాంశం నుండి కండ్లు, జలము యొక్క సత్వాంశం నుండి జిహ్వ, పృథ్వి యొక్క సత్వాంశం నుండి ముక్కు ఉత్పన్నమయ్యాయి. ఈ సూక్ష్మ శరీరమే సుఖముకాని దుఃఖము కాని అనుభవించటానికి కారణము.

బుద్ధి నిశ్చయాత్మక అంతఃకరణ వృత్తి. సంకల్పాత్మక వికల్పాత్మక సంశయాత్మక అంతఃకరణవృత్తి. చిత్త అహంకారములు - బుద్ధి - మనస్సులలో అంతర్గతమైన రెండు వృత్తులు మాత్రమే. చిత్తానుసంధానాత్మక వృత్తి, అహంకారాభిమానాత్మక

వృత్తియే. బుద్ధి - మనస్సులు ఆకాశ పంచభూతముల సాత్త్వికాంశం నుండి ఉత్పన్నమైనది. పంచ జ్ఞానేంద్రియములను మనస్సు - బుద్ధుల ప్రకాశ రూపము. అందువలన అవి సాత్త్వికాంశముల కార్యములని చెప్పబడతాయి.

పంచ కర్మేంద్రియములు : వాక్, పాణి, పాద, పాయు, ఉపస్థలు. ఈ పంచ కర్మేంద్రియములు ఆకాశము యొక్క తమసాంశ నుండి విడివిడిగా పుట్టినవి. ఆకాశపు రజో అంశము నుండి వాక్కు, వాయువు యొక్క రజో అంశము నుండి పాణి, తేజస్సు యొక్క రజోంశము నుండి పాదము, జలము యొక్క రజో అంశమునుండి పాయువు, పృథ్వి యొక్క రజో అంశం నుండి ఉపస్థ ఉత్పన్నమవుతాయి.

పంచ వాయువులు : ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానములు. ఊర్ధ్వగమన శీలము కలిగి నాసాగ్రమున ఉండే వాయువును ప్రాణవాయువు అంటారు. అధోగమన శీలము కలిగి పాయుస్థానమున ఉండే వాయువును అపానవాయువు అంటారు. తిని, త్రాగే అన్నపానాదులను సమీకరించే వాయువును సమానవాయువు అంటారు. ఊర్ధ్వగమన శీలము కలిగి కంఠస్థానమున ఉండేవాయువును ఉదానవాయువు అంటారు. అన్ని నాడులలో సంచరిస్తూ శరీరమంతటా ఉండే వాయువును వ్యానవాయువు అంటారు.

ఇవికాక నాగ, కూర్మ,కృకట, దేవదత్త, ధనంజయములనే మరి ఐదు వాయువులు కూడా ఉన్నాయని సాంఖ్యమతావలంబులు చెబుతారు. నాగము బయటకువచ్చే వాయువు. కూర్మము కండ్లు తెరిపించే వాయువు. కృకటము ఆకలి పుట్టించే వాయువు. దేవదత్తము ఉచ్ఛ్వాసమును పుట్టించే వాయువు. ధనంజయము శరీరమునకు పుష్టినిచ్చే వాయువు. వేదాంతికులు ఈనాగాది పంచవాయువులను ప్రాణాది పంచ వాయువులలోనే అంతర్భవింపజేసి, ప్రాణాది వాయు పంచకమనే చెబుతారు. ఈ ప్రాణాది పంచవాయువులు ఆకాశాది పంచభూతలములతో కలిసిన రజో అంశనుండి పుట్టినవే. గమనాగమన క్రియాశీల స్వభావం కోసం ప్రాణాది పంచవాయువులకు రజో అంశ యొక్క కార్యములని చెప్పబడతాయి.

శరీరము మూడు విధాలుగా ఉంటుంది. అవి-స్థూల శరీరము, సూక్ష్మ శరీరము, కారణ శరీరము - అని ఈ మూడు రకాల శరీరాలలోను ఐదుఐదు

కోశములున్నాయి. అవి అన్నమయ కోశము, ప్రాణమయ కోశము, మనోమయ కోశము, విజ్ఞానమయ కోశము, ఆనందమయ కోశము అనేవి.

1. స్థూల శరీరము అన్నరసం నుంచి ఉత్పన్నమవుతుంది. అన్నరసంతో పెరుగుతుంది. చివరకు నశించిపోయి, తిరిగి అన్నమయ పృథ్విలో లీనమవుతుంది. అందుకే దీనిని అన్నమయ కోశమంటారు.

2. పంచేంద్రియాలతో కూడినా ప్రాణాది పంచవాయువులను ప్రాణమయ కోశమంటారు.

3. పంచేంద్రియములతో కూడిన మనస్సును మనోమయ కోశమంటారు.

4. జ్ఞానేంద్రియములతో కూడిన బుద్ధిని విజ్ఞానమయ కోశమంటారు. ఈ విజ్ఞానమయ కోశము కర్తవ్య, భోక్తవ్య, సుఖ దుఃఖములకు అభిమానియై ఇహలోక పరలోకములకు పోయే జీవుడు అని చెప్పబడుతుంది.

5. కారణ శరీరంలో సుషుప్తి కాలంలో ఆత్మ ఉన్నంత వరకూ ఆనందాన్ని అనుభవిస్తుంది. అందుకే ఆ కారణ శరీరాన్ని ఆనందమయ కోశం అంటారు. సంతోషమే కారణ శరీరము.

జీవుని యొక్క సంచిత కర్మానుసారం పంచీకరణం చేయబడిన ఈ పాంచభౌతిక స్థూల శరీరము సుఖ దుఃఖములను అనుభవించే స్థానము. అనిర్వచనీయము, అనాది అయిన ఏ అవిద్య, ఈ సర్వ ప్రపంచ నిర్మాణానికి కారణమైనదో, దానిని కారణ శరీరమంటారు. కారణ, సూక్ష్మ స్థూల శరీరములకన్న భిన్నమైనదే ఆత్మ.

నిర్మలమైన స్ఫటికము నీలవర్ణ వస్త్రాదులలో ఉన్నప్పుడు నీలంగా ప్రకాశించి నట్లుగా, అతినిర్మలమైన ఆత్మకూడా అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయములనే పంచ కోశముల సంయోగం వలన ఆ కోశమయ రూపంతో కనిపిస్తుంది.

ఈ పంచకోశములలో జ్ఞానశక్తి సంపన్నమైన విజ్ఞానమయ కోశము కర్త; ఇచ్ఛాశక్తి సంపన్నమైన మనోమయకోశము కారణము; క్రియా శక్తి సంపన్నమైన ప్రాణమయకోశము కార్యము, ఈ మూడు కోశములు కలిసిన దానిని సూక్ష్మశరీర మంటారు. అడవిలోని ఆకాశానికీ, చెట్టుమీది ఆకాశానికీ భేదములేనట్లు,

సరస్సులోను నీటిలోను ప్రతిబింబించే ఆకాశానికీ బింబరూపానికీ తేడాలేనట్లు, చైతన్యంలో కూడా తేడాలేదు.

ఆకాశంలో శబ్దగుణము, వాయువులో శబ్ద-స్పర్శ గుణములు, అగ్నిలో శబ్ద, స్పర్శ-రూప గుణములు, జలములో శబ్ద - స్పర్శ - రూప - రస గుణములు, పృథ్విలో శబ్ద - స్పర్శ రూప - రస-గంధములు ఉత్పన్నమవుతాయి.

స్థూల శరీరము నాలుగు రకాలుగా ఉంటుంది. అవి జరాయువు, అండజము, స్వేదజము, ఉద్భిదము అనేవి. మనుష్యులు పశువులు మొదలైనవానిని జరాయువులంటారు. పక్షులు సర్పాలు మొదలైనవి అండములనుంచి పుడతాయి కనుక అండజములు. ఈగలు దోమలు చెమటనుండి పుడతాయి కనుక స్వేదజములు. వృక్షములు లతలు భూమి నుంచి పుడతాయి కనుక ఉద్భిదములు.

జరాయు శరీరము తిరిగి మూడు రకాలు. ఇవి పురుషులు, స్త్రీలు, నపుంసకులు. శుక్రాంశ ఆధిక్యం వలన పురుషులు, శోణితాంశ ఆధిక్యం వలన స్త్రీలు, ఆ రెంటి సమానత్వం వల్ల నపుంసకులు పుడతారు. ఋతుకాలంలో స్త్రీ - పురుష సంయోగం వలన జీవి తల్లి గర్భంలో ప్రవేశిస్తుంది. సరి రోజులలో జరిగిన సంసర్గం వలన పురుషుడు, బేసి రోజులలో జరిగిన సంసర్గం వలన స్త్రీ జన్మిస్తారు. ఋతుస్నానం చేసిన స్త్రీ ఎవరిని చూస్తుందో ఆ ఋతుకాలంలో పుట్టిన సంతానానికి ఆ ఆకారం వస్తుంది. కనుక ఆ సమయంలో భర్త ముఖం చూడటం మంచిది.

5 దినములలో బుద్బుదాకారముగాను, 7 దినములలో మాంస పిండంగాను అది తయారవుతుంది. 15 దినాలలో శోణితాప్లుత మవుతుంది. 25 దినాలకు అంకురాకారంగా అవుతుంది. మొదటి నెలలో భుజములు, మెడ, తల, పృష్టము, ఉదరములు ఏర్పడతాయి. రెండవ మాసములో చేతులు

కాళ్లు, మూడవ మాసములో అన్ని అంగాలు ఏర్పడతాయి. నాల్గవ మాసంలో రక్త సంచారం కలుగుతుంది. ఐదవ మాసంలో కండ్లు, చెవులు, ముక్కు, గోళ్లు, పురీషములు ఏర్పడతాయి. ఆరవ నెలలో పురీష రంధ్రము, స్త్రీ పురుష చిహ్నాలు, కర్ణరంధ్రాలు, నాభి ఏర్పడతాయి. ఏడవ నెలలో కేశములు, రోమములు ఏర్పడతాయి. ఎనిమిదవ నెలలో గర్భంలోని శిశువు అన్ని అవయవాలతో ఉంటాడు. కేవలము దంతములు, మీసములు, గడ్డము అనేవి తప్ప మిగిలిన అన్ని

అవయవాలు గర్భంలోనే తయారవుతాయి. తొమ్మిదవ నెలలో సంపూర్ణ రూపంలో చైతన్యాన్ని పొందుతాడు. అప్పుడు జీవి తల్లి తినే ఆహారంతోపాటు గర్భంలోనే తాను కూడా పెరుగుతుంది. ఆ తరువాత గర్భం నుంచి బయటకు వచ్చి మాంస పిండం లాగా ఉంటుంది. దానికి ఏ పనీ చేయగల సామర్థ్యం ఉండదు. సుషుమ్న నాడి ఎన్నిరోజుల వరకూ శ్లేష్మం చేత ఆవృతమై ఉంటుందో, అన్ని రోజుల వరకూ కదలటం, తిరగటం, మాట్లాడటమనేది జరగదు. కాలక్రమంలో అన్నీ జరిగిన తరువాత, మాయా మోహితులై గర్భయంత్రణను మర్చిపోతారు.

బాల్యావస్థ అత్యంత కష్టతరమైనది, మాట్లాడలేరు. మనస్సులోని భావాలను ప్రకటించలేరు. తన ఇష్టానుసారం ఏమీ చెయ్యలేరు. మాటిమాటికీ మలమూత్రాలలో పడి ఉండవలసివస్తుంది. అప్పుడు ఏమీ సుఖమే ఉండదు. ఆ తరువాత కూడ సంపూర్ణంగా పరాధీనులై ఉండి, చదువుకొనేటప్పుడు వ్రాసుకొనేటప్పుడు నానా రకాల కష్టాలు అనుభవించవలసి వస్తుంది. అందరితో తిట్లు దెబ్బలు తినవలసి వస్తుంది. ఎవరికీ వశవర్తి కావాలనే కోరిక లేనప్పటికీ, అందరూ తమ తమ వశంలో ఉంచుకోవాలని ప్రయత్నిస్తారు. ఒక్కొక్కసారి క్రిందపడి దెబ్బ తగులుతుంది. మరొకసారి కత్తితో చెయ్యోకాలో తెగి కష్టం కలుగుతుంది. ఎన్నో రకాల అత్యాచారాలు చేయాలని మనసు పుడుతుంది. అప్పుడు ఎన్నో కష్టాలు అనుభవించవలసి వస్తుంది.

యౌవనకాలం ఇంకా కష్టతరమైనది. అథఃపతనం కావటానికి అదే సమయము. కేవలం శరీరమునకే కొన్ని మెరుపులు కలుగుతాయి. ఈ సమయంలోనే అన్నిరకాల చెడ్డపనులూ చేస్తారు. రకరకాల మత్తు పదార్థాలు, వేశ్యావృత్తి, లోభము, దొంగతనము, విషయాసక్తి, వివాదములు, దెబ్బలాటలు, వ్యాజ్యాలు అన్ని పాడు పనులు ఈ సమయంలోనే చేస్తారు. ఈదుతూ సముద్రాన్నయినా దాటవచ్చును కాని, యౌవనమును శాంత స్వభావంతో గడపటం ఏవిధంగానూ సంభవమయ్యేది కాదు. ఎక్కువ మంది ఈ వయస్సులోనే నానారకాల అత్యాచారాలు చేసి శరీరమునకు కష్టం కలిగించుకొంటారు. యౌవనాన్ని నీతిగా గడపగలిగిన వారే మహాపురుషులన బడతారు. మనుష్యులు యౌవనంలో అడుగుపెడుతూనే స్త్రీలపట్ల ఆసక్తులు కావటం తమ మొదటి కర్తవ్యంగా భావిస్తారు. స్త్రీ సంసర్గం కలగనంత వరకూ ఈ సంసారము అసారంగా కన్పిస్తుంది. సంసారంలో అదికాక ఇతరమైన

సుఖం లేదనిపిస్తుంది. మనస్సులో వైరాగ్య భావము అనవసరంగా తోస్తుంది. జాగ్రత్తగా ఆలోచించి చూడు - స్త్రీలో ఏమున్నది? పంచభూతములతో తయారైన శరీరము తప్ప వేరేమీ లేదు. స్తనయుగళము రెండు మాంసపిండములు తప్ప మరేమీ కాదు. సంభోగములు నరక భోగము వంటిది మాత్రమే. మనిషి శరీరము విష్టము. మూత్రములతో నిండిన తోలు తిత్తి మాత్రమే. మనిషి చేప మనస్సు జలము. వాసనలు త్రాడు చింత ముల్లు వంటివి. ఈ సంసారంలో స్త్రీలపట్ల ఆసక్తుడైన యువకుడు, వింధ్యగిరి గహ్వరములలో కామాసక్తమైన ఏనుగులాగా అతిశోచనీయమైన దశనుపొందుతాడు. ఎవరికి వాసనలుంటాయో, వారికి కోరికలు, భోగములు ఉంటాయి. వాసనలు వదిలిపోతే జగత్తు కూడా వదిలిపోతుంది. జగత్తు వదిలిపోతే మహా సుఖం లభిస్తుంది.

యౌవనము పూర్తి అయి అవకముందే, యౌవనమును మ్రింగి వార్థ్యక్యావస్థ సిద్ధమవుతుంది. అప్పుడు లోభం పెరుగుతుంది. ధనహీనుడు, తేజోహీనుడు, శక్తిహీనుడు అయి చింతామగ్నుడవుతాడు. అప్పుడు ఆత్మీయులు కూడా చీదరించుకొంటారు. ఉపేక్షచేస్తారు. వయస్సు పెరిగిన కొద్దీ మంచి మంచి పదార్థాలు తినాలనే కోరిక పెరుగుతూ ఉంటుంది. కాని జీర్ణశక్తి తగ్గిపోవటం వలన తినలేకపోతారు. ఆసమయంలో ఎన్నో రకాల చింతలు మనస్సులో కలుగుతాయి. అంతేకాక ఇదివరలో చేసిన అన్యాయములు ఒక్కొక్కటీ జ్ఞాపకం వచ్చి, ఏంచేశాను ఏమీచేయవలసి ఉండింది. ముందు ఏమవుతుంది. పరజన్మలో ఏమవుతుంది. వంటి ఆలోచనలు వచ్చి భయం కలుగుతుంది. చివరికి మాట్లాడ కుండా ఉండటానికి నిర్ణయించుకొంటాడు. దానికి కారణము ఉత్సాహహీనత, చేతకానితము అనేవి ఆవరించటమే. శక్తిహీనుడై, ఆహారాసక్తి పెరగటం వలన దుఃఖంతో హృదయం కాలిపోతూ ఉంటుంది. శరీరం మీదికి ముసలితనం రావటం వలన మృత్యువు కూడా వెంబడిస్తుంది. శ్వాసము, కాశము, వాతము, ఉదరరోగము వంటి వ్యాధులు శరీరమును ఆక్రమిస్తాయి. ఏ శరీరానికి మనం ఎంతో ఆదరణను మోహమును చూపామో, అదే శరీరము మృత్యు ముఖంలోకి పోతూ ఉంటుంది. ఆత్మీయులు, స్వజనము, భార్య, పుత్రులు, ఆస్తి, సంపద అన్నింటినీ వదలి ఎక్కడికి వెళ్లవలసి వస్తుందో అని ఆలోచిస్తూ వ్యాకులపడి, రోదిస్తూ ఉండవలసివస్తుంది.

ఈ శరీరానికి కొన్నింటిలో ఆనందము, కొన్నింటిలో దుఃఖము కలుగుతుంది.

అందువలన ఈ శరీరంలాంటి నీచ నిర్గుణ శోచనీయమైనది మరొకటి లేదు. శరీరంతో మనకు ఏలాంటి సంబంధమూలేదు. అట్లాగే మనతో శరీరానికి కూడా ఎలాంటి సంబంధమూ లేదు. ఈ శరీరము మనము ఒకటి కాదు. ఎవరు సన్మార్గంలో నడుస్తూ ఈశ్వర సేవలో ఉండి జీవన యాత్ర సాగిస్తారో, వారే చివరికి ఈశ్వరునిలో లీనమవుతారు. ఎవరు విషయ వాసనలలోను, భోగ విలాసముల లోను మునిగి ఉంటారో వారి జీవనము నిష్ఫలమనిపించుకొంటుంది. ఈ సంసారంలో అపార సుఖాలను అనుభవించాలనుకొనేవారిని కూడా కాలం మ్రింగి వేస్తుంది. కాలము యొక్క కరాళదంష్ట్రలలోకి పోకుండా ఉండే వస్తువు జగత్తులో ఏదీ లేనేలేదు.

భగవంతుడు ఈ సృష్టి కార్యాన్ని చెయ్యటానికి స్వేచ్ఛగా తన శరీరాన్ని రెండు రకాలుగా విభజించుకొనినాడు. అవి - శివుడు - ప్రధాన పురుషుడు; శివా - పరాశక్తి. అందుకే తత్త్వదర్శనులైన యోగీశ్వరులు వారిని శివ-శక్తి అనే ఉభయాత్మకమైన పరాత్పరుడు, పరబ్రహ్మ యొక్క రూపమని కీర్తిస్తారు. ఆయనే పరబ్రహ్మ రూపంలో ఈ చరాచర జగత్తును సృజిస్తాడు. ఆయనే విష్ణువు రూపంలో ఈ సమస్త జగత్తును పాలిస్తాడు. ఆయనే అంత్యకాలంలో శివస్వరూపంలో సమస్త జగత్తునూ సంహరిస్తాడు.

ఈ నాలుగు రకాల స్థూల శరీరములు స్థూల భోగముల కొరకు మేల్కొని ఉంటాయి. జాగ్రదవస్థలో చక్షు, కర్ణ, నాసిక, జిహ్వ, త్వక్కులనే పంచ జ్ఞానేంద్రియాల ద్వారా వరుసగా రూప, శబ్ద, గంధ, రస, స్పర్శములచే పంచవాహక విషయములు అనుభూతి కలుగుతుంది.

వాక్, పాణి, పాద, పాయు, ఉపస్థలనే పంచకర్మేంద్రియముల ద్వారా వరుసగా వచన, గ్రహణ, గమన, విసర్జన, ఆనందములు అనుభూతి కలుగుతుంది. మనో, బుద్ధి, అహంకార, చిత్తములనే నాలుగు అంతరింద్రయముల వలన వరుసగా సంశయము నిశ్చయము అహంకారము చింతనముల అనుభూతి కలుగుతుంది.

అందువలన పరజీవ శరీరములలో నున్న జీవనము లేదా ప్రాణము - అంటే జీవాత్మ, పరమాత్మ, చైతన్యము లన్నింటినీ ఒకే చైతన్యంగా భావించాలి. ఎట్లాగంటే వృక్షము వనము కన్న భిన్నముకాదు కదా! నీరు జలాశయము కన్న భిన్నము కాదు కదా! తప్తలోహము అగ్ని కన్న భిన్నము కాదుగదా! ఇదీ అంతే!

జీవ చైతన్యములో నానామతావలంబులైన మనుష్యులూ నానా ప్రకారములైన సిద్ధాంతాలనూ చెబుతారు. అతి అజ్ఞానులైనవారు పుత్రుని ఆత్మ అంటారు. కొందరు స్థూల శరీరాన్ని ఆత్మ అంటారు. కొందరు ఇంద్రియాలను ఆత్మ అంటారు. కొందరు ప్రాణమును ఆత్మ అంటారు. కొందరు మనస్సును ఆత్మ అంటారు. కొందరు బుద్ధిని ఆత్మ అంటారు. కొందరు అజ్ఞానమును ఆత్మ అంటారు. కొందరు చైతన్యమును ఆత్మ అంటారు. కొందరు శూన్యమును ఆత్మ అంటారు. ఈ విధంగా అజ్ఞానులైన వారు పుత్రుని నుంచి ప్రారంభించి శూన్యం వరకూ ఆత్మ అని వ్యాఖ్యానిస్తూ ఉంటారు. వాస్తవానికి బుద్ధికాని, అజ్ఞానంకాని, లేదా శూన్యంకాని ఆత్మ అని చెప్పలేము. ఆత్మ కేవలము సత్య స్వరూపచైతన్యమాత్రము. రజ్జువులో సర్పభ్రాంతి కలిగినప్పుడు సర్పము ప్రతీతమై ఆ భ్రాంతి తొలగిపోగానే రజ్జువు మాత్రమే మిగిలిపోవునట్లు సచ్చిదానంద బ్రహ్మంలో అవస్తు రూపమైన అజ్ఞానాది జడపదార్థముల భ్రమ తొలగిపోగానే చైతన్యమాత్రంగానే అది మిగిలిపోతుంది.

తత్త్వమసి - అంటే "తత్, త్వమ్, అసి" అని తత్ శబ్దము యొక్క అర్థము అప్రత్యక్ష చైతన్యము; త్వమ్ శబ్దము యొక్క అర్థము ప్రత్యక్ష చైతన్యము. ఈ రెండు పదాల అర్థాన్ని శోధించి, తత్ - త్వమ్ - అసి అన్న వాక్యం ద్వారా అఖండ చైతన్యాన్ని అర్థం చేసుకొని నేను నిత్యుడను, శుద్ధుడను, బుద్ధుడను, ముక్తుడను, సత్య స్వరూప పరమానందుడను, అద్వితీయ బ్రహ్మను వంటి బోధ అంతః కరణంలో పుడుతుంది. అలాంటి అంతఃకరణ వృత్తిలో చైతన్యం ప్రతిబింబించి - దాని ప్రకాశము కన్న అభిన్నమైన పరబ్రహ్మ విషయిక అజ్ఞానము సూర్యరశ్మి దీపకాంతిని నశింపజేసినట్లు నశింపజేస్తుంది. మనోవృత్తి ద్వారా అజ్ఞానం నష్టమైపోతుంది. కాని ప్రతిబింబించిన చైతన్యము దానిని ప్రకాశింప చేయలేదు. ఎందుకంటే పరబ్రహ్మ స్వయంప్రకాశ రూపము. అందువలన దానిని ఏ ఇతర వస్తువూ ప్రకాశింపజేయలేదు. సర్వవ్యాపి అయిన ప్రకాశ స్వరూపము, జన్మ రహితము, వినాశరహితము, అలిప్తము, సర్వగతము, సర్వదా విముక్త స్వభావము అయినది ఏదో అదే అద్వితీయ చైతన్యము.

మాయామయ అచేతనము సత్వరజస్తమోగుణములు, ఇంద్రియ గణములు కర్మను చేస్తాయి. అదే గుణత్రయము. ఇంద్రియముల అధిష్ఠాత అయిన ఆత్మ అచేతనమైనప్పటికీ ఏమీ చేయలేదు. ఇనుము అచేతనమైనప్పటికీ ఆయస్కాంతము

యొక్క ఆకర్షణ వలన దాని దగ్గరకు చేరినట్లు శరీరంలోని ఇంద్రియాలన్నీ అచేతనములైనప్పటికీ చైతన్యము యొక్క ప్రభావము చేత అవి తమతమ పనులను చేస్తాయి. సూర్యుని ప్రకాశంలో ప్రజలు తమతమ పనులు చేసుకొంటారు కాని సూర్యుడు స్వయంగా తానేమీ చేయడు; ఎవరినీ పనులలో నియోగించడు. సరిగ్గా అదే ప్రకారం జ్ఞానాన్ని కూడా అర్థం చేసుకోవాలి.

ఆత్మ సర్వవ్యాపి, స్వభావతః నిర్మలము అయినప్పటికీ సత్ - అసత్ కర్మలలో నేను కర్తను, నేను భోక్తను, నేను ద్రష్టను అని భావిస్తుంది. స్ఫటికం స్వభావతః నిర్మలమైనదే. అయినా, అనేక రకముల రంగుల కలయికతో నానారకాల రంగులను ధరించినట్లు, ఆత్మ కూడా సర్వవ్యాపి, స్వభావతః నిర్మలము అయినప్పటికీ సత్వరజస్తమోగుణముల సహాయంతో మనస్సు, ప్రాణము, ఇంద్రియములు, శరీరముల స్వభావమును ధరిస్తుంది.

బాష్పజలంలో నీటి భ్రాంతి, శంఖంలో చంద్రకాంతి భ్రాంతి, రజ్జువులో సర్పభ్రాంతి ఉన్నట్లు, దృష్టి దోషముచేత దిక్ భ్రాంతి కలుగుతుంది. దృష్టిలోని విలక్షణత వల్ల చంద్రుడు ఇద్దరులా కనబడినట్లు, ఈ జగత్తు కూడా భ్రాంతి మూలక మైనదే! ధర్మము అధర్మము, సుఖ - దుఃఖముల కల్పన, స్వర్గ - నరకములు, జన్మ - మరణములు, వర్ణ - ఆశ్రమములు అన్నీ సాంసారిక అవస్థలోనే కలుగుతాయి. పరమార్థంలో అవేమీ లేవు. ఒకే సూర్యుడు ఎన్నో జలాశయములలో భిన్న భిన్న రూపాలలో కన్పించునట్లు, ఆత్మ కూడా మనస్సు, ప్రాణము, ఇంద్రియములు, శరీరము అనే విభిన్న ఉపాధులలో భిన్న భిన్న రూపాలలో ప్రకాశిస్తాడు.

నీటిలో సూర్యబింబము నీటితోపాటు పోతున్నట్లుగాను, స్థిరమైన నీటిలో స్థిరం గాను కన్పించునట్లు, ఆత్మకూడా అట్లాగే అంతఃకరణముతోపాటు ప్రయాణించి, అంతఃకరణము నిలకడగా ఉండగానే అదికూడా స్థిరంగా నిలిచిపోతుంది. రాహువు వదలగానే చంద్రబింబం ప్రకాశించినట్లు, ఆత్మ అదృశ్యమైనది అయినప్పటికీ జీవుని బుద్ధిలో కన్పిస్తుంది. నిర్మలమైన అద్దంలో మనిషి తన రూపాన్ని దర్శించినట్లు, నిర్మలమైన బుద్ధిలో ఆత్మ, ఆత్మ స్వరూపదర్శనం చేస్తుంది.

పంచమహాభూతములు, ఇంద్రియములు, బుద్ధి, మనస్సు, అహంకారములన్నీ మాయవలననే ఈ సంసార సృష్టి - రక్షణ అను పనులను చేస్తాయి. అవన్నీ

బంధన హేతువులు కనుక వాటన్నింటినీ వదిలిపెట్టాలి. ఆకాశం ఘటం లోపల-బయట కూడా ఉన్నట్లు, పరమాత్మకూడా అన్ని వస్తువులకూ లోపల బయట ఉన్నాడు. అందువలన ఆయనకు బంధనము - మోక్షణము అనేవి అసంభవమైనవి. కాని శరీరమునకు నేను అనే జ్ఞానమే బంధన హేతువు. రసము, బెల్లము, చక్కెర అనేవి అన్నీ చెఱుకు నుంచే పుట్టినప్పటికీ అవి విభిన్న రూపాలలో ఉండునట్లు, ఒకే ఆత్మ విభిన్న ఆకారాలలో ఉంటుంది.

పరమాత్మ, ప్రాణులు మొదలైన అసంఖ్యాక రూపాలలో ఒక్కొక్కసారి విస్తరించి, మరొకసారి ఉపసంహరించి తన మహిమతో క్రీడిస్తూ ఉంటాడు. మొదట - జాగ్రదవస్థలో విశ్వము, రెండు - స్వప్నావస్థలో తేజస్సు అంటే సూక్ష్మ శరీర ఉపాధి రూపమైన చైతన్యము, మూడు - సుషుప్తి అవస్థలో ప్రాజ్ఞ అంటే అజ్ఞాన ఉపాధి విశిష్ఠ చైతన్యము అనే మూడు రకాల భ్రాంతి చైతన్యం ద్వారా బ్రహ్మ కప్పబడి ఉన్నది. ఆ స్థితిలో జ్ఞానము తననే బుద్ధిస్థ పురుషునిగా అంటే ఆత్మగా భావిస్తుంది.

అగ్నిలోనుంచి బయటికి వచ్చిన పొగ పైకిపోయి నానారకాల ఆకృతిని పొందినట్లు, సర్వవ్యాపియైన పురుషుని మాయచేత సృష్టిరూపము రెండు విధాలుగా ప్రకాశిస్తున్నది. మనస్సు శాంతించగానే ఆత్మ శాంతిస్తుంది; మనస్సు వికసించగానే ఆత్మ వికసిస్తుంది. మనస్సు ముగ్ధమైతే ఆత్మ ముగ్ధమవుతుంది. సాంసారిక అవస్థలో ఆత్మ యొక్క ఈ భావాలు అన్నీ వ్యావహారిక భావాలు. వాస్తవానికి అవి సత్యాలుకావు. ఆకాశంలోకి ఎగసిన పొగ ఆకాశాన్ని మలినం చేయనట్లు, ఆత్మ ప్రకృతి వికారములలో కలిసిపోదు. పొగవలన ఒక గృహము మలినం అయినప్పటికీ, ఇతర గృహములు మలినం కానట్లు, ఒక దేహంలోని జీవము మలినమైనప్పటికీ, మరొక దేహంలోని జీవము మలినం కాదు.

ఒక మనిషి దోషాలవల్లకాని గుణాలవల్లకాని ఇతరులు ఎందుకు ప్రభావితులు కావటం లేదు? ఆత్మ ఒక్కటే. రెండు కాదు. అదే అన్ని శరీరాలలోను ఉన్నది. కేవలం ఉపాధి గుణ సంసర్గం వల్లనే జీవసాంగత్యాన్ని పొందుతున్నాడు కదా అనే అనుమానం కలుగువచ్చును. దానికి ముందే చెప్పబడింది. ఆత్మ ఒక్కటే. అది ఆకాశంలా నిర్మలమైనది. అది ఉపాధి గుణములలో లిప్తము కాదు. కనుక దానికి బంధము, ముక్తి అనేవి లేవు. ఒకే ఆత్మ అన్ని జీవులలో ఉన్నప్పటికీ అన్ని

జీవాత్మలు, అన్ని జీవములు ఒకటే అని ఆలోచించటం అసంగతమైన విషయము. భిన్న భిన్న ఉపాధులలోని జీవుల యొక్క భిన్న భిన్న కార్యాల ద్వారా, శుభాశుభ కార్యముల ఫలభోగము, భిన్నభిన్న జీవులకు తప్పక కలుగుతుంది. దానికి ఆత్మతో ఎలాంటి సంపర్కమూ లేదు. అందువలన ఒకరి గుణదోషముల వలన ఇతరులు లిప్తులు కావటమనేది సంభవించదని అన్ని విధాలా స్పష్టమవుతుంది.

జీవుడు కర్మానుగుణంగా సంతరించుకొన్న సుఖము - దుఃఖము, స్వర్గము - నరకము వంటి ఫలాలను ఈ జగత్తులోనే అనుభవిస్తాడు. స్వర్గ నరకములు వేరు వేరు చోట్ల లేవు. దానికి ప్రమాణం చూపనక్కరలేదు. ఎందుకంటే జీవుడు అసంఖ్యాకములైన కష్టములు, పీడలు, సుఖములు, దుఃఖములు మొదలైనవన్నీ అనుభవించటం అందరూ చూస్తూనే ఉన్నారు. స్వర్గ నరకములు వేరే వేరే చోట్ల ఉంటే, అతనికి జీవితంలోనే సుఖ దుఃఖాలు అనుభవించవలసిన అవసరం లేదు. అంతేకాక పునర్జన్మ కూడా ఉండదు. జీవన్ముక్తుని ఆత్మకు ఎలాంటి కష్టాలనూ అనుభవించ నక్కరలేదు. మానవుని అవయవాలకు మనోవృత్తులకు చాలా గట్టి సంబంధం ఉన్నది. వృత్తి, స్వభావములను బట్టి మానవ అవయములలో తేడా ఉంటుంది. అత్యంత కోపం ఉన్న అవయవములకన్నా , శాంత ప్రకృతికల మానవుని అవయవములు సంపూర్ణంగా భిన్నంగా ఉంటాయి. మానవుని బాహ్య దృశ్యాన్ని చూసి, అతని స్వభావాన్ని గుర్తించటానికి వీలైనవారు చాలామంది కన్పిస్తారు. అన్ని జీవములు వాటి వాటి అనుభవాలకు అనుగుణంగా శరీరము, ఇంద్రియాలచేత ఎప్పుడూ కర్మలు చేయిసూ ఉంటారు. మనము కర్తలమూ కాము, ఏదీ మన వస్తువూ కాదు అనే జ్ఞానం కలిగితే జీవి కర్మబంధంచేత కట్టుబడడు.

ఈ పరమాత్మ వ్యక్తము. అవ్యక్తము అయిన విశ్వమునకు రక్షకుడు. ఆత్మ పరీక్షా రూపంలో భోగమునందు బద్ధమై ఉన్నది అని తెలుసుకొంటే బంధనముల నుంచి విముక్తుడవుతాడు. సంసార బంధనము ఆత్మలో లేదు. పరమాత్మను అనుసరించటమే మోక్షప్రాప్తికి హేతువు అవుతుంది. ఆత్మకు ఉత్పత్తి వినాశములు లేవు. దానికి ఎల్లప్పుడూ బ్రహ్మసత్తాయొక్క ఆశ్రయం ఉన్నది.

జీవాత్మ ఉపాధితో కూడి ఉన్నప్పుడు ఆ జీవాత్మ పరమాత్మ కన్న స్వతంత్రమై, అనేక రూపములలో ఉంటుంది. జీవాత్మ పరమాత్మ యొక్క అంశ రూపంలో ఉండటం ఈ జగత్తులోని ప్రత్యేకత. కాని ప్రకృతి యొక్క కలయిక వలన అది

అశుద్ధము, సగుణము, సమలము అవుతుంది. ఆత్మ ప్రకృతితో కలిసి ఉన్నంత వరకూ దానికి సుఖము, దుఃఖము, సంతోషము, విషాదము మొదలైనవి అనుభవించవలసి ఉంటుంది. ఆత్మ శరీరం మీద అధికారం కలిగి ఉన్నంతవరకూ దానికి సంసారము యొక్క సుఖదుఃఖములను అనుభవించవలసి వస్తుంది. శరీరాన్ని వదిలివేసిన తరువాత దానికి సుఖదుఃఖముల జ్ఞానం ఉండదు.

పిల్లవాడు చిన్నతనంలో నగ్నంగా ఉన్నట్లు, ఈ జగత్తు బాల్యావస్థలో ఉన్నప్పుడు ఆనాటి జగద్వాసులు కూడా నగ్నంగా ఉండేవారు. చిన్న పిల్లలలాగా వారికి సిగ్గు ఉండనట్లు, ఆనాటి జగద్వాసులకు కూడా లజ్జాజ్ఞానం ఉండేదికాదు.

సాధువులను పరిరక్షించి పాపులను శిక్షించటానికి, ధర్మసంస్థాపన చెయ్యటానికి పరమాత్మ యుగయుగాలలో ప్రత్యేకంగా అవతరించి, సాధువుల హృదయాలలో వసించి, జీవులకు ఆదర్శ మార్గాన్ని చూపుతాడు. ఏ శాస్త్రాధ్యయనంవల్లను ఈశ్వరుని హృదయంలో ఉండేటట్లు చేసుకోలేము. కేవలము భక్తిభావంతోను ఈ విషయాలను మననం చేయటం వల్లను పుణ్యాత్ములైనవారు మాత్రము ఈశ్వరుని హృదయంలో చేర్చుకొని బంధించ గలుగుతారు.

అగ్నిని ప్రజ్జ్వలింపచేసినప్పుడు వేలకొద్దీ నిప్పురవ్వలు బయల్పడినట్లు, పరమాత్మ నుంచి నానారకాల జీవాత్మలూ సృష్టింపబడుతున్నాయి. ఆయనలోనే లీనమవుతున్నాయి. పరమాత్మ నుంచే పుట్టి చివరకు పరమాత్మనే పొందుతున్నాయి. అందువలన ఆత్మ జీవాత్మలు ఒకే పరమాత్మ నుంచి పుడుతున్నాయి. జ్ఞానులైనవారు మాత్రమే ఆత్మ, జీవాత్మ, పరమాత్మలు పరస్పర సంబంధం కలవారని తెలుసుకో గలుగుతారు.

❀ ❀ ❀ ❀ ❀

12. సంసారము

సంసారమని దేనినంటారు? మనము, భార్య, సంతానము, ఆత్మీయులు, స్వజనము అందరూ కలిస్తే సంసారమని అందరికీ తెలుసు. కొంతధనము సంపాదించి వీళ్లందరినీ పోషించటం సంసారము యొక్క ముఖ్యమైన పని. చిన్నవారు పెద్దవారు అందరూ జీవితాంతమూ ఇందులోనే మునిగిపోతున్నారు. మాయలో మునిగిపోయి ఎవరు తండ్రి? ఎవరు తల్లి? ఎవరు సోదరుడు? ఎవరు ఆత్మీయులు? ఎక్కడి నుంచి వచ్చారు? ఎక్కడికి వెళ్తారు? ఎందుకు వచ్చారు? ఎందుకు శరీరాన్ని ధరించారు? ఎవరు ఇక్కడికి తెచ్చారు? ఎవరు నన్ను ఏ పనిని పూర్తి చేయటానికి ఇక్కడికి పంపారు? వీటన్నింటిని గురించీ ఆలోచింపక, ఆత్మ విస్మృతిని పొందుతున్నారు. ఒకసారి ధనవంతుడు, ఒకసారి అభిమానవంతుడు, ఒకసారి జ్ఞాని అయి ఉల్లాసవంతులవుతున్నారు. ఒకసారి శోకము, ఒకసారి తాపము, ఒకసారి రోగము, ఒకసారి నింద, ఒకసారి ధనము, ఒకసారి చింతలతో మనస్తాపం చెందుతున్నారు. ఒకసారి శూద్రుడు, ఒకసారి వైశ్యుడు, ఒకసారి క్షత్రియుడు, ఒకసారి బ్రాహ్మణుడు అనే కులాల్లో పుడుతున్నారు. ఒకసారి భోగి, ఒకసారి త్యాగి, ఒకసారి యోగి అయి అన్ని అవస్థలకు గురి అవుతున్నారు. ఒకసారి కోపంతో ఉన్మత్తులై ఇతరులను పీడించటంలో ఉత్తేజితులవుతున్నారు. ఒకసారి మోహాంధకారంలో పడి ఒకరిని తనవాడని, మరొకరిని పరాయివాడని అనుకొంటు న్నారు. ఒకసారి విషయోన్మత్తులై జగత్తును గడ్డిపోచలాగా తుచ్ఛమైనదని భావిస్తారు.

మానవుడా! నీవు అహంకరించటానికి ఎవరు నీకు అధికారం ఇచ్చారని ఒకసారి ఆలోచించు. ఎవరి సమక్షంలో భూమి ఒక ధూళికణమో, సూర్య మండలము ఒక చిన్న గోళమో, మహాసముద్రము గోష్పాద తుల్యమో అక్కడ నీ చిన్ని శరీరము, చిన్ని ప్రాణముల యొక్క లెక్కేమిటి? అక్కడ నీవు ధూళికణము యొక్క ఒక పరమాణువుతో సమానము; అందులో ఒక అంశము మాత్రమే. అలాంటి నీకు అహంకరాము ఎందుకు? సత్త్వ-రజ-స్తమోగుణాలనే మూడు స్థూల ఆవరణలతో నీవు నీ కళ్లను కప్పుకొన్నావు. సూక్ష్మరూపమును వదిలిపెట్టి స్థూల శరీరమును ధరించావు. ఇప్పటికీ నీవు నీ అసలు స్వరూపమును తెలుసుకోలేక

పోతున్నావు. అయినా సమయం మించిపోలేదు. ఇప్పటికైనా ఆత్మతత్త్వాన్ని నిర్ణయించుకొని, నీవు ఎవరవో, ఎందుకు ఇక్కడికి వచ్చావో తెలుసుకో.

మనుష్యులందరినీ 'మనది' అన్న శబ్దము ముగ్ధులు చేసిపెట్టింది. మన అబ్బాయి ఎంత కురూపి అయినప్పటికీ మళ్లీ మళ్లీ చూసినప్పుడు కళ్లకు కలిగే తృప్తి, ఇతరుని కుమారుడు అతిరూపవంతుడైనా అతనిని చూసినప్పుడు మన మనస్సుకు అంత ఆనందం కలుగదు. నీవు చేయవలసిన పని చాలా చిన్నదయినప్పటికీ అది అధిక శ్రమ సాధ్యమనీ కష్టతరమైనదనీ అనిపిస్తుంది. కాని అంతకన్న నూరురెట్లు కష్టమైన పని కూడా మనది అని తలపోసినప్పుడు, తోడున్నప్పుడు కష్టమనిపించదు. ఒకవేళ నీ దగ్గర ఎవరిదైనా ధనం ఉండి, అది వృధాగా ఖర్చు అయిపోతున్నప్పటికీ నీకు కొంచెం కూడా కష్టం అనిపించదు. కాని, అదే ద్రవ్యం 'మనది' అన్నప్పుడు ప్రయత్నము మమతలకు హద్దు ఉండదు. ఈ రోజు ఎవరినీ 'నీలాగా' అని నిందిస్తున్నావో, రేపు అదే మనది అయిపోతే ప్రశంసాపరంపరలు బయల్వెడలుతాయి. మాయ అనే రాక్షసి చేసిన 'మనది' అనే కుహనాశబ్దజాలంలో పిపీలికాది బ్రహ్మ పర్యంతమూ అన్ని ప్రాణులూ మోహితులవుతున్నాయి. మనము దేనిని మనది అనుకొంటామో అది మనది కాకపోయినా, మనము ఏ వస్తువును మనది అని భావించి దానికోసం ప్రయత్నిస్తామో, అది విధివశాత్తు ఎవరికి చెందుతుందో, దానిని ఎవరూ చెప్పలేరు.

మన బుద్ధియే మనను సర్వనాశనం చేసింది. అయితే వాస్తవంగా మనవాళ్లు ఎవరూ లేరా? వాస్తవానికి మనవారు ఎవరూ కారా? ఇప్పుడు ఆలోచించు - మనవాళ్లని చెప్పుకొనేవారు ఎవరున్నారో వారిని మనం ఇష్టపడకపోతే, వారు మనవాళ్లు కాకుండాపోతారు? అన్నీ ఆ భగవంతునివే అని శాస్త్రం చెబుతున్నది. కాని మనం అన్నీ మనవే అని చెబుతాము. సామాన్యమైన ఈ ధనము, పుత్రులు, సుఖసంపత్తులను మనవి అని చెప్పుకొంటే ఎంత ఆనందం కలుగుతుంది? కాని ఒక్కసారి సరళమైన చిత్తముతో, భక్తి భావంతో మనం కూడా ఉన్న ఈ అనంత బ్రహ్మాండమును మాది అనగలిగితే ఎంత అపూర్వమైన ఆనందం కలుగుతుందో ఆలోచించు.

మానవా! నీవు బుద్ధిశాలివి కావటానికి ఎన్నో పుస్తకాలు చదువుతావు. సాహిత్యము, ఇతిహాసము, భూగోళము, జ్యామితి, గణితము మొదలైన వివిధ

శాస్త్రాలను చదువుతావు. కాని ఏ పుస్తకాన్ని చదివితే నీవు అసలైన పండితునివి అవుతావో దానిని చదవవు; చదవాలని నీకు కోరిక కూడా ఉండదు. నీవు ఇతరుల భాషను, ఇతరుల ఇతిహాసాన్ని జీవనాన్ని జ్ఞాపకం చేస్తావు. కాని మనది ఏమిటి, అందులో లేనిది ఏమిటి అనే విషయాన్ని నీవు చూడలేదు. అంతేకాదు చూడకూడదని పట్టుపట్టావు. మనిషి కూడా ఒక గ్రంథ విశేషమే. మనను మనం చదవగలిగితే జీవితంలోని అన్ని విషయాలనూ తెలుసుకో గలుగుతాము. మన శరీరము - అస్థి, మాంసము, చర్మము, మేధస్సు, మజ్జా, స్నాయువు, శిరలు, రసములు, రజస్సు మొదలైనవాటి సమాహారమని, దాని పరిమాణమును గతి విధానములను చక్కగా తెలుసుకోగలిగితే, భగవంతుడు నిన్ను ఎంత అద్భుతంగా నీ శరీరాన్ని నిర్మించాడో ఒక్కసారి ఆలోచించి చూడు. నీ శరీరంలోని క్రియలు ఎంత లయబద్ధంగా స్పందిస్తున్నాయో చూడు, పంచతత్త్వాలలో పంచతన్మాత్రలు ఎట్లా నాట్యం చేస్తున్నాయో, ఇంద్రియాలు నియమబద్ధంగా ఎట్లా క్రీడిస్తున్నాయో యోచించు. వీటిలో ఏ ఒక్కదాని పని తలక్రిందులైపోయినా శరీరంలో మహా ప్రళయం సంభవిస్తుంది. గురుకృప వలన మనజీవన గ్రంథాన్ని చక్కగా ఉంచి, దానిని అధ్యయనం చెయ్యగలిగితే, నీకూ ఇతరులకూ కూడా ఎంతో ఉపకారం జరుగుతుంది.

ఒక్కొక్క మనిషి ఒక్కొక్క పుస్తక రూపంలో ఉన్నాడు. గర్భవాసము దానిపై అట్ట, కర్మఫలము దాని విషయసూచిక. దీక్షాగ్రహణము దాని విజ్ఞానము. శైశవము, కౌమారము, యౌవనము, వార్ధక్యములు అందులోని ఒక్కొక్క అధ్యాయము. జీవితంలోని మంచి చెడు పనులు దానిలోని పాఠ్యాంశాలు.

దరిద్రులు - సాధారణ వస్త్రధారులు అయినవారు మామూలు అట్టవేసిన పుస్తకం లాంటివారు. ధనవంతులు - జమీందారులు - రాజులు మహారాజులు సువర్ణాక్షరాలతో వ్రాసి పట్టుబట్టతో అట్టవేసిన ఒక్కొక్క బృహత్ గ్రంథములు. అల్పాయుష్కులై, విశేష కార్యములు ఏమీ చేయకనే చనిపోయినవారు చిన్న చిన్న పుస్తకాలవంటివారు. దీర్ఘాయుష్కులై మహత్ కార్యములు చేసినవారు బృహత్ గ్రంథముల వంటివారు. అలాంటివారు ప్రపంచంలో అందరికోసం ఏర్పడిన ఆదర్శ పాఠ్యపుస్తకాలవంటివారు.

ఇతరులను మంచి మార్గంలో నడవమని ఉపదేశాలు ఇస్తూ, స్వయంగా ఏమీ చెయ్యనివారు వ్యాకరణంలాంటివారు. రాజులు మహారాజులు వంటి పెద్దవారి చరిత్రలు వినిపించి, సభలను - సమాజాన్ని ఇరుకులో పడవేసేవారు ఇతిహాసం లాంటివారు. జగత్తు యొక్క లౌకిక లాభాన్ని నష్టాన్ని విచారిస్తూ రోజులు గడిపేవారు గణితశాస్త్రం లాంటివారు. జడజగత్తును గురించి ఆలోచించటమే శ్రేష్ఠమని తలచేవారు భూగోళం లాంటివారు. రంగము - రసము - ఆమోదము- ప్రమోదము - విలాస జీవనములే జీవనసారమని భావించేవారు నాటకం లాంటివారు. పరోపకారము సత్య-దయ -నిష్ఠ - వేదాధ్యయనము - ధర్మచర్చ వంటివి చేస్తూ కాలాయాపన చేసేవారు ధర్మశాస్త్రం లాంటివారు. విషయ వ్యాపారాల నుంచి దూరంగా ఉండి, స్వతంత్రులై భక్తితత్పరతతో భగవదారాధనయే ప్రధాన జీవనకార్యంగా భావించేవారు యోగశాస్త్రం లాంటివారు. ఈవిధంగా ఒక్కొక్క మనిషి ఒక్కొక్క గ్రంథంలాంటివారు. నీ జీవన గ్రంథం చాలా చక్కగా చదవదగినట్లు, వ్రాయబడేటట్లు, అందరికీ నీవు పఠనీయుడవయ్యేటట్లు నీ మరణానంతరం కూడా నీ జీవిత చరిత్ర తిరిగి తిరిగి ముద్రింపబడేటట్లు, నీ జీవిత చరిత్రను కూడా రచించుకో. అన్ని పుస్తకాలలోనూ చివర సమాప్తము అంటే మృత్యువు లిఖితమై ఉంటుంది. దానిని ఎప్పుడూ జ్ఞాపకం ఉంచుకో!

మనుష్యమాత్రులైనవారు - మనం ఇదివరకు ఎక్కడ ఉన్నాము? ఎక్కడికి వచ్చాము? ఎందుకు వచ్చాము? వచ్చి ఏమి చేశాము? ఇక్కడికి మనను ఎవరు తెచ్చారు? ఎందుకు తెచ్చారు? ఎట్లా తెచ్చారు? ఎందుకోసం తెచ్చారు? అనేవాటిని గురించి ఆలోచించాలి. ఇక్కడికి వచ్చి ఎంత చూశాము? ఎంతవిన్నాము? ఎంత మాట్లాడాము? ఎంత ఆలోచించాము? చూసి విని ఆలోచించినా ఏమీ నిర్ణయానికి రాలేకపోయాము. ఇక్కడ తల్లీ -తండ్రి లభించారు; భార్యా పుత్రులు లభించారు. బంధువులు బాంధవులు లభించారు; ధనము - జనము లభించారు; సుఖము సంపత్తి లభించాయి. ఇక్కడ అన్నీ లభించినా, ఏ రకమైన తృప్తీ లభించలేదు. అనేక భాషలు నేర్చుకొన్నావు; అనేక దేశాలు తిరిగావు; అనేక వస్తువులు చూశావు; ఎందరు మనుషులతోనో కలిసి నివసించావు; కాని అసలైన సుఖము ఎలాంటిదీ లభించలేదు. మనస్సు - బుద్ధులకు పరస్పర ప్రేమ కలుగలేదు. రెంటికీ ద్వంద్వయుద్ధం జరుగుతూనే ఉన్నది. వాటి మధ్య ప్రవృత్తి - నివృత్తుల వివాదం

నడుస్తూనే ఉన్నది. సంసార సాగరంలో ప్రళయము, తుఫాను, రాత్రింబవళ్లు రేగుతూనే ఉన్నాయి. ఎక్కడ చూసినా సంప్రదాయం పేరిట మత భేదాలు చెలరేగుతూనే ఉన్నాయి. అందరూ తమ తమ మతాలను నడిపించటంలో నిమగ్నులై ఉన్నారు. కొందరు చెబుతున్నారు; కొందరు వింటున్నారు; కొందరు వ్యాఖ్యానిస్తున్నారు; కొందరు మాట్లాడకుండా కూర్చొని తమాషా చూస్తున్నారు; కొందరు ఆందోళన చేస్తున్నారు. కొందరు శాసిస్తున్నారు; కొందరు పాలిస్తున్నారు; కొందరు సింహాసనం మీద, కొందరు భూమి మీద కూర్చున్నారు. కొందరు ఏడుస్తూ ఉంటే, కొందరు నవ్వుతున్నారు. కొందరు అవాక్కులై కూర్చొన్నారు. ఈ సంసారంలోని వారంతా తిరుగుతూనే ఉన్నారు. మరికొందరు చీదరించు కొంటున్నారు. ఇవన్నీ చూస్తూ ఉంటే కేవలము చింతయే పెరుగుతున్నది. కాని సుఖము ఏ విధంగానూ లభించటం లేదు. కొందరు అసలైన వస్తువు దొరకక రాత్రింబగళ్లు కష్టపడుతున్నారు. ఇలాంటి అనుభవాలు కలుగుతున్నాయి.

భగవచ్చింతన అనే గంభీర సాగరంలో నిమగ్నులై ఎవరు ఉన్నారో వారే పరమ సుఖంతో ఉన్నారు. వారికి ఏ ఇతర విషయాన్ని గురించిన చింతాలేదు. గురువు ఎవరిని తెలుసుకోమని ఉపదేశమిచ్చారో ఆయన లోపల బయట ముందు వెనక ఉన్నప్పటికీ ఆయనను ఎవరూ పట్టుకోలేపోతున్నారు; కాని ఆయన అందరినీ ధరించి ఉన్నాడు. 'మన మెవరము' అనేది తెలియలేదు. 'మనవారు ఎవరు' అనేది అర్థంకాలేదు. మనము నీవు వాడు అన్న శబ్దాలతో ఎవరిని నిర్దేశిస్తున్నావో దాని తత్త్వాన్ని కూడా తెలుసుకోలేకపోయావు. ఈ సంసారము, ఈ సర్వస్వము, ఈ మనము మొదలైన వన్నింటినీ ఆయనకు సమర్పించక, మనమే కర్తలమై కూర్చొన్నాము. ఎవరి పేరు తలిస్తే ఆనందం లభిస్తుందో, ఎవరిని గురించి చింతన చేస్తే భయమనే భావన దూరంగా తొలగిపోతుందో, ఎవరి స్మరణచేస్తే విపత్తు - సంపత్తులు సమానవుతాయో, ఎవరి చరణాలను ఆశ్రయిస్తే జన్మ మృత్యువులు జీవులను స్పృశించనైనాలేవో, అలాంటి వానిని తెలుసుకోటానికి ప్రయత్నం కూడా చెయ్యలేదు. అట్లాంటప్పుడు మానవుడు ఈ జన్మను పొంది చేసింది ఏమిటి?

మనము సంసార సుఖంలో జీవితమంతా ఆసక్తులమై ప్రవర్తించాము. ఎందుకంటే సంసారము తప్ప మనము ఏ ఇతర సుఖ సామగ్రిని చూడనేలేదు. ఈ సుఖమయమైన సంసారాన్ని వదిలి వెళ్లాలన్న దారుణమైన మాట జ్ఞప్తికి వస్తే

మనము చింతామగ్నులమై పోతాము. మనము సంసారానికి దాసులమై, దానిపట్ల అనురక్తులమై, మనము పరమసుఖవంతులమని భావిస్తాము. మనము మన ప్రాణంకన్న ఈ సంసారమే గొప్పదని భావించి ప్రేమిస్తాము. ఈ ఇల్లు తోట చెరువు వంటి విషయ సంపదకు మనమే అధికారులమని అనుకొన్నప్పుడు మన హృదయంలో ఆత్మగౌరవమునకు హద్దులుండవు. రూపవతి, యౌవనవతి అయిన మన భార్య, మన పుత్రులు, మన సేవకులు అంతా వినయ విధేయతలతో మనవైపే చూస్తున్నారని చూపినప్పుడు, చక్కగా అమర్చిన వాహనాలు మనకోసం సిద్ధంగా ఉన్నాయని అన్నప్పుడు, మన ఆనందానికి అవధులు ఉండవు. మనకీర్తి గానం చేయబడి, రాజసభలో సన్మానింపబడి, వేలాది మంది ముఖములలో మన ప్రశంస వినిపిస్తూ ఉంటే అప్పుడు మనం ఆనందంలో మునిగిపోతాము. ఈ సంసారమనే మోహనిద్రలో ఈ విధంగా మునిగి ఉంటాము.

మనిషికి వయస్సు పెరిగి, ఆత్మజ్ఞానం లభించి, మోహనిద్రాభంగం అయిన తరువాత, విషయ సుఖములనే పూలపాన్పు బాగా అనిపించదు. సుఖమయమైన సంసారము విషమయంగా బోధపడుతుంది. భోగవిలాసములు వికట రూపంలో మనకు తోస్తూ ఉంటాయి. చిరకాల ఆనంద భూమి ఆనంద రహితంగా కన్పిస్తుంది. నివసించే మేడ కారాగారంలాగా అనిపిస్తుంది. భార్య, పుత్రులు, విషయ సంపద అన్నీ ఒకటియై ఎలాంటి సంకెళ్లను వేశాయో అనిపిస్తుంది. అప్పుడు మనలో మనకు ఓ సంసారమా! ఇక నీ ఒళ్లో మేము నిద్రించము. ఎక్కడ సంధ్యలేదో, ఎక్కడ రాత్రి లేదో, ఎక్కడ నిద్రలేదో, ఎక్కడ శోకము లేదో, ఎక్కడ దుఃఖము లేదో, అలాంటి దేశానికి వెళ్లి అక్కడి వారితో కలిసి ఉంటాము. ఎవరి దగ్గర మధుర స్వరము, హద్దులులేని దయ, తులతూచలేని స్నేహం ఉన్నాయో, వారిని శరణు పొందుతాము. అప్పుడు జీవితంలో మనం ఏఏ అన్యాయాలు చేశామో అవన్నీ జ్ఞాపకం వచ్చి, మనసు ఆక్షేపిస్తున్నట్లు అనిపించి దయామయుడవైన ఓ శ్రీహరీ! నీవు భక్తుల పట్ల దయదలచి వారికి సహాయపడతావని మేము వింటున్నాము. నీవు సాధువులకు సర్వస్వమైన ధనానివి. నీ మహిమ అపారము. ఓ దీనబంధూ! నిన్ను ఆశ్రయించినవారినే నీవు దయతలుస్తున్నావు. హే అనాథనాథ! నీవు దయదలచి దర్శనం ఇవ్వకపోతే నిన్ను ఎవ్వరూ చూడలేరు. మేము మహా పాపులము. అభయ ప్రదమైన నీ చరణములలో మాకు స్థానం ఇయ్యి. ఏ మార్గంలో

వెళ్తే నీ దర్శనం లభిస్తుందో మాకు చెప్పు. నిన్ను ఏమని పిలవాలో మాకు తెలుపు. నీ ఆద్యంతములను తెలుసుకోటం మాకు అసాధ్యము. దయదలచి మా ఆశలను పూరించు అని మన మనస్సే మనకు చెబుతుంది.

నిన్ను నీవు తెలుసుకొని గుర్తించనంతవరకూ, నీవు ఎవరి కోసం ధర్మసాధన చేస్తావు? ఎవరిని బంధించటానికిగాని, విమోచన చేయటానికిగాని యాచిస్తావు? ముందు నీకు దుఃఖముకాని బంధనముకాని ఉన్నాయో లేవో తత్త్వ నిరూపణ చేసి చూడు. నీవు ఎక్కడ ఏ స్థితిలో ఉన్నావో మెళకువ తెచ్చుకొని చూడు. అన్ని చోట్లా నీ సత్తా వ్యాపించి ఉన్నది. మంచి యోగంతో జగత్తంతా ఆత్మమయంగా చూస్తే, నీవు ఎవరో, ఎక్కడి నుంచి వచ్చావో ప్రత్యక్షంగా చూడగలవు. అప్పుడు ఎవరికీ సంశయము, భేదాభిప్రాయములు ఉండవు.

అందరూ గురుదేవుని చరణముల వద్ద మనస్సు ప్రాణములను సమర్పించి "ఓ గురుదేవా! అజ్ఞానులైన శిష్యులపట్ల మీరు దయను వర్షించండి. మీరే నా గతి. మీరే నాకు ముక్తి. మీరు ఆత్మ మంత్రంతో ఎవరిని దర్శించమని చూపారో, ఆయనలోని పూర్ణశక్తిలో మనశక్తిని కలపగల సామర్థ్యాన్ని ఇవ్వమని ఆశీర్వదించండి. నేను అట్లా చెయ్యలేకపోతే, మానవ జీవితాన్ని పొంది, అభయప్రదములైన మీ చరణాలను శరణుపొంది నేను ఏమి సాధించాను?" అని ముక్తకంఠంతో చెప్పండి.

ప్రపంచంలో అంతా అర్థచింతలోనే నిమగ్నులై ఉన్నారు. ప్రపంచంలోని అన్ని అనర్థములకు, అన్ని అనిష్టములకు, అన్ని దుర్ఘటనలకు, అన్నింటికీ మూల కారణము ధనమే. ధనహీనుడు ఎంత అనిష్టుడవుతాడో, ధనవంతుడు కూడా అంత అనిష్టుడే అవుతాడు. ధనము ఉండటం వలన జగత్తు ఎంత పతనం అవుతుందో, ధనం లేకపోవటం వలన కూడా అంతే పతనమవుతుంది. ధనమే చింతకు సోదరుడు. నీవు ధనవంతునివైతే నీ చింతలకు హద్దేలేదు. ఒకవేళ మనం నిర్ధనులమైనా మనకు కూడా కష్టములకు చింతలకు హద్దు ఉండదు. నీకు డబ్బుంటే, నీవు దాని రక్షణ గురించో, పెరుగుదలను గురించో ఎప్పుడూ ఆలోచిస్తూనే ఉంటావు. మనకు ధనం లేకపోతే ఎట్లా ధనవంతులమవుతాము? ఏ ఉపాయంతో మనము ధనవంతులమవుతాము? అనే చింతలతోనే మన శరీరము జీర్ణించి పోతున్నది. నీవు నిర్ధనుడవు అయిపోతావేమో అనే చింత నీకు ఉండ

వచ్చును. ఎట్లా ధనవంతుడిని కావాలనే చింత నాకున్నది. ధనం ఉన్నా సహించ లేము. లేకపోయినా సహించలేము. దానికి దూరంగా ఉన్నా ఎలాంటి స్వేచ్ఛా లేదు. ధనమునకు విహార భూమి అదృష్టము. ఎవరి అదృష్టం ప్రకారం వారితో అట్లా ధనము ప్రవర్తిస్తుంది. ఆ అదృష్టాన్ని లిఖించేవాడు ఈశ్వరుడే! జీవుని యొక్క సుకృతము పూర్వజన్మ కర్మ ఫలములను బట్టి వారి వారి అదృష్టము వ్రాయబడి ఉంటుంది. ఆ లిఖితాంశమును కార్యరూపంలో పెట్టటానికి అర్థము కర్మఫలాన్ని బట్టి ఇస్తుంది. ధనము ఎప్పుడూ చంచలమైనదే. ఎప్పుడూ ఒకచోట ఉండదు. ధనము పోలేని చోటు ఉండదు. దానికి సిగ్గుకూడా కొంచమైనా లేదు. అందువలన చాకలినైనా, చండాలుడినైనా, అది కౌగలించుకొంటుంది. ధనమునకు హృదయం కూడా లేదు. ఒకరిని సర్వనాశనము చేస్తుంది. మరొకరికి సుఖాన్ని ఇస్తుంది. మళ్లీ అతనిని నాశనం చేస్తుంది. మూడవ వానిని సంతృప్తుని చేస్తుంది.

ఈ సామాన్యార్థమునకన్న భిన్నమైన అర్థం మరొకటి ఉన్నది. దేనికి సాటియైనది లేదో, దేనిని పొందిన తరువాత పొందవలసినది మరేదీ ఉండదో అదే పరమార్థము. మోక్షాన్ని సంపాదించటానికి సాధువులైనవారు జగత్తులోని అర్థాన్ని వదిలిపెట్టి, పరమార్థప్రాప్తి కోసం ఎల్లప్పుడూ ప్రయత్నిస్తూ ఉంటారు. ఈ పరమార్థమే ప్రపంచంలోని సారభూతమైన వస్తువు. అది నాశనము లేనిది. అనంతమైన ఫలముకలది. ఐహికమైన ధర్మము – అర్థములు జీవితాంతమున నశించిపోతాయి. కాని పరమార్థము నశించిపోదు. అది ఆత్మతోపాటు వెళ్తుంది. ఎవరి కోరికలు భావనలు ఎట్లా ఉంటాయో, వారికి సిద్ధి కూడా అట్లాంటిదే లభిస్తుంది. ఆకాంక్ష లేనిదే ఏ కార్యములోను అది ప్రవేశించదు. అయినా ఆ కార్యంలో లభించే సిద్ధి కూడా అతని అదృష్టానికి పొసగదు. మానవుడేపని చేసినా శుభాశుభములను ఆశించకుండా చేయడు. ధార్మికుడు ముక్తిని ఆశించి ధర్మానుష్ఠానము చేస్తాడు. ధనము నాశించియే దొంగ దొంగతనము చేస్తాడు. పుత్రుడు కావాలనే కోరికతో మనుష్యులు వివాహం చేసుకొంటారు. గుణవంతుడైన భర్త కావాలనే కోరికతో వధువు వ్రతములు చేస్తుంది. ఈవిధంగా ప్రతిదానికి మూలము కోరికయే. కోరిక లేకుండా కార్యారంభము జరగదు. కార్యము లేకుండా ప్రపంచము నడవదు. ప్రపంచము లేకుండా నడిస్తే సృష్టికర్త యొక్కఆశయం నెరవేరదు. కార్యానుష్ఠానము చేయాలి. తపఃఫలమును కోరుకొనడం అనుచితమని కొందరంటారు. కాని అన్ని పనులకు ఫలమును ఆశించటం అది ఈశ్వరుని ఇచ్ఛ. శ్రమపడి ధనమును

సంపాదించటం ఆయన కోరికే. పనిలోని గుణాగుణములను విచారణ చెయ్యాలి. అలాంటి విచారణ చెయ్యడానికి వివేకము యొక్క సహాయము తీసుకోవలసి వస్తుంది. ప్రతి మనిషిలోను వివేకము ఇంతో అంతో తప్పక ఉంటుంది. ఆ వివేక బలం వల్లనే చేసే పనిలోని గుణాగుణములు మనిషి మనసులో కలుగుతాయి. చేసే పనిలోని మంచి చెడు ఫలితములను మనుష్యుడు తెలుసుకోనంత వరకు ఆ పనిని చేస్తూనే ఉంటాడు. కాని ఆ పని యొక్క ఫలమును తెలుసుకొన్న తరువాత ఆ పని చెయ్యడు. చేసే పని యొక్క దుష్ఫలితాన్ని తెలిసికూడా కొంతమంది దానిని చేస్తూనే ఉంటారు. అది కేవలం వారి హృదయ దౌర్బల్యం మాత్రమే. సకామ కర్మవల్ల స్వర్గం లభిస్తుందని, నిష్కామకర్మ వల్ల మోక్షం లభిస్తుందని ఇప్పుడందరికీ తెలిసింది. అన్ని పనులకు మంచో చెడో ఫలం ఉండనే ఉంటుంది. అలాంటి ఫలం ఉన్నప్పుడు దానిని తప్పక అనుభవించవలసిందే.

మనుష్యుడు స్వ - అధీనుడని అందరూ అనుకొంటూ ఉంటారు. కాని అట్లా అనుకోవడం పొరపాటు. ఒకవేళ మనుష్యుడు స్వ-అధీనుడైతే ఆయన కోరికలు ఎందుకు సఫలంకావు? ఒకవేళ స్వ-అధీనుడైతే తన ఇష్టానుసారం పనులను ఎందుకు చేసుకోలేడు? మనుష్యులలో వాసనలు ఉన్నప్పటికి, వారిలో పనులు పూర్తిచేయగల శక్తి ఎందుకు లేదు? మనుష్యుల ఈ దుర్దశకు కారణమేమిటి? మనము మన ప్రాణములను పొమ్మని చెప్పటం లేదు. అయినా అవి ఎందుకు పోతున్నాయి? మన ఆజ్ఞలను అపేక్షించనివి, చెప్పినా విననివి అయినట్టివి మనకన్న బలవత్తరమైనవి కావా? కనుక ఈ దుఃఖమయ సంసారంలో మనము మన ఇచ్ఛానుసారం లేము. మనం పోదలుచుకున్నా పోలేము. మన శరీరంలో శరీర రక్షణ కోసం అన్ని పనులు చేసే వారిమీద మనకు అధికారం లేదు. బుద్ధి యొక్క పనుల మీద కాని, శారీరక కార్యముల మీదకాని, రక్తసంబంధ విషయముల మీద కాని, ఇతర పనుల మీదకాని మనకు నువ్వు గింజంతయిన అధికారం లేదు. అప్పుడు మనము స్వ-అధీనులము ఎట్లా అవుతాము? కొద్దిగా ఆలోచిస్తే మన శరీరంలో మనకంటె శక్తివంతులు ఎవరో ఉన్నారని, మనుష్యులంతా ఆయన అధికారంలోనే సంపూర్ణంగా ఉన్నారని తెలుస్తుంది. మనుష్యుని శక్తి ఇచ్ఛా పూర్వకంగానైనా, లేదా అనిచ్ఛాపూర్వకంగానైనా ఆ గొప్ప శక్తి అధీనంలో ఉన్నది. కనుక మనము మనము కాదు. మనం ఆయనను గుర్తించలేదు. అందువలన

మనము కూడా మనను గుర్తించలేకపోయాము. తనను తాను గుర్తించినవాడు భగవంతుడెవడో సంసారమేమిటో అనే విషయాలను గురించి కూడా చక్కగా తెలుసుకొంటాడు. సంసారం ఒక వృక్షం లాంటిది. ఆశ దాని పువ్వు. దుఃఖము దాని ఫలము. భోగము దాని ఆకులు. ముసలితనము దాని కుసుమములు. కోరిక దాని కొమ్మ. పరబ్రహ్మయే ఈ జగత్తు యొక్క ఉత్పత్తికి నిమిత్త కారణము. ఆ బ్రహ్మ తప్ప మరెవ్వరూ ఈ కల్పనలను చేయలేరు. అగ్ని నుండి పుట్టిన దాహకశక్తి అగ్నియే అయినట్లు బ్రహ్మ నుంచి ఉత్పన్నమైన ఈ జగత్తు కూడా బ్రహ్మ పదార్థమే. వాస్తవానికి సంసారము లేదా జగత్తు ఏదీలేదు. అన్నీ కేవలం బ్రహ్మమే. అంధకారము పోగానే ఈ దృశ్యజగత్తు దృష్టిగోచరమయినట్లు, అవస్తువు క్షీణించగానే అసలైన వస్తువు ఏదో అదే నిర్మల రూపంలో ప్రవేశిస్తుంది.

❀❀❀❀❀

శివానంద సుపథ ఫౌండేషన్

అత్యున్నతమైన సాంస్కృతిక సంపదకు, బహుముఖ విజ్ఞాన వివేకాలకు అనాదిగా మన భారతదేశం ఆలవాలం. ఈ అర్షవిజ్ఞానసంపద మనకు ఒక అవిచ్ఛిన్న పరంపరగా తర తరాలుగా అందించబడుతూవస్తోంది. దీనిని అనుసరించిన జీవన విధానానికే సనాతన ధర్మమని పేరు. ఈ ఆధ్యాత్మిక సంపదకు తోడుగా, మన భారతీయ ఋషులు మనకు భౌతిక ప్రపంచానికి సంబంధించిన అన్ని శాస్త్రాలనూ కూడా అందించారు. భౌతిక రసాయన శాస్త్రాలు, ఖగోళ-భవన నిర్మాణ- వైమానిక- ఆర్థిక-వైద్య-పరిపాలనా- న్యాయశాస్త్రాలవంటి ఆర్షవిజ్ఞానం, ఈనాటి కాలానికి మనం అన్వయించుకొని ఉపయోగించుకోగలిగితే,మనకు మార్గదర్శనం చేయగలదు.

ఈ కాలంలో సనాతనధర్మాన్ని ఆచరించి చూపి, దాని సార్వకాలికమైన ప్రయోజనాన్ని విశదీకరించిన సద్గురువు డా॥ శివానందమూర్తిగారి స్ఫూర్తితో, 'శివానంద సుపథ ఫౌండేషన్' 2012 సం॥లో ఆవిర్భవించింది.

ఫౌండేషన్ ఆశయాలు :

- సనాతనధర్మాన్ని, ఆర్షవిజ్ఞానాన్ని వివిధ పత్రికల నిర్వహణ ద్వారా, మీడియా ద్వారా వ్యాప్తిచేయడం;
- మన సంస్కృతి, భారతీయ-ప్రపంచ చరిత్రలు, నాగరికత, విద్య, సమకాలీన సమాజం వంటి అంశాలపై పుస్తక ప్రచురణ చేపట్టడం.
- గ్రామీణ, పేద ప్రజానీకానికి ఉచిత విద్య, వైద్య సదుపాయాలు అందించే దిశలో కృషిచేయడం;
- కేవలం వృత్తిపరమైన విద్యయేకాక, విద్యార్థులలో ఉత్తమ వ్యక్తిత్వ విలువలు, పౌరసత్వం కలిగించే విద్యకు సహకరించడం;
- పేదలకు ఆర్థికపరంగా, ఇతర విధాలుగా సహాయపడడం;
- నిర్లక్ష్యానికి గురి అవుతున్న గోవులను రక్షించి పోషించడం.

'సుపథ' సాంస్కృతిక మాస పత్రిక

గురుదేవులు శ్రీ శివానందమూర్తిగారి ఆశీస్సులతో, వారి మార్గదర్శనంలో 1998లో ప్రారంభమై, 'సుపథ' సాంస్కృతిక మాస పత్రిక (తెలుగు & ఇంగ్లీషు) 22 సంవత్సరాలుగా ప్రచురింపబడుతోంది. చారిత్రక, సామాజిక, రాజకీయ అంశాలు, సమకాలీన పరిస్థితులు, సమస్యలపై జాతీయ దృక్పథం, భారతీయమైన విశ్లేషణతో కూడిన వ్యాసాలు, వార్తాకథనాలు, ప్రాచీన, ఆధునిక భారతీయ చరిత్ర, పౌరాణికాంశాలు, చారిత్రక, యాత్రాస్థలాల వివరాలు, ఆధునికసాహిత్యం, మన సమాజానికి, సంస్కృతికి ఎనలేని సేవలందించిన వ్యక్తులతో ముఖాముఖీ, ప్రాచీన గ్రంథాలపై డైజెస్ట్‌లు (సుదీర్ఘవ్యాసాలు) 'సుపథ' అందిస్తోంది.

ఒక సంవత్సర చందా రూ.240/-
7 సంవత్సరాలకు రూ.1,600/-

'సుపథ' చందాను ఈ దిగువ సూచించిన చిరునామాకు
తమ పూర్తి చిరునామా, ఫోన్‌నెంబరు, ఈమెయిల్ అడ్రసుతో సహా పంపవచ్చును.

Local Cheques / Demand Drafts shall be drawn in favour of

Sivananda Supatha Foundation

payable at, Bhemmunipatnam.

చందా పంపుటకు, పుస్తకాలు పొందుటకు చిరునామా :

Sivananda Supatha Foundation

Regd.Office: D.No.2-6-3,
Dr.V.Hanumantha Rao Memorial Complex,
Jubliee Road TADEPALLIGUDEM,
West Godavari District, Andhra Pradesh:534 101
Phone: 08818-229111 Cell : 9441114222, 9177999696
e-mail: enquiry@ssfound.com, Web : WWW.SSFOUND.COM
Twitter : https://twitter.com/sivananda_ssf
Facebook : https://facebook.com/pg/ssfound

శివానంద సుపథ ఫౌండేషన్ ప్రచురణలు

I 'సుపథ' సాంస్కృతిక మాస పత్రిక

SUPATHA - Cultural Telugu Monthly Magazine -Telugu రూ. 20

II సద్గురు శ్రీ శివానందమూర్తిగారి తెలుగు రచనలు

1.	కఠోపనిషత్తు	రూ. 200
2.	భారతీయత - 1	రూ. 250
3.	భారతీయత - 2	రూ. 200
4.	భారతీయత - 3	రూ. 300
5.	భారతీయత - 4	రూ. 100
6.	శైవోపనిషత్తులు	రూ. 50
7.	హిందూ వివాహ వ్యవస్థ	రూ. 50
8.	మార్గదర్శకులు మహర్షులు-1	రూ. 200
9.	మార్గదర్శకులు మహర్షులు-2	రూ. 200
10.	మార్గదర్శకులు మహర్షులు-3	రూ. 200
11.	మార్గదర్శకులు మహర్షులు-4	రూ. 150
12.	శ్రీ మహావిష్ణుతత్త్వము (భీష్మబోధ)	రూ. 300
13.	శ్రీ కృష్ణ	రూ. 300
14.	అనంతకాల చక్రం	రూ. 125
15.	ధర్మము - కర్మ - గీతాబోధ	రూ. 50
16.	శివయోగ ప్రదీపిక	రూ. 200
17.	శ్రీ శివ హృదయము	రూ. 20
18.	గీతా ప్రసంగములు-1	రూ. 200
19.	గీతా ప్రసంగములు-2	రూ. 120
20.	గీతా ప్రసంగములు-3	రూ. 150
21.	గీతా ప్రసంగములు-4	రూ. 150
22.	గీతా ప్రసంగములు-5	రూ. 150
23.	ప్రశ్నోపనిషత్	రూ. 50
24.	గురుతత్త్వ ప్రసంగాలు	రూ. 150
25.	గోరక్ష శతకమ్	రూ. 50
26.	సాధన-సాధకుడు-1	రూ. 200

27. సాధన-సాధకుడు-2 రూ. 200
28. సిద్ధాన్త శిఖామణి - 1 రూ. 200
29. సిద్ధాన్త శిఖామణి - 2 రూ. 200
30. సిద్ధాన్త శిఖామణి - 3 రూ. 200
31. మండలబ్రాహ్మణోపనిషత్తు-1 రూ. 200
32. మండలబ్రాహ్మణోపనిషత్తు-2 రూ. 200
33. మండలబ్రాహ్మణోపనిషత్తు-3 రూ. 200
34. ఉపనిషత్ప్రసంగాలు రూ. 200
35. గీతగోవిందం రూ. 350
36. ఛాందోగ్యోపనిషద్ రూ. 200
37. సంగీతవిద్య రూ. 300
38. రుద్రభాష్య ప్రసంగాలు -1 రూ. 250
39. రుద్రభాష్య ప్రసంగాలు -2 రూ. 250

III. Publications in English :
Authorised by Satguru Dr. K. Sivananda Murty

1. Kathopanishad Rs. 200
2. Thoughts of a Seer Rs. 150
3. Hindu Marriage & Married Life Rs. 50
(English translation for
Hindu Vivaha Vyavasitha in Telugu)
4. Words to Remember Rs. 100
5. Suvarnabhoomi Rs. 100
6. Education System in India Rs. 150
7. The Structure of the Universe Rs. 350
(Vedic) - (Printed both in India and U.S.A.,
also available in amazon)
8. The Essence of Sri Mahavishnu Rs. 300
(English translation from Bheeshmabodha in Telugu)
9. Sri Krishna
(English translation from Sri Krishna in Telugu) Rs. 200
10. Dharma-Karma-Geeta Bodha Rs. 50
11. Bharateeyatha-5 Rs. 200

IV. Publications in Hindi :
Originally Authored by Satguru Dr. K. Sivananda Murty

1. कठ - योग (कठोपनिषत् की व्याख्या)
   Translated from Telugu Kathayogam — Rs. 200
2. हिंदू विवाह व्यवस्था - दाम्पत्यजीवन
   Translated from Telugu Hindu Vivaha Vyavastha — Rs. 50

V. Souvenirs

1. Platinum Platform (English and Telugu) — Rs. 350
2. Platinum Platform Supplementary (English and Telugu) — Rs. 100
3. The world tomorrow - What They Say (English) — Rs. 300

VI. గురువుగారిపై ఇతరుల రచనలు :

1. జన్మ కర్మచ తే దివ్యమ్ — రూ. 300
2. శివానంద గీతి — రూ. 20
3. శ్రీ శివానంద గురుతత్త్వ దర్శనము — రూ. 100
4. ఒక ఊరి కథ — రూ. 100
5. శివానంద 'గురు'తులు — రూ. 300
6. శివానందయోగం (ఇంగ్లీషు) — రూ. 100

VII. సద్గురు శ్రీ శివానందమూర్తిగారి ఆదేశముతో రచింపబడి, వెలువరించిన మా ఇతర ప్రచురణలు

1. లల్లాదేవి వాక్కులు — రూ. 50
2. మహాత్మ శ్రీ త్రైలింగస్వామి (జీవితము-ఉపదేశములు) హిందీ నుండి తెలుగు అనువాదం. — రూ. 200
3. సాయణ మాధవాచార్య ప్రణీత 'సర్వదర్శన సంగ్రహం' బాలానందినీ వ్యాఖ్యా: ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు — రూ. 400
4. షడంగయుక్త 'శ్రీ మేధా దక్షిణామూర్తి మంత్రరత్నావళి' — రూ. 100
5. 'శ్రీ శివదృష్టి' బాలానందినీ వ్యాఖ్యా పద్మశ్రీ ఆచార్య డా. పుల్లెల రామచంద్రుడు. — రూ. 500
6. కుంభరాణా విరచిత 'సంగీత రాజం' తెలుగు అనువాదం — రూ. 650
7. వైదిక ధర్మ సత్యార్థ ప్రకాశము — రూ. 100

8. శ్రీ రమణీయం	రూ.	300
9. అష్టావక్రగీత	రూ.	250
10. హరివంశం	రూ.	300
11. కృష్ణం వందే జగద్గురుం	రూ.	100
12. ప్రాచీన వాఙ్మయంలో మానవత్వపు విలువలు	రూ.	120
13. దేవీ భాగవతం	రూ.	1000
14. బుద్ధుని అంగుత్తర సంభాషణలు-1	రూ.	250
15. A visit to Ancient India (English)	రూ.	150
16. శివకవితలు	రూ.	80
17. తానదీపిక	రూ.	150
18. Mahaprasthan	రూ.	150
19. సమశ్రుతి	రూ.	200

VIII. Videos and Audio

1. గీత గోవిందం సంగీతం సద్గురు శ్రీ శివానందమూర్తి	రూ.	100
2. భావగీతమాలిక, మహాకవి విశ్వనాథ సత్యనారాయణ మరియు బసవరాజు అప్పారావు పాటలు, సంగీతం : పాలగుమ్మి విశ్వనాథం.	రూ.	50
3. శివానంద గీతి	రూ.	50
4. నా జీవనయానం (రేడియో ఆటోబయోగ్రఫీ ఆఫ్ సద్గురు డా॥ కె. శివానందమూర్తి)	రూ.	200

Video :

1. In Search of Buddha	Rs.	100
2. In the Footsteps of Master	Rs.	75
3. Anantakaalachakram	Rs.	100
4. Sangeetayatra	Rs.	100
5. Mahasivaratri (17th Feb2015 Speech)	Rs.	100
6. Naa Gurunchi Nenu (New)	Rs.	300

Photos & Calendar :

1. Ammavari Photo	Rs.	100
2. Table Calendar (with daily quotes)	Rs.	200

మహాత్మా శ్రీ త్రైలింగస్వామి

జీవితము - ఉపదేశములు



మహాత్మా శ్రీ త్రైలింగస్వామి సమాధి వద్ద సద్గురు శ్రీ శివానందమూర్తిగారు
పంచగంగా ఘాట్, కాశి

శివానంద సుపథ ఫౌండేషన్
ఆనందవనం, భీమునిపట్నం (భీమిలి)
విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ - 531 163
ఫోన్స్ : 7674019696, 9441114222
web : www.ssfound.com
email : enquiry@ssfound.com

ISBN 978-81-927356-5-8
9 788192 735658